Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 • సంచిక:299 • శుక్రవారం 9 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



- రక్షణరంగ ఉత్పత్తుల్లో నంబర్‌వన్
- హైదరాబాద్‌తో రక్షణ అనుబంధం
- కారిడార్ మంజూరు చేయాలని మంత్రి నిర్మలకు కేటీఆర్ విజ్ఞప్తి
- ఫార్మాసిటీకి అనుమతులివ్వండి
- హర్షవర్ధన్‌ను కోరిన ఐటీ మంత్రి
- మైనింగ్ సదస్సుకు రావాలని తోమర్‌కు కేటీఆర్ ఆహ్వానం
- నేడు రాష్ట్రపతితో సమావేశం

హైదరాబాద్‌లో డిఫెన్స్ కారిడార్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: హైదరాబాద్‌లో డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు కేంద్రాన్ని కోరారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చించేందుకు ఢిల్లీకి వచ్చిన మంత్రి కేటీఆర్ గురువారం బిజీబిజీగా గడిపారు. 2018-19 సంవత్సరానికిగానూ కేంద్రం బడ్జెట్‌లో రెండు డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్‌లు ప్రకటించింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన కేటీఆర్ అందులో ఒకటి హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రక్షణ రంగానికి, హైదరాబాద్‌కు ప్రత్యేక అనుబంధం ఉండడమే కాక, రక్షణ రంగ సంస్థలు, రక్షణ రంగ పరికరాల తయారీలో హైదరాబాద్ ముందు వరుసలో ఉందని నిర్మలా సీతారామన్‌కు వివరించారు. రక్షణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న హైదరాబాద్‌లో ఒక డిఫెన్స్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కారిడార్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌లతో సమావేశమైన కేటీఆర్ ఫిక్కీ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 19 వరకు హైటెక్స్‌లో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ కమ్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న ప్రపంచంలోనే అతిపెద్దదైన ఫార్మా సిటీకి అనుమతుల ప్రక్రియ వేగవంతం చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్‌ను కోరారు. ఫార్మాసిటీ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రత్యేకతలను ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి వివరించారు. కాలుష్యానికి 3వ పేజీలో...



విభజన హామీలన్నీ నెరవేర్చండి

- బడ్జెట్‌లో రైతులకు భరోసా లేదు
- కాళేశ్వరానికి జాతీయ హోదా
- అన్ని పంటలకు మద్దతు ధర
- లోక్‌సభలో కవిత డిమాండ్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఏపీ పునర్విభజన చట్టంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని టీఆర్ఎస్ ఎంపీ కవిత అన్నారు. ఈ విషయంలో టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు చేస్తున్న ఆందోళనకు తాము మద్దతిస్తున్నామని తెలిపారు. అధికారంలోని పార్టీ నిరసనలకు వెళ్లడం మంచి పరిణామం కాదని, తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. విభజన చట్టంలో పేర్కొన్న హామీలన్నిటినీ నెరవేర్చాలని డిమాండ్‌చేసిన కవిత, ప్రసంగం ముగింపులో జై ఆంధ్ర అని నినదించడం విశేషం. గురువారం లోక్‌సభలో ఆమె బడ్జెట్‌పై తెరాస తరపున ప్రసంగించారు. ఈ సారి కూడా రైతులకు నిరాశే మిగిలింది. చివరి బడ్జెట్‌లో రైతుల కోసం ఏమీ ఇవ్వలేదు. రైతుల ఆదాయం రెట్టింపు దిశగా చర్యల్లేవు. రైతులకు మేలు చేసే విధానాలు, వ్యూహాలు అమలు చేయలేదు అని 3వ పేజీలో...

ఏపీకి చాలా చేస్తున్నాం..ఇస్తున్నాం

బడ్జెట్ పెద్ద ఊరట



- దేశ ఆర్థిక వ్యవస్థ భేష్
- సంస్కరణలతో జీడీపీ వృద్ధి
- మరిన్ని సంస్కరణలు అమలు
- ద్రవ్యోల్బణం అదుపులోనే
- పన్ను సంస్కరణలతో ఆదాయం
- బడ్జెట్‌పై చర్చలో అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ: బడ్జెట్ వేతన జీవులు, వయోవృద్ధులకు రూ.12,000 కోట్ల లబ్ధులను చేకూర్చిందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం తెలిపారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం ప్రభుత్వానికి తెలుసునని చెప్పడం ద్వారా ఈక్విటీలపై దీర్ఘకాలక మూలధన రాబడుల పన్నును వెనకేసుకొచ్చారు. నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రాతిపదికన ఆర్థిక వ్యవస్థకు 3వ పేజీలో...

రాహుల్ మా బాస్!

- బీజేపీ ఓటమికి కలిసి వచ్చే పార్టీలతో పనిచేద్దాం
- పార్టీ విజయావకాశాల పునరుద్ధరణ ప్రక్రియ షురూ
- కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ భేటీలో సోనియా గాంధీ

3

అమ్మమాట!



హోదాకోసం ప్రధాని వద్దకు

- ఏపీకిచ్చిన హామీలన్నీ అమలు చేయాలి
- జయప్రకాశ్ నారాయణ్‌తో పవన్ భేటీ

3



భూమి మీద అంగారకుడు



2

అంతరిక్ష కారు రూటు మార్చింది



10

భూమికి చేరువలో గ్రహశకలం

2





- రక్షణ రంగంలో నిపుణుల కొరత
- డిఫెన్స్ అకాడమీకి తగ్గిన దరఖాస్తులు
- ఐటీవైపు మొగ్గు చూపుతున్న యువత
- ఆర్మీ పట్ల సన్నగిల్లుతున్న ఆసక్తి
- విద్యా సంస్థల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు
- నిర్బంధ సైనిక విధానమే పరిష్కారమా?

మిలటరీకి నిపుణులు కావలెను!

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

భారత రక్షణ దళం అధికారుల కొరత ఎదుర్కొంటోంది. ఏకంగా 9,259 ఉన్నతాధికార పోస్టులు ఇప్పుడు రక్షణరంగంలో ఖాళీగా ఉన్నాయి. ఇవికాక మరో 60 వేలకు పైగా వివిధ విభాగాల్లో నిపుణుల కొరత ఉంది. సైన్యంలో 27,864 నిపుణుల పోస్టుల ఖాళీ ఉంటే నావికాదళంలో 16,255, వైమానిక దళంలో 15,503 పోస్టులు గత నెలాఖరు నాటికి ఖాళీగా ఉన్నాయి. అసలే భారత్‌లోకి ఇటీవల సరిహద్దు దేశాల నుంచి చొరబాట్లు అధికమయ్యాయి. చైనా, పాక్‌ల నుంచి తరచూ భారత సైన్యం కవ్వింపుచర్యల్ని ఎదుర్కొంటోంది. ఈ దశలో సాధారణ సైనికదళం స్థిరంగానే ఉన్నప్పటికీ నిపుణులు, ఉన్నతాధికారుల కొరత సైన్యానికి ఓ సమస్యగా మారింది. నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చేరుతున్నవారి సంఖ్య కూడా నానాటికి తగ్గిపోతోంది. పదాతి, నావిక, వాయుదళాలు ఎంత పటిష్టంగా ఉన్నా వ్యూహాల్ని సిద్ధం చేసి అమలు చేసే ఉన్నతాధికార యంత్రాంగం తగినంత లేకపోవడం ఏ దేశ సైన్యానికైనా పెద్ద ఇబ్బందే. ఈ కొరత ఎదుర్కొనేందుకు వీలుగా ఇప్పుడు భారత సైన్యం సరికొత్త ప్రయోగాలు చేస్తోంది. విద్యాసంస్థల్లో ప్రత్యేక శిక్షణా తరగతులు చేపట్టింది. విద్యార్థుల్లో దేశభక్తిని రంగరించడంతో పాటు సైన్యంలో అధికారహోదాలో లభించే ప్రత్యేకతలు, జీత భత్యాలు, ఇతర సౌకర్యాలు, వెసులుబాట్ల గురించి వారి దృష్టికి తీసుకురావడం మొదలెట్టింది. రెండు దశాబ్దాలుగా సాధారణ విద్యార్హతలు ఉన్నవారు సైనికులుగా చేరుతున్నా ఉన్నత విద్యార్హతలు, వివిధ రంగాల్లో నిపుణులు మాత్రం భారత సైన్యానికి దూరంగా ఉంటున్నారు. ఇందుకు కారణం మారిన జీవన విధానాలు, ప్రైవేటు కార్పొరేట్ రంగంలో అత్యాధునిక జీతంతో అందుబాటులోకి వచ్చిన ఉపాధి అవకాశాలే. సైన్యంలో కేవలం యుద్ధం చేసే యంత్రాంగం మాత్రమే కాదు.. పలురకాల నైపుణ్యం కలిగినవారు కూడా ఉన్నతాధికారులుగా ఉద్యోగావకాశాలు ఉంటాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్, డాక్టర్ పట్టభద్రుల కోసం సైన్యంలో ప్రత్యేక విభాగాలు ఉన్నాయి. సైన్యానికి అవసరమైన పరికరాల రూపకల్పన, తయారీ 3వ పేజీలో...



పాడి రైతులకు రెండేసి గేదెలు

- రూ. 30వేలు చెల్లిస్తే రూ. 70వేలు సబ్సిడీ
- విధివిధానాలు ఖరారు
- రూ. 600 కోట్లతో పథకం
- జూన్ నుంచి అమల్లోకి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో పాడి రైతులకు గేదెలను అందజేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. రూ.లక్షవ్యయంతో ఒక్కో గేదెను కొనుగోలుచేసి రాష్ట్రంలోని 60వేల మంది రైతులకు రెండు గేదెల చొప్పున లక్షా 20వేల గేదెలను పంపిణీ చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఒక్కో రైతుకు రెండు లక్షల రూపాయల వ్యయంతో గేదెలను కొనుగోలుచేసి అందించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ఈ పథకానికి సంబంధించిన 10వ పేజీలో...

ఎలక్ట్రిక్ సూపర్ బైక్

- ధర రూ. 5 – 6 లక్షలు
- ఇదే తొలి దేశీయ తయారీ బైక్
- ఆటో ఎక్స్‌పోలో ప్రత్యేకాకర్షణ
- మార్కెట్లోకి కొత్త కొత్త కార్లు
- పోటా పోటీగా ఆధునిక వాహనాలు
- ఎలక్ట్రిక్ కార్లు, బైక్‌లదే హల్‌చల్

6



అంతర్జాతీయ మేధోసంపత్తిలో భారత్ ముందడుగు

- ఇండియాకు 44వ ర్యాంకు
- భారీస్థాయిలో సంస్కరణలు, అన్వేషణలతోనే
- నివేదిక విడుదల చేసిన అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్

6




భూమి మీద అంగారకుడు!

ధోఫార్ ఎడారి: అంగారకుడు భూమి మీదికి వచ్చాడా? అరుణ గ్రహంగా పేరొందిన అంగారకుని మనుషులు నడిచే రోజు ఎంతో దూరంలో లేదని అమె రికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా,స్పేస్ ఎక్స్ వ్యవ స్థాపకుడు ఎలోన్ మస్క్ గతంలో చేసిన ప్రకటనను సాకారం చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగు తున్నాయి. స్పేస్ ఎక్స్ అంటే అమెరికాకు చెందిన ప్రైవేటు అంతరిక్ష పరిశోధనా సంస్థ. ఆ సంస్థ అత్యంత శక్తివంతమైన రాకెట్ ప్రయో గాన్ని విజయ వంతంగా పూర్తిచేయడంతో మరింత ఉత్సాహంతో అంగారక యాత్రకు రిహార్సిల్స్‌ని నిర్వహించే కార్యక్రమాన్ని చేపట్టింది . అరేబియా ద్వీపంలో ని ఎడారి ప్రాంతంలో అంగా రక గ్రహాన్ని పోలిన ప్రదేశాన్ని సృష్టించింది. యెమన్, సౌదీ అరేబియా ల సరిహద్దుల్లో నెలకొనిఉన్న ఈ ప్రదేశంలో 25 దేశాలకు చెందిన 200 మందిపైగా శాస్త్రజ్ఞులు విరామం లేకుండా పరిశోధనలు సాగి స్తున్నారు. వారంతాతెల్లని రోదశి దుస్తులు ధరించారు. పర్వత శ్రేణుల్లో ఉన్న ఆ ప్రాంతంలో ఇసుక దిబ్బలు ఉన్నాయి. అంగార కునిపై మనిషి దిగి నప్పుడు కలిగే అనుభూతి ఎలా ఉంటుం ది.అక్కడి వాతా వరణం ఎలా ఉంటుంది అనే అంశాలపై లోతుగా అధ్య యనం చేస్తున్నారు. ధోఫార్ అడవి నునుపుగా గోధుమ వర్ణంలో ఉంటుంది. కొద్ది పాటి జంతుజాలం, మొక్కలు కనిపిస్తుంటాయి.అక్కడి వాతావరణం 125 డిగ్రీల ఫారిన్ హీట్,లేదా 51 డిగ్రీల సెలిసియస్. ఆ ఎడారి ఉపరితలం అంగారకుని పై భాగాన్ని పోలి ఉం టుంది. వాటి మధ్యతేడాను గమనించడం కష్టమని వ్యోమగామి కార్తిక్ కుమార్ చెప్పారు. స్పేస్ ఎక్స్ సంస్థ ఫాల్కన్ భారీ రాకెట్‌ని విజయ వంతంగా ప్రయోగిం చడంతో ఆ ఉత్సాహంతో తమ బృందం పని చేస్తోందని ఆయన అన్నారు. నాలుగు వారాల పాటు ఇక్కడ జరిగే శిక్షణా కార్యక్రమంలో వ్యోమగాములు అమూల్యమైన విషయా లను తెలుసుకుంటు న్నారని ఆయన చెప్పారు. అరుణ గ్రహంపైకి మనుషులను పంపేందుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు పోటీ పడుతు న్నాయి. చైనా వంటి దేశాలు అమెరికా,రష్యా సరసన చేరేందుకు పోటీ పడుతు న్నాయి. అంగారక యాత్రకు క్షేత్రస్థాయి సాంకేతిక విజ్ఞానాన్ని సముపార్జించేందుకు ఈ దేశాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయి.

రేపు భూమికి అత్యంత చేరువలో గ్రహశకలం

వాషింగ్టన్: అత్యంత చిన్నదైన గ్రహశకలం ఈ నెల 10వ తేదీన భూమికి అత్యంత సమీపంలో ప్రయాణిస్తుందని నాసాలో సెంటర్ ఫర్ నియర్ ఎర్త్ ఆబ్జెక్ట్ స్టడీస్ మేనేజర్ పాల్ చోదస్ తెలిపారు. 2018 సిబి అని పేరుగాంచిన సదరు గ్రహశకలం 15 నుంచి 40 మీటర్ల మధ్య పరి మాణంలో ఉంటుంది. భారతీయ కాలమానం(ఐఎస్‌టి) ప్రకారం తెల్ల వారుజామున నాలుగు గంటల ప్రాంతం లో భూమికి కేవలం 64,000 కి.మీ.ల దూరంలో 2018 సిబి దూసుకుపోనుంది. ఈ వారంలో భూమికి చేరువగా దూసుకువెళ్ళిన రెండవ గ్రహశకలంగా ఇది నిలిచిపోనుంది. ఈ నెల ఆరవ తేదీన భూమికి దాదాపు 1,84,000 కి.మీ.ల దూరంలో దూసు కుపోయిన గ్రహశకలాన్ని నాసా నిధులతో నడుస్తున్న క్యాటలినా స్కయ్ సర్వే (సిఎస్‌ఎస్) గుర్తించింది. 2018 సిబి పరిమాణంలో చిన్నదైనప్పటికీ ఐదేళ్ల క్రితం ఇదే రోజున రష్యాలో చెల్యాబిన్‌స్క్ గగనతలంలోకి ప్రవేశించిన గ్రహశకలం కన్నా పెద్దది అని పాల్ చోదన్ తెలిపారు. ఇలాంటి పరి మాణంలో ఉన్న గ్రహశకలాలు ఏడాదికి ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే మన భూగ్రహానికి అత్యంత సమీపంలోకి వస్తాయని చెప్పారు.



గురువారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో గజ్వేల్ నియోజక వర్గంలోని గజ్వేల్ మండలం దాతర్‌పల్లి గ్రామస్తులు సేంద్రియ సాగులో పండించిన బియ్యాన్ని మంత్రి హరీశ్‌కు అందజేశారు. సేంద్రియ వ్యవసాయంతో పండించిన బియ్యం ఆరోగ్యానికి ఎంతో మంచిదని మంత్రి అన్నారు. అంతే కాకుండా సేంద్రియ వ్యవసాయం వల్ల తక్కువ ఖర్చు, అధిక దిగుబడి ఉంటుందన్నారు. సేంద్రియ వ్యవసాయంలో పండించిన కూరగాయలు తింటే ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండవని తెలిపారు. సిద్ధిపేట నియోజక వర్గంలో దాదాపు 10 గ్రామాలు సేంద్రియ సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. సేంద్రియ సాగులో పండించిన కాయగూరలకు రైతు బజార్లలో ప్రత్యేక స్టాళ్లు పెట్టనున్నట్లు తెలిపారు. సేంద్రియ సాగు చేసే గ్రామాలకు, రైతులకు సహకారం అందించనున్నట్లు మంత్రి తెలిపారు.

కేటుగాళ్లపై కఠిన చర్యలు

- అసలు రైతులే లబ్ధి పొందాలి
- జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్
- మార్కెట్ యార్డుల్లోనే కొనుగోలు కేంద్రాలు : మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైతుల ముసుగులో క్రయ విక్ర యాలు జరిపే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మంత్రి హరీష్‌రావు అధికారులను ఆదేశించారు. నకిలీ రైతుల పట్ల జిల్లా యంత్రాంగం నిరంతరం అప్ర మత్తంగ ఉండాలన్నారు. రైతుల సంక్షేమమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రా లను ఇకపై వ్యవసాయ మార్కెట్ యార్డులలోనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గురువారం సచి వాలయంలో మార్కెటింగ్ కార్యకలాపాలు, కందులు, శనగలు, వేరు శనగ వంటి పంట కొనుగోలు కేంద్రాల అమలు తీరు, ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. సంగారెడ్డి జిల్లా పర్యట నలో ఉన్న మంత్రి హరీష్ రావు ఆ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు తగ్గిన వెంటనే శనగలు, వేరుశనగ కొనుగోలు కేంద్రాలను తక్షణం ప్రారంభిం చాలని మంత్రి సూచిం చారు. మార్కెట్ యార్డుల వెలుపల కొనుగోలు కేంద్రా లను ఏర్పాటు చేయొద్దని, ప్రస్తుతం కదుల కొనుగోలు కోసం ఇప్పటికే నడుస్తున్న సొసైటీల కొనుగోలు కేంద్రాలను సమీపంలోని మార్కెట్ కమిటీతో వెంటనే అనుసంధానించాలని ఆదేశించారు. అదే విధంగా సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారులచేధృవీ కరణ పత్రం పొందిన రైతుల నుంచి మాత్రమే ప్రభుత్వ కొనుగోళ్ళు జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్‌కు తీసుకు రాక ముందే నాణ్యతా ప్రమా ణాలపై రైతులకు అవగాహన కల్పించా లన్నారు. ఇప్పటి వరకు జరిగిన కందుల కొనుగోళ్ళను మంత్రి సమీక్షించారు. కందుల సేకరణ సందర్భంగా కొన్నిచోట్ల ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్, ఆదిలాబాద్ జిల్లాలలో అవకతవకలు జరిగి నట్లు ఆరోపణలు వచ్చాయని, వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి కొనుగోళ్ళ క్రయవిక్రయాలపై నిఘా ఉంచాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. 25 క్విం టాళ్ళకు మించి పంటను మార్కెట్ కమిటీకి తీసుకు వచ్చిన వ్యక్తులపై నిఘా ఉంచాలని, వారు ఎంత విస్తీర్ణంలో పంట పండించా రనే విషయాన్ని తనిఖీ చేయాలన్నారు. కొనుగోళ్ళు చెల్లింపుల సమాచారాన్ని ఏ రోజుకు ఆ రోజు ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మార్కెటింగ్ శాఖ కార్యదర్శి పార్థసారధి, వ్యవసాయ శాఖ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



వెల్‌నెస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు లక్ష్మారెడ్డి, హరీష్‌రావు

సంగారెడ్డి , ప్రభ న్యూస్ : దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్నాయని రాష్ట్రంలో కొనసాగుతున్న విధి విధానాలను తెలుసుకునేందుకు అనేక రాష్ట్రాల ప్రభుత్వ అధికారులు,ప్రజా ప్రతినిధులు హాజరై ఇక్కడి ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలను పరిశీలించి వాటి అమలు తీరుపై అడిగి తెలుసుకొని అక్కడి రాష్ట్రాలలో తెలంగాణాలో జరుగుతున్న అంశాలను అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి డా.లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి కేంద్రంలో వెల్‌నెస్ కేంద్రాన్ని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం వైద్య రంగంలో పలుసంస్కరణలు అమలు చేస్తుందని ఆయన తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులలో అంధిస్తున్న సేవలకు భిన్నంగా ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు అందించేందుకు తెలంగాణా ప్రభుత్వం నూతన ఆధునిక వైద్య పరికరాలను పూర్తి స్థాయిలో ఆసుపత్రులలో లభించే విధంగా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకు వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. వెల్‌నెస్ కేంద్రాలలో సుమారు 20 వేల మంది వరకు లబ్ధి పొందుతారని ఆయన తెలిపారు. ముఖ్యంగా వెల్‌నెస్ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్య తీసుకుందని ఆయన తెలిపారు. దేశంలోనే ఓ ప్రభుత్వ ఆసుపత్రి(గాంధీ)లో సంతానలేమి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం దేశ చరిత్రలోనే మొట్టమొదటి సారని ఆయన తెలిపారు. సమగ్ర సంపూర్ణ వైద్య సేవలు అందించి ఆరోగ్య తెలంగాణ రాష్ట్రంగా రూపొందాలని మంత్రి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో భారీ నీటి పారుదల శాఖా మంత్రి తన్నీర్ హరీశ్వరావు, ఎమ్మెల్సీలు భూపాల్‌రెడ్డి, రాములు నాయక్, పాతూరు సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్ గౌడ్, మహిపాల్‌రెడ్డి, తెలంగాణ ప్రెస్‌అకాడమి చైర్మెన్ అల్లం నారాయణ, స్థానిక జిల్లాపరిషత్ చైర్మెన్ రాజమని మురళి యాదవ్, జిల్లా కలెక్టర్ మాణిక్ రాజ్ కణ్ణన్,ఆరోగ్యశ్రీ సిఈఓ పద్మశ్రీతో పాటు పలు శాఖల అధికారులు, అనధికారులు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ ఎన్నికల ప్రక్రియ షురూ

- ఆగస్టు 1 లోపు ఎన్నికలు
- 83 నియోజక వర్గాల్లో ఓటర్ల సవరణ
- మార్చి 22న తుది జాబితా ప్రచురణ
- టీఎస్ఈసీ షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాజకీయ వాతావరణ వేడెక్కుతోంది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు సంబందించిన ముందస్తు ప్రక్రియకు రాష్ట్ర ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది ఆగస్ట్ ఒకటి లోపు రాష్ట్రంలోని అన్న గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లకు తెరలేపింది. తెలంగాణ రాష్ట్రంలో 5వ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు 83 గ్రామీణ అసెంబ్లీ నియోజక వర్గాల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబీతాను సిద్ధం చేసే కార్యక్రమాన్ని చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం .అశోక్ కుమార్ గురువారం అందుకు సంబధించిన షెడ్యూల్ విడుదలను విడుదల చేశారు. ఓటర్ల జాబీతాలో మార్పులు , కొత్త ఓటర్ల చేర్పులు, తొలగింపులు , అభ్యంతరాల స్వీకరణ వంటి వాటికి ఈ నెల 14వరకు గడువుగా నిర్ణయించారు. ఇందుకోసం రాష్ట్రవమంతటా చేపట్టిన ప్రత్యేక క్యాంపెయినింగ్‌లకు ఈ నెల 11 చివరి తేదిగా నిర్ణయించింది. ప్రజలనుంచి , రాజకీయ పార్టీలనుంచి ఓటర్ల జాబీతా మార్పు చేర్పులకు సంబంధించిన అభ్యంతరాల స్వీకరణను మార్చి 5 నుంచి చేపడతారు. అన్ని వైపుల నుంచి సేకరించిన డాటా కూర్పులను మార్చి 15నాటికి పూర్తి చేయనున్నారు. 22న ఓటర్ల తుది జాబీతాలను ప్రచురించనున్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ చట్టం 1994 ప్రాకారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితాలు సిద్ధం చేయనున్నారు. 1950 పంచాయతీరాజ్ చట్టం కింద వీటిని కొత్త గ్రామ పంచాయతీలకు కూడా అన్వయించనున్నారు. పాత అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల జాబీతాలనే సవరించి కొత్త జాబీతాలు రూపొందిస్తున్నారు. వీటి ద్వారానే గ్రామ పంచయతీ ఎన్నికల ప్రక్రియను నిర్వహించనున్నారు. జనవరి 20 న 36 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో తుది ఓటర్ల జాబీతాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇదివరకే ప్రకటించింది. మిగిలిన 83 నియోజకవర్గాల పరిధిలో మాత్రమే ఇపుడు ఓటర్ల జాబీతాల సరవణ కార్యక్రమాలను చేపడుతున్నారు. ఓటర్ల జాబీతాలో లేని పేర్లు, కొత్త ఓటర్ల చేర్పులు, తొలగింపులు, పెండింగ్‌లో ఉన్న జాబీతాలు వంటి వాటిని ఇపుడు స్వీకరించనున్నారు. ఈ ఏడాది జనవరి ఒకటి నాటికి 18-23ఏళ్ల వారందరినీ ఓటర్లుగా నమోదు చేయించేందుకు తొలి ప్రాధ్యాన్యత ఇవ్వనున్నారు. ఓటరుగా నమోదుపై పెద్ద ఎత్తున అవగాహన , చైతన్య కార్యక్రమాలను చేపట్ట నున్నారు. ఇందుకోసం ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం కల్పిచాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. జిల్లా స్థాయిల్లో సమాచార పౌర సంబంధాల శాఖ అధికారుల సహకారం తీసుకోవాలని అన్ని జిల్లాల ఎన్నికల యంత్రాగానికి ఆదేశాలు ఇచ్చింది.. అంతే కాకుండా ప్రజల్లో ఓటు హక్కు పట్ల అవగాహన పెంచేందుకు ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు సమన్వయంతో పనిచేస్తూ స్వచ్ఛంద సంఘాలు, మహిళా సంఘాలు , ఇతర సామాజిక సేవా సంస్థల సహకారం కూడా తీసుకోవాలని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ కార్యక్రమాల్లో రాజకీయ పార్టీలను క ూడా భాగస్వాములను చేయాలని సూచించింది. ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించే కార్యక్రమాల వివరాలను ఎప్పకపుడు ఆయా జిల్లాల కలెక్టర్లకు నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ మేరకు ఆదేశాలు ఇచ్చింది.

చైనాలో 'శుభలగ్నం'

- భర్తకు రూ. కోటి కట్నం

బీజింగ్ : శుభలగ్నం సినిమా చూసే ఉంటారు.. కోటి రూపాయలు ఇచ్చి హిరోయిన్ హిరోను మొదటి భార్య నుండి కొనుగోలు చేస్తుంది. కానీ ఇక్కడ మాత్రం కొద్దిగా ఛేంజ్... ఆమెకు 38.. అతనికి 23 ఏళ్లు.. ఆమె రూ.కోటికట్నం ఇచ్చి మరీ పెళ్లి చేసుకుంది... ఈ ఘటన చైనాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... తన కన్నా వయస్సులో 15 ఏళ్లు చిన్నవాడైన ఓ యువకుడిని పెళ్లాడిన ఘటన ఇది.. 38 ఏళ్ల మహిళ 5 మిలియన్ల యువాన్లు (కోటి రూపాయలు) కట్నంగా ఇచ్చి 23 ఏళ్ల యువకుడిని పెళ్లి చేసుకుంది. చైనాలోని హైనాన్ ప్రావిన్స్‌లోని కియోంగ్హై నగరంలో జనవరి 10న వీరి పెళ్లి జరిగింది. తైవాన్ న్యూస్ ఏజెన్సీ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు మహిళకు 14 ఏళ్ల కుమారుడు కూడా ఉన్నాడు. ఈ ఘటనతో ప్రపంచం ఆశ్చర్యానికి గురైంది. తమ జీవితంలో ఎన్నో ఘటనలు చూస్తాం. కానీ ఇలా ఎదురు కట్నం ఇచ్చి మరీ తన కంటే 15 ఏళ్లు చిన్నవాడిని పెళ్లాడిన ఘటన ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రేమ గుడ్డిది అనే సామెత అందరికీ తెలుసు. దాన్ని నిజం చేయడానికే ప్రయత్నించినట్టు దంపతులు వివరించారు. ఇది నిజమే అని నిర్ధారణకు వచ్చినట్టు వారు తెలిపారు. 38 ఏళ్ల మహిళ తాను పెళ్లాడే 23 ఏళ్ల యువకుడి తల్లిదండ్రులకు పెళ్లి విషయం వివరించడంతో ముందు ఒప్పకోలేదు. చాలా ప్రయత్నించింది. అయినా అతని తల్లిదండ్రులు ససేమిరా అనడంతో చివరికి 5 మిలియన్ల యువాన్‌లు ఇచ్చి కుమారుడిని మీ కుమారుడిని పెళ్లి చేసుకుంటా అని బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఈ ఆఫర్ విని అబ్బాయి తల్లిదండ్రులు ఆశ్చర్యానికి గురయ్యారు. తరువాత ఓకే చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. పెళ్లి సమయంలో 38 ఏళ్ల మహిళ బంగారు బ్రేస్‌లెట్, నెక్లెస్, చెవి దిద్దులు వేసుకుని అందంగా ముస్తాబైంది. పెళ్లితంతు ముగిసిన అనంతరం ఇద్దరు కలిసి ఎరుపు రంగు కారులో షికారుకు వెళ్లిపోయారు.






సినీ ఫక్కీలో..

వధూవరులు జంప్

కర్నాటక : మరికొద్ది గంటల్లో నిశ్చితార్థం.. అంతలోనే అమ్మాయి కనిపించడం లేదనే వార్త.. ఏం చేయా లో అర్థం కాని పరిస్థితి. ఎంత వెతికినా ఫలితం శూన్యం. పెళ్లి కూతురి చిన్నాన కూతురితో పెళ్లి చేయడానికి నిర్ణయించుకున్నారు. అతనికీ పెళ్లి ఇష్టం లేకపోవడంతో పెళ్లి రోజు అతనూ పారిపోయాడు. సినిమా స్టోరీని తలదన్నే ఘటన కర్నాటకలో చోటు చేసుకుంది. వరుడు పార్లర్‌కి వెళ్తా అని చెప్పి తిరిగి రాలేదు. కానీ వరుడు, వధువు తరుపు బంధువులు మాత్రం పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం కొసమెరుపు. వరుడు గురేష్ మాలూర్ పట్టణానికి చెందిన చన్నకల్ గ్రామానికి చెందిన గురేశ్. సినిమాల్లో చూస్తుంటాం... వరుడు లేదా వధువు పారిపోయినా.. అక్కడే ఎవరినో ఒకరిని వధువుగా, లేదంటే వరుడిగా తయారు చేసి పెళ్లి తంతు ముగిస్తాం. సినిమా కథలు నిజ జీవితంలో సాధ్యం కావని అనుకుంటాం.. కానీ కర్నాటకలో మాత్రం సినిమా స్టోరీని తలదన్నే ఘటన చోటు చేసుకుంది. జనవరి 28న పెళ్లి నిర్ణయించుకున్నారు. పెళ్లి కూతురు బెంగుళూరులో పని చేసే ఎస్.సౌమ్యగా గుర్తించారు. ఈమెది బంగారుపేట తాలూకా నేర్నహళ్లి స్వస్థలం. నిశ్చి తార్థానికి ఇంకొద్ది సమయం ఉందన్న సమయంలో సౌమ్య ఇంటి నుండి వెళ్లిపోయింది. గురేష్‌తో పెళ్లి ఇష్టం లేకపోవడమే. గురేష్ వికలాంగుడు కావడం దీనికి ప్రధాన కారణం. సౌమ్య జాడ కోసం ఎంత వెదికినా ఫలితం కనిపించలేదు. దీంతో వధువు తరుపు బంధువులు గురేష్‌తో పెళ్లి చేయడానికి వధువు చిన్నాన్న కూతు రు వెంకట రత్నమ్మను సిద్ధం చేశారు. పెళ్లిని వాయిదా వేయడానికి వధువు తరుపు కుటుంబీకులు కూడా ఒప్పు కోలేదు. శనివారం సాయంత్రం నిశ్చితార్థం పెట్టుకోగా, ఆదివారం పెళ్లి ముహూర్తం నిర్ణయించారు. ఆది వారం పెళ్లి సమయానికి వరుడు గురేష్ కూడా జంప్ కావడంతో అందరూ ముక్కున వేలేసుకునే పరిస్థితి కనిపించింది. వధువు మేకప్ చేసుకోవడానికి పార్లర్ వెళ్తా అని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. కొన్ని గంటల పాటు ఆమె కుటుంబ సభ్యులు నిరీక్షించారు. ఈ వార్త పెళ్లి కుమారుడి తరుపు బంధువులకు తెలియడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయం మించిపోతుండటంతో వెంకటరత్నమ్మతో పెళ్లికి నిర్ణయించారు. ఆ తరువాతి రోజు గురేష్ పారిపోవడంతో ఇద్దరి ఇళ్లు బోసిపోయి కనిపించాయి. పిల్లలకు స్వేచ్ఛ ఇవ్వాలని, వారి భాగస్వామి వారే ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు. పెళ్లి సమయంలో ఒత్తిళ్లు చేస్తే ఇలాంటి పరిస్థితి ఎదుర్కోవాల్సి ఉంటుందని పెద్దలు అంటున్నారు.

విమానంలో నెమలికి నో ఎంట్రీ

- పట్టుబడిన యజమానురాలు
- రోడ్డు మార్గం ద్వారా న్యూయార్క్ పయనం

అమెరికా : తాను ఎంతో ముద్దుగా పెంచుకున్న నెమలిని ఓ మహిళ ఏకంగా అమెరికాలోని విమానాశ్రయానికి తీసుకొచ్చింది. ఏదో సరదా కోసం అనుకుంటే మీరు పప్పులో కాలేసినట్టే... తనతో పాటు విమానంలో నెమలిని తీసుకుళ్లేందుకు యత్నించింది. నెమలి పరిమాణం కూడా చాలా పెద్దగా, బరువుగా ఉండటం గమనార్హం. ట్రాలీ బ్యాగుపై నెమలి కూర్చున్న ఫొటో సామాజిక మాధ్యమంలో తెగ చక్కర్లు కొట్టింది. నెమలి పక్కనే సదరు మహిళ కూడా కనిపించింది. ఎమోషనల్ సపోర్ట్ యానిమల్ ప్రకారం తనకు ప్రాణమైన నెమలిని విమానంలో తీసుకెళ్లేందుకు పట్టుబట్టింది. కానీ నిబంధనల ప్రకారం... పరిమాణం, బరువు కారణంగా తాము అనుమతించలేమని విమాన సిబ్బంది ఆమెకు వివరించారు. విశేషం ఏంటంటే ఆమెతో పాటు నెమలికి కూడా టికెట్ తీయడం కొసమెరుపు. కానీ సిబ్బంది దీనికి ఒప్పుకోలేదు. జీవాలను విమానంలోకి తీసుకెళ్లే సమయంలో పాటించే నిబంధనలను ఆమెకు ఏయిర్‌లైన్స్ సిబ్బంది వివరించారు. ఆ నెమలిని ఆమె అమెరికా నుండి న్యూయార్క్ తీసుకెళ్లడానికి ప్రయత్నించింది. ఏది ఏమైనా తన నెమలిని తనతో తీసుకెళ్లడానికి నిర్ణయించుకుంది. చివరికి 6 గంటల పాటు అక్కడే ఉండి చివరకు తన బ్యాగు, నెమలితో కలిసి రోడ్డు మార్గాన న్యూయార్క్ వెళ్లడానికి నిర్ణయించుకుంది. నెమలి పేరు డెక్స్టర్ కాగా, యజమానురాలి పేరు వెంటికో. ఈమె బ్రూక్లిన్‌కు చెందిన ఆరిస్టుగా అక్కడి మీడియా గుర్తించారు. ఇంతకు ముందు కూడా వెంటికో ఇంటర్వ్యూకు వెళ్లే సమయంలో నెమలిని తీసుకెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రాణానికి ప్రాణమైన నెమలిని వదిలి వెళ్లను అని వెంటికో ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. వెంటికో ఎట్టా అనే ఆడ నెమలితో పాటు డెక్స్టర్‌ను కొనుగోలు చేసింది. వీటిని తన కొత్త ఇంట్లోకి తీసుకెళ్లి పెట్టగా, ఎట్టా కనిపించకుండా పోయింది. దీంతో డెక్స్టర్ వింతగా ప్రవర్తించడంతో వెంటికో అప్పటి నుండి ఎక్కడికి వెళ్లినా తన వెంట తీసుకెళ్తూ వస్తున్నది. పక్షులు మనుషుల జీవితాల్లో ఉంటే సానుకూల ప్రభావం ఉంటుందని ఆమె చెబుతున్నారు.





మిలటరీకి నిపుణులు కావలెను!

(మొదటిపేజీ తరువాయి)

నుంచి సైన్యం రాకపోకలకు అనుగుణంగా రహదార్ల నిర్మాణాల కోసం సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లను నియమించుకుంటారు. ఆధునిక రవాణా యంత్రాల నిర్మాణం గురించి ఆటోమొబైల్ ఇంజనీర్లను, వీరికి అనుబంధంగా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్హతలు కలిగిన వారికి కూడా ఉన్నత స్థాయిలో ఉద్యోగాలిస్తారు. సాఫ్ట్‌వేర్, సమాచార రంగ నిపుణుల సేవల్ని వినియోగించుకుంటారు. మిలటరీ ఆసుపత్రుల్లో అన్ని విభాగాల్లో నిపుణులైన వైద్యుల్ని నియమిస్తారు. వీరితో పాటే మేనేజ్‌మెంట్ నిపుణులకు కూడా మంచి అవకాశాలుంటాయి. ఇలాంటివారిని తీర్చిదిద్దడానికి నేషనల్ డిఫెన్స్ అకాడమీని పుణెకు సమీపంలోని కడక్‌వాసలా గ్రామంలో 7,015 ఎకరాల విస్తీర్ణంలో 1954లో ప్రారంభించారు. కొంతకాలంగా ఈ అకాడమీకొస్తున్న దరఖాస్తుల సంఖ్య తగ్గడం ఆందోళనకర పరిణామం.

స్వతంత్ర సంగ్రామ సమయంలో సుభాష్ చంద్రబోస్ ప్రత్యేకంగా ఓ సాయుధ దళాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరేందుకు భారతీయ యువతీ యువకులు పోటీలు పడ్డారు. వీరిలో 43వేల మంది ఇందులో శిక్షణ పొంది సభ్యులుగా మారారు. గెరిల్లా యుద్ధంలో కూడా ఆరితేరారు. ఇంఫాల్, కోహిమా, సెంట్రల్ బర్మా, పోకోకు, గాజీడౌక్ యుద్ధాలతో పాటు రెండో ప్రపంచ యుద్ధంలో కూడా వీరు విధులు నిర్వర్తించారు. అప్పట్లో వీరికి ఎలాంటి జీతభత్యాలు ఉండేవికావు. కానీ దేశం కోసం జరిగే పోరాటంలో తాము కూడా భాగస్వాములు కావాలని అభిలషించారు. ఇందులో చేరడాన్ని ఒక ప్రతిష్ఠాత్మక చర్యగా భావించారు. స్వతంత్రానంతరం కూడా భారతీయ రక్షణదళంలో చేరేందుకు ఉన్నత విద్యావంతులు ముందుకొచ్చేవారు. శిక్షణ కఠినంగా ఉన్నా నేషనల్ డిఫెన్స్ అకాడమీ పట్ల ఆసక్తి చూపేవారు. కానీ ప్రస్తుత పరిస్థితులు మారిపోయాయి. రక్షణ దళాలలో చేరే విద్యార్థులకు ఆసక్తి తగ్గింది. ఇందులో ఉన్న కఠినతరమైన జీవన విధానంతో పాటు క్రమశిక్షణలే ఇందుకు కారణం. ప్రైవేటు, కార్పొరేట్ రంగం విస్తృతం కావడంతో వారిస్తున్న జీతాలు యువతను ఆకర్షిస్తున్నాయి. ఆధునిక జీవన విధానం ముందు దేశభక్తులు వెలవెలబోతున్నాయి. వీటికి తోడు మీడియాలో జరుగుతున్న ప్రచారం కూడా ఓ కారణంగా పరిశీలకులు అంచనా వేస్తున్నారు. సరిహద్దుల్లో జరిగే పోరాటాలు, సరిహద్దుల్లో పనిచేసేవారి సైనికులకు సంబంధించిన వార్తల్ని పదేపదే మీడియా ప్రసారం చేస్తోంది. సైగా మైనస్ 50సెంటీగ్రేడ్ డిగ్రీల వాతావరణంలో గడ్డకట్టుకుపోయే చలిలో కాపలాకాయడం ఎంతటి భయంకరమైన పరిస్థితో పదేపదే వివరిస్తోంది. వీటిని చూసి సాధారణ యువత సైన్యంలో చేరేందుకు భయకంపితులౌతున్నారు. వాస్తవానికి మొత్తం రక్షణ దళాల్లో చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో పనిచేసేవారి సంఖ్య రెండు నుంచి మూడు శాతం మాత్రమే. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, ఇండో టిబెటన్ బోర్డర్ ఫోర్స్‌లలోని ఒక విభాగం మాత్రమే ఈ విధులు నిర్వర్తిస్తోంది. అదికూడా నిర్ణీత కాలపరిమితి వరకే అక్కడ డ్యూటీలు ఉంటాయి. మిగిలిన సైన్యం, అధికారులంతా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని కంటోన్మెంట్ కేంద్రాల్లోనే విధులు నిర్వర్తిస్తుంటారు. ఇక సైనికాధికారులైతే అప్పుడప్పుడు మాత్రమే ఇలాంటి ప్రమాదకర ప్రాంతాలకు వెళ్తారు. మిగిలిన కాలమంతా రెజిమెంట్ పాలనా కేంద్రాల్లోనే విధులు నిర్వర్తిస్తుంటారు. ప్రస్తుతం సైన్యంలో 14,43,921 మంది వివిధ ప్రాంతాల్లో విధుల్లో ఉంటే 11.55 లక్షల మంది రిజర్వ్ సిబ్బంది ఉన్నారు. నావికాదళంలో 67,228 మంది విధుల్లో ఉంటే వాయుసేనలో 1,39,576 మంది సేవలు అందిస్తున్నారు. వీరిలో క్లిష్టతర వాతావరణంలో విధుల్లో ఉన్నవారి సంఖ్య గరిష్ఠంగా 8శాతము ఉంటుందంటే. వీరిని తరచూ దేశ అంతర్గత వ్యవహారాల్లోనే ప్రభుత్వం వినియోగించుకుంటోంది.

ఒక్క భారత్‌లోనే కాదు.. ప్రపంచ వ్యాప్తంగా రక్షణరంగం పట్ల ఆసక్తి సన్నగిల్లుతోంది. భారత్ వంటి దేశాల్లో ఎంటెక్ లేదా ఎంబీఏ, ఎంసీఏ అర్హతలు కలిగిన వారు కూడా కానిస్టేబుల్ ఉద్యోగానికి వెళ్ళేందుకు పోటీపడుతున్నారు. లేదా వీఆర్‌ఓ, వీఆర్‌ఏ ఉద్యోగాల కోసం ఎగబడుతున్నారు. కానీ తమ అర్హతలకు తగ్గ ఉద్యోగాలు సైన్యంలో ఖాళీగా ఉన్నప్పటికీ అటువైపు మొగ్గుచూపడం లేదు. ఈ పరిస్థితిని గమనించి ఇప్పటికే కొన్ని దేశాలు సైన్యం సంఖ్యను తగ్గించుకునే ప్రయత్నాలు మొదలెట్టాయి. ఏకంగా 23లక్షల సంఖ్యాబలంతో ప్రపంచంలోనే శక్తివంతమైన రక్షణ వ్యవస్థ కలిగిన చైనా పదేళ్లలోపే ఈ సంఖ్యను 10లక్షలకు తగ్గించుకోవాలని ప్రయత్నిస్తోంది. సాంకేతికపరిజ్ఞానాన్ని సైన్యంలో మరింత విస్తృత పర్చడం ద్వారా ఉన్నతాధికారుల సంఖ్యను పరిమితం చేసుకోవాలని ప్రయత్నాలు మొదలెట్టింది. భారత్‌లో అయితే ఏ చిన్న సంఘటన జరిగినా కొద్దిమంది సైనికులు క్షతగాత్రులైనా సాధారణ జనాల్లో భీతావహాన్ని చేసే ప్రచారం పదేపదే మీడియా చేస్తున్న ప్రసారాల్ని కట్టడి చేయాలి. విద్యార్థి దశ నుంచి మాతృదేశం పట్ల బాధ్యతాయుతమైన భక్తిభావాన్ని పెంపాలి. లేదా కొన్ని దేశాల్లో అమలు చేస్తున్న విధంగా నిర్బంధ సైనిక ఉద్యోగ విధానాన్ని అమల్లో పెట్టాలని పరిశీలకులు సూచిస్తున్నారు. అమెరికాలో కూడా విధిగా కొంతకాలం సైన్యంలో పనిచేయాలన్న నిబంధన అమలైంది. గ్రేట్ బ్రిటన్‌లో ఇప్పటికే రాజవంశీకులు కొన్నేళ్ళు సైన్యంలో పని చేయడం సంప్రదాయంగా ఉంది. తక్కువ జనాభా కలిగిన దేశాల్లో నిర్బంధ సైనిక విధానం అమలు చేస్తున్నారు. భారత్‌లో నిర్ణీత కాలపరిమితి వరకు సైన్యంలో పని చేసే ఆ తర్వాత ప్రభుత్వోద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్‌తో పాటు కుటుంబానికి కూడా అనేక వెసులుబాట్లు కల్పిస్తున్నారు. అయినప్పటికీ యువత స్వచ్ఛందంగా ముందుకు రావడంలేదు. దీంతో భారత్‌లో కనీసం కొన్నేళ్ళు నిర్బంధ సైనిక ఉద్యోగ విధానం అమలు చేయాల్సిన అవసరముందని వీరు విశ్లేషిస్తున్నారు.



హైదరాబాద్‌లో డిఫెన్స్ కారిడార్

(మొదటిపేజీ తరువాయి)

ఏమాత్రం తావులేకుండా నిర్మించనున్న ఈ ఫార్మాసిటీతో తెలంగాణతో పాటు దేశానికి కూడా ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. దేశంలో యాంటీబయాటిక్స్, ఇతర ఔషధాలు 84శాతం వరకు విదేశాల నుంచి దిగుమతి అవుతున్నాయని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఫార్మాసిటీతో ఔషధాల దిగుమతి చాలావరకు తగ్గుతుందన్నారు. ఈ క్లస్టర్‌తో భారీగా పెట్టుబడులు రావడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయని వివరించారు. ఫార్మాస్యూటికల్ డిపార్ట్‌మెంట్ కూడా ఈ ప్రాజెక్టుకు మద్దతు ప్రకటించిందని గుర్తుచేశారు. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న ఫార్మాసిటీకి వెంటనే పర్యావరణ అనుమతులు ఇవ్వాలని హర్షవర్ధన్‌ను కోరారు.

గురువారం రాత్రి కేంద్ర పెట్రోలియం, మైనింగ్ శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో కేటీఆర్ సమావేశం కానున్నారు. రేపు ఉదయం 10:30 నిమిషాలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిందిని రాష్ట్రపతి భవన్‌లో మంత్రి కే.టీ. రామారావు సమావేశం కానున్నారు.

రైతు పెట్టుబడి పథకం సూపర్ హిట్

- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 7 సీట్లు కూడా రావు
- సీఎం పదవి కోసం కాంగ్రెస్‌లో ఇప్పటి నుంచే కొట్లాట
- వచ్చేది తెరాస ప్రభుత్వమే
- లక్షా 20 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తాం
- ఇష్టాగోష్టిలో మంత్రి తలసాని

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈ ఏడాది ఖరీఫ్ నుంచి ప్రభుత్వం ప్రారంభిస్తున్న రైతు పెట్టుబడి పథకం సూపర్ హిట్ అవుతుందని, దేశంలోనే అన్ని రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆకుపచ్చ తెలంగాణ రాష్ట్రం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు సంకల్పమని ఆ దిశగా అడుగులు వేస్తున్నారని మంత్రి తలసాని గురువారం తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ చెప్పారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్నీ ప్రతిష్టాత్మకమేనని ఇతర దేశాలు, రాష్ట్రాలు ఈ పథకాలను అధ్యయనంచేసి వారి వారి రాష్ట్రాల్లో వీటిని మరో రూపంలో ప్రారంభిస్తున్నారని ఈ ఘనత సీఎం కేసీఆర్‌దని చెప్పారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటనను తలసాని అవహేళన చేశారు. 70 స్థానాల మాట అటుంచి కనీసం ఏడు అసెంబ్లీ సీట్లయినా కాంగ్రెస్‌కు వచ్చే పరిస్థితి లేదని జోస్యం చెప్పారు. సీఎం కేసీఆర్ తన కుటుంబ సభ్యులను మంత్రివర్గంలో చేర్చుకుని పాలన సాగిస్తున్నారని విపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్, ఎంపీ కవితలను ముఖ్యమంత్రి కేసీఆర్ నామినేట్ చేయలేదని ప్రజల ద్వారా వారు ఎన్నికయ్యారని ఈ విషయాన్ని విస్మరించి ఆరోపణలు చేయడాన్ని ఆయన తోసిపుచ్చారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ జిహెచ్ఎంసి ఎన్నికల ఫలితాలే పునరావృతమవుతాయని ఆయన పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న ప్రతి ఒక్కరి ఆర్థిక పరిస్థితి, వారి జీవిన విధానం, ఇతరత్రా అంశాలు సీఎం కేసీఆర్‌కు బాగా తెలుసునని అందుకే వారిని దృష్టిలో ఉంచుకుని పథకాలను, కార్యక్రమాలను రూపొందించారని గుర్తుచేశారు. హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణలోని జిల్లాల్లో తాగునీటికి ఎన్నెన్నో కష్టాలు పడుతున్నారని మహిళలు కిలోమీటర్ల తరబడి బిందెలను తీసుకునివెళ్ళి చెరువులు, బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్న సంఘటనలు గతంలో జరిగాయని దీన్ని గుర్తించిన సీఎం మిషన్ భగీరథ పథకాన్ని తీసుకువచ్చారని చెప్పారు. ఇప్పటికే మిషన్ భగీరథ పథకానికి సంబంధించి 90శాతం పనులు పూర్తయ్యాయని



వచ్చే మే నాటికి మిగతా పదిశాతం పూర్తయి అన్ని గ్రామాలకు, ఆవాసాలకు శుద్ధమైన నీరు అందిస్తామని చెప్పారు. ఇప్పటికే ఈ పథకం ద్వారా అనేక గ్రామాలకు నీరు అందుతున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అన్ని పథకాల్లోకెల్ల సీఎం కేసీఆర్ ప్రారంభించిన కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకానికి ప్రజల నుంచి ఊహించని స్పందన వచ్చిందని గుర్తుచేశారు. ఐటిరంగంలో తెలంగాణ రాష్ట్రం భారతదేశంలోనే అగ్రగామిగా నిలిచిందని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం దూసుకుపోతోందని చెప్పారు. ఐటి ఎగుమతుల్లోనూ ఇతర రాష్ట్రాలకన్నా తెలంగాణ ముందంజలో ఉందన్నారు. రాష్ట్రంలో కోటి ఎకరాలకు నీరందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం వేలకోట్లతో సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించిందని వీటి ఫలాలు త్వరలోనే అందుతాయని చెప్పారు. తన శాఖ చేపట్టిన గొర్రెల పథకం విజయవంతమైందని రాష్ట్రంలో గొల్ల, కురవలు ఈ పథకం ద్వారా ఎంతో లబ్ధి పొందడంతో పాటు అనాధిగా ఈ సామాజికవర్గం నమ్ముకున్న కులవృత్తిని కొనసాగింపునకు దోహద పడిన సీఎంకు రుణపడి ఉంటామని చెబుతున్న అంశాన్ని ఆయన గుర్తుచేశారు. చేపపిల్లల పథకానికి మంచి స్పందన వచ్చిందని 50 కోట్ల చేపపిల్లలను చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో వదిలామని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం ద్వారా ప్రజలు లబ్ధి పొందుతున్నారని గుర్తుచేశారు. గూడులేని వారికోసం చేపట్టిన రెండు పడక గదుల ఇండ్ల పథకం పూర్తిచేస్తామని చెప్పారు. ఇప్పటికే 31 జిల్లాల్లో ఈ పథకం ద్వారా యుద్ధప్రాతిపదికన ఇండ్ల నిర్మాణం జరుగుతోందని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు రెండున్నర లక్షల ఇండ్లను నిర్మించి తీరుతామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ యువతకు లక్షా 20వేల ఉద్యోగాలను భర్తీచేస్తామని ఇప్పటికే 30వేల ఖాళీలను భర్తీ చేయడంతో పాటు నియామక ఉత్తర్వులు కూడా జారీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దన్నారు.



విభజన హామీలన్నీ నెరవేర్చండి

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. సులభతర వాణిజ్యంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసిందని కితాబిచ్చారు. దాని వల్ల ప్రపంచ దేశాల్లో 41 ర్యాంకులు పైకి వెళ్లిందన్నారు. జీఎస్టీ, ఐటీ మినహాయింపులు, తదితర వ్యూహాల ద్వారా ఇది సాధ్యమైందన్నారు. ఇదే తరహాలో రైతుల ఆదాయం రెండింతలు చేసేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వ్యాపార రంగం కోసం 31 బిల్లులు పాస్‌చేస్తే, వ్యవసాయరంగంకోసం రెండు బిల్లులు మాత్రమే పాస్ చేశారని అన్నారు. నాబార్డు, విత్తనాల బిల్లులు చాలా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటన్నింటిని ఆమోదిస్తేనే రైతుల ఆదాయం రెండింతలు అవుతుం దన్నారు. పెద్దనోట్ల రద్దు, జిఎస్టీలలో తాము ప్రభుత్వానికి మద్దతిచ్చామన్నారు. కార్పొరేట్‌కు అండగానిలబడినట్లే, రైతులకు అండగా ఎందుకు ఉండడం లేదన్నారు. ఫర్టిలైజర్ సబ్సిడీ 17వేల కోట్ల సబ్సిడీ వెళుతోందన్న ప్రభుత్వం నేరుగా రైతులకే ఇస్తామని చెప్పిందన్నారు. మూడు కంపెనీలకు మాత్రమే ఫర్టిలైజర్ దిగుమతి చేసుకునే అవకాశం ఉండడం వల్ల రైతులకు ఆలస్యంగా అందుతున్నాయన్నారు. సాగుయోగ్యమైన భూముల్లో 51శాతానికి మాత్రమే నీరు అందుతోందన్నారు. రైతుల ఆదాయం రెండింతలు కావాలంటే సాగునీటి ప్రాజెక్టులకు ఎక్కువ నిధులు ఇవ్వాలని కోరారు.

కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందించాలని కోరారు. సూక్ష్మ నీటిపారుదలకు ఇస్తున్న సబ్సిడీ చాలా ఆలస్యంగా అందుతోందన్నారు. దీనిని నిర్ణీత వ్యవధిలో ఇవ్వాలని కోరారు. రైతు యూనిట్‌గా బీమాను కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలనికోరారు. 26 పంటలకు కనీస మద్దతు ధర అందించాలని కోరారు. ఇందులోకేవలం వరి, గోధుమను మాత్రమే 30శాతం కొనుగోలు చేస్తున్నారని అన్నారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధరను కల్పించాలని డిమాండ్ చేశారు.

టీఆర్టీ అభ్యర్థులు మాధ్యమాన్ని స్పష్టం చేయాలి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఉపాధ్యాయ భర్తీ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో 1868 మంది స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రం సబ్జెక్టుకు దరఖాస్తు చేసుకున్నారు. వారి దరఖాస్తుల్లో ఇంగ్లిష్, హిందీ మీడియం అని చేర్చారు. ఇంగ్లిష్, హిందీ మీడియంలో జీవశాస్త్రం సబ్జెక్టులో ఖాళీలు లేవని, తెలుగు, ఉర్దూ, మరాఠీ, కన్నడ మాధ్యమాల్లో జీవశాస్త్రం సబ్జెక్టుకు వారు ఎడిట్ ఆప్షన్‌ను ఇచ్చుకోవాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడిట్ ఆప్షన్‌లో వారు మార్పులు చేయకపోతే వారికి పరీక్ష రాయడానికి హాల్‌టికెట్ రాదని తెలిపారు. కాబట్టి అభ్యర్థులు 10 నుంచి 12 తేదిల్లో వారు ఎడిట్ అప్షన్ ఇవ్వాలని సూచించారు. అలాగే 30,849 మంది అభ్యర్థులు 31 జిల్లాల ప్రకారం వారి స్థానికతను అప్‌లోడ్ చేశారని, వారు తమ హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో 10 జిల్లాల ప్రకారం వారి స్థానిక జిల్లా ఏదైతే దానిని దరఖాస్తులో అప్‌లోడ్ చేసి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

బడ్జెట్ పెద్ద ఊరట

(మొదటిపేజీ తరువాయి)

లబ్ధి చేకూరుస్తాయని తెలిపారు. భారతదేశం వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రపంచంలో త్వరితగతిన వృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అరుణ్ జైట్లీ చెప్పారు. 2018-19 బడ్జెట్‌పై చర్చకు సమాధానమిస్తూ ఎన్డీయే ప్రభుత్వం 2014, మే మాసంలో అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక అంశాల్లో మార్పు చోటు చేసుకుందని మంత్రి తెలిపారు. భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అనే పేరును 0.1 శాతం తేడాతో కోల్పోయిందని చెప్పారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) ప్రకారం భారత్ మరోసారి వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అరుణ్ జైట్లీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సూచించినట్టుగా నోట్ల రద్దు ప్రభావం రెండు శాతానికి బదులుగా కేవలం 0.4 శాతం మాత్రమే ఉందని చెప్పారు. బడ్జెట్‌లో అన్ని వర్గాల బాగోగులు చూడటానికి తాను ప్రయత్నించినట్టు తెలిపారు.

వేతన జీవుల ఊరటకు అయ్యే మొత్తం ఖర్చు రూ.8,000 కోట్లు, పింఛనదారులు, వయోవృద్ధులకు అది రూ.4,000 కోట్లు. సవాళ్ళ కాలంలోనూ రూ.12,000 కోట్లు ఊరట కల్పించాల్సిన పరిస్థితి. అయినప్పటికీ ఆ సంప్రదాయాన్ని నేను గత నాలుగు బడ్జెట్‌లకు కొనసాగిస్తూ వస్తున్నాను అని చెప్పారు.

దీర్ఘకాలిక మూలధన రాబడుల పన్నును ప్రస్తావిస్తూ స్టాక్ మార్కెట్ పతనానికి పన్ను ప్రతిపాదనను ఆపాదించడం సరికాదని మంత్రి అన్నారు. స్టాక్ మార్కెట్ పతనానికి అంతర్జాతీయ కారణాలే తప్ప ఎల్‌టిసిజి విధింపు కాదని, పన్ను ప్రతిపాదన అంతర్జాతీయ మార్కెట్లపై ఎలాంటి ప్రభావం చూపించలేదని జైట్లీ వివరించారు.

నోట్ల రద్దు, జీఎస్టీ, దివాలా స్మృతి.. ఇవ్వన్నీ క్లిష్టతరమైన నిర్ణయాలు. అదే యూపీఏ, ఎన్డీయే మధ్య ఉన్న తేడా. నిర్ణయాలు తీసుకున్నప్పుడు విపత్కర పరిస్థితులు ఎలా ఎదుర్కోవాలో మాకు తెలుసు అని అన్నారు. వ్యవసాయ రంగం, పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పనకు సంబంధించిన సవాళ్లను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీ తన పాలనలో ఈ సమస్యలను తొలగించిందా లేక సృష్టించిందా అని ఆత్మ శోధన చేసుకోవాలి అని వేలెత్తి చూపారు. సులువైన వ్యాపారానికి సంబంధించి ప్రపంచ బ్యాంకు సూచీలో తన ర్యాంకింగ్‌ను మెరుగుపరుచుకునే ఘనమైన సామర్థ్యం భారత్‌కు ఇప్పటికీ ఉందని జైట్లీ తెలిపారు. జీఎస్టీ, నోట్ల రద్దు లాంటి నిర్మాణాత్మక సంస్కరణలు కాలానుగుణ కష్టాన్ని సృష్టించినప్పటికీ దీర్ఘకాలంలో అవి ఆర్థిక వ్యవస్థకు మంచి లాభాలు తెచ్చిపెడతాయని చెప్పారు. ప్రభుత్వం ఆర్థిక ప్రాజ్ఞతను అనుసరిస్తున్నదని, భవిష్యత్తులోనూ అదే కొనసాగిస్తుందని ఆర్థిక మంత్రి తెలిపారు. ప్రభుత్వం కొద్ది మాసాల్లో జీఎస్టీ

అమలును స్థిరీకరించగలుగుతుందని చెప్పారు. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణను తాము ప్రారంభించినట్టు తెలిపారు. రెవెన్యూ వసూళ్ల వృద్ధికి అనుగుణంగా వాటిని తగ్గిస్తామని చెప్పారు. జీఎస్టీ అమలు చేసిన సమయాన్ని గురించి ప్రస్తావిస్తూ రాజ్యాంగపరమైన గడువు కారణంగానే వాయిదా వేయలేకపోయామని తెలిపారు. యూపీఏ హయాంలో నిర్దేశిత వస్తువులపై ప్రభావిత పన్ను రేటు 31 శాతం ఉండేదని, కానీ పన్ను పరిమితిని 18 శాతానికి తీసుకురావాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని నేటి కాంగ్రెస్ కోరుతున్నదని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు.

యూపీలో ఎంఇఐఎల్ ఘనత

13,220 ఎంవిఎ విద్యుత్ ప్రాజెక్టు పూర్తి

- ఎంఇఐఎల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పశ్చిమ ఉత్తరప్రదేశ్ విద్యుత్ సరఫరా సంస్థ చేపట్టిన ప్రాజెక్టును ఎంఇఐఎల్ విజయవంతంగా పూర్తిచేసింది. ఈ ప్రాజెక్టు దేశంలోనే అతిపెద్దదిగా నిలిచింది. ఈ ప్రాజెక్టును రూ.4,150 కోట్లతో చేపట్టి ఉన్నత ప్రమాణాలు, అత్యాధునిక టెక్నాలజీతో నిర్దిష్టమైన ప్రణాళికతో నిర్ణీతకాల వ్యవధిలోనే పూర్తిచేశామని ఎంఇఐఎల్ డైరెక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 13,220 ఎంవిఎ విద్యుత్ ఈశాన్య ప్రాంతానికి సరఫరా చేస్తారని, ఇది రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరా సంస్థలకు సమానమని ఆయన పేర్కొన్నారు. ఇంతటి భారీ ప్రాజెక్టులను ఇప్పటి వరకు కేవలం ప్రభుత్వరంగ సంస్థలే నిర్మాణం చేసేదని, దేశంలోనే మొదటిసారిగా ప్రైవేట్ రంగంలో తమ సంస్థ ప్రతిష్టాత్మకమైన ఈ ప్రాజెక్టును పూర్తిచేసిందని శ్రీనివాసరెడ్డి చెప్పారు. 2011లో బూట్ పద్ధతిపై ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టగా, ఈ వారంలోనే దాన్ని పూర్తిచేశామని చెప్పారు. ఈ ప్రాజెక్టును 35 ఏళ్ళపాటు తమ సంస్థ నిర్వహణ, మరమ్మతులు చేపడుతుందని అన్నారు. విద్యుత్‌రంగ ప్రాజెక్టులలో తమ సంస్థకు గుర్తింపుతెచ్చే మైలురాయిగా ఈ ప్రాజెక్టు నిలుస్తుందని శ్రీనివాసరెడ్డి ఆశాభావం వ్యక్తంచేశారు.

రాహుల్ మా బాస్

- బీజేపీ వ్యతిరేకులతో పనిచేద్దాం
- కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ భేటీలో సోనియా



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తనకు కూడా బాస్‌యే నని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ గురువారం తెలిపారు. పార్టీ విజయావకాశాలను పునరుద్ధరించే ప్రక్రియ మొదలైందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓటమి కోసం భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి పనిచేస్తామని తెలిపారు. బీజేపీ, మోడీ ప్రభుత్వంపై పూర్తి స్థాయి దాడిని ఆమె ప్రారంభించారు. ప్రభుత్వం రాజకీయ లబ్ధుల కోసం మైనారిటీలపై హింసను ప్రేరేపిస్తున్నదని ఆరోపించారు. మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరగనున్న కర్ణాటకలో కూడా ఇదే కనిపిస్తున్నదని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) సమావేశాన్ని ఉద్దేశించి సోనియా గాంధీ అన్నారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో తనకు సైతం బాస్ అయిన రాహుల్ గాంధీ పట్ల అంకితభావం, విధేయత, ఉత్సాహంతో పనిచేయాలని పార్టీ ఎంపీలకు పిలుపునిచ్చారు. మనం కాంగ్రెస్ పార్టీకి కొత్త అధ్యక్షుడిని ఎన్నుకున్నాము. మీ తరఫున, నా తరఫున ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నాను. ఆయన ప్రస్తుతం నాకు కూడా బాస్. నాతో మీరు ఎలా పనిచేశారో అదే విధమైన అంకితభావం, విధేయత, ఉత్సాహంతో మీరు ఆయనతో పనిచేయాలి. ఆయన నాయకత్వంలో మనం పార్టీ విజయావకాశాల పునరుద్ధరణ కోసం కలసికట్టుగా పనిచేస్తామనే విశ్వాసం నాకు ఉంది. ఆ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది అని సోనియా గాంధీ అన్నారు. మోడీ ప్రభుత్వం వాస్తవాలకు తగ్గట్టుగా పనిచేయడంలేదని ఆమె ఆరోపించారు. ఇందుకు లోక్‌సభలో ప్రధాని బుధవారం చేసిన ప్రసంగమే నిదర్శనమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించి, భారత్‌ను ఒక ప్రజాస్వామిక, లౌకిక, ఆర్థికంగా ప్రగతిపథంలో పయనించేలా భావసారూప్యత కలిగిన రాజకీయ పార్టీలతో జరిపే చర్చల్లో కాంగ్రెస్ అధ్యక్షుడు, ఇతర సహచరులతో ఒక సీపీపీ చైర్‌పర్సన్ హోదాలో తాను పనిచేస్తానని సోనియా గాంధీ తెలిపారు. మైనారిటీలు, దళితులపై రాజకీయ లబ్ధుల కోసం పథకం ప్రకారం దాడులు జరుగుతున్నాయని, ఇవి ఉత్తరప్రదేశ్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో పెచ్చరిల్లుతున్నాయని అన్నారు.

హోదా కోసం ప్రధాని వద్దకు..

- వ్యక్తులపై కాదు.. హక్కుల కోసమే పోరాటం
- రాష్ట్రానికి న్యాయం చేయాలని బీజేపీ పెద్దలు ఆలోచించాలి
- జేపీతో పవన్ భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి అభిప్రాయాలు సేకరించి డిమాండ్ల సాధన కోసం ప్రధాని నరేంద్రమోడీని కలుస్తామని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చెప్పారు. విభజన సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇస్తామన్న వాటినే ఇప్పుడు ప్రధాని మోడీని అడుగుతున్నామని ఆయన చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలోని హామీలను అమలు చేసేందుకు జేఏసీ ఏర్పాటు చేసే అంశంపై గురువారం లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో చర్చలు జరిపారు. అనంతరం ఈ ఇద్దరు నేతలు మీడియాతో మాట్లాడారు.

తెలంగాణలో జేఏసీ ఉన్నప్పటికీ తెరాసకు అనేక సమస్యలు ఉన్నాయని, వారి సమస్యలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణకు కూడా కేంద్రం అన్యాయం చేస్తున్న సందర్భంలో దాని తరఫున కూడా పోరాటం చేస్తారా అని ఒక విలేకరి ప్రశ్నించగా, ఏ రాష్ట్రం అనేది ప్రధానం కాదని, ఇది రాజకీయ పార్టీల సమస్యగా కాకుండా ప్రజా ప్రయోజనాల పోరాటంగా పరిగణించాలని పవన్ కళ్యాణ్ అన్నారు. తమ ఉద్యమం ఏ ఒక్క రాజకీయ పార్టీ, కొందరు వ్యక్తుల కోసం కాదనీ, ఇది ఆంధ్ర ప్రజానీకం సంక్షేమం, అభివృద్ధి కోసమేనని పవన్ పునరుద్ఘాటించారు.




విభజన సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి ఆ తర్వాత రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న తీరుపైనే తమ పోరాటం సాగుతుందేగానీ వ్యక్తులపై కాదని స్పష్టంచేశారు. న్యాయమైన హక్కుల సాధన కోసం సమూహంగా, సమైక్యంగా పోరాటం చేయాలని, ప్రజాస్వామ్యయుతంగా హక్కులు సాధించాలన్నదే తమ లక్ష్యమన్నారు. భాజపా నేతలకు ఉన్న సుదీర్ఘ అనుభవంతో రాష్ట్రానికి న్యాయం చేయాలన్న ఆలోచనకు పదును పెట్టాలని, ఎన్నికల్లో ఆ పార్టీ ఇచ్చిన హామీలను కూడా నిలబెట్టుకోవాలని పవన్ డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా.. ప్యాకేజీ అంటూ మభ్యపెట్టడం మానుకోవాలని ఆయన ఘాటుగా స్పందించారు. కేంద్రం ఇచ్చిన నిధులకు లెక్కల గురించి రాజకీయం చేయడం కాదని, హామీలు ఏమయ్యా యన్నదే ప్రజలు ప్రశ్నిస్తున్నారని ఆయన అన్నారు. కేంద్రంపై పోరాటం ఏ రూపంలో ఉంటుందని ఓ విలేకరి ప్రశ్నించగా, ప్లకార్డులు, రోడ్లపై ఆందోళనలతో సమస్య పరిష్కారం కాదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగానే ఆందోళన ఉంటుందని, ఇది ఎవరికీ ఇబ్బంది కలుగని రీతిలో ఉండాలని పవన్ అభిప్రాయపడ్డారు.

కేటాయింపులు రాజకీయంగా చూడొద్దు : జేపీ

కేంద్ర ప్రభుత్వం విభజన బిల్లులో పేర్కొన్న అంశాలను అమలు చేయకుండా ఆంధ్రప్రదేశ్‌ను అన్యాయం చేస్తోందని జయప్రకాశ్ నారాయణ్ దుయ్యబట్టారు. ప్రతి కేటాయింపును రాజకీయంగానే చూస్తున్నారని, రాష్ట్రానికి విభజన చట్టం మేరకు ఎందుకు నిధులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బుందేల్‌ఖండ్‌లో కేవలం కోటి 83 లక్షల మంది జనాభా ఉంటే ఏపీలో ఐదుకోట్ల మంది ఉన్నారని చెప్పారు. ఆ రాష్ట్రానికి రూ.4కోట్లకు పైగా ఆర్థికసాయం ప్రకటించిందని, ఈ తరహాలో చూస్తే ఏపీకి రూ.10వేల కోట్లకుపైగా ఇవ్వాల్సి ఉంటుందని జేపీ డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఎంతో ఇచ్చామని చెబుతున్న కేంద్రం ఎక్కడ ఇచ్చారో, దేనికి ఇచ్చారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. అరకొర ఇచ్చే నిధులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలుసుకోవాలేగానీ విభజన హామీలను ఎందుకు పక్కన పెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. సినీరంగంలో సూపర్‌స్టార్‌గా ఎదుగుతున్న పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రజల కోసం రాజకీయాల్లోకి ప్రవేశించి సమస్యలు కొని తెచ్చుకుంటున్నారని జేపీ అన్నారు. పవన్ ఒక నిర్దిష్టమైన లక్ష్య సాధన కోసం అడుగు ముందుకు వేశారని, దానికి అందరి మద్దతు కావాలని ఆయన కోరారు. రాష్ట్రం కోసం పవన్ తీసుకున్న చొరవను స్వాగతిస్తున్నామని, ఆయన పోరాటానికి తన మద్దతు ఉంటుందని జేపీ స్పష్టంచేశారు.

రూ.300 కోట్లతో ఆటోమిషన్ కంట్రోల్

సీఎండీ రఘుమారెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక వాడల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించి ఆటో మిషన్ కంట్రోల్ సిస్టంను ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ సీఎండి రఘుమారెడ్డి వెల్లడించారు. ఇప్పటివరకూ విద్యుత్ సరఫరాలో ఏర్పాడే లోపాలు, బ్రేక్‌డౌన్స్ వంటివాటికి సిబ్బంది హాజరయి వాటని సరిదిద్దే వారన్నారు. కొత్త సిస్టం ద్వారా ఇకపై పని మరింత సులువవు తుందన్నారు. ఆటో మిషన్ కంట్రోల్ సిస్టం ఏర్పాటుకు రూ.300కోట్లతో టెండర్లు పిలిచామన్నారు. వీటి పనులు పురోగతిలో ఉన్నట్టు రఘుమారెడ్డి పేర్కొన్నారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శుక్రవారం 9 ఫిబ్రవరి 2018

బకాయిలపై మొండి వాదనలు!

బ్యాంకుల్లో మొండి బకాయిలు కొత్తగా వచ్చిన సమస్య కాదు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రధానమంత్రులుగా ఉన్న కాలంలో కూడా ఈ అంశంపై పార్లమెంటులో వాడిగా, వేడిగా చర్చించిన సందర్భాలు అనేకం. కుట్టుపని కేంద్రాలు, టైప్ రైటింగ్ ఇనిస్టిట్యూట్, ఫర్నిచర్ దుకాణాలు, బుట్టలు, తడికల అల్లిక కేంద్రాలు వంటి స్వయం ఉపాధి కార్యక్రమాలకు రుణాలు ఇప్పిస్తున్నామంటూ మంత్రులు, అధికార పార్టీ నాయకులు తరచూ దండోరా వేసినట్టు ప్రకటనలు చేస్తుంటారు. నిజానికి ఈ తరహా రుణాలన్నీ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ సానుభూతిపరులకూ, మద్దతుదారులకే లభిస్తున్నాయి. ఈ మార్గంలో రుణాలు పొంది కొందరు అధికారంలో ఉన్న వారి అండతో ఎగనామం పెట్టేస్తుంటారు. నిజాయితీపరులు ఎప్పటికప్పుడు వాయిదా సొమ్ము కట్టేస్తూ రుణ విముక్తులవుతున్నారు. ఇక ఉన్నత వర్గాల విషయానికి వస్తే, కొత్త పరిశ్రమల స్థాపనకూ, ప్రత్యేక ఆర్థిక మండళ్ళ (సెజ్‌ల)కూ సంపన్న వర్గాలకూ బ్యాంకులు విరివిగా రుణాలు ఇస్తుంటాయి. హామీలు, జామీనులు లేకుండానే సంపన్న వర్గాలకు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయంటూ వామపక్షాలు చేసే ఆరోపణల్లో అసత్యంలేదు. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, బ్యాంకుల్లో మొండి బకాయిలను వారసత్వంగా పొందుతూ ఉండటానికి అసలు కారణం ఇదే. ఖజానా ఖాళీ చేసి వెళ్ళారనీ, అప్పులు వారసత్వంగా ఇచ్చారనీ అధికారంలోకి వచ్చిన ప్రతి పార్టీ అధికారం కోల్పోయిన ప్రత్యర్థి పార్టీని దుమ్మెత్తి పోస్తూ ఉంటుంది. ఇది అలవాటుగా మారింది. మళ్ళీ వీరు అధికారం నుంచి వైదొలగే సమయానికి మొండి బకాయిల మొత్తం పాపంలా పెరిగి పోతుంది. ఇది ఒక విషవలయం. దీనికి అడ్డుకట్ట వేయడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ బుధవారం పార్లమెంటులో చేసిన ప్రసంగంలో ఈ అంశాన్ని ప్రస్తావించడం సబబే కానీ, ఆయన ఉదహరించిన మొండిబకాయిల వివరాలన్నీ అర్ధ సత్యంగానే ఉన్నాయి. కాంగ్రెస్ నాయకులైతే మోడీ నోటంట వచ్చిన అంకెలన్నీ అసత్యాలేనంటూ తేలిగ్గా కొట్టి వేస్తున్నారు. మొండి బకాయిలు బ్యాంకింగ్ వ్యవస్థ మనుగడకు సవాల్‌గా తయారయ్యాయన్నది తిరుగులేని వాస్తవం.. అందువల్ల ఇది పూర్తిగా ఆర్థిక సమస్యే అయినప్పటికీ, రాజకీయ ప్రత్యర్థుల మధ్య వాగ్వాదానికి ఇంధనంగా మారింది. ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చే నాటికి బ్యాంకుల మొండి బకాయిలు 86 శాతం ఉన్నట్టు మోడీ పేర్కొనగా, 36 శాతమేనని ఓ వార్తా సంస్థ ప్రతినిధి సేకరించిన వివరాల్లో వెల్లడైంది. మొత్తంమీద కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం మోడీ ప్రభుత్వానికి మొండి బకాయిలను వారసత్వంగా ఇచ్చిన మాట నిజం. అంకెల్లో గజిబిజినీ, గారడీని సృష్టించడం రాజకీయ నాయకులకు అలవాటు. బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న సొమ్మును బడా పారిశ్రామిక వర్గాలకు ఉదారంగా సంతర్పణ చేయడంలో కాంగ్రెస్, బీజేపీలకు తేడా లేదు. మోడీ సభాముఖంగా అందజేసిన అంకెలు తప్పని కాంగ్రెస్ వారు అంటున్నారు. తమ ప్రభుత్వం అధికారం నుంచి తప్పుకునే సమయానికి మొండి బకాయిలు 2.76 లక్షల కోట్లు మాత్రమేననీ అవి ఇప్పుడు దాదాపు పదిలక్షల కోట్లకు పెరిగాయనీ కాంగ్రెస్ ప్రత్యారోపణ చేస్తోంది. బ్యాంకులకు రుణాలు ఎగవేసిన వారిలో బీజేపీ సానుభూతిపరులూ, పార్టీ ఫిరాయించి కాషాయ కండువా కప్పుకున్న వారూ ఎక్కువ మంది ఉన్నమాట నిజమే. ఎగవేతదారులు ఏ పార్టీ అధికారంలోకి వస్తే, ఆ పార్టీ కండువాలు వేసుకుంటూ ఉంటారు. ఉదాహరణకు కింగ్ ఫిషర్ ప్రైవేటు వైమానిక సంస్థ వ్యవస్థాపకుడు విజయ్ మాల్యా, ఐపిఎల్ మాజీ ఫ్రాంచైజర్ లలిత్ మోడీ యూపీఏ హయాంలోనే బ్యాంకు రుణాలు అధిక మొత్తంలో తీసుకుని తీర్చకుండా గడిపేశారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన కొత్తల్లో దేశంలోనే ఉన్న వీరు ఆ తర్వాత లండన్‌కిఎలా జారుకున్నారో ఇప్పటికీ అంతుచిక్కని విషయమే. వార్తల్లోకి రానివి ఇలాంటి కోకొల్లలు. బ్యాంకుల మొండి బకాయిల సమస్య రావణ కాష్టంలా దశాబ్దాలుగా రగులుతూనే ఉంది. ఇందిరాగాంధీ హయాంలో ఆనాటి ప్రతిపక్ష నాయకులు జార్జి ఫెర్నాండెజ్, భూపేష్ గుప్తా ప్రభృతులు అధికార పార్టీని ఇరుకున పెట్టేందుకు గుక్కతిప్పుకోకుండా గణాంకాలను పార్లమెంటులో వెల్లడించేవారు. బ్యాంకు ఉద్యోగుల సంఘాల సమాఖ్య నాయకుడు తారకేశ్వర చక్రవర్తి, బహిరంగ సభల్లో రుణాలను ఎగవేసే వారికీ, అధికార పార్టీ నాయకులకూ మధ్య ఉన్న సంబంధాన్ని వివరించేవారు. అందువల్ల మొండి బకాయిలను పెంచి పోషించడంలో కాంగ్రెస్ పాపం 70 శాతం ఉంటే, బీజేపీది 30 శాతం ఉంటుంది. గణాంకాల వివరాలు కొద్దిగా అటూ, ఇటూగా ఉన్నా మొత్తం మీద జనం సొమ్మును అక్రమార్కులకు పంపిణీ చేయడంలో ఈ రెండు పార్టీలు తిలాపాపం సామెతగా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ ధోరణికి అడ్డుకట్టవేయడంతో పాటు బ్యాంకులు రుణాలు ఇచ్చే విధానాన్ని సమీక్షించాల్సిన అవసరం ఎంతైనాఉంది. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారంలో బ్యాంకు రుణాలు కట్టొద్దని పిలుపు ఇస్తుంటారు. ఇంతకన్నా బాధ్యతా రహితం మరేదీ లేదు. కార్పొరేట్ వర్గాలకు ఉదారంగా రుణాలు సంతర్పణ చేయడం ఎంత తప్పో, బడుగు వర్గాలను రుణాలు కట్టొద్దనడం కూడా అంతే తప్పు. వడ్డీని మాఫీ చేయడం, రుణాలను రీషెడ్యూల్ చేయడం వంటి చర్యలు తీసుకోవడం ఎప్పుడూ జరుగుతున్నదే. మొండి బకాయిల సమస్యను రాజకీయ కోణం నుంచి కాకుండా, ఆర్థిక కోణం నుంచి పరిశీలించి పరిష్కారానికి నిపుణులతో చర్చించి నిర్దిష్టమైన ప్రతిపాదనలను ప్రభుత్వం రూపొందించాలి. ఇది అందరికీ సంబంధించిన సమస్య కనుక, దీనిపై అఖిలపక్ష సమావేశాన్ని వీలైనంత త్వరలో ఏర్పాటు చేయాలి. ప్రధాన జాతీయ పార్టీలు పరస్పరం దుమ్మెత్తి పోసుకోవడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు సరికదా బ్యాంకులపై సామాన్య ప్రజల విశ్వాసం సన్నగిలుతుంది.

మిత్ర భేదం ఏ దరికి చేరెనో!

కఠోర సత్యాలు



పెంటపాటి పుల్లారావు
రాజకీయ విశ్లేషకులు, న్యూఢిల్లీ
ppr193@gmail.com

తెలుగు రాష్ట్రాలలో రాజకీయంగా ఇప్పుడొక అంశం ప్రముఖంగా వినిపిస్తోంది. చర్చలకూ తావిస్తోంది. టీడీపీ నేత, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు బీజేపీతో చెలిమికి కటీఫ్ చెబుతారా అనేదే ఆ అంశం. ఫిబ్రవరి 4న నిర్వహించిన తెలుగుదేశం పార్టీ సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వాటిలో కేంద్ర బడ్జెట్, బీజేపీతో చెలిమి అంశాలు కూడా ఉన్నాయి. ఊహించిన దానికి భిన్నంగా సమావేశ నిర్ణయాలున్నాయి. బీజేపీకి చంద్రబాబు తీవ్రమైన హెచ్చరిక చేసి, కేంద్ర క్యాబినెట్లో ఉన్న ఇద్దరు మంత్రులతో రాజీనామా చేయించవచ్చునేది సాధారణ అభిప్రాయం. చంద్రబాబు నాయుడు ఇటీవలి కాలంలో మిత్ర ధర్మం గురించి మాట్లాడారు. అప్పుడే ఏదో జరుగుతుందనే ఊహాగానాలు ప్రారంభమయ్యాయి. అనుకున్నట్లుగా ఏమీ కాలేదు. పెరిగిన స్వరం మారింది. తమ మాటలు విని మోడీ కొన్ని నిధులిస్తారని భావించారు. తద్వారా సమస్య సద్దుమణుగుతుందనీ అనుకున్నారు. కానీ.. అందుకు భిన్నంగా జరిగింది. మోడీ-షాకూ చంద్రబాబుకూ మధ్య ప్రస్తుతం ఎటువంటి కెమిస్ట్రీ లేదని స్పష్టమై పోయింది. ఏబీ వాజ్‌పేయి, ఎల్.కె. అద్వానీల వైఖరినే పాటిస్తున్నట్లు కనిపిస్తోంది. నరేంద్ర మోడీ, అమిత్ షా ఇద్దరూ విభిన్నమైన నేతలు. ఇద్దరి అభిప్రాయాలు కూడా వేరుగానే ఉన్నాయి. లోక్‌సభలో బీజేపీకి పూర్తిస్థాయి మెజారిటీ ఉండడమే ఇప్పుడు సమస్యగా మారింది. 1999లో వాజ్‌పేయి ప్రభుత్వానికి మెజారిటీ లేదు. టీడీపీ ఎంపీలు 30మందిపైనే ఆయన ఆధారపడ్డారు. ఇప్పుడు చంద్రబాబుకు ఆ శక్తీ, అధికారం రెండూ లేవు. 1999కీ ఇప్పటికీ అదే ప్రధానమైన వ్యత్యాసం. ఆంధ్ర ప్రదేశ్‌లో రెండు డ్రామాలు నడిచాయి. 2002లో చంద్రబాబు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి అత్యంత శక్తిమంతమైన ముఖ్యమంత్రి, ఆ సమయంలో ఆయన స్వరం కూడా పెద్దగానే ఉండేది. అప్పట్లో గుజరాత్‌లో హింస, అల్లర్లు చెలరేగాయి. నరేంద్రమోడీ కొత్తగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఆ సమయంలో మోడీపై వేటు వేయాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. 2004లో టీడీపీ ఎన్నికలలో ఓటమిని చవిచూసింది. గుజరాత్ అల్లర్లను సాకుగా చూపి, బీజేపీతో చంద్రబాబు తెగతెంపులు చేసుకున్నారు. ఇదే టీడీపీ ఓటమికి ప్రధాన కారణమైంది. నాయకులు రాజకీయాలలో ఉత్సాహంగానూ, జీవించి ఉన్నంత కాలమూ చరిత్రను వారే కాకుండా ఎవరూ మరిచిపోలేరు.

ప్రతీకారం చాలా తియ్యగా ఉంటుంది.. రక్తం మరిగిపోతున్నప్పుడు మరింత తియ్యదనాన్ని సంతరించుకుంటుందని షేక్స్‌పియర్ అంటారు. దేశంలో ఆమూలాగ్రమూ నరేంద్ర మోడీని దేశ నేతగా కోరుకుంటోందని 2014లో చంద్రబాబు సరైన సమయంలో చక్కగా పసిగట్టారు. మోడీ ఆకర్షణ లేకుండా పట్టణ ప్రాంతాలు, యువకుల ఓట్లు తాను గెలుచుకోలేనన్న విషయం బాబుకు అర్థమైంది. అనేక ప్రయత్నాల తరవాత బీజేపీ టీడీపీతో అనుబంధానికి అంగీకరించింది. ఇటీవలి కాలపు చరిత్ర ఇది. ఈ నేపథ్యంలో ఇరువురు నేతల మధ్య అభిప్రాయ భేదాలు పొడసూపాయి. మెల్లిగా వేడెక్కి ఉడకడమూ ప్రారంభించాయి.

1) టీడీపీ డిమాండ్లన్నింటినీ తీరుస్తామని పార్లమెంటు సాక్షిగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. ఆంధ్ర ప్రదేశ్ వరకూ ఇదే అతి పెద్ద అంశం. దీనివల్ల వివాదం కొంతమేరకైనా సద్దుమణుగుతుందని ఆశించవచ్చు. లక్షల



కోట్ల రూపాయల నిధులు ఇవ్వలేకపోవచ్చు గానీ, టీడీపీ పరువు కాపాడేందుకు ఉపయోగపడవచ్చు. నాలుగు రాష్ట్రాల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇప్పుడు కొత్త కూటమికి బీజేపీ అవకాశమీయదు. ఎందుకంటే.. అది దారికి తెచ్చుకోవాల్సిన అంశాలు చాలానే ఉన్నాయి.

2) వివిధ సంస్థల ఏర్పాటు, రైల్వే జోన్ అంశాలు ప్రభుత్వ దృష్టికి వస్తాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో తనకు చెడ్డపేరు ఆపాదించుకోవడం బీజేపీకి ఇష్టం ఉండదు కనుక కేంద్రం ఆ దిశగా ఆలోచించే అవకాశముంది. ఇంకే కారణంగానూ బీజేపీ పేరు చెడగొట్టుకోవడానికి సిద్ధంగా లేదు. ఆర్థిక డిమాండ్లకు సంబంధించి అంగీకారంలో బీజేపీ టీడీపీలకు విశ్వసనీయమైన రాజకీయ అంశాలున్నాయి. కోరికలూ పెండింగులో ఉన్నాయి.

ఎ) రాజకీయంగా బీజేపీ, టీడీపీల నడుమ విశ్వాసం లేదు. తప్పెవరివైపున్నా ఆధిక్యం కనబరచాలనే తపన టీడీపీలో కనిపిస్తుంది. ఆంధ్ర ప్రదేశ్‌లో బీజేపీని ఎదగనీయకుండా చేస్తుంది. బీజేపీ ఎదిగితే తన సహజమైన పునాది దెబ్బతింటుందన్నది తెలుగుదేశం పార్టీ భయం. అందుకే బీజేపీని టీడీపీ కొన్ని స్థానాలకే పరిమితం చేస్తుంది. వీలైతే ఇంకాస్త తగ్గించడానికే ప్రయత్నిస్తుంది. పార్టీ సహచరులను కొందరిని బీజేపీలో చేరమని సలహా ఇచ్చి, వారికే టికెట్లు వచ్చేలా చేస్తుంది.

బి) ప్రస్తుతం బీజేపీ కేరళలో కాలూనింది. పశ్చిమబెంగాల్, ఈశాన్య భారత్‌లోనూ ఉనికిని చాటుకుంటోంది. ఆ ప్రాంతాలలో ఇంతవరకూ బీజేపీకి స్థానమే లేదు. ఆంధ్ర ప్రదేశ్‌లో బీజేపీ మంచి అవకాశాలున్నాయి. అదే సమయంలో టీడీపీ తనను ఎదగనీయదనే విషయమూ బీజేపీకి తెలుసు. ఎదగకపోతే ఏపీలో కాలగర్భంలో కలిసిపోవాల్సిందే. బీజేపీ ఎదిగే పరిణామంలోనే దానికీ టీడీపీకి మధ్య ఘర్షణపూరిత వాతావరణం ఏర్పడుతోంది.

సి) బీజేపీని టీడీపీ ఎదగకుండా చేస్తోందనే అనుమానాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. వైయస్ఆర్ కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి సభ్యుల్ని చేర్చుకోవాలని ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ టీడీపీ అనేక ప్రాంతాలలో నిరసనలూ తెలిపింది. ఇటువంటి సమస్యలను బీజేపీ నిశ్శబ్దంగా భరించింది. ఎదుగుదలకు సరైన అవకాశం కోసం ఎదురుచూస్తోంది. తన మిత్రుడే తనను ఎదగనీయని దీన స్థితిలో బీజేపీ కొట్టుమిట్టాడుతోంది. 2004 ఎన్నికల్లో బీజేపీకి ఒక శాతం ఓట్లే వచ్చాయి. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దక్కిన వాటా కూడా అంతే.

డి) ప్రస్తుతానికి కేంద్రం నుంచి రాబట్టుకోవాల్సినంతా రాబట్టుకుని, చంద్రబాబు నాయుడు 2019లో ఎన్డీయేను వీడతారనే అనుమానం బీజేపీని పట్టి పీడిస్తోంది. తాను ఆశించింది రాలేదు కాబట్టే కూటమిని వీడుతున్నానని టీడీపీ చెబుతుందని కూడా బీజేపీ ఊహిస్తోంది. అదే సమయంలో బీజేపీ కొత్త స్నేహితుడిని వెతుక్కుని తనను చెత్తబుట్టలో వేస్తుందని టీడీపీ కూడా భావిస్తోంది. అంటే రెండు పార్టీలు ఒకదానినొకటి పాతరవేయడానికి అవకాశాలు చాలా ఉన్నాయి. ఎవరికి ఆ అవకాశం మొదట లభిస్తుందనేదే ఇక్కడ ఆసక్తికరం.

ఇ) ఇలాంటి సందిగ్ధ పరిస్థితుల మధ్య వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడూ, ప్రతిపక్ష నేత అయిన వైయస్ జగన్మోహన్ రెడ్డి బీజేపీకి చేసిన ప్రతిపాదన ఆశ్చర్యాన్ని కలిగించింది. కొన్ని నిబంధనలకు లోబడి తాము బీజేపీకి మద్దతివ్వడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన చేసిన ప్రకటన రాజకీయంగా ప్రకంపనలు పుట్టించింది. జగన్‌మోహన్ రెడ్డి ఈ రకమైన ప్రతిపాదన బీజేపీకి చేస్తారని టీడీపీ ఏ దశలోనూ ఊహించలేదు. ఇప్పుడు తేల్చుకోవాల్సిన బాధ్యత బీజేపీపై పడింది. ఎవరి మద్దతు తీసుకోవాలో ఆ పార్టీ తేల్చుకోవాల్సుంది. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తే వైయస్ఆర్ కాంగ్రెస్ మద్దతు బీజేపీకి లభిస్తుంది. అప్పుడు టీడీపీని వదిలించేసుకోవచ్చు. దీన్ని దృష్టిలో ఉంచుకునే వైయస్ఆర్ కాంగ్రెస్ పెద్ద రాజకీయానికి తెరదీసింది.

ఈ నేపథ్యంలో బీజేపీ విశ్వాసాన్ని చూరగొనడానికి చంద్రబాబు నాయుడు కొత్త వ్యూహాన్ని అశ్రయించాల్సిందే. ఇందుకు రాజకీయాన్ని ఆయన పణంగా పెట్టాల్సి ఉంటుంది. రాష్ట్ర బీజేపీలోని అన్ని వర్గాలతోనూ శాంతి సామరస్యాలతో మెలగాల్సి ఉంటుంది. టీడీపీ ఎన్డీయేను వీడితే బీజేపీకి ఎటువంటి నష్టమూ లేదని చంద్రబాబుకు క్షుణ్ణంగా తెలుసు. కేవలం 2019లో మనుగడే కాదు.. ఆ తరువాత మనుగడనూ చంద్రబాబు చూసుకోవాల్సుంటుంది.


ఆంధ్ర ప్రదేశ్‌లో కులాలకుమ్ములాటలు చాలా ఎక్కువనీ, దానిపైనే రాజకీయాలు ఆధార పడి ఉంటాయనీ బీజేపీకి తెలుసు. ఓబీసీ కులాలు, దళితులు, గిరిజనులు, ఇతర ఉన్నత కులాలతో బీజేపీ సత్సంబంధాలు కలిగుంది. ఈ వర్గాలు టీడీపీ అంటే కినుకతో ఉన్నాయి. ఈ ఏడాది ఒక్క పద్మశ్రీ అవార్డు కూడా ఏపీకి ఇవ్వకుండా కేంద్రం పెద్ద సంకేతమే పంపింది. తనకు ఏపీలో కులాల గురించి తెలుసని మోడీ కూడా తెలియజేసినట్లయ్యింది. ఏపీలో బీజేపీ ఒక స్థిరమైన పునాదిని ఏర్పరచుకుంది. ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తయారయ్యే వీలుందన్న విషయం ఆ పార్టీకి తెలుసు. ఈ ఏడాది కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌ఘర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉంటాయో వేచిచూస్తోంది.

ఈ నేపథ్యంలో భారమంతా టీడీపీపైనే ఉంది. బీజేపీతో సంబంధాలను పునరుద్ధరించుకోవాల్సుంది. చంద్రబాబు ఎంతో సహనశీలి మాత్రమే కాక ముక్కుసూటి మనిషి కూడా. అలాంటి నాయకుడు సైతం బీజేపీపై శివసేన వ్యవహరించినట్లు ఆగ్రహాన్ని ఎందుకు వెలిబుచ్చారనేది ఆశ్చర్యకరం.

గాంధీజీతో రెండేళ్ళ సహవాసం

నేడు యం.యన్.రాజలింగం జయంతి

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన కొద్దిరోజులకు 1952 లో ఏర్పాటైన హైదరాబాద్ రాష్ట్ర మంత్రివర్గంలో ఆయన మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. మహాత్మాగాంధీ ఆశయాలను పుణికి పుచ్చుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఆయన చర్యలను గమనించి, పోలీసుల నిఘా పెంచింది. వారి కళ్ళుగప్పి, పిట్టలదొర వేషం వేసుకొని వార్ధా పారిపోయారు. వార్ధాలోని సేవాగ్రాం ఆశ్రమంలో గాంధీని కలిశారు. అక్కడి గోశాలను నిర్వహించారు. గాంధీజీ సన్నిధిలో రెండేళ్ళు గడిపారు. గాంధీజీ సూచనల మేరకు స్వరాష్ట్రం తిరిగి వచ్చారు. స్వాతంత్ర్యోద్యమాన్ని ఉద్ధృతం చేసే కార్యక్రమాలు చేపట్టారు. నిజాం ప్రభుత్వం జిల్లా బహిష్కరణకు ఆదేశాలిచ్చింది. వాటిని ధిక్కరించి అరెస్టయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించటానికి కొన్ని నెలల ముందు గాంధీజీని వరంగల్‌కి రప్పించారు. ఆయనే యం.యన్.రాజలింగం.



1919 ఫిబ్రవరి 9న యం.యన్.రాజలింగం వరంగల్ జిల్లాలోని రామన్నపేటలో జన్మించారు. నిజాం నవాబు పాలనలో కొనసాగుతున్న హైదరాబాద్ విముక్తికోసం స్వామి రామానంద తీర్థ కొనసాగిస్తున్న ఉద్యమంలో కూడా రాజలింగం కీలకపాత్ర పోషించారు. ఆ సమయంలోనే నిజాం పోలీసులు రాజలింగంను బంధించటానికి ప్రయత్నించగా, మారు వేషంలో 1940లో వార్ధాకు పారిపోయారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమం మొదలయ్యేనాటికి వరంగల్‌లో ఉద్యమాన్ని ఉద్ధృతం చేశారు. కరీంనగర్ జిల్లా ముస్తాబాద్‌లో ఖాదీ చరఖా సంఘం వరంగల్‌లో సర్వోదయ సంఘాన్ని ఏర్పాటు చేశారు. 1946 జనవరిలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ వజ్రోత్సవాలకు గాంధీ జీ వెళ్ళే కార్యక్రమం ఖరారైంది. మద్రాసు వెళ్ళే సమయంలో గాంధీజీని వరంగల్ సమీప నగరాలలో పర్యటింపజేస్తే, ఉద్యమానికి మంచి ఊతం వస్తుందని అభిప్రాయపడ్డారు. గాంధీజీని వరంగల్ నగరానికి రప్పించే బాధ్యతను రాజలింగంకు అప్పగించారు. 1952లో వరంగల్ నియోజకవర్గం నుంచి రాజలింగం శాసనసభకు పోటీ చేసి గెలిచారు. బూర్గుల మంత్రివర్గంలో రాజలింగం నీటిపారుదల, కార్మిక శాఖల మంత్రిగా రాజలింగం వ్యవహరించారు. 2012 జనవరి 23న రాజలింగం మరణించారు.

● దాసరి

ఎరువుల ధరల పెంపు రబీకి హానికరం

కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న అన్నదాత నెత్తిన అదనపు భారం మోపడానికి ఎరువుల ఉత్పత్తి సంస్థలు సిద్ధమయ్యాయి. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వానికి తాఖీదులు కూడా పంపాయి. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు రైతు మరిన్ని నష్టాలను మూటకట్టుకొనే దుస్థితి ఉత్పన్నమౌతోంది. అన్నదాతగా కీర్తింపబడుతున్న రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధర నిర్ణయం జరగటం లేదు, అరకొరగా నిర్ణయించిన ధరకు కొనుగోలు చేసే యంత్రాంగం లేదు. కొనుగోలు బాధ్యతలను నెత్తికెత్తుకొన్న సంస్థలు మద్దతు ధరల్లో కోత విధించి, రైతుల్ని నిస్సహాయులను చేస్తున్నాయి. ధాన్యం కొనుగోళ్ళ విషయంలో ఇటీవల రాష్ట్రంలో జరిగిన అనేక అవకతవకలే అందుకు ప్రత్యక్షసాక్ష్యం. పదిహేను రైసు మిల్లులపై కేసులు నమోదు చేయటంతో పాటు, ధాన్యం కొనుగోలు చేస్తూ అక్రమాలకు పాల్పడిన సహకార పరపతిసంఘాల గుట్టు కూడా రట్టయింది. కొనుగోలు సంస్థలు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర యివ్వటానికి మీనమేషాలు లెక్కిస్తున్న దశలో ఎరువుల ధరలు పెరగటం రైతుకు మరింత భారమే. నత్రజని మాత్రమే కలిగిన సూటి ఎరువుల వాడకం వల్ల రైతులకు చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గుతాయి. వీటినే వాడాలని శాస్త్రవేత్తలు చాలా కాలంగా చెపుతున్నారు. వారి సూచనలను రైతులు పాటిస్తున్నారు. రైతుల అవసరాలను గ్రహించి ఎరువుల ఉత్పత్తి సంస్థలు మిశ్రమ ఎరువుల ధరలు పెంచడానికి సిద్ధమయ్యాయి. ఆ పెరుగుదల నామమాత్రం గా లేదు. సుమారు పదకొండు శాతం, ఒక్కసారిగా ఎరువుల ధరలు పదకొండు శాతం పెరగటమంటే రైతులకు భరించలేని భారమే. ప్రస్తుతం డిఎపి టన్ను ధర రూ.24,753 లు మాత్రమే. పెరిగితే అది రూ.27,353 లవుతుంది 50 కిలోల బస్తాపై రూ.130 లు పెరగ నుంది. మిగిలిన మిశ్రమ ఎరువుల ధరలు బస్తాకు రూ.112 లు చొప్పున పెంచటానికి ఉత్పత్తి సంస్థలు సిద్ధమయ్యాయి. రైతుకు లాభం చేకూర్చాలని, వ్యవసాయం లాభసాటిగా మార్చాలని ప్రయత్నం చేస్తున్న తరుణంలో ఇలా మిశ్రమ ఎరువుల ధరలు పెంచటం ప్రభుత్వ వర్గాలకు కూడా మింగుడు పడటం లేదు. అలా అని ఎరువుల ధరలు పెరగకుండా ఆపే శక్తి కేంద్ర ప్రభుత్వానికి కూడా లేదనే చెప్పాలి. ఒక్క యూరియా ధర మినహా మరే ఎరువుల ధర నిర్ణయాధికారం కేంద్రానికి లేదు. 2009కి ముందే వాటి ధరలు నిర్ణయాధికారం ఆయా ఉత్పత్తి సంస్థలకే దాఖలు పరుస్తూ నిర్ణయం జరిగిపోయింది. ఆ సమయంలో సేంద్రీయ సాగు వైపు రైతులు దృష్టిసారించారు. ఎరువుల వాడకం తగ్గుతోందని గమనించిన ఉత్పత్తి సంస్థలు పెంచిన ధరలను తగ్గించుకొంటూ వచ్చాయి. కనుచూపుమేరలో ఎన్నికలు కనిపిస్తున్నాయి. ఎరువుల ధరలను నియంత్రించే ప్రయత్నాలు ఏ ప్రభుత్వం చేయదు. కోట్ల మంది వేసే ఓటర్లు కన్నా, వేల సంఖ్యలో ఉన్న ఉత్పత్తి సంస్థల శ్రేయస్సే పాలకులకు ముఖ్యం. ఎరువుల ధరలు పెరుగుతున్న దామాషాలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరగాల్సిన అవసరం ఉందన్న విషయం ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ధాన్యం ధర పెరిగే అవకాశం 2019 వరకూ లేదనే చెప్పాలి. డిఎపి ఎరువు తయారు చేయటానికి ఉపయోగించే ఫాస్పారిక్ ఆమ్లం ధర గణనీయంగా పెరగటం వల్ల తమ ఉత్పత్తుల ధరలు పెంచవలసి వచ్చిందనే వివరణ యిచ్చుకొంటున్నాయి. పంటల ధరలను కూడా పెంచాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. ఆ విషయం కూడా ఆలోచించగలిగినపుడే రైతుకు కొంచెం ఊరట లభిస్తుంది.

● దాసరి ఆళ్వారస్వామి

యువ నిర్మాతలకు రోల్ మోడల్ సుబ్బరాజు




తోటపల్లి సాయినాథ్
9394449777

కొందరికి కొన్ని అనుభవాలు నిత్య నూతనంగా ఉంటాయి. సినిమా రంగానికి చెందిన వారికైతే అవి మరిన్ని ఎక్కువ. అమలాపురంలో చదువుకున్న ఎన్.వి.సుబ్బరాజుకూ ఇలాంటి మరిచిపోలేని సంఘటన ఒకటుంది. అదే షూటింగ్‌కు చెన్నై రావడం. నా జీవితంలో అది మరిచిపోలేని మలుపంటారాయన. అలా వచ్చినాయన అంచెలంచెలుగా ఎదిగారు. తనకున్న కొద్దిపాటి పరిజ్ఞానంతో ఓ సినిమాకు కథ అందించారు. ఆ చిత్రమే జగత్‌కిలాడీలు. 1969లో ప్రతాప్ ఆర్ట్స్ బ్యానర్‌పై రాఘవ... ఏకాంబరేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మించారు. చిత్ర నిర్మాణంలో భాగస్వామి కూడా అయ్యారు సుబ్బరాజు. ఈ చిత్రానికి రామానాయుడు సంభాషణలు అందించారు.

ఆ తర్వాత 1972లో కృష్ణ హీరోగా - జ్యోతిలక్ష్మి హీరోయిన్‌గా తీసిన సూపర్ హిట్ చిత్రం హంతకులు - దేవాంతకులు అనే యాక్షన్ థ్రిల్లర్‌కి కథా రచయితయ్యారు. అదే సినిమాకు సుబ్బరాజు నిర్మాతగా కూడా పరిచయమయ్యారు. ఈ చిత్రానికి దర్శకులు కె.ఎస్ఆర్ దాస్.

అక్కడి నుంచి ఎస్.వి.సుబ్బరాజు వెనుదిరిగి చూడలేదు. శ్రీ వాణి ఫిలిమ్స్ సంస్థను స్థాపించారు. 18 సినిమాలు నిర్మించారు. వీటిలో 12 సినిమాలకు పిసి రెడ్డి దర్శకత్వం వహించారు. పిసి రెడ్డి, సుబ్బరాజు అనుబంధం అంతగా పెనవేసుకుపోయింది. నాకు తెలిసి ఇలాంటి సందర్భం చాలా చాలా అరుదు. వాళ్ళిద్దరికీ అంతటి గొప్ప సఖ్యత ఉండేది. వీరిద్దరి కాంబినేషన్‌లో కృష్ణ హీరోగా స్నేహబంధం సినిమా వచ్చింది. అనంతరం కృష్ణ, జమునలతో గౌరి తీశారు. దీనికి కూడా పి.సి.రెడ్డి దర్శకత్వం వహించారు. తర్వాత కృష్ణ, జయప్రద కాంబినేషన్‌లో- ఒకే రక్తం, పుట్టింటి గౌరవం సినిమాలు, మోహన్‌బాబుతో భార్యాభర్తల సవాల్ చిత్రాలకు వరుసగా దర్శకత్వం చేశారు. ఇలా ఆనాటి ప్రముఖ హీరోల నుంచి మొన్నటి శుభలగ్నం దాకా సుబ్బరాజు జైత్రయాత్ర సాగింది. నిరంతరం కథలు రాస్తూ తన ఆలోచనలకు పదును పెట్టే ఎస్.వి.సుబ్బరాజు నేటి యువతకు నచ్చేలా ప్రెజెంట్ ట్రెండ్‌కి తగ్గట్టుగా ఒక కథను సమకూరుస్తున్నారు.

ఆయన చేసిన సినిమాల్లో యాక్షన్ ఓరియెంటెడ్‌వి కూడా ఉన్నాయి. ఫ్యామిలీ డ్రామాలూ ఉన్నాయి. రొమాంటిక్ కామెడీలున్నాయి. సస్పెన్స్ థ్రిల్లర్లున్నాయి. అన్నిరకాల కథలకు తన సంస్థ ద్వారా చిత్ర రూపాన్నిచ్చారు. సిల్క్‌స్మిత, సుమన్ కాంబినేషన్‌లో వచ్చిన జేమ్స్ బాండ్ 999 అనే సినిమా సూపర్‌హిట్. ఈ సినిమాకు నేను రచయితగా పనిచేశాను. ఈ సినిమా ద్వారా నాకు సుబ్బరాజు, పి.సి.రెడ్డి పరిచయమయ్యారు. యమదూతలు, పున్నమిరాత్రి సినిమాలకు అవకాశమిచ్చారు. తర్వాత సుబ్బరాజు చేసిన సినిమాల్లో ఈ తీర్పు ఇల్లాలిది అనే సినిమా అద్భుతమైన ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాకి ఆయన కథ కూడా సమకూర్చారు. మోహన్ బాబు, సుజాత కాంబినేషన్‌లో ఈ సినిమా మంచి సూపర్ హిట్ అయ్యింది. సుబ్బరాజు నిర్మాణ రంగంలో ఫలప్రదంగా ఉండగానే వాణి ఫిలింస్ ఔట్‌డోర్ యూనిట్‌ని స్థాపించారు. వీలైనంతవరకు చాలా తక్కువ ధరకి అందుబాటులో ఉంచేవారు. తన తమ్ముడు కూడా కెమెరామెన్ అవటంతో చాలామందికి ఈ యూనిట్ ద్వారా ఎంతో సహాయం చేసేవారు.



సుబ్బరాజును దగ్గరుండి పరిశీలిస్తే ఆయనలో క్రమశిక్షణ, ఇచ్చిన మాటకి కట్టుబడి ఉండే విధానం, మంచితనం, మానవత్వం, స్నేహం, కథకుడు కాబట్టి సున్నితత్వం, సంప్రదాయం, సంస్కారం కనిపిస్తాయి.

ప్రముఖ హీరో కృష్ణ ఓ సినిమా షూటింగ్‌లో ఉండగా, వాహిని స్టూడియోకి సుబ్బరాజు వెళ్ళారు. 50,000 రూపాయలు అడ్వాన్స్ ఇచ్చి, తను తరువాత ప్రారంభించబోయే సినిమా తాలూకు వివరాలు చెప్పారు. కృష్ణకాసేపు మాట్లాడి, ఆ కొత్త సినిమా కథ వివరాలు తెలుసుకుని, మీకు ఖర్చులు ఉంటాయి కదా... ఈ డబ్బు నేను బ్యాంక్‌లో వేసేదే కదా! మీ దగ్గరుంచండి. తర్వాత కావాలంటే షెడ్యూల్ అయ్యాక ఇద్దురు గానీ అని అన్నారు.

కృష్ణ ఆఫర్‌కు సుబ్బరాజు ఆనందంగా థ్యాంక్స్ చెప్పినా లక్ష్మి లాంటి డబ్బు తెచ్చి స్టూడియోలో ఇస్తున్నానండి దయచేసి కాదనకండి. తీసుకోండి. ఏం ఫర్లేదు అని అడ్వాన్స్ కృష్ణకు ఇచ్చేశారు.

ఓ చిత్రం ప్రారంభం రోజున... నిర్మాత గురించి ఆలోచించే వారు హీరోలు అంటారు సుబ్బరాజు. ఆ కాలం నిర్మాతలకు స్వర్ణయుగమంటారాయన. ఆ చిత్రమే గౌరి.. సూపర్ హిట్టయ్యింది. అప్పటి హీరోలు తమ ప్రొడ్యూసర్స్‌ని ఫ్రెండ్స్ లాగా, బ్రదర్స్ లాగా, ఫ్యామిలీ మెంబర్స్ లాగా చూసేవారని తెలిపారాయన. రాజ్ - కోటిలను మ్యూజిక్ డైరెక్టర్స్‌గా సుబ్బరాజు పరిచయం చేశారు. మోహన్‌బాబు ప్రళయ గర్జన ద్వారా నాయని మహేశ్వరరావును ఎడిటర్‌ని చేశారు. కె.ఆర్.వెంకటేష్ అనే యువ దర్శకుడికి ఘన విజయాన్ని ఇచ్చారు. తన సంస్థలోనే అసిస్టెంట్ నుంచి అసోసియేట్ అయిన కె.ఆర్. వెంకటేష్‌కి ఘన విజయం అనే సినిమాని బ్రేక్‌గా ఇచ్చారు. తన సినిమాలకు కో-డైరెక్టర్‌గా పనిచేసిన పోలవరపు బ్రహ్మానందానికి చిట్టెమ్మ చిలకమ్మ అనే చిత్రంతో బ్రేక్ ఇచ్చారు. ఇలా తనతోపాటు తన దగ్గర పనిచేసిన వారు కూడా సక్సెస్‌ఫుల్‌గా ఎదగాలని కోరుకుంటూ చేయూత అందించిన నిర్మాత సుబ్బరాజు. ఆయన చేసిన 20 చిత్రాలలో ఎక్కువ చిత్రాలకు పిసి రెడ్డిని దర్శకుడిగా ఎంచుకోవటం ఎంత విచిత్రమో అలాగే అన్ని చిత్రాలకు తన టీమ్‌తోనే ట్రైన్డ్ చేయడం గొప్పవిషయం. బాయ్ దగ్గర్నుంచి ఎడిటర్ నుంచి డైరెక్టర్ నుంచి రిపీట్ చేయటం, వాళ్ళతో స్నేహబంధం చక్కటి వాతావరణం ఉండేలా చేయటం సుబ్బరాజు ప్రత్యేకత.

ఇదివరకు అనుకున్నట్లుగా ఆయన క్రమశిక్షణ. ఆయన నిజాయితీ, ఆయన కష్టపడే తత్వం, ఆయన ఆలోచనల్లో నిత్యనూతనత్వం, మనిషి కంటే డబ్బు ముఖ్యంకాదు. స్వార్థం కంటే స్నేహం ముఖ్యం. సంస్కారం చాలా గొప్పది లాంటి నియమాలు నిజాయితీగా ఆలోచిస్తారు. అవి ఆచరణలో కూడా చూపిస్తారు. ఆయన అంత సక్సెస్‌ఫుల్‌గా 1972 నుంచి 2006 దాకా ఇన్నేళ్ళు చిత్రాలు చెయ్యగలిగారు. అంటే ముఖ్యంగా అన్నపూర్ణ డిస్ట్రిబ్యూటర్స్ వాళ్ళు... ఇచ్చిన సహకారం అపూర్వమంటారు.

నైజాం డిస్ట్రిబ్యూటర్ ఆనం గోపాలకృష్ణారెడ్డి కూడా ఆయనకు స్నేహితుడే. ఈ స్నేహభావం వల్ల చాలా అండగా ఉండేవారు అంటారు. ఆయన విజయం వెనుక ఎంతోమంది ఉన్నారు. వాళ్ళందరూ కుటుంబసభ్యులతో సహా ముఖ్యం అంటారు. వీళ్ళందరి వల్లే సక్సెస్ అయ్యానంటూ అందరికీ కృతజ్ఞతలు చెబుతుంటారు. ఈ రోజుకి ఆయన తన వయసుకి మించిన ఎనర్జీతో కథ అల్లుకోవటం, కథని చర్చించే విధానం, మర్యాద ఇచ్చే పద్ధతి, క్రమశిక్షణ, ఈనాటి యువ నిర్మాతలకు ఆయన ఆదర్శం కావాలి. రోల్ మోడల్‌లా మారాలి. సుబ్బరాజు మరిన్ని మంచి చిత్రాలు తియ్యాలని, మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

కొత్త పాస్ పుస్తకాలకు అడుగడుగునా అడ్డంకులే!



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో డిజిటలైజ్డ్ పట్టాదార్ పాస్ పుస్తకాలు ముద్రణ ప్రహసనంగా మారింది. మార్చి 11న 72 లక్షల పట్టాదార్ పాస్‌పుస్తకాలు కం టైటిల్ డీడ్‌లను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఐతే మూడు దశలుగా టెండర్ గడువును పొడిగించినా ప్రీబిడ్‌లు ఒక్కటికూడా రాలేదు. ఇప్పుడు ఇందుకు కారణాలను విశ్లేషిస్తోంది ప్రభుత్వం. మొత్తం 23 కీలక, కఠినమైన భద్రతా ప్రమాణాలే ఆటంకంగా నిల్చాయని అధికారులు అంటున్నారు. ప్రింటింగ్‌లో నాణ్యత పర్యవేక్షణకు హైదరాబాద్‌లోనే ప్రింటింగ్ చేయాలని షరతుకూడా విధించారు. ఒక్కో పుస్తకానికి రూ.250 ఖర్చవుతుందని అంచనా వేశారు. ప్రైవేటు సంస్థలు తక్కువ టెండర్ కోట్ చేస్తే వారికే అప్పగించాలని టెండర్ డాక్యుమెంట్‌లో పొందుపర్చారు. అయితే ఇవన్నీ టెండర్ వేసే సంస్లకు కొంత ప్రతికూలంగా మారాయి. ఒక్కో పుస్తకానికి రూ.250 ఖర్చుతో వీటిని రూపొందించడం అసాధ్యమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్దేశించిన షరతులు, ప్రమాణాలు కొంత ఇబ్బందిగా ఉన్నాయి. ఇందులో కీలకసూచనలు, షరతులు ఇలా ఉన్నాయి...

ప్రతీ పాస్ పుస్తకంలో 13 అంకెల యూనిక్ ఐడీ నెంబర్ వేయాలి. అందులో తొలి రెండు అంకెలు జిల్లా కోడ్‌ను, మూడో అంకె రాష్ట్రం పేరును సూచించేటీ అక్షరం, నాల్గువ, ఐదవ అంకెలు మండలకోడ్‌ను, ఆరవ అంకె జిల్లాను సూచించే అక్షరం, ఏడునుంచి తొమ్మిది వరకు గ్రామ కోడ్, చివరి నాలుగు అంకెలు నిర్ధిష్ట గ్రామానికి చెందిన పాస్ పుస్తకం సీరియల్ నెంబర్, ఫోటో తదితరాలు ఉంటాయి. వీటికి వాడే ఇంకు, కాగితం యువి ఫిల్మ్ ప్రత్యేకంగా ఉంటాయి. వీటిని రూపొందించే సంస్థ ఈ పేపర్‌ను, ఇంకును ఇతరవాటికి వినియోగించరాదు. పాస్ పుస్తకం తయారీ నుంచి ముగింపు వరకు సీసీటీవి కెమెరా రికార్డులో జరపాలి. ఈ ముద్రణ జరిగినన్ని రోజులు ఇతర ముద్రణలు జరపరాదు. ముద్రణా సమయంలో వృధా అయిన ఇంకు, కాగితాలను టీఎస్‌టీఎస్, సీసీఎల్‌ఏ అధికారుల సమక్షంలో వ్యర్ధంగా మార్చాలి.

- ●షరతులు, నిబంధనలే ప్రధాన సమస్య
- ●23 భద్రతా ప్రమాణాలే అడ్డుగోడలు


- పాస్ పుస్తకానికి 130 జీఎస్ఎం కాగితం, 140మైక్రాన్‌ల మందంతో వాడాలి
- ప్రత్యేకమైన ఫాంట్‌ను ఫ్లోరోసెంట్ ఇంకుతో వాడాలి. అతి నీల లోహిత కిరణాల దగ్గర ఈ కాగితాలను పెడ్తే అవి నల్లఇంకు నుంచి ఆకు పచ్చరంగులోకి మారాలి.
- పాస్ పుస్తకం అట్టకు వాడే కాగితం ధీర్ఘకాలం మన్నేలా ప్రత్యేకంగా 0.7 మిమి గుడ్డతో మిశ్రమం చేయాలి. రాష్ట్ర రాజముద్రను నిర్ధిష్ట రంగులో ముద్రించి దానికి బంగారు వర్ణంతో కూడిన ఫాయిల్ ప్రింటింగ్‌ను జోడించాలి. రాజముద్ర 4.3 సెంటీమీటర్లు, దానికింద టైటిల్‌ను తెలుగులో ముద్రించాలి.
- పాస్‌బుక్‌లోని 16 లోపలి పేజీలు మైక్రో టెక్స్ట్ ప్రింటింగ్‌తో ఉండాలి.
- కాగితాలపై బార్డర్‌గా ఉండే లైన్లు మామూలు కంటితో చూస్తే ఒకరకంగా కనిపించి, అతి నీలలోహిత కిరణాల సాయంతో చూసినప్పుడు ఆ బార్డరు తెలంగాణ రాజముద్రలతో కూడినట్లు కనిపించాలి.
- పాస్ బుక్‌లను నకిలీకి అవకాశం లేకుండా రూపొందించాలి. లబ్దిదారుల వివరాలు ఉండే తొలి మూడు పేజీల్లోని వివరాలను ఎవరైనా కాపీ చేసేందుకు యత్నిస్తే కాపీ అనే అక్షరంవచ్చేలా ఉండాలి.
- ప్రతీ పేజీలో కంటికి కనిపించని తీరులో అతి నీల లోహిత కిరణాలకు మాత్రమే సాధ్యమయ్యే ఫైబర్‌ను చేర్చాలి. యువి కిరణాల దగ్గర పెట్టినప్పుడు మెరుస్తూ ఉండాలి.
- కరెన్సీ నోట్లపై ఉండే సెక్యూరిటీ త్రెడ్ తరహాలో యువి కిరణాల త్రెడ్ ఉండాలి.
- ప్రతీ పాస్‌పుస్తకానికి క్యూఆర్ కోడ్, బార్‌కోడ్
- లబ్దిదారుల ఆధార్ నెంబర్ ఉండాలి
- యువి కిరణాల పరిజ్ఞానంతో కూడిన సన్నని ఫిల్మ్ జోడించాలి.
- తెలంగాణ రాష్ట్ర రాజముద్రను ప్రత్యేకమైన ఇంకుతో ముద్రించాలి.
- పాస్‌బుక్‌లోని పేజీలుకూడా ప్రత్యేకమైన ఇంకుతోనే ముద్రించాలి.
- ఈ కాగితాల్లో నకిలీలకు ఆస్కారం లేకుండా, వాటిని పసిగట్టేలా ప్రత్యేకమైన పెన్నుతో ఏదైనా రాస్తే ఆ కాగితం నీలంరంగులోకి మారాలి.
- ప్రతీ పాస్‌బుక్‌పైన పైకి ఉబ్బినట్లుండే (ఎంబోసింగ్) అక్షరాలుండాలి.
- ప్రతీ కాగితంపై కంటికి కనిపించని తీరులో ప్రత్యేక తరహా గీతలు(పెర్ఫొరేషన్) ఉండాలి.
- పాస్‌పుస్తకంలోని కాగితాలను ఒక కోణంలో వాల్చి చూసినప్పుడు ప్రత్యేక తరహా చిత్రం కనిపించాలి.
- నీళ్లల్లో రెండు గంటలపాటు నానబెట్టినా కాగితం చెక్కు చెదరకూడదు. ఇంకు కరిగిపోరాదు.
- 220 డిగ్రీల వేడి దగ్గర ఒక నిమిషంపాటు ఉంచినా కాగితం కాలిపోకూడదు.
- పాస్‌బుక్‌లోని కాగితాన్ని వెయ్యిసార్లు ఒకేవైపునకు మల్చినా అది చిరిగిపోకూడదు.
- కాగితం జీవితకాలం కనీసంగా 50 ఏళ్లు ఉండాలి. అంటే అప్పటివరకు అవి చినగడానికి ఆస్కారం లేకుండా ఉండాలి.
- కాగితాలకు వాడుతున్న యువి పరిజ్ఞానం (సెక్యూరిటీత్రెడ్) కనీసం పదేళ్లయినా మన్నికగా ఉండాలి.

గుర్తించిన భూములు...

రాష్ట్రంలో భూ దస్త్రాల ప్రక్షాళన విజయవంతంగా ముగిసింది. వివాదరహిత భూముల లెక్కలు తేలాయి. 2.80 కోట్ల ఎకరాల భూముల్లో 2కోట్ల 38లక్షల 650 ఎకరాల భూమి వివాదరహితంగా తేలింది. ఇందులో 1,42,12,826 ఎకరాల వ్యవసాయ భూమి ఎటువంటి వివాదాలు లేనివిగా తేలాయి. వ్యవసాయేతర భూములు 11,95,889 ఎకరాలుగా గుర్తించారు.

ఆ భవనాలను కూల్చొద్దు

- ●మహబూబ్‌నగర్‌లో పాత ప్రభుత్వ కార్యాలయ సముదాయాలపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మహబూబ్ నగర్ జిల్లా, పాలకొండలో నిర్మించనున్న ఏకీకృత కార్యాలయ సముదాయాన్ని, ఎదిరె గ్రామంలో నిర్మించతలపెట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాలపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న కార్యాలయాల సముదాయాన్ని కూల్చివేయరాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఆ రెండు భవన సముదాయాల భూములపై ఏమైనా నిలుపుదల (స్టే) ఉత్తర్వులున్నాయో, లేదో తెలుసుకొని చెప్పాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ సందర్భంగా తెలంగాణ అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ..ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ ఒకేచోట జిల్లాఏకీకృత భవనసముదాయాన్ని ప్రభుత్వం నిర్మించతలపెట్టిందన్నారు. పైగా ఇది ప్రభుత్వ విధాన నిర్ణయమని తెలిపారు. ఎక్కడైనా ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించేస్వేచ్ఛ ప్రభుత్వానికి ఉందన్నారు. ఈ భవన సముదాయంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, తదితర కార్యాలయాలుంటాయని విన్నవించారు. ఈ సందర్భంగా వాచ్ వాయిస్ ఆఫ్ ఇండియా (ఎన్జీవో) తరపు న్యాయవాది శశికిరణ్ వాదనలు వినిపిస్తూ ...రాష్ట్ర మంత్రి లక్ష్మారెడ్డి, బంధువులు స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్, ముఖ్యమంత్రి కుమార్తె ...పాలకొండ, ఎదిరె గ్రామాల్లో భారీ మొత్తంలో భూములను కొనుగోలు చేసినందువల్లనే, అక్కడ ఏకీకృత భవన సముదాయాలను నిర్మిస్తున్నారని తెలిపారు. కేవలం కొందరు వ్యక్తులకు లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వ కార్యాలయాలను, వైద్యకళాశాలను జిల్లాలో దూరప్రాంతానికి తరలిస్తున్నారన్నారు. ఈ నిర్మాణాలపై స్టే విధించాలని అభ్యర్థించారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ..నిర్మాణాలపై స్టే విధించేందుకు నిరాకరించింది.

ఈ వ్యవహారంలో మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయ భవనాలను కూల్చివేయబోమని అదనపు అడ్వకేట్ జనరల్ జె.రామచంద్రరావు చేసిన ప్రకటనను ధర్మాసనం నమోదు చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది.

పోటీ పరీక్షలకు గిరిజనులకు ఉచిత శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే గిరిజన అభ్యర్థులకు అవసరమయ్యే శిక్షణను ఇప్పించడానికి ఏర్పాట్లు చేసినట్టు గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ సర్వేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకులు నిర్వహించే ప్రొబిషనరీ, క్లరికల్, ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, ఇతర పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందించడానికి తమ శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. మార్చి5వ తేదీ నుంచి మే 3వ తారీఖు వరకు ఉచిత శిక్షణా ఉంటుందన్నారు. అర్హులైన ఎస్టీ అభ్యర్థుల నుంచి ఈనెల 9వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 040-27540 104 ఫోన్ నెంబర్లలో సంప్రదించా లని ఆయన తెలిపారు.

రైతు ప్రాణం తీసిన అప్పు



మృతిచెందిన రైతు కుంసోత్ బాలు

ఇల్లెందు, ప్రభ న్యూస్ : వేసిన పంట ఎండిపోయిందని..దీని కోసం పెట్టిన పెట్టుబడి పెరిగిపోయి అప్పులు తీర్చలేనని..మనస్తాపం చెంది ఓ గిరిజన రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఇల్లెందు మండల పరిధిలోని చల్లసముద్రం పంచాయతీ సేవ్యా తండాలో చోటు చేసుకుంది. సేవ్యాతండాకు చెందిన రైతు కుంసోత్ బాలు(45) తనకున్న నాలుగెకరాల భూమి లో మూడెకరాల మొక్కజొన్న, ఎకరం పత్తి సాగుచేశాడు. ఇందు కోసం సుమారు 2,50,000 రూపాయలు అప్పులు చేశాడు. వేసిన పంట ఎండిపోయి దిగుబడి రాక మనస్తాపానికి గురైన బాలుకు ఫారెస్టు అధికారుల వేధింపులు తీవ్రం కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతనికి భార్య, కూతురు ఉన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుంసోత్ బాలు కుటుంబాన్ని గురువారం ఎన్డీ డివిజనల్ కార్యదర్శి మధు, ఏఐకేఎంఎస్ డివిజనల్ కార్యదర్శి నాయిని రాజు, సర్పంచ్ సుభద్ర, ఏపే వెంకన్న, భాస్కర్, నరాటి వెంకన్న, పృధ్వీలతో కూడిన బృందం పరామర్శించి రైతు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

అమరుల త్యాగాల ఫలితం తెలంగాణ

- ●ప్రభుత్వ సలహాదారు రమణాచారి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసి తెలంగాణ పౌరులు వ్యయప్రయాసలకు ఓర్చి ఎందరో అమరవీరుల త్యాగనిరతితో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలనాటి ప్రాచీన సంస్కృతీ, నాగరికతలకు ప్రాధాన్యమిస్తూ నవీన సంస్కృతీ, నాగరికతలకు పెద్దపీట వేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సాంస్కృతిక శాఖ అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ప్రపంచతెలుగు మహాసభలను నిర్వహించడం వలన ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణకు గుర్తింపు వచ్చిందన్నారు. రమణాచారి 66వ జన్మదినోత్సవం సందర్భంగా ముదుగంటి సుధాకర్ రెడ్డి, ఎండీ.నజీరుద్దీన్, బొప్పు శ్రీహరి తదితరులు కలిసి రమణాచారికి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఐఏఎస్‌లకు పదోన్నతులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పలువురు ఐఏఎస్‌లకు పదోన్నతులను వర్తింపజేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1993 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు ఐఏఎస్‌లను కార్యదర్శి స్థాయినుంచి ముఖ్య కార్యదర్శులుగా పదోన్నతిని వర్తింపజేసింది. అదేవిధంగా 2004, 2005 బ్యాచ్‌కు చెందిన ఆరుగురు ఐఏఎస్ అధికారులకు సెలక్షన్ గ్రేడ్ స్కేల్ అధికారులుగా పదోన్నతిని వర్తింపజేయగా, 2009 బ్యాచ్‌కు చెందిన మరో ఐదుగురు ఐఏఎస్‌లకు జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ స్కేల్ అధికారులుగా పదోన్నతి దక్కింది.

పదోన్నతులు పొందిన అధికారులు

1993 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్‌లకు ముఖ్య కార్యదర్శులుగా...

పేరు	ప్రస్తుత పోస్టింగ్
బూసాని వెంకటేశ్వర్‌రావు	అదనపు డైరెక్టర్ ఎంసీహెచ్‌ఆర్డీ
ఎన్ శివశంకర్	ఆర్థికశాఖ కార్యదర్శి
సి పార్థసారథి	వ్యవసాయ శాఖ కమిషనర్
వీఎన్ విష్ణు	సీఏడి కమిషనర్ స్టేట్ గెజిటీర్స్
ఆర్వీ చంద్రవదన్	విపత్తు నిర్వహణ శాఖ కమిషనర్

2004, 2005 బ్యాచ్‌కు చెంది సెలక్షన్ గ్రేడ్ స్కేల్ పదోన్నతి పొందిన వారు

పేరు	ప్రస్తుత హోదా
కె నిర్మల	ఎండి డైరీ డెవలప్‌మెంట్ కో ఆపరేషన్
గౌరవ్ ఉప్పల్	నల్గొండ కలెక్టర్
కె ఇలంబర్తి	స్టేట్ ఇన్‌ఫర్మేషన్ కమిషన్ సెక్రటరీ
కె మాణిక్యరాజ్ ఎక్కా	సంగారెడ్డి కలెక్టర్
ఎ శరత్	జగిత్యాల కలెక్టర్
ఎల్ శర్మన్	మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ సెక్రటరీ

2008, 2009 బ్యాచ్‌కు చెంది జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ స్కేల్ పదోన్నతులు పొందిన వారు

పేరు	ప్రస్తుత హోదా
ఎ దేవసేన	పెద్దపల్లి కలెక్టర్
సర్ఫరాజ్ అహ్మద్	కరీంనగర్
ఎన్ సత్యనారాయణ	కామారెడ్డి
ఎస్ అర్వింధర్‌రెడ్డి	ప్రోటోకాల్ డిప్యూటీ సెక్రటరీ
ఎం ప్రశాంతి	నిర్మల్ కలెక్టర్

'నెల రోజుల్లో 'భగీరథ' సిద్ధం కావాలి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథలోని అన్ని సెగ్మెంట్లను నెల రోజుల్లో ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మిషన్ భగీరథ పనులపై అన్ని జిల్లాల ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇలు , ఈఈలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ గుట్టల దగ్గర పంపింగ్‌తో వచ్చే ఒత్తిడిని తగ్గించాడానికి అవసరమైన సర్జ్‌ప్రొటెక్షన్ డివైజ్‌లను నాలుగైదు రోజుల్లో బిగించాలన్నారు. ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లలో విజయవంతంగా ట్రయల్ రన్ నడుస్తోందన్నారు. చిన్న చిన్న పనులు మిగిలి ఉంటే త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వాటితోపాటు ఓఎఫ్‌సి డక్ట్ ఛాంబర్ పనులను కూడా సమాంతరంగా పూర్తి చేయాలన్నారు. డక్ట్ పనులు పూర్తయితేనే ఇంటింటికీ మంచినీళ్లతోపాటు ఇంటర్నెట్‌ను కూడా అందించటం సాధ్యమవుతుందన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో చీఫ్ ఇంజనీర్లు కృపాకర్ రెడ్డి , జగన్మోహన్ రెడ్డి , విజయపాల్ రెడ్డి, విజయప్రకాశ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



వాణిజ్యాభివృద్ధిలో వినూత్న ఆలోచనలకు ప్రోత్సాహం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎగుమతి వ్యాపారం సులభమైన వాణిజ్యం కాదనీ, ఇందులో పలు ఒడిదుడుకులు, పలు రకాల ఇబ్బందులు ఉంటాయని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) జనరల్ మేనేజర్ ప్రబోధ్ పారిఖ్ అన్నారు.ఇలాంటి ఒడిదు డు కులు ఎదుర్కొనేందుకు సిద్ధ మైన వారే ఎదుగుదలలో ముందుకు వెళ్ళడం మంచిదని అన్నారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ పారిశ్రామిక, వాణిజ్య మండళ్ళ సమాఖ్య (ఎఫ్‌ట్యాప్సీ), కేంద్ర ప్రభుత్వ ఎక్స్ పోర్టు క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్, ఎగ్జిమ్ బ్యాంకు లిమిటెడ్ సంయుక్తంగా శుక్రవా రం నిర్వహించిన ఎగు మతుల వ్యాపారం ః వా ణిజ్య ప్రక్రియ, డాక్యుమెంటేషన్ సర్టిఫికెట్ కోర్సు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎఫ్‌ట్యాప్సీ సీనియర్ ఉపాధ్యక్షుడు అరుణ్ లుహారుకా, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాల కమిటీ చైర్మన్ అనిల్ అగ ర్వాల్, అంతర్జాతీయ వాణిజ్య నిర్వహణ సలహాదారు సంతప్ కుమార్ తది తరులు ప్రసంగించారు.ప్రబోధ్ పారిఖ్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభు త్వం ఇస్తున్న ప్రోత్సాహం, వినూత్నమైన ఆలో చనకు తోడ్పాటు అందిస్తూ ఆసక్తిగల వ్యాపారులను, పారిశ్రా మికవేత్తలకు ప్రోత్సహిస్తుందని ఆయన చెప్పారు. తద్వారా తెలం గాణ రాష్ట్రంలో పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధి వేగంగా



జరుగుతోందని పారిఖ్ చెప్పారు. ఎగుమతి రంగంలో ఉన్న క్లిష్ట సమస్యల నుంచి బయట పడడానికి ఇవి సహకరిస్తాయని ఆయన అన్నారు.

ఆంధ్రాబ్యాంక్‌కు
మొండిబకాయిల సెగ

• క్యూ3నష్టం రూ. 532కోట్లు

హైదరాబాద్ : ప్రభుత్వ రంగానికి చెందిన ఆంధ్రాబ్యాంకు డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరవడ్డీ ఆదాయం రూ.4549 కోట్లు ఆర్జించగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.4409 కోట్లు ఆర్జించింది. నికరవడ్డీ మార్జిన్‌లో 3 శాతం వృద్ధి కనిపించింది. తొమ్మిది నెలల కాలానికి చూస్తే నికరవడ్డీ ఆదాయం రూ.13,369 కోట్లు కాగా అంతకు ముందు ఏడాది డిసెంబర్‌తో 2016లో రూ.13,253 కోట్లు .. కేవలం ఒక శాతం వృద్ధి రేటు కనిపించింది. వడ్డీయేతర ఆదాయం విషయానికి వస్తే డిసెంబర్ త్రైమాసికంలో రూ.544కోట్లు ఆర్జించగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.604 కోట్లు ఆర్జించింది. నికరంగా చూస్తే రెండు శాతం క్షీణించింది. అదే తొమ్మిది నెలల కాలానికి చూస్తే డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి రూ.1885 కోట్లు ఆర్జిస్తే అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో రూ.1658 కోట్లు ఆర్జించింది. 14 శాతం వృద్ధి కనిపించింది. డిసెంబర్ త్రైమాసికంలో మొత్తంఆదాయం రూ.5093కోట్లు కాగా క్రితం ఏడాది రూ.5013 కోట్లు. రెండు శాతం వృద్ధి కనిపించింది. తొమ్మిది నెలల కాలానికి చూస్తే డిసెంబర్‌లో రూ.15254 కోట్లు కాగా..క్రితం ఏడాది ఇదే కాలంలో రూ. 14911 కోట్లురెండు శాతం వృద్ధి కనిపించింది. అయితే మొండిబకాయిలకు పెద్దమొత్తంలో రూ.1862 కోట్లు కేటాయించగా.. క్రితం ఏడాది రూ.853 కోట్లు కేటాయించింది. తొమ్మది నెలల కాలానికి రూ.4872 కోట్లు కేటాయించగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.2814 కోట్లు కేటాయించింది. డిసెంబర్ త్రైమాసికంలో నికర నష్టం రూ.532 కోట్లు కాగా క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.57 కోట్లు లాభాన్ని ప్రకటించింది. తొమ్మిది నెలల కాలానికి రూ.877 కోట్ల నష్టాన్ని ప్రకటిస్తే అంతకు ముందు ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.139కోట్లు లాభాన్ని ప్రకటించింది.



అంతర్జాతీయ మేధోసంపత్తిలో భారత్
ముందడుగు



• 44వ ర్యాంకులో ఇండియా

వాషింగ్టన్ : తాజా అంతర్జాతీయ మేధోసంపత్తి (ఐపీ) సూచిలో భారత్ మెరుగైన ర్యాంకు సాధించింది. అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్ గురువారం విడుదల చేసిన ర్యాంకులో మొత్తం 50 దేశాల్లో భారత్ 44వ ర్యాంకును దక్కించుకుంది. అంతర్జాతీయ మేధోసంపత్తి ర్యాంకులో భారత్‌ర్యాంకు గణనీయంగా మెరుగుపడుతోంది. ర్యాంకు మెరుగుపడినా.. భారత్‌ర్యాంకు మొత్తానికి చూస్తే వెనుకనే ఉంది. మొత్తం 50 దేశాలను తీసుకుంటే భారత్ ర్యాంకు 44వ స్థానంలో ఉంది. గత సంవత్సరం మొత్తం 45 దేశాల సూచితో భారత్ ర్యాంకు 43గా నిలిచింది. మొత్తానికి 8.4 పాయింట్లు స్కోర్ సాధించింది. భారత్ ర్యాంకు మెరుగుపడ్డానికి ప్రధాన కారణం ... పెద్దెత్తున సంస్కరణలు తీసుకురావడంతో పాటు కంప్యూటర్ ద్వారా కొత్త కొత్త అన్వేషణలను కనుగొని.. వాటికి పెటెంట్ రిజిస్ట్రేషన్‌లను దక్కించుకోవడంలో భారత్ మంచి మార్కులు దక్కించుకుంది. మేధోసంపత్తి జాబితాలో అమెరికా అగ్రస్థానంలో ఉంది మొత్తం 37.98 పాయింట్లు సాధించింది. తర్వాతి స్థానం బ్రిటన్ 37.97 పాయింట్లు, స్వీడెన్ 37.03 పాయింట్లు సాధించింది. వార్షిక నివేదిక ప్రకారం జులై 2017లో భారత్ కొన్ని రకాల గైడ్‌లైన్స్ జారీ చేసింది. వాటిలో కంప్యూటర్ రంగానికి చెందిన కొత్త కొత్త ఆవిష్కరణలు వాటి పెటెంట్‌లపై గైడ్‌లైన్స్ జారీ చేయడం ద్వారా భారత్ మెరుగైన ర్యాంకును సాధించగలిగిందని అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో వివరించింది. దీంతో పాటు భారత ప్రభుత్వం ఐపీ అవగాహన వర్క్‌షాప్‌లను నిర్వహించింది. దీంతో పాటు వారికి సాంకేతిక పరమైన శిక్షణ ఇవ్వడం జరిగింది. జాతీయ మేధోసంపత్తి హక్కుల విధానాన్ని రూపొందించడం తదితర అంశాలు భారత్‌కు కలిసొచ్చాయని అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్ పేర్కొంది. అయితే భారత్ ర్యాంకు మరింత మెరుగుపర్చుకోవాలంటే ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంటుందని నివేదికలో వివరించింది. భారత్‌కు బలహీనమైన అంశాల విషయానికి వస్తే లైఫ్ సైన్సెస్ ఐపి పరిరక్షణలో పరిమితి స్థాయిలో వెసులు బాటు ఉందని తెలిపింది. ఈ విభాగంలో అంతర్జాతీయ ప్రమాణాలను పాటించాల్సి ఉందని సూచించింది.

మొత్తానికి మొదటి సారి భారత్ కింది నుంచి పదిశాతం మెరుగుపర్చు కుం దని, దీని బట్టి చూస్తే భారత్ మేధోసంపత్తితో కాస్తా ముందడుగు వేస్తోందని జీఐపీసీ వైస్‌ప్రెసిడెంట్ ప్యాట్రిక్ కిల్‌బ్రైడ్ చెప్పారు.భారత్‌స్కోర్ మెరుగుపడ్డానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. వాటిలో సరికొత్త సంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించడానికి బలమైన గైడ్‌లైన్స్ రూపొందించడం, ఐటీ మేధోసంపత్తిని పరిరక్షించడంతో వాటిని అవగాహన పెంచడం, దీంతో పాటు 2016లో నేషనల్ ఐపీఆర్ విధానాన్ని అమలు చేయడం భారత్ బాగా కలిసొచ్చింది. అయితే దేశీయంగా వినూత్నమైన ఆవిష్కరణలు చేయాల్సి ఉందని, దీంతో పాటు పెద్దమొత్తంలో విదేశీ పెట్టుబడులు ఆకర్షించాల్సి ఉందని కిల్‌బ్రైడ్ చెప్పారు. మేధోసంపత్తి ర్యాకు నిర్ణయించడానికి మొత్తం 40 వినూత్నమైన సూచికలను అందుబాటులో పెట్టారు. వారిలో పెటెంట్, ట్రేడ్‌మార్కు, కాపీరైట్ వ్యాపార రహస్యాలను కాపాడ్డమని నివేదికలో వివరించింది.

బంగారం వెల వెల

•పది గ్రాములు రూ. 600 తగ్గుదల



న్యూఢిల్లీ : బంగారం ధరలు గురువారం నాడు మూడు వారాల కనిష్ఠానికి దిగివచ్చాయి. పది గ్రాములు రూ.600 తగ్గి రూ.30,950కి దిగివచ్చింది. దీనికి ప్రధాన కారణం గ్లోబల్ మార్కెట్లో పసిడికి డిమాండ్ తగ్గడమే. దీంతో పాటు ఇక్కడ స్థానిక నగల వ్యాపారులు కూడా బంగారం కొనుగోలుకు దూరంగా ఉండటం కూడా ఒక కారణంగా చెప్పుకోవచ్చు. పసిడితో పాటు వెండి కిలో రూ.450 తగ్గి రూ.38,900 మార్కుకు దిగివచ్చింది. పారిశ్రామిక యూనిట్లు, వెండి నాణెల తయారీదార్లు కొనుగోళ్లకు దూరంగా ఉండటం వల్ల ధరలు తగ్గముఖం పట్టాయి. స్థానిక ట్రేడర్ల సమాచారం ప్రకారం అమెరికాలో వడ్డీరేట్లు పెరుగుతాయన్న అంచనాతో డాలర్ బలపడిందని.. పెట్టుబడులకు బంగారం కంటే డాలర్లే నయమని పెట్టుబడులన్నీ డాలర్లవైపు తరలిపోతున్నాయని చెబుతున్నారు. సింగపూర్‌లో ఔన్స్ బంగారం 0.61 శాతం క్షీణించి 1310.10 డాలర్లకు, వెండి 0.37 శాతం క్షీణించి 16.28 డాలర్లకు దిగివచ్చింది. దేశ రాజధానిలో 99.9 శాతం, 99.5 శాతం మేలిమి బంగారం రూ.600 తగ్గి రూ.30,950, రూ.30,800కు దిగివచ్చింది. చివరగా జనవరి 18వ తేదీనాటి స్థాయికి పడిపోయాయి. ఎనిమిది గ్రాముల సావరిన్ బంగారం రూ.24,800 పలుకుతోంది.

బాష్‌లో 10వేల కొలువులు

బెంగళూరు : బాష్ ఇండియా గ్రూపు వచ్చే రెండేళ్లలో భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానం కోసం సుమారు పది వేల మంది యువ ఇంజినీర్లను తమ ఆర్అండ్‌డి కోసం తీసుకోనుంది. గురువారం నాడు ఈ విషయం తెలియజేసింది. జర్మనీ తర్వాత అతి పెద్ద ఆర్అండ్‌డి భారత్‌లోనే ఉంది. ప్రస్తుతం బెంగళూరు, కోయంబత్తూరు ఆర్అండ్‌డిలో మొత్తం 18,500 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఆర్అండ్‌డిని మరింత బలోపేతం చేసేందుకు వచ్చే రెండేళ్లలో రూ.500 కోట్ల నుంచిరూ.800కోట్ల వరకు వ్యయం చేస్తుంది. ఎక్కువగా ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్‌పై పెట్టుబడులు పెడుతున్నట్లు బాష్‌ఒక ప్రకటనలో తెలిపింది. చివరగా సెప్టెంబర్ 2016లో పెద్దమొత్తంలో రిక్రూట్‌మెంట్లు చేసింది. బెంగళూరులో 50 మిలియన్ డాలర్లతో ఆర్అండ్‌డి సెంటర్‌ను ఏర్పాటు చేసింది. భారత్ మార్కెట్ కోసం ఎలక్ట్రిక్ హై వోల్టెజీ వెహికిల్ సిస్టమ్ 400 వోల్ట్‌లతో పాటు 85కె పవర్‌ట్రెయిన్‌ను దేశీయ మార్కెట్లో విడుదల చేయబోతున్నట్లు బాష్‌గ్రూపు ఇండియా ప్రెసిడెంట్ సౌమిత్ర భట్టాచార్య ఒక ప్రకటనలో తెలియజేశారు.

డాక్టర్ రెడ్డీస్ ఔషధాలు వెనక్కి



హైదరాబాద్ : డాక్టర్ రెడ్డీస్ లేబరెటరీస్ స్వచ్ఛందంగా అమెరికా మార్కెట్ల నుంచి 80వేల ఆటోర్వాస్టాస్టిన్ కాల్షియం సీసాలను వెనక్కి రప్పిస్తోంది. నాణ్యత ప్రమాణాల్లో లోపాల కారణంగా 10ఎంజీ, 20 ఎంజీ, 40 ఎంజీ బాటల్స్‌ను రప్పిస్తున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ఔషధం రక్తంలో కొవ్వును తగ్గిస్తుంది. అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ ఒక నోటిఫికేషన్‌లో ఈ మందులను మార్కెట్ నుంచి ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించింది. డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన అధికారులు దీనిపై స్పందించడానికి అందుబాటులోకి రాలేదు.

ఫోర్బ్స్ క్రిప్టోకరెన్సీ సంపన్నుల జాబితా

Forbes

న్యూయార్కు : ప్రపంచంలోని సంపన్నుల జాబితాను ప్రచురించడంలో ఫోర్బ్సుకు పెట్టింది పేరు. అయితే మొట్టమొదటిసారి మంగళవారం నాడు ప్రపంచంలోని క్రిప్టోకరెన్సీ సంపన్నుల జాబితాను విడుదల చేసింది. క్రిప్టో కరెన్సీ గురించి తెలువాలంటే పూర్తి పారదర్శకత ఉండాలి. ప్రపంచంలోని సంపన్నుల వద్ద ఖచ్చితంగా క్రిప్టోకరెన్సీ ఎంత ఉందో పక్కాగా తెలియడం చాలా కష్టమని ఫోర్బ్స్ ఎడిటర్ రాండాల్‌లేన్ చెప్పారు. సంప్రదాయబద్ధ కరెన్సీ చెల్లింపులకు ప్రత్యామ్నంగా క్రిప్టోకరెన్సీ ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయని, ఇటీవల కాలంలో బిట్‌కాయిన్‌లపై పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టి రాత్రి రాత్రి బిలియనీర్లు అయిన వారి సంఖ్య కూడా తక్కువేమీ కాదు. ఫోర్బ్స్ క్రిప్టోకరెన్సీ సంపన్నులను ఐదు విభాగాలుగా విభజించింది.

వారిలో ఐడియలిట్స్, బిల్డర్స్, ఆపర్చునిస్ట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లేయర్స్ ఇన్వెస్టర్లుగా నిర్ణయించింది. ఈ జాబితాలో స్థానం దక్కించుకోవాలంటే 350 మిలియన్ డాలర్లు సంపాదించాల్సి ఉంటుంది. వారి వద్ద ఉన్న క్రిప్టోకరెన్సీ (ఆధారాలతో) పాటు ఉన్న వారిని, ట్రేడింగ్ తర్వాత లాభాలపై పన్ను చెల్లించిన వారిని మాత్రమే జాబితాలో తీసుకున్నారు. జాబితాలో మొత్తం 19 మంది స్థానం దక్కించుకున్నారు. ఫోర్బ్స్ వెబ్‌సైట్‌పైక్లిక్ చేస్తే ప్రతి సభ్యుడి నికర విలువ తెలుస్తుంది. క్రిప్టో ర్యాంకింగ్ నుంచి తప్పుకున్న వారిలో లైట్‌కాయిన్ వ్యవస్థాపకుడు చార్లీ లీ, బిట్‌కాయిన్ ఇన్వెస్టర్ రోజర్ వీర్, క్రిప్టో పయనీర్ నిక్ సుజాబో తదితరులున్నారు.

మారుతి ఎలక్ట్రిక్ కార్ల హవా

• ఆటోఎక్స్‌పో 2వ రోజు • నేటి నుంచి 14వరకు ప్రజల సందర్శనకు అనుమతి



గ్రేటర్ నోయిడా : 14వ ఎడిషన్ ఆటో ఎక్స్‌పో 2018ని భారీపరిశ్రమల మంత్రి అనంత్‌గీతే గురువారం నాడు గ్రేటర్ నోయిడాలో ఆవిష్కరించారు. ఆటో ఎక్స్‌పో 2018 ఫిబ్రవరి 14 వరకు కొనసాగుతుంది. ఈ ఎక్స్ పోలో అతి పెద్ద కంపెనీలు తమ కార్లను, మోటా ర్‌సైకిళ్లు ప్రదర్శనకు ఉంచ ుతాయి. వాటిలో ప్రధానంగా చెప్పుకోవాలంటే మారుతి సుజుకీ కాన్సెప్ట్ ఫ్యూచర్ ఎస్, హోండా కొత్త ఏమేజ్, హ్యుందాయ్ ఎలై ట్20ని బుధవారం నాడు ప్రద ర్శనకు ఉంచా యి. కాగా గురు వారం నాడు కొత్త మారుతి సుజుకి స్విఫ్ట్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇదిలా ఉండగా బుధవారం నాడుసుమారు రెండు డజన్ వాహనాల ఆవిష్కరణ జరిగింది. మరో 100 వాహనాల ఆవిష్కరణ జరగాల్సి ఉంది. ఈ సారి ప్రత్యేక ఆకర్షణ ఏమిటంటే ఎలక్ట్రిక్ వాహనాలు. టాటా కొత్త హెచ్‌బ్యాక్, సెకండ్ జెన్ హోండా అమేజ్, దీంతో పాటు హ్యుందాయ్ ఐ20 కొత్త రూపుతో తీసుకువచ్చారు. ఇవన్నీ మొదటి రోజు మీడియా కోసం ప్రదర్శనకు ఉంచారు. కాగా ఫిబ్రవరి 9 నుంచి అంటే శుక్రవారం నుంచి ఈ వాహ నాలను ప్రజల కోసం అందుబాటులో ఉంచుతారు. గురువారం మధ్యాహ్నం 2.45 గం టలకు భారీ పరిశ్రమల మంత్రి పబ్లిక్ ఎంట ర్‌ప్రైజెస్ మంత్రి ఆటో ఎక్స్‌ఫో 2018ని ఆవిష్క రించారు. బాలీవుడ్ సినీనటి సోనాక్షి సిన్హా డీసీ స్టాల్ వద్ద ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మారుతి సుజుకి స్విఫ్ట్ ఫీచర్, ఆటోగేర్ షిఫ్ట్ టెక్నాలజీ, ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్ డేటైం రన్నింగ్ లైట్స్‌ను ప్రదర్శనకు ఉంచింది. మారుతి సుజుకి ఒక అడుగు ముందుకేసి కొత్త స్విఫ్ట్ బుకింగ్‌లను కూడా మొదలుపెట్టిది. కొత్త స్విఫ్ట్ నాలుగు వెరియెంట్లలో లభిస్తుంది. పెట్రోల్ ఎల్ఎక్స్ రూ.4.99 లక్షలు, వీఎక్స్ఐ రూ.5.87 లక్షలు, జెడ్ఎక్స్ఐ రూ.6.49 లక్షలు, జెడ్ఎక్స్ రూ.7.29 లక్షలు, డిజెల్ మాన్యువల్ ఎల్ఐడి రూ.5.99 లక్షలు, విడీఐ రూ.6.87 లోలు, జెడ్ఐ రూ.7.49 లక్షలు, జెడిఐ రూ.8.29 లక్షలు, డిజెల్ ఆటోమెటిక్ (ఏజీఎస్) వీడిఐ రూ.7.34 లక్షలు జెడ్‌డీఐరూ.7.96 లక్షలుగా ప్రకటించింది. మొత్తానికి మారుతి సుజుకి పెవెలియన్ వద్ద భారీ హడావిడి కనిపించింది.

బీఎండబ్ల్యు పెట్రోల్‌మోడల్ బీఎస్-6వెరియెంట్

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బీఎండబ్ల్యు పెట్రోల్ వెర్షన్ బీ ఎ స్ - 6 ప్ర వ రా




ణాలతో కూడిన కారును తయారు చేయడానికి ప్రణాళికలు రూపుదిద్దిన్నట్లు తెలిపింది. అనుకున్న సమయం కంటే ముందుగానే మార్కెట్లో విడుదల చేస్తామని బీఎండబ్ల్యు గ్రూపు ఇండియా ప్రెసిడెంట్ విక్రం పాహోహ ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. వాస్తవానికి భారత్ మార్కెట్లో ఏప్రిల్ 2020 నాటికి బీఎస్-6 ప్రమాణాల కార్లను మార్కెట్లోకి తేవాల్సి ఉంటుంది. ఆటో కంపెనీలన్నీ దానిపై కసరత్తు చేస్తున్నాయని షెడ్యూలు కంటే ముందే మార్కెట్లో విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా బీఎండబ్ల్యు గురువారం నాడు పెట్రోల్ వెర్షన్ కూపీ ఎక్స్6 ఎం స్పోర్ట్‌ను మార్కెట్లో విడుదల చేసింది దీని ధర రూ.94.15 లక్షలు. దీంతో పాటు కొత్త అప్‌డెటెడ్ వెర్షన్ ఎం3 సెడాన్ ఎం4 కూపీ వీటి ధర వరుసగా రూ.1.3 కోట్లు, రూ.1.33 కోట్లు నిర్ణయించింది. ఈ రెండు అప్‌డెటెడ్ వాహనాలను మార్కెట్లో విడుదల చేసింది.

ఎలక్ట్రిక్ సూపర్‌బైక్‌ఎంఫ్లెక్స్ ధర రూ.6 లక్షలు

ఇక్కడ జరుగుతున్న ఆటోఎక్స్‌లో గురు వారం నాడు న్యూ ఇండియా ఎలక్ట్రిక్ టూ వీలర్ స్టార్టప్ ఎంఫ్లెక్స్‌ను ప్రదర్శించారు. ఈ మోటార్ సైకిల్ ధర సుమారు రూ.6 లక్షల వరకు ఉంటుంది. ఈ ఎలక్ట్రిక్ సూపర్‌బైక్ మూడు వెరియెంట్‌లలో లభిస్తుంది. వాటి ధర రూ.11 లక్షల వరకు ఉంటుందని ఎంఫ్లెక్స్ మోటార్ ప్రకటించింది. ఈ బైక్ బుకింగ్‌లు వచ్చే ఆరు నెలల నుంచి మొదలుపెడుతుంది. ఏప్రిల్ 2019 నుంచి డెలివరీ ఇస్తుం దని తెలిపింది. ఎంఫ్లెక్స్‌బైక్ 9.7 కెడబ్ల్యుహెచ్ (కిలోవాట్) లిథి యం బ్యాటర్ ప్యాక్‌ను (స్యాంసంగ్) తయారుచేసింది వినియోగిస్తుంది. 60కి లోవాట్ మోటార్ బిగించారు. ఈ సూపర్‌బైక్ మూడు సెకన్లలో టాప్ స్పీడ్ 200 కిలోమీటర్లు చేరుతుం దని కంపెనీ నిర్వాహకులు చెబుతున్నారు. ఫీచర్ల విషయానికి వస్తే దీనికి బ్రేమ్‌బో బ్రేక్‌లు డ్యూయెల్ చానల్ ఏబీఎస్, సింగిల్ సైడెడ్ స్విగ్ ఆర్మ్, ఒహిలిన్స్ సస్పెన్షన్‌తో పాటు తేలికపాటి అల్లాయ్ వీల్స్‌ను అమర్చింది. ఈ స్పోర్ట్‌బైక్‌ను మోడల్ 2గా పేరుపెడుతోంది. ఈ బైక్‌లు రెండు వెరియెంట్‌లలో లభి స్తాయి. ఒకటి గంటలకు 150 కిలోమీటర్లు, 220 కిలోమీటర్ల వేగంతో పరుగెడుతాయి.


హమ్మయ్య...లాభాల్లోకి...



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లకు ఎట్టకేలకు గురువారం ఊరట లభించింది. కార్పొరేట్ ఫలి తాలు అనుకూలంగా నమోదు కావ డంతో పాటు ఆసియా మార్కెట్లు లాభాలతో ట్రేడ్ కావ డంతో దేశీయ మార్కెట్లు గట్టెక్కాయి. మార్కెట్ ముగి సే నాటికి సెన్సెక్స్ 330 పాయింట్లు లాభపడి 34,413.16 వద్ద ముగి సింది. గత ఏడు ట్రేడింగ్ సెషన్‌లలో సూచి 2,200.54 పాయింట్ల వరకు నష్టపోయింది. ఆర్థికశాఖ కార్యదర్శి హస్ముఖ్ ఆదియా కూడా విదేశీ మార్కెట్లు నష్టాలతో ట్రేడ్ కావడం వల్లే దేశీయ మార్కెట్లు నష్టాలను చవిచూ శా యని చెప్పారు. నిఫ్టీకూడా వంద పాయింట్లు కోలుకుని 10,576.85 వద్ద ముగిసింది. ఇటీవల కాలంలో బ్యాంకింగ్, ఫార్మా, ఐటి రంగానికి చెం దిన షేర్లు బాగా దబ్బతిన్నాయి. అయితే గురు వా రం నాడు మదుపరులు ఈ రంగానికి చెందిన షేర్ల ను పెద్దెత్తున కొనుగోలు చేశారు. దీంతో పాటు తగ్గ ముఖం పడుతున్న ముడి చమురు ధరలతో వృద్ధిరేటు పుంజుకుంటుంటున్న సెంటి మెంట్ కూడా తోడయింది. బ్రెంట్ క్రూడ్ ఆరు వారాల కని ష్ఠానికి 65.16 డాలర్లకు దిగివచ్చింది. కార్పొరేట్ ఫలితాలు ఆశాజనకంగా ఉండటంతో పాటు ఆసి యా మార్కెట్లకు పుంజు కోవడం, ఆర్‌బీఐ వడ్డీ రేట్లను యధా తథంగా కొనసాగించడం వల్ల మార్కెట్ స్థిరపడిందని మార్కెట్ పండితులు చెబుతున్నా రు. రిజర్వుబ్యాంకు బుధవారం నాడు జరి గిన ఆరవ ద్వైపాక్షిక ద్రవ్యపరపతి సమీక్షలో వడ్డీ రేట్లను యధాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటిం చింది. వచ్చే ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 7.2 శాతం సాధిస్తుందని అంచనా వేసింది... రుణాలకు డిమాండ్ పెరుగుతుందని స్పష్టం చేసిం ది.

రూ.500కే 4జీ స్మార్ట్‌ఫోన్

హైదరాబాద్ : మొబైల్ టెలికం రంగంలో పోటీ తీవ్రంగా ఉంది. బిలియనీర్ ముఖేష్ అంబానీ రిలయన్స్ జియో పేరుతో ఎంట్రీ ఇవ్వడం.. టారిఫ్ రేట్లు అత్యంత చౌకకు అందుబాటులోకి తేవడంతో పోటీ కంపెనీలు బెంబేలెత్తుతున్నాయి. భారీ నష్టాల్లో కూరుకుపోతున్నాయి. తాజాగా రిలయన్స్ జియో రూ.500కె స్మార్ట్‌ఫోన్ తీసుకురావడానికి కంపెనీలతో చర్చలు జరుపుతోంది. దీంతో పోటీ కంపెనీలైన భారతి ఎయిర్‌టెల్, వోడాఫోన్ ఇండియా, ఐడియా సెల్యూలార్ కూడా అత్యంత చౌక 4జీ స్మార్ట్‌ఫోన్ రూ.500కు తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నాయి. దేశంలో ఇప్పటి చాలా మంది బేసిక్ మొబైల్ ఫోన్ వినియోగిస్తున్నారు. ఇటీవల కాలంలో మొబైల్ టెలికం రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్నాయి. అయితే వీటిని వినియో గించుకోవాలంటే స్మార్ట్‌ఫోన్ తప్పనిసరి.. స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయాలంటే వేలాది రూపాయిలు కుమ్మ రించాల్సిందే. అలాంటి వారు కొద్ది కాలం వేచి చూస్తే వారికి కూడా స్మార్ట్‌ఫోన్ సౌభాగ్యం లభిస్తుంది. భారతి ఎయిర్‌టెల్, వోడాఫోన్, ఐడి యాసెల్యూ లార్లు హ్యాండ్ సెట్ కంపె నీలతో చర్చలు జరిపి అత్యం త చౌకగా రూ. 500కే స్మార్ట్‌ఫోన్ తయారు చేసి పెట్టాలని కోరు తున్నట్లు మీడియాలో వార్తలు వస్తున్నాయి. అదే సమయంలో కంపె నీలు వాయిస్‌తో పాటు డేటా సర్వీసు ప్లాన్‌ను నెలకు రూ.60 నుంచి రూ.70కి అందుబాటులో తేవాలని చూస్తున్నాయి. తాజాగా రిలయన్స్‌జియో నెలకు రూ.49 ప్లాన్‌కు



• జియోకు పోటీగా మిగిలిన టెల్కోలు

పోటీగా పోటీ కంపెనీలు కూడా చౌకరకం స్మార్ట్‌ఫోన్ తెచ్చి జియోకు పోటీ ఇవ్వాలనుకుంటున్నాయి. స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ ఎగ్జిక్యూటివ్ మాట్లాడుతూ అత్యంత చౌకరకం వోల్ట్ ఫీచర్ ఫోన్ తయారు చేయాలంటే కనీసం రూ.800 అవుతుందని, జియో ఫోన్ కంటే రెట్టింపు ధర అవుతుంది. పోటీ కంపెనీలు ఈ వ్యత్యాసాన్ని ఎలా పూరుస్తాయో కంపెనీలకు ఇది పెద్ద సవాలన్నారు. అయితే భారతి ఎయిర్‌టెల్, వోడాఫోన్, ఐడియా సెల్యూలార్లు దీనిపై స్పందించానికి నిరాకరించాయి. ప్రస్తుతం దేశంలో సుమారు వంద కోట్ల కంటే ఎక్కువ మంది మొబైల్ సబ్‌స్క్రైబర్లున్నారు. వారిలో 65-70 శాతం మది ఫీచర్ లేదా బేసిక్ ఫోన్ లేదా 2జీ వాయిస్ సర్వీసును వినియోగిస్తున్నారు.


ఇప్పుడు పెద్ద కంపెనీలన్నీ వీరిని లక్ష్యంగా చేసుకున్నాయి. కనీసం 50 శాతం మంది 4జీ సర్వీసుల్లోకి తీసుకుని రెవెన్యూ పెంచుకోవాలని చూస్తున్నాయి.. అయితే విశ్లేషకుల అంచనా మాత్రం వేరుగా ఉంది. కంపెనీలు వినియోగదారులకు స్మార్ట్‌ఫోన్‌లు అంటగట్టి ఉచితంగా వాయిస్‌కాల్స్ ఇచ్చి డేటా ప్లాన్‌కు మాత్రం డబ్బు వసూలు చేస్తాయి. దీంతో భవిష్యత్తులో కంపెనీలకు రెవెన్యూ తగ్గుతుందని చెబుతున్నారు.

కార్మిక సంక్షేమంలో తెలంగాణ టాప్

రూ. 6,999 కోట్లతో ఆర్‌అండ్‌బీ ప్రతిపాదనలు

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : వచ్చే వార్షిక బడ్జెట్‌లో తమ శాఖకు రూ. 6,999 కోట్ల నిధులు కేటాయించాలని రాష్ట్ర ఆర్థిక శాఖను రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ కోరింది. ఈ మేరకు ప్రతిపాదనలతో కూడిన నివేదికను సమర్పించింది. 2017 -18 వార్షిక బడ్జెట్‌లో ఆరువేల కోట్ల రూపాయలను కేటాయించాలని అభ్యర్థించగా ప్రభుత్వం రూ. 5,033 కోట్లు కేటాయించింది.2018 -19 ఆర్థిక సంవత్సరంలో పెద్దయెత్తున రహదారులు, భవనాల నిర్మాణం చేపడుతున్నందున వెయ్యి కోట్లు అదనంగా కేటాయించాలని ఈ శాఖ ప్రభుత్వానికి నివేదించింది. తెలంగాణ రాష్ట్రం రాష్ట్రంలో పెద్ద యెత్తున రహదారుల నిర్మాణాలను ప్రభుత్వంచేపడుతోంది.పంచాయతిరాజ్ రహదారులను రహదారుల శాఖకు విలీనం చేయడంతో పాటు రాష్ట్ర రహదారులను కూడా చేపడుతోంది. కొత్తగా 21 జిల్లాలు ఏర్పాటు చేసినందున కలెక్టరేట్లతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల సముదాయాన్ని చేపట్టాలని నిర్ణయించి కొన్ని జిల్లాల్లో పనులను కూడా ప్రారంభించింది. సమీకృత జిల్లా కార్యాలయాల భవనాల నిర్మాణ సముదాయానికి ప్రస్తుతం రూ. 962 కోట్ల అంచనాలతో నిర్మాణాలను ప్రారంభించింది. ప్రస్తుతం రాష్ట్ర రహదారుల పొడవు 25,792 కిలోమీటర్లు కాగా ఇతర శాఖల నుండి రహదారుల శాఖకు బదలీ అయిన తర్వాత రహదారుల నిడివి 42,053 కోట్లకు చేరుకుంది. మొత్తం తెలంగాణ రాష్ట్రాన్ని అనుసంధానం చేసేందుకు మండల కేంద్రాల నుంచి నియోజకవర్గ కేంద్రాలు, అక్కడి నుంచి జిల్లా కేంద్రాలు, అక్కడి నుంచి రాజధాని హైదరాబాద్‌కు నేరుగా రహదారుల సౌకర్యం కల్పించాలని ఈ శాఖ మాస్టర్ ప్లాన్ రూపొందించింది. తెలంగాణ రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ట్రాక్) ద్వారా 5,107 కిలోమీటర్ల పొడవునా రోడ్లను చేపట్టేందుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ పథకం ద్వారా 31 జిల్లాలకు కనెక్టివిటీ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది.అంతేగాక ట్రాక్ పథకం ద్వారా 87 పర్యాటక కేంద్రాలు, 91వ్యవసాయ మార్కెట్ యార్డులను కలిపేవిధంగా ప్రణాళికను రూపొందించారు.


తాగునీటికి ప్రత్యేక గ్రిడ్:వేముల



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హైదరాబాద్ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా అవసరాలను పూర్తిస్థాయిలో తీర్చేలా నీటి సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయాలని సీఎం కేసీఆర్ ఆలోచిస్తున్నారని మిషన్ భగీరథ వైఎస్ ఛైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి వెల్లడించారు. గురువారం సచివాలయంలో మిషన్ భగీరథ పనులను అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ కృష్ణా-గోదావరి నదులను అనుసంధానిస్తూ తాగునీటి గ్రిడ్‌ను ఏర్పాటు చేయాలన్న ఆలోచన ముఖ్యమంత్రికి ఉందన్నారు. ఈ వేసవికి ఔటర్ రింగ్‌రోడ్ లోపల ఉన్న గ్రామాలకు బల్క్‌గా తాగునీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ రింగ్‌రోడ్ అవతల జరుగుతున్న గ్రామీణ మిషన్ భగీరథ పనులకు అనుగుణంగా ఓఆర్‌ఆర్ లోపల అర్బన్ మిషన్ భగీరథ పనులు సమాంతరంగా జరగాలన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క గ్రామంలోనూ వేసవికి తాగునీటి సమస్య తలెత్తరాదన్నారు. ప్రాధాన్యతలకు అనుగుణంగా పనులు చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా చేరవచ్చన్నారు. అర్బన్ మిషన్ భగీరథ పనులకు ఎక్కడైనా పైపులు ,మెటీరియల్ అసరమైతే అందిస్తామని వేముల ప్రశాత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ నగర తాగునీటి సరఫరా సంస్థ ఎండి దానకిశోర్ , ఈడి సత్యనారాయణ, ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

59 మూగ జీవాలు దుర్మరణం



చిట్యాల, ప్రభ న్యూస్ : సంతలో గొర్రెలను కొనుగోలు చేసి తెల్లవారే లోపు హైదరాబాద్‌కు చేరుకొని అక్కడ విక్రయించుకుందామనుకున్న ఆ గొర్రెల వ్యాపారులు తెల్లవారకుండానే అనంత లోకాల్లోకి వెళ్లిపోయారు. నల్లగొండ జిల్లా, చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున డీసీఎం వాహనం బోల్తా పడిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడంతో పాటు 59మూగజీవాలు మృతి చెందాయి. సీఐ పాండు రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా, నెక్కొండ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన దోనికి కుమారస్వామి (40), సంగెం మండలం కృష్ణానగర్‌కు చెందిన మేకల మల్లయ్య (36), చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లికి చెందిన కొల్లూరు రాకేష్ (22) అనే గొర్రెల వ్యాపారులు బుధవారం నెక్కొండ అంగడిలో 105గొర్రెలను కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన గొర్రెలను హైదరాబాద్ జియాగూడ మండిలో విక్రయించడం కోసం డీసీఎం వాహనాన్ని కిరాయికి తీసుకొని అదే రోజు రాత్రి బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో డీసీఎం వాహనం వెలిమినేడు శివారులోకి రాగానే కల్వర్టు గోడను ఢీకొట్టి కల్వర్టులో పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు గొర్రెల వ్యాపారులు అక్కడికక్కడే మృతి చెందారు. డీసీఎంలోని 59 గొర్రెలు కూడా అక్కడికక్కడే మృతి చెందాయి. డీసీఎం డ్రైవర్ వెంకన్న తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

22న సీపీఎస్ రద్దు కోరుతూ ధర్నాలు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని 1.20 లక్షల మందికి నష్టం కలిగించే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేయాలని పిఆర్‌టియు డిమాండ్ చేసింది. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా తాము ఆందోళనలు చేపడుతున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి చెన్నకేశవరెడ్డి తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ వారు ఎమ్మెల్సీలు పూలరవీందర్, కాటేపల్లి జనార్ధన్‌రెడ్డితో కలిసి గురువారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషికి వినతిపత్రం సమర్పించారు. 22న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు చేపడుతున్నట్టు వారు తెలిపారు. సీపీఎస్ రద్దు విషయమై శాసనసభలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లింపు ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్‌రూల్స్ రూపొందించడానికి హైకోర్టులో ఉన్న స్టేటస్ కో ఎత్తేసేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఖాళీ గా ఉన్న 90 శాతం పర్యవేక్షణాధికారుల పోస్టులను భర్తీ చేయాలని, పండిట్ పోస్టులకు అప్‌గ్రేడ్ చేయాలన్నారు. బదిలీలతోపాటు పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. గోడపత్రిక, కరపత్రాలను ఎమ్మెల్సీలు ఆవిష్కరించారని చెప్పారు.

వర్మకు సీసీఎస్ నోటీసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వివాదాలకు కేంద్రబిందువు, సంచలనాలకు మారుపేరైన దర్శకుడు రాంగోపాల్‌వర్మకు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు షాక్ ఇచ్చారు. గాడ్ సెక్స్ ట్రూత్ (జీఎస్టీ)పై నమోదైన కేసులో తమ ముందు విచారణకు హాజరు కావాలని వర్మకి సీసీఎస్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. పోలీసులు ఎదుట గురువారం హజరు కావాల్సి ఉంది. నోటీసు అందుకున్నా తాను విచారణకు హాజరు కాలేనని లాయర్ ద్వారా పోలీసులకు ఆయన సమాచారం ఇచ్చారు. ముంబైలో నాగార్జున సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నామని, వచ్చేవారంలో మళ్లీ నోటీసు ఇస్తే వస్తానని వర్మ తెలిపినట్లు సమాచారం. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు, మహిళలను పెట్టి న్యూడ్(అశ్లీల) సినిమాలు తీస్తానని అన్నందుకే నోటీసు ఇచ్చామని దానిపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

- జీహెచ్‌ఎంసీ, వరంగల్‌లో లేబర్ అడ్డాలు
- మేడే నాటికి మరిన్ని పథకాలు
- హెూం, కార్మికమంత్రి నాయిని నర్సింహారెడ్డి



కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో : తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 10,06,192 మంది కార్మికులు వారి పేర్లను భవన, ఇతర నిర్మాణ కార్మిక మండలిలో నమోదు చేసుకున్నారని రాష్ట్ర హోం, కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహరెడ్డి తెలిపారు. గురువారం కరీంనగర్ పద్మనాయకలో జరిగిన భవన నిర్మాణ కార్మిక, ఇతర విభాగాల కార్మిక రంగాలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ప్రారంభించి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు బోర్డులో 312 పబ్లిక్ ఎస్టాబ్లిష్‌మెంట్లు, 9,993 ప్రైవేటు ఎస్టాబ్లిష్‌మెంట్ల వారి పేర్లను నమోదు చేయడం జరిగిందన్నారు. కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, బోర్డులో పేర్లు నమోదు చేసుకున్న వారికి ఈ పథకాల ద్వారా లబ్ధి పొంవచ్చన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయడంతో తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ప్రమాద వశాత్తు కార్మికుడు మరణిస్తే కుటుంబానికి రెండు లక్షల రూపాయలు ఇచ్చేవారని, తెలంగాణ ఏర్పడిన తరువాత ఆరు లక్షల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. అంగవైకల్యం ఏర్పడితే గతంలో లక్ష రూపాయలు మాత్రమే ఇచ్చేవారని, తెలంగాణ ఏర్పడిన తరువాత ఐదు లక్షల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. సహజ మరణం పొందిన కార్మికునికి ముప్పైవేల రూపాయలు పెంచడం జరిగిందని తెలిపారు. పెళ్లి కానుక నుంచి వైద్య సేవల వరకు అందిస్తున్న సేవల గురించి నాయిని వివరించారు. కార్మికులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తున్నామని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నాక్ సంస్థ వారికి ప్రతి సంవత్సరం శిక్షణకు పదికోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లలో పైలెట్ ప్రాజెక్టుగా 'లేబర్ అడ్డా'లు నిర్మించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. టీ వాలెట్, మీ సేవాల ద్వారా కార్మికుల పేర్లను నమోదు చేసుకోవడం, రెన్యూవల్ చేసుకొనే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి అనుమతులతో 'మే' డే నాటికి కార్మికులకు మరిన్ని కొత్త పథకాలు ప్రవేశపెట్టడానికి బోర్డు నిర్ణయం తీసుకోవడం జరిగిందని, త్వరలో కొత్త పథకాలు అమలులోకి వస్తాయని తెలిపారు. మరో అతిథి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ కార్మిక సంక్షేమ బోర్డులో కార్మికుల పేర్లు నమోదు చేయించడంలో టీఆర్‌ఎస్ శ్రేణులు కృషి చేయాలని అన్నారు. భవ నిర్మాణంతోపాటు ఇతర రంగాల్లో ఎక్కువ శాతం ఒడిషా, బిహార్ రాష్ట్రాల నుంచి కార్మికులు వస్తున్నారని, ప్రభుత్వం అందిస్తున్న నైపుణ్య శిక్షణ పొందితే ఇతర రాష్ట్రాల వారి సేవలు మనకు అవసరముండదని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఐడీసీ ఛైర్మన్ ఈద శంకర్ రెడ్డి, కరీంనగర్ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 10వేల కోట్లు కేటాయించాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: 2018-19 ఆర్థిక సంవత్సరంలో వెనుకబడిన తరగతుల వారి అభివృద్ధికి రూ. 10వేల కోట్లను కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషికి విన్నవించారు. రూ. 20వేల కోట్లతో బీసీలకు ప్రత్యేకంగా సబ్‌ప్లాన్‌ను అమలు చేయాలని కోరారు. సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య, జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ నాయకులు ఎస్ రామలింగం తదితరులు గురువారం సచివాలయంలో సీఎస్‌ను కలిశారు. సంక్షేమ పథకాల్లో బీసీ లబ్దిదారులను 52 శాతం ఎంపిక చేయాలని వారు కోరారు. బీసీ కార్పొరేషన్‌కు ఏటా రూ. 2వేల కోట్లు కేటాయించాలని, ఎంబీసీ కార్పొరేషన్‌కు ప్రత్యేకంగా మరో రూ. 2వేల కోట్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కుల వృత్తులను కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించే చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ కులవృత్తుల కోసం ఏర్పాటు చేసిన 14 ఫెడరేషన్లు ఉన్నాయని, ఆయా ఫెడరేషన్లకు కుల జనాభా ఆధారంగా నిధులను కేటాయించాలన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ఇచ్చే ఆర్థిక ప్రోత్సాహాన్ని రూ. 10వేల నుంచి రూ. 2 లక్షలకు పెంచాలని కోరారు. బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను రూ. 25 కోట్ల నుంచి రూ. 250 కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. 200 కొత్త బీసీ కాలేజీ హాస్టళ్లను మంజూరు చేయాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే బీసీ విద్యార్థులందరికీ ర్యాంకులతో సంబంధం లేకుండా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పోటాపోటీ నిరసనలు

●పార్లమెంట్‌లో టీడీపీ, వైకాపా ఆందోళనలు ●వెల్‌లో నిలబడి నినాదాలు ●నేలపై పడుకుని నిరసన తెలిపిన టీడీపీ ఎంపీలు ●జైట్లీ ప్రకటనపై తీవ్ర అసంతృప్తి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఆంధ్రప్రదేశ్ ప్రజల నిరసనల సెగ తగిలింది. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు పార్లమెంటు ఉభయ సభల్లో రోజంతా ఆందోళన కొనసాగించారు. ఉదయం పార్లమెంటు ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహం ఎదుట మొదలుపెట్టిన ఆందోళన, ఆ తర్వాత సభ లోపల కొనసాగింది. టీడీపీ ఎంపీలు ఉదయం గం. 10.30 ని.లకు గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని నోటికి నల్లని మాస్కులు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. అంతకు ముందు రోజు (బుధవారం) ప్రధాని ప్రసంగంలో విభజన హామీలను ప్రస్తావించకపోగా, ఏపీ విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వక పోవడంతో, నిరసన కొనసాగిస్తున్నామని ఎంపీలు వెల్లడించారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బంద్‌కు ప్రభుత్వమే పరోక్షంగా మద్దతు పలకాల్సిన పరిస్థితి వచ్చిందంటేనే కేంద్ర సర్కారు అర్థం చేసుకోవాలని టీడీపీ ఎంపీ జేసీ దివాకర్ అన్నారు. ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని, ఆంధ్రులను కేంద్రం మోసం చేసి అవమానిస్తున్నదన్న భావన ఉందని ఆయన చెప్పారు. ప్రజల గొంతు పార్లమెంటులో వినిపించేందుకే తమ ఆందోళన కొనసాగిస్తున్నామన్నారు. ఇక్కడికి వివిధ వేష ధారణలో వచ్చిన చిత్తూరు ఎంపీ శివప్రసాద్, పాట పాడుతూ కళారూపాన్ని ప్రదర్శించారు. ఆ కళారూపకం ద్వారా నిరసనను మరింత కళాత్మకంగా వివరించే ప్రయత్నం చేశారు. చేతిలో ఢమరుకం పట్టుకుని, ఆ ఢమరుకంతో శబ్దం చేస్తూ ప్రదర్శించిన కళారూపకం పార్లమెంటుకు వచ్చేవారి దృష్టిని ఆకట్టుకుంది.

మరోవైపు తెలుగుదేశం పార్టీ ఎంపీలకు పోటీగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు పార్లమెంటు భవనం 1వ నెంబర్ గేట్ వద్ద నిలబడి ధర్నా చేశారు. చేతిలో ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. సభ ప్రారంభమయ్యే సమయానికి లోపలికి వెళ్లారు.

లోక్‌సభ ప్రారంభమైన వెంటనే ఇటు తెలుగుదేశం, అటు వైకాపా ఎంపీలు ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి దూసుకెళ్లారు. స్పీకర్ పోడియంకు ఇరువైపులా తెలుగుదేశం ఎంపీలు నిలబడి నినాదాలు చేయగా, వైకాపా ఎంపీలు మాత్రం స్పీకర్ పోడియంకు ఎదురుగా నిలబడ్డారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని అడ్డుకుంటూ పదేపదే గట్టిగా నినాదాలు చేశారు. అయినా సరే స్పీకర్ సభను కొనసాగించడంతో, గం. 11.30 ని.ల సమయంలో లోక్‌సభ సెక్రటరీ జనరల్ టేబుల్ మీద ఉన్న ఫైల్‌ను చిత్తూరు ఎంపీ శివప్రసాద్ తన చేతుల్లోకి తీసుకుని అక్కడ్నుంచి వెళ్లబోయారు. దీంతో ఒక్కసారిగా సభలో గందరగోళం నెల కొంది. ఎంపీ ప్రయత్నాన్ని అక్కడున్న సిబ్బంది అడ్డుకున్నారు. గందరగోళం మధ్య స్పీకర్ సభను 15 నిమిషాలపాటు వాయిదా వేశారు.

వాయిదా పడగానే సభ్యులంతా బయటకి వెళ్తుంటే, తన సీట్లో కూర్చున్న యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ తెదేపా ఎంపీలను తన దగ్గరకు పిలిచారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందని ఆరా తీశారు. అదే సమయంలో నిరసన హుందాగా కొనసాగించాలని సూచించారు. టీడీపీ లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం, ఎంపీలు కేశినేని నాని, పి. రవీంద్ర బాబు, కే. రామ్మోహన్‌నాయుడు సోనియాతో ముచ్చటించారు. రాష్ట్రంలో జరుగుతున్న బంద్‌తో పాటు ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తి గురించి ఆమెకు వివరించారు. సభ మళ్లీ ప్రారంభమయ్యాక తమ ఆందోళన మళ్లీ మొదలు పెట్టారు. ఈసారి చిత్తూరు ఎంపీ శివప్రసాద్ ఢమరుకం మోగిస్తూ పాట అందుకున్నారు. సభ వెలుపల చేసిన ప్రదర్శనను లోపల కూడా ప్రదర్శించారు. అనంతరం హిందూపూర్ ఎంపీ నిమ్మల కిష్టప్ప "రైల్వే జోన్ క్యా హువా" అంటూ నినాదం అందుకోగా, మిగతా సభ్యులంతా "గోవిందా, గోవిందా" అని బదులిస్తూ నినదిస్తారు. ఇదే మాదిరి ఒక్కో అంశంపై కిష్టప్ప ప్రశ్నించడం, మిగతా సభ్యులు గోవిందా గోవిందా అంటూ నినదించడం ప్రశ్నోత్తరాల సమయం ముగిసే వరకు కొనసాగింది.

తర్వాత జీరో అవర్‌లో వివిధాంశాలపై మాట్లాడేందుకు సభ్యులకు అవకాశం కల్పించగా, అప్పుడు కూడా తెదేపా, వైకాపా ఎంపీలు నిరసన కొనసాగిస్తూ పదే పదే అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్ కుమార్ జోక్యం చేసుకుని, సాయంత్రం గం. 5 సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ మీద బదులిస్తారని, ఆ సమయంలో ఆంధ్ర ప్రదేశ్ గురించి కూడా చెబుతారని అన్నారు. అప్పటి వరకు తెదేపా, వైకాపా ఎంపీలు ఆందోళన విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అయితే ఆయన విజ్ఞప్తిని బేఖాతరు చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఎంపీలు నిరసన కొనసాగించారు. హిందూపూర్ ఎంపీ నిమ్మల కిష్టప్ప ఢమరుకం మోగిస్తూ నినాదాలు చేశారు. అనంతరం తెలుగుదేశం ఎంపీలు అక్కడే నేలపై పడుకుని తమ నిరసన తెలిపారు. దీంతో సభను భోజన విరామం కోసం స్పీకర్ వాయిదా వేశారు.

మధ్యాహ్నం సభ ప్రారంభమయ్యాక తొలుత రెండు పార్టీల నుంచి ఇద్దరేసి ఎంపీలే ప్లకార్డులు పట్టుకుని నిలబడ్డారు. కాసేపటికి మిగతా సభ్యులంతా ఒక్కొక్కరుగా వచ్చి చేరారు. బడ్జెట్ మీద చర్చ మొదలవడంతో సభ్యులు ఒక్కొక్కరుగా మాట్లాడుతుంటే, తెదేపా, వైకాపా ఎంపీలు నినాదాలు చేస్తూ సభను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే సాయంత్రం టీఆర్ఎస్ ఎంపీ కవిత మాట్లాడే అవకాశం రాగానే ఎంపీలంతా ఒక్కసారిగా నినాదాలు ఆపేశారు. వెల్‌లో సైలెంట్‌గా ప్లకార్డులు పట్టుకుని ఆమె ఏం చెబుతుందా అని ఆసక్తిగా విన్నారు.

జైట్లీ ప్రసంగం సమయంలోనూ గందరగోళం

సాయంత్రం గం. 5.30 తర్వాత కేంద్ర ఆర్థిక మంత్రి బడ్జెట్ చర్చకు సమాధానాలిస్తూ ప్రసంగం ప్రారంభించారు. వెంటనే తెలుగుదేశం, వైకాపా ఎంపీలు ఆయన్ను చుట్టుముట్టారు. ముందు ఆంధ్రప్రదేశ్ గురించి మాట్లాడాలని ఎంపీ శివప్రసాద్ పట్టుబట్టారు. మిగతా అంశాలపై ఎన్ని గంటలు మాట్లాడినా మాకు అభ్యంతరం లేదని, ముందు ఏపీ గురించి చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో తాను కచ్చితంగా ఏపీ గురించి మాట్లాడతానని, తనకు కాస్త సమయమివ్వాలని జైట్లీ వారిని వారించే ప్రయత్నం చేశారు.

పంచాయతీరాజ్‌లో పదోన్నతులు

అమరావతి, ఆంధ్రప్రభ: గత మూడు సంవత్సరాలుగా పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పెండింగులో ఉన్న విస్తరణాధికారుల పదోన్నతులు ఎట్టకేలకు ఏపీ మంత్రి నారా లోకేష్ చొరవతో కల్పించినట్లు పంచాయతీరాజ్ కమిషనర్ బి. రామాంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియారిటీని ఫైనల్ చేసిన అనంతరం వివిధ అసోసియేషన్లతో మాట్లాడి అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకొని గురువారం లిస్టును ఫైనల్ చేసినట్లు తెలిపారు. డిపిసి సభ్యులు కె. కిషోర్, జాయింట్ సెక్రటరీ కాశీకుమార్ ఆధ్వర్యంలో 116 మంది అర్హులకు విస్తరణాధికారులుగా పదోన్నతులు కల్పించినట్లు చెప్పారు. జోన్-1లో 16ఖాళీలు, జోన్2లో-30, జోన్3-29, జోన్4-41 ఖాళీలను పూరించడం జరిగిందని, దీనివలన క్షేత్రస్థాయిలో విధులు, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారులు, జిల్లా ప్రజా పరిషత్, మండల ప్రజా పరిషత్ సీనియర్ అసిస్టెంట్లు, డీపీఓ సీనియర్ అసిస్టెంట్లు లబ్ధి పొందారన్నారు.

మార్చి 5 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు మార్చి 5 నుంచి ప్రారంభంకానున్నాయి. 8న శాసనసభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ సమావేశాలు మొత్తం 16 పనిదినాల పాటు కొనసాగనున్నాయి. మార్చి 28వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లును సైతం ప్రవేశపెట్టనుండగా, అదే రోజు అసెంబ్లీ సమావేశాలు ముగుస్తాయి. కాగా 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కసరత్తు ఇప్పటికే ముమ్మరంగా కొనసాగుతోంది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బడ్జెట్‌కు సంబంధించి అధికార యంత్రాంగానికి ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. కాగా వచ్చే బడ్జెట్ లక్షన్నర కోట్లకు పైగా ఉండే విధంగా అంచనాలు సిద్ధమవుతున్నాయి. 2017-18 అంచనాలను మించి వచ్చే బడ్జెట్‌ను తయారుచేసే పనిలో ఆర్థిక శాఖ నిమగ్నమైంది. ప్రాధాన్యతారంగాలకు పెద్దపీట వేయాలని ప్రభుత్వ నిర్ణయించింది. ఫలితంగా ఈసారి కేటాయింపుల్లో సేవా, సర్వీసు రంగానికి పెద్దపీట వేయనున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ రెండంకెల అభివృద్ధిని కట్టబెడి వుండాలనే ప్రభుత్వ నిర్ణయాలకనుగుణంగా కేటాయింపులు ప్రభావితం చేయనున్నాయి. ఈ విషయమై ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి సైతం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. 15 శాతం అభివృద్ధి రేటు లక్ష్యంగా సిద్ధమవుతున్న బడ్జెట్ ప్రతిపాదనల నేపథ్యంలో గత సంవత్సరం శాఖవారీగా జరిగిన కేటాయింపులు, చేసిన వ్యయంపై ఆర్థిక శాఖ మదింపు చేస్తోంది. కొన్ని శాఖలకు కేటాయించిన నిధులు ఖర్చు పెట్టక పోవడం, మరోవైపు బడ్జెట్‌లో కేటాయింపులున్నప్పటికీ నిధులు విడుదల చేయని శాఖలకు సంబంధించిన మదింపు జరుగుతోంది. ప్రజా సంక్షేమ పరిష్కారాలకు గత బడ్జెట్‌లో కేటాయింపులు చేయాల్సిందిగా ఆర్థిక శాఖకు ప్రభుత్వం ఆదేశించింది. ఫలితంగా వచ్చే బడ్జెట్‌లో మళ్లీ సంక్షేమ రంగానికి అత్యధిక కాగా ప్రాధాన్యం ఇచ్చే అవకాశాలున్నాయి. సేవా, పారిశ్రామిక రంగాలకు సంబంధించి ప్రత్యేక కేటాయింపులపై ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల ఫలితంగా గతంలో కన్నా రెట్టింపు నిధులు కేటాయించే అవకాశాలు వున్నాయి.

రేపు హైకోర్టు భవనాలను పరిశీలించనున్న కమిటీ


అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఏర్పాటు చేయనున్న హైకోర్టు తాత్కాలిక భవనాలను పరిశీలించేందుకు ఏర్పాటు చేసిన కమిటీ ఈనెల 10,11 తేదీల్లో రానున్నట్లు అధికార వర్గాల సమాచారం. రాష్ట్ర విభజన తర్వాత అమరావతి కేంద్రంగా హైకోర్టు ఏర్పాటుకు ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ అనుమతి మేరకు ముందుగా తాత్కాలిక భవనాల్లో హైకోర్టు ఏర్పాటుకు ప్రభుత్వ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం భవనాలతో పాటు కంచికచర్ల సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీ భవనాలు, గన్నవరం సమీపంలోని మేధా టవర్స్ భవనాలను ప్రభుత్వం గుర్తించింది. వీటిని పరిశీలించి ఖరారు చేయాల్సిందిగా ఇటీవల ప్రభు త్వం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసింది. ప్రభుత్వ అభ్యర్థన మేరకు హైకోర్టు భవనాల పరిశీలనకు కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రెండు రోజు ల పాటు ఎంపిక చేసిన భవనాలను పరిశీలించి హైకోర్టుకు తగిన నివేదిక ఇవ్వ నుంది. ఆ నివేదిక ఆధారంగా ఏదో ఒక భవనాన్ని హైకోర్టు ఖరారు చేయనున్నట్లు అధికారులు చెపుతున్నారు.

జీఎస్టీ కమిషనర్‌కు అభినందనల వెల్లువ

అమరావతి, ఆంధ్ర ప్రభ: కేరళ రాజధాని కొచ్చిలో ఈ నెల 5,6 తేదీల్లో జరిగిన సౌత్‌జోన్ సెంట్రల్ రెవిన్యూ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్‌లో సోలో డాన్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో రజత పతకం సాధించిన జీఎస్టీ (సెంట్రల్) కమిషనర్ ఎమ్. శ్రీహరి రావును ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు అభినందించారు. గుంటూరులోని జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో పలువురు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందలు తెలిపారు. ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు పూణేలో జరిగే అఖిల భారత స్థాయి పోటీల్లో ప్రథమ స్థాయి విజేతగా నిలవాలని ఆకాంక్షించారు.

కొల్లేరు సమస్యపై వెంకయ్యకు వినతులు

●ఉపరాష్ట్రపతితో మంత్రి కామినేని, బీజేపీ ఎంపీల సమావేశం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కొల్లేరు సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుణ్ని కోరి నట్టు ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ తెలి పారు. కొల్లేరు సమస్యపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఒక నివేదిక సమర్పించిందని, ఈ అంశంపై సంబంధిత శాఖా మంత్రి, ఉన్నతాధికారులను కలిసేందుకు ఆయన ఢిల్లీ వచ్చారు. ఎంపీలు కంభంపాటి హరిబాబు, గోకరాజు గంగరాజులతో కలిసి వెంకయ్య నాయు డు, కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి హర్ష వర్ధన్‌లతో పాటు ఫారెస్ట్ డీజీ సిద్ధాంత దాస్, పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్ర టరీ సి.కె మిశ్రా, ఇతర ఉన్నతాధికారులతో కామినేని భేటీ అయ్యారు. అనంతరం పార్ల మెంట్ ఆవరణలో పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన నివే దిక, కేంద్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సమ ర్పించిన నివేదికలు దగ్గరగా వున్నాయని, వీలైనంత త్వరగా కొల్లేరు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినట్టు వివరించారు. పర్యావరణానికి ఆటంకం కలుగకుండా కొల్లేరు సమస్యను పరిష్కరించాలని ఉపరాష్ట్రపతి సూచించినట్లు మంత్రి చెప్పారు. పర్యావరణ శాఖ మంత్రి హర్షవర్ధన్ మాట్లాడుతూ నేషనల్ బోర్డు వైల్డ్ లైఫ్ సమావేశం మార్చి మొదటి వారంలో జరగనుందని, అందులో కేంద్రం వేసిన ఎక్స్‌పర్ట్ కమిటీ ఇచ్చిన రిపోర్ట్‌ను పరిశీలించి తగిన చర్యలు చేపడతామని అన్నారు.

సమాఖ్య స్ఫూర్తిని కాపాడండి

●రాజ్యసభలో మంత్రి సుజనా చౌదరి ●మంత్రిగా విభేదిస్తే రాజీనామా చేయాలన్న విజయసాయిరెడ్డి ●రాజ్యసభలో కొనసాగిన టీడీపీ, వైసీపీ, కేవీపీ నిరసనలు ●అమిత్‌షాతో సుజనా మంతనాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఏపీ విభజన చట్టం హామీలు అమలు చేయాలని రాజ్యసభలో గురువారం ఆంధ్రప్రదేశ్ ఎంపీలు నిరసన తెలిపారు. టీడీపీ ఎంపీలు సీఎం రమేష్, టీజీ వెంకటేష్, సీతారామలక్ష్మి, గరికపాటి మోహన్‌రావు వైఎస్ఆర్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు రాజ్యసభలో ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేశారు. ఏపీ పునర్విభజన చట్టంలోని అంశాలు మూడున్నరేళ్లయినా అమలు కాలేదని మంత్రి సుజనా చౌదరి రాజ్యసభలో అన్నారు. సమాఖ్య సహకార వ్యవస్థ గురించి మాట్లాడుతున్న నేపథ్యంలో పార్టీ సంఖ్యా బలం కాకుండా, పార్టీ సభ్యులను గౌరవించాలన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, రెవెన్యూలోటు, రాజధానికి నిధులు తదితర అంశాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆర్థికమంత్రి తన బడ్జెట్ ప్రసంగానికి సమాధానమిచ్చే సమయంలోనైనా ఈ అంశాలను 15రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇవ్వాలని కోరారు. అయితే మంత్రిగా ఉండి ప్రభుత్వ విషయాలతో విబేధించడమేమిటని వైఎస్ఆర్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. ఆర్టికల్ 75, 75 ప్రకారం రాష్ట్రపతి ప్రసంగం పూర్తిగా కేంద్రమంత్రివర్గం సమష్టి ఆమోదంతో జరిగిందన్నారు. తెలుగుదేశం పార్టీ మంత్రివర్గంలో కొనసాగుతూ విభేదించాలనుకుంటే ముందుగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అయితే మంత్రిగా సమస్య పరిష్కారానికి సలహా ఇవ్వవొచ్చని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు అన్నారు. పార్లమెంటులో తయారు చేసిన చట్టాలనే గౌరవించకపోతే ఎలా అని కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు రాజ్యసభలో ప్రశ్నించారు. హక్కులను కాపాడకపోతే పార్లమెంటులో కూర్చొని ప్రయోజనమేమిటని అడిగారు. సభలో తీవ్రగందరగోళం చెలరేగడంతో సభ పలుమార్లు వాయిదా పడింది. బడ్జెట్‌పై చర్చ సమయంలోనూ ఏపీ ఎంపీలు తమ నిరసన కొనసాగించారు. మరోవైపు బీజేపీ ఎంపీలు చిదంబరం ప్రసంగానికి అడ్డుతగులుతూ నినాదాలు చేశారు.

అమిత్‌షాతో సుజనా మంతనాలు


రాజ్యసభలో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాతో కేంద్రమంత్రి సుజనా చౌదరి మంతనాలు జరిపారు. ఏపీ పునర్విభజన చట్టంలో అమలు చేయాల్సిన అంశాలక ు సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన పలు డాక్యుమెంట్లను ఆయనకు సభలో చూపించారు.

సాగర్ నీటి విడుదలకు ఓకే

అమరావతి, ఆంధ్రప్రభ: సాగర్ ఎడమ కాలువ ద్వారా ఆంధ్రప్రదేశ్ 3 జోన్ కు ఫిబ్రవరి కోటా కింద నీటిని విడుదల చేసేందుకు కృష్ణా నది యాజమాన్య బోర్డు సభ్య కార్యదర్శి ఎ.పరమేశం అంగీకరించారని రాష్ట్ర జలవరుల శాఖ ఎపెక్స్ కమిటీ సభ్యులు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు ,ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వై.పుల్లయ్యచౌదరి ,డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదేళ్ల చెన్న కేశవరావు తెలిపారు. గురువారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్ఎస్‌పీ 3వ జోన్‌కు వెంటనే సాగర్ జలాలు విడుదల చేసి,ఆరుతడి పంటలను రక్షించాలని తాము చేసిన విజ్ఞప్తికి కృష్ణానది యాజమాన్య బోర్డు సానుకూలంగా స్పందిం చిందని చెప్పారు.

జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సూచనల మేరకు తాము గురువారం హైదరాబాద్‌లోని జలసౌదాలో ఉన్న కెఆర్ఎంబి కార్యాలయంలో సభ్య కార్యదర్శి ఎ.పరమే శంను స్వయంగా కలిసి,ఏపీ 3వ జోన్‌కు నీటి విడుదల విష యమై వినతిపత్రం అందజేశామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లోని సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు కింద కృష్ణా జిల్లాలోని తిరువూరు, నూజివీడు, మైలవరం, గన్నవరం, నంది గామ, జగ్గయ్యపేట నియోజ కవర్గాల్లో 3.60 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని, ఈ ఆయకట్టులో మిర్చి,పొగాకు, మొక్కజొన్న,పత్తి, మామిడి, మినుము, పసుపు తదితర ఆరుతడిపంటలు సాగు చేస్తున్నారని ఆయన చెప్పారు.

సభ లోపలా, వెలుపలా కేవీపీ నిరసన



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తొలి రోజు నుంచి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు డా. కేవీపీ రామచంద్రరావు, గురువారం కూడా ప్లకార్డు పట్టుకుని నిరసన తెలిపారు. రాజ్యసభ వెల్‌లో నిలబడి నిరసన తెలియజేస్తున్న సమయంలో మాట్లాడేందుకు అవకాశమిస్తానని రాజ్యసభ ఛైర్మన్ ఎం. వెంకయ్య నాయుడు తెలిపారు. దీంతో కేవీపీ తన సీట్లోకి వెళ్లారు. ఆ తర్వాత మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంతో నిరసన చెబుతూ పార్లమెంటు ఆవరణలో మరోసారి ధర్నా చేపట్టారు. మహాత్మా గాంధీ విగ్రహం ముందు నిలబడి నిరసన తెలియజేశారు. అనంతరం విజయ్ చౌక్ వద్ద మీడియాతో మాట్లాడుతూ, తాను రాజ్యాంగ హక్కుల కోసం పోరాడుతున్నానని అన్నారు. రాజ్యసభ నిబంధన 168 ప్రకారం చర్చ చేపడతానని చెప్పడంతోనే తాను వెనక్కి తగ్గానని అన్నారు. కానీ రాజ్యసభ ఛైర్మన్ చర్చకు అంగీకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చర్చ జరిపి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. రాజ్యసభను పెద్దల సభ అంటారని, రాజ్యాంగ నిర్మాతలు ఈ సభకిచ్చిన హోదా అని గుర్తుచేశారు. ఈ సభలోనే ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం సరికాదని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల బాధలను సభ ముందుకు తీసుకొచ్చే ప్రయత్నం చేశానని, కానీ విఫలమయ్యానని అన్నారు. శుక్రవారం కూడా తన ఆందోళన కొనసాగుతుందని వెల్లడించారు.

ఏపీలో ఫోనిక్స్ రైస్‌మిల్ ప్రాజెక్టు

●ప్రపంచంలోనే అతి పెద్ద రైస్‌మిల్ ఏర్పాటుకు దుబాయ్ సంస్థ సన్నద్ధం
●సామర్ల కోటలో ప్రాజెక్టు నిర్మాణం
●400 మందికి ఉద్యోగావకాశాలు
●దుబాయ్‌లో ఫోనిక్స్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, సీఈవో గౌరవ్‌థావన్‌తో సీఎం చంద్రబాబు భేటీ



అమరావతి, ఆంధప్రభ బ్యూరో: ప్రపంచంలోనే అతిపెద్ద రైస్ మిల్లును ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పేందుకు దుబాయ్‌కు చెందిన ఫోనిక్స్ సంస్థ సన్నద్ధమైంది. తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట మెగా ఇంటిగ్రేటెడ్ రైస్ మిల్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తామని, ఇందుకు సంబంధిం చిన పనులు ఈ ఏడాది ఏప్రిల్‌లో మొదలుపెడతామని ఫోనిక్స్ గ్రూపు ఎగ్జిక్యూటివ్ చైర్మన్, సీఈవో గౌరవ్ థావన్ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో అన్నారు. ఈ నెలాఖరులో విశాఖలో నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు వాణిజ్య - పారిశ్రామిక ప్రముఖులను ఆహ్వానించడానికి, ఆంధ్రప్రదేశ్‌కు మరింత పెట్టుబడులను ఆకర్షించేందుకు గురువారం ఒకరోజు పాటు దుబాయ్‌లో పర్యటించిన ముఖ్యమంత్రితో గౌరవ్ థావన్ సమావేశమయ్యారు. మెగా ఇంటిగ్రేటెడ్ రైస్‌మిల్ ప్రాజెక్టుపై ఇరువురు చర్చించారు. ఉక్రెయిన్‌లో అమెరికాకు చెందిన కొన్ని సంస్థల సహకారంతో తాము నెల కొల్పుతున్న ప్రాజెక్టు త్వరలో ప్రారం భం కానున్నదని, దీని తర్వాత భారత్ మార్కెట్‌పై దృష్టిసారిస్తామని థావన్ తెలిపారు. ఏపీలో వ్యవసాయ రంగంలో అనుసరిస్తున్న వినూత్న విధానాల గురించి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారికి వివరించారు. అనంత పురం జిల్లాలో పెద్ద ఎత్తున వేరుశనగ సాగు చేపట్టేందుకు గల అవకాశాలను పరిశీలించాలని , వేరుశనగ నుంచి బటర్ తయారుచేసే యూనిట్ నెలకొల్పాలని ముఖ్యమంత్రి సూచించారు. సామర్లకోటలో నెల కొల్పే రైస్ మిల్ ప్రాజెక్టు ఏడాదికి 3 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే ప్రపంచంలోనే అతి పెద్ద రైస్ మిల్ ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలుస్తుంది. ఇందులో లక్ష మెట్రిక్ టన్నులను దేశీయ మార్కెట్‌లో, మిగిలిన 2 లక్షల మెట్రిక్ టన్నులను విదేశాలకు ఎగుమతి చేయాలని ఫోనిక్స్ సంస్థ భావిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో 200 నుంచి 400 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి దేశ విదేశాలకు సంస్థ పెద్ద ఎత్తున క్రయవిక్రయాలు జరుపుతోంది. సుమారు 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తుల మేరకు లావాదేవీలు జరుపుతోంది. పలు దేశాలలో భారీగా భూకమతాలు ఫోనిక్స్ గ్రూపు కలిగి ఉంది. ఈ భేటీలో ఫోనిక్స్ గ్రూప్ ఫైనాన్స్ కంట్రోలర్ నితిన్ నవంథెర్ కూడా ఉన్నారు. ముఖ్యమంత్రి బృందంలో ఆర్థిక శాఖా మంత్రి యనమల రామకృష్ణుడు,ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్ర, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్, మౌళిక వసతుల ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఏపీఈడీబీ సీఈవో జాస్తి కృష్ణకిషోర్ ఉన్నారు.

షరాఫ్ గ్రూపుకు చంద్రబాబు ఆహ్వానం

భారత ప్రభుత్వం ఆహార శుద్ధి రంగంలో సరైన విధానం ప్రకటిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని షరాఫ్ గ్రూపు ప్రతినిధులు దుబాయ్ పర్యటనలో ఉన్న చంద్రబాబునాయుడుకు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ నెలకొల్పే అంశంపై గతంలోనే ప్రతిపాదనలు ఇచ్చామని, ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాలను పరిశీలించామన్నారు. ప్రస్తుతం యూనిట్ నెలకొల్పేందుకు అవసరమైన భూసేకరణకు ఎదురుచూస్తున్నామని చెప్పారు. లాజిస్టిక్స్ వ్యవహారాలలో భారత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం తమకు అంత సానుకూలంగా, తమ అవసరాలకు తగ్గట్టుగా లేదని షరాఫ్ గ్రూపు ప్రతినిధులు అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, ఈ రంగంలో అత్యుత్తమ విధానం కోసం ప్రయత్నిస్తామని ముఖ్యమంత్రి బదులిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటుతో పాటు ఆహారశుద్ధి పరిశ్రమలకు సంబంధించిన లాజిస్టిక్స్‌పైనా దృష్టి సారించినట్లు షరాఫ్ గ్రూపు ప్రతినిధులు చెప్పారు. ఆహార శుద్ధి పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా రవాణా సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఆహార శుద్ధి పరిశ్రమలకు సంబంధించి భూముల కేటాయింపు తదితర విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇతోధికంగా సహకారం అందిస్తుందని, దీని కోసం వెంటనే తమ ప్రభుత్వాధికారులతో సంప్రదింపులు జరపవచ్చని ముఖ్యమంత్రి వారికి సూచించారు. ఎలాంటి అనుమతులైనా సత్వరం ఇవ్వడంలో తమ ప్రభుత్వం ముందుంటుందని హామీ ఇచ్చారు.

అనేక అంశాల్లో ఏపీ ప్రభుత్వం చురుగ్గా వ్యవహరిస్తోందని షరాఫ్ గ్రూపు వైస్ చైర్మన్ షరాపుద్దీన్ మొహమ్మద్ హుస్సేన్ షరాఫ్ ప్రశంసించారు. త్వరలో తమ సంస్థ అత్యున్నత స్థాయి బృందాన్ని ఏపీకి పంపిస్తామని ముఖ్యమంత్రికి తెలిపారు. దుబాయ్‌లో తమ ఆధ్వర్యంలో నిర్వహించే వ్యాపారవేత్తల సదస్సుకు హాజరుకావాలని హుస్సేన్ షరాఫ్ ఆహ్వానించారు. భారత్‌లో ఇప్పటికే 300 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టిన షరాఫ్ గ్రూపు, పుణె, లూథియానాలో వ్యాపారాన్ని కేంద్రీకరించింది.

అమరావతికి మెట్రో లేదు

రాజ్యసభలో తేల్చి చెప్పిన కేంద్రం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతికి మెట్రో లేదా లైట్ మెట్రో రైలు వ్యవస్థలను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అమరావతిలో మెట్రో రైల్ స్థానంలో లైట్ మెట్రో ప్రాజెక్టును చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన మాట వాస్తవమేనా, అలా అయితే లైట్ మెట్రో రైల్ వ్యవస్థ కోసం ఎలాంటి డీపీఆర్‌ను సమర్పించని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ తమ కన్సల్టెన్సీ ఛార్జీల కింద 60 కోట్ల రూపాయలు చెల్లించాలంటూ ఎందుకు ప్రభుత్వాన్ని అడుగుతోంది, అసలు మెట్రో ప్రాజెక్టులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తమ విధానాన్ని మార్చుకున్న నేపథ్యంలో అమరావతిలో లైట్ మెట్రో రైల్ వ్యవస్థ ఏర్పాటయ్యే అవకాశముందా అంటూ వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి గురువారం రాజ్యసభలో అడిగిన ప్రశ్నలకు కేంద్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖా మంత్రి హర్దీప్ సింగ్ పూరి అమరావతిలో ఏ మెట్రో రైల్ ప్రాజెక్టును చేపట్టే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదని జవాబిచ్చారు.

మాతృ వందనంలో వెనుకబడ్డ ఏపీ

ప్రధాన మంత్రి మాతృ వందనం పథకం (పీఎంఎంవీవై) అమలులో ఆంధ్రప్రదేశ్ జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల కంటే కూడా వెనుకబడిపోయింది. రాజ్యసభలో విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు మహిళా శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ అందించిన గణాంకాల ప్రకారం చూస్తే ప్రధానమంత్రి మాతృ వందన్ యోజన పథకం విజయవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ తొమ్మిదో స్థానంలో ఉంది. ఈ పథకం కింద ఫిబ్రవరి 5, 2018 నాటికి అత్యధికంగా మహారాష్ట్రలో 50,831 మంది గర్భిణులు, బాలింతలైన తల్లులు లబ్ధి పొందగా ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 2,352 మంది మాత్రమే లబ్ధి పొందారు.

గల్ఫ్‌లో జగిత్యాల యువకుడి మృతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇంటికి డబ్బులు పంపలేని స్థితిలో గల్ఫ్‌కు వెళ్లిన జగిత్యాలకు చెందిన ఓ యువకుడు బలవన్మరణం చెందాడు. వివరాల్లోకి వెళితే.. జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం పెంబస్థకు చెందిన నాగరాజు(24) తాను పనిచేసే సంస్థ వేతనం సరిగా ఇవ్వడం లేదని తీవ్రంగా కలత చెందాడు. ఇక తనకు చావే శరణ్యమని భావించి ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తాను చనిపోయే ముందు స్నేహితులకు వాయిస్ మెసేజ్ పంపి తన ఆవేదనను పంచుకున్నాడు. రెండేళ్లుగా ఖతార్‌లో వాహనాల సర్వీసింగ్ సెంటర్‌లో నాగరాజు పనిచేస్తున్నాడు. చాలీ చాలని జీతంతో ఇంటికి డబ్బులు పంపలేకపోతున్నానని వాయిస్‌లో తెలిపాడు. రావాల్సిన వేతనం కంటే చాలా తక్కువగా ఇస్తూ కంపెనీ వాళ్లు మోసం చేస్తున్నారని వాపోయాడు. దిక్కుతోచని స్థితిలో చావడమే శరణ్యమని నిర్ణయించుకున్నానని ఆవేదన చెందాడు. కన్నతల్లికి డబ్బులు పంపలేకపోతున్నా నని, చనిపోవాలనిపిస్తోందని తన సందేశంలో తెలిపాడు. పనిచేస్తున్న చోటే ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

'వాడుకుని వదిలేయడం బాబుకు అలవాటే'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చరిత్ర అంతా వాడుకుని వదిలేయటమే అని వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో అంబటి మాట్లాడుతూ సీపీఎం, సీపీఐ, టీఆర్ఎస్ , బీజేపీ, పవన్ కల్యాణ్‌లతో జతకట్టి గెలవటం, పబ్బం గడిచిన తరువాత వదిలేయటం చంద్రబాబు నాయుడు రాజకీయ నైజం అన్నారు.

కోదండరాం కొత్తపార్టీపై స్పష్టతివ్వాలి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : కోదండరాం పార్టీ ఎందుకు పెడుతున్నారో ప్రజలకు, తెలంగాణ రాష్ట్రం కోసం అహర్నిశలు శ్రమించిన ఉద్య మ కారులకు సమాధానం చెప్పాల్సిన అవసరముందని తెలంగాణ ఇంటిపార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్ పేర్కొన్నారు. గురువారం ఆదర్శ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కలిసి పోరాడితేనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కోదండరాం పార్టీ పెడతానని ప్రకటించారని అసలు ఆయన సీఎం కావడానికా లేదా తెలంగాణ ప్రజలకు ఏదైనా చేయాలన్న ఆలోచనతో పార్టీ పెడుతున్నారా అనే స్పష్టతను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. నేను గతంలో 14 సంవత్సరాలు టీఆర్ఎస్ పార్టీలో పని చేశానని, ఎన్నో కేసుల్లో జైలుకు వెళ్లానని నాతో పాటు చాలా మంది తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని వారందరం కలిసి తెలంగాణ ఇంటిపార్టీ జూన్2 ప్రారంభించామన్నారు. కేసీ ఆర్ కు వ్యతిరేకంగా ఒక పార్టీ ఉండగా కొత్తగా మరో పార్టీని ప్రారంభించాల్సిన అవసరం ఏముందో కోదండరాం స్పష్టత ఇవ్వాలన్నారు.

సామాజిక తెలంగాణే లక్ష్యంగా తెలంగాణ ఇంటిపార్టీ ఆవిర్భవించింది:యెన్నం

సామాజిక తెలంగాణే లక్ష్యంగా తెలంగాణ ఇంటి పార్టీ ఆవిర్భవించిందని పార్టీ ఉపాధ్యక్షుడు యెన్నం శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రస్తుతం ఉద్యమపార్టీ ఉండాలన్నారు. కోదండరాం ఉద్యమ కారులను కలుపుకు పోవడం లేదని ఆయన ఆరోపించారు. చెరుకు సుధాకర్ కన్నా గొప్ప ఉద్యమకారుడు ఎవరూ లేరన్నారు.

కాంగ్రెస్‌పార్టీకి క్షమాపణలు చెప్పాలి

మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: కాంగ్రెస్ పార్టీకి, తెలంగాణ ప్రజలకు మంత్రి కేటీఆర్ క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో పార్టీ నేతలు నిరంజన్, వినోద్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రజల సొమ్మును దోచుకోవడానికి ప్రాజెక్టుల రీ డిజైన్లు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనిపించడం లేదా..? అని మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. సీఎం కేసీఆరే బట్టేవాజ్.. కేటీఆర్ అంతకంటే పెద్ద బట్టేవాజ్‌గా మాట్లాడుతున్నారని ఆయన దుయ్యబట్టారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించాలి

అధికారులతో సీఎస్ ఎస్.కె. జోషి సమీక్ష


హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో చదవే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేం దుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.కె.జోషి ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా సంక్షేమం, విద్యాశాఖ, ఇంధనం, గృహ నిర్మాణం, రవాణా, మున్సి పల్, పంచాయతీ రాజ్, పర్యాటక, యువజన సంక్షే మం, వైద్య ఆరోగ్య శాఖ, కార్మికశాఖ ఉన్నతా ధికారు లతో ఆయన సమీక్ష నిర్వహించారు. రెసిడెన్షియల్ పాఠశాలలో అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి అడ్మిషన్ అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు హాస్టళ్లు, కళాశాలలు, పాఠశాలకు గ్రేడింగ్ ఇచ్చే విధా నాన్ని రూపొందించాలని సీఎస్ పేర్కొన్నారు. వివిధ సంక్షేమ శాఖల ద్వారా అమలవుతున్న స్వయం ఉపాధి పథ కాలు శిక్షణా కార్యక్రమాలు, విద్యా సౌకర్యాలు, విదేశీ విద్యా పథకం తదితర అంశాలపై చర్చించారు. గిరిజన సహకార సంస్థ ద్వారా ఆర్థిక కార్యకలాపాలను మరింత విస్తృత పరచాలని ఆయన సూచించారు. స్టడీ సర్కిళ్ల ద్వారా ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ యువత ఉద్యోగ అవకాశాలు పొందేలా శిక్షణా కార్యక్రమాలు ఉండాల న్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వ హించి పనితీరు మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు.

నిధుల వినియోగం మధ్యాహ్న భోజన పథకంపై...

విద్యాశాఖకు సంబంధించి సమీక్షిస్తూ ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ సాంకేతిక విద్యాకళాశాలలో అడ్మిషన్లు, ఉత్తీర్ణత, ఉపాధి శిక్షణ, పరిశోధన, ఎస్.ఎస్.ఎ, ఆర్ఎంఎస్ఎ, నిధుల వినియోగం మధ్యా హ్న భోజన పథకం తదితర అంశాలపై సమీక్షించారు. విద్యుత్ శాఖకు సంబంధించి రాష్ట్రంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందిస్తున్నందున డిమాండ్ 9460 మెగావాట్లకు చేరుకుందని, గత సంవత్సరంతో పోలిస్తే 20 శాతం డిమాండ్ అధికారులు సీఎస్‌కు వివరిం చారు.

మోడీ వ్యాఖ్యలు అవివేకం

- స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని అందించిన ఘనత కాంగ్రెస్‌దే
- తెలంగాణ బిల్లును పాస్ చేయించిన ఘనత మాదే
- వాస్తవాలు తెలీకుండా విమర్శలా?
- ప్రధాని వ్యాఖ్యలపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి



పార్లమెంట్ సాక్షిగా ప్రధాని అబద్ధాలు

ఖమ్మం, ప్రభన్యూస్ సిటీ బ్యూరో : దేశానికి స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని అందించిన గొప్ప ఘనత కాంగ్రెస్ పార్టీకి ఉందని, ఈ విషయాలను గుర్తుపెట్టుకుని మాట్లాడితే బాగుంటుందని దేశ ప్రధాని నరేంద్రమోడీకి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క హితవు పలికారు. ఈ మేరకు ఆయన ఖమ్మంలో మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యానికి రాజ్యాం గబద్ధ నిర్మితమైన దేవాలయం లాంటి పార్లమెం టును అబద్దాలతో ఎందుకు తప్పుదారి పట్టిస్తున్నారో అర్థం కావడం లేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తలుపులు మూసి తెలంగాణా రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని మోడీ చేసిన ప్రకటన చిన్న పిల్లల మాటలను తలపిస్తుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ తలుపులు మూసి తెలంగాణా ఇచ్చిన సమయంలో ప్రతిపక్ష హోదాలో ఉన్న తమరి పార్టీ ఎలా సమర్థించిందని ప్రశ్నించారు. తమవల్లే తెలంగాణా బిల్లు పాస్ అయ్యిందని వెంకయ్య నాయుడు, సుష్మ స్వరాజ్‌లు పలు సందర్భాల్లో చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. తలుపులు మూసి అప్రజాస్వామిక పద్ధతిలో విభజన జరిగిందని మోడీ చేసిన ప్రకటనకు, సుష్మ, వెంకయ్య నాయుడు ప్రకటనల కు పొంతనలేదన్నారు. తెలంగాణా రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీతో పాటు ఈ చిన్నమ్మను గుర్తుంచుకోవాలని సుష్మ చేసిన ప్రకటన మర్చిపో యినట్లున్నారని మోడీకి గుర్తుచేశారు. తమరు చెప్పిందే నిజమనుకుంటే తెలంగాణాకు బీజేపీ అనుకూలం అనే పదం అబద్ధం అని స్పష్టంగా తెలుస్తుందని, నిజంగా బీజేపీ తెలంగాణాకు అనుకూలం అయితే.. ప్రస్తుతం ప్ర ధాని గా దళిత ముఖ్యమంత్రి అంజయ్యను రాజీవ్‌గాంధీ అవమానించారంటూ పార్లమెంటు సాక్షిగా ప్రధాని అబద్దాలు చెప్పారని, అంజయ్య కులం, అక్కడ జరిగిన ఘటన ఏమిటో తెలియకుండా మాట్లాడడం ప్రధాని మోడీ అవివేకానికి నిదర్శనంగా తెలిపారు. ఘటనపై రాజీవ్‌గాంధీ, సీనియర్ పాత్రికేయులు పొత్తూరి వెంకటేశ్వరరావుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టమైన వివరణ ఇచ్చారని, ఈ విషయాన్ని పొత్తూరి వారు తన పుస్తకంలో కూడా రాసుకున్నారని గుర్తు చేశారు. అది కూడా తెలియకుండా మోడీ మాట్లాడటం ఆయన విచక్షణకే వదిలేస్తున్నామని అన్నారు. ఇటువంటి కీలక విషయాలు తెలియకుండా ప్రధానిగా కొనసాగడం, ఒక విషయంపై ప్రసంగించే సమయంలో అందుకు సంబంధించిన కనీస సమాచారం తెలుసుకోకపోవడాన్ని ఏమనాలని ప్రశ్నించా రు. తెలంగాణా రాష్ట్రాన్ని ఆశించిన ప్రజానీకం, ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని పార్లమెంటు సాక్షిగా అవమానించడాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారని, సున్నితమైన అంశంపై తెలంగాణా ప్రజలను అవమానించే విధంగా మాట్లాడటం సరైంది కాదని, దీనిపై తెలంగాణా ప్రజలకు స్పష్టంగా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తమరు చేసిన వాఖ్యలు పూర్తిగా అబద్ధమని అన్నారు. ఇందులో ఏది నిజమో ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత బీజేపీ మీద ఉందని పేర్కొన్నారు. కేవలం హావభా వాలతో, ప్రసంగాలతో రాజకీయం చేయడం, మాటలతో మోసం చేసే ప్రధాని దొరకడం ఈ దేశ ప్రజల దౌర్భాగ్యంగా ఆవేదన వ్యక్తం చేశారు. మాటల గారడీతో నిజాలు దాచిపెట్టే ఇటువంటి ప్రధాని మరొకరు ఎవరూ ఉండరనితెలిపారు. తెలంగాణాపై ప్రధాని మోడీ చేసిన వాఖ్యలపై విదేశాంగ శాఖ మంత్రి సుష్మస్వరాజ్, ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు తక్షణమే స్పందించా లని విజ్ఞప్తి చేశారు.


ప్రధాని నరేంద్రమోడీ వ్యాఖ్యలపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. చరిత్ర తెలియని కేటీఆర్ తన స్థాయిని మరచి పెద్ద నేతలపై విమర్శలు చేస్తున్నారని, విమర్శించినంత మాత్రాన కేటీఆర్ పెద్ద నాయకుడు కాలేడని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదని, దాదాపు పదేళ్లపాటు ప్రధాని అయ్యే అవకాశం ఉన్నా కనీసం మంత్రి పదవి తీసుకోని చరిత్ర

ప్రధాని వ్యాఖ్యలపై కేసీఆర్ స్పందించాలి

రాహుల్‌గాంధీదని అనందం ఆయన విజ్ఞతకే వదిలివేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం వస్తే దళితుడిని సీఎంను చేస్తానని మాటచెప్పి, తెలంగాణా ఏర్పడగానే సీఎం కేసీఆర్ మాట మార్చారని, కుటుంబం అంతా రాష్ట్రంలో పదవులు అనుభవిస్తున్న విషయం మర్చిపోయావా అంటూ సూటిగా ప్రశ్నించారు. రాహుల్‌గాంధీని పరుష పదజాలంతో మాట్లాడడం ద్వారా ఆలోచనలు, సంస్కృతి బయటపడుతోందని, ఇటువంటి పిల్లకాకులను కాంగ్రెస్ ఎన్నో చూసిందని మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

కేంద్రంపై పోరాడాలి

మాజీ మంత్రి సమరసింహారెడ్డి డిమాండ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రత్యేక హోదా కోసం ఆంధ్రప్రదేశ్ చేస్తున్న పోరాటం కంటే ముందుగా తెలంగాణ ప్రభుత్వం చేయాలని మాజీ మంత్రి సమరసింహారెడ్డి డిమాండ్ చేశారు. తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ఎంతో నష్టపోయిందని, ఈ విష యాన్ని 2014 ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ తెలంగాణ ఇస్తే సరేసరి, లేకపోతే మేం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ప్రత్యేక రాష్ట్రం ఇస్తామని ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. పార్లమెంట్‌లో ఏపి ఎంపీలు ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ కోసం పోరాడుతుంటే తెలంగాణ ఎంపీలు మనకు కూడా కావాలని ఎందుకు అడగడం లేదని నిలదీశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ కోల్పోయిన నీళ్ళు, నిధులు, నియామకాలు కేంద్రం భర్తీ చేసిందని టిఆర్ఎస్ ప్రభుత్వం భావిస్తుందా? అలా అయితే ఎన్ని నిధులు, నీళ్ళు వచ్చాయి, నియామకాలెన్ని జరిగాయన్న అంశాలపై శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ముస్లిం రిజర్వేషన్లు విస్మరించిన తెరాస

తెదేపా మైనారిటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెరాస అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళు గడిచినా ముస్లిం మైనారిటీలకు 12శాతం రిజ ర్వేషన్లు కల్పించలేదని తెలుగు దేశంపార్టీ తెలంగాణ మైనారిటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్ దుయ్యబట్టారు. తెరాస ప్రభు త్వ పెద్దలు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారేగానీ ఎన్నికల్లో ఇచ్చిన రిజర్వే షన్ హామీ గురించి పట్టించుకోవడం లేదని గురువారం జరిగిన విలేకరుల సమా వేశంలో విమర్శించారు. ఈ సమావేశంలో మైనారిటీ సెల్ ప్రధాన కార్యద ర్శి మహ్మద్ అబ్జల్ అలీ, మైనారిటీ నాయకులు ముజహర్ నవాబ్, తాహేర్ షరీఫ్ కూడా పాల్గొన్నారు.

రాజకీయ క్విడ్‌ప్రో కోకు తెరతీసిన జగన్

తెదేపా అధికార ప్రతినిధి దినకర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అధికార దుర్వినియోగంతో అవినీతి క్విడ్ ప్రో కో కేసును ఎదుర్కొంటున్న వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇప్పుడు రాజీ ధోరణిలో రాజకీయ క్విడ్ ప్రో కోకు తెర లేపుతున్నారని తెలుగుదేశంపార్టీ అధికార ప్రతినిధి లంకా దినకర్ ఆరోపించారు. అణువణువునా రాజకీయ అవసరాల కోసం రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టుపెట్టి పలాయన విధానాన్ని జగన్ అవలంబిస్తున్నారని గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన దుయ్యబట్టారు. ప్రతివారం సిబిఐ కోర్టుకు హాజరయ్యే వ్యక్తి శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉండడం ఆంధ్రప్రదేశ్ దౌర్భాగ్యమని ఆయన విచారం వ్యక్తంచేశారు. గురువారంనాడు బంద్‌లో పాల్గొంటానని చెప్పి ఫోటోలకు ఫోజులిచ్చి అడ్రస్ లేకుండా పారిపోయాడని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర సమస్యలపట్ల జగన్‌కు ఉన్న చిత్తశుద్ధికి ఇది అద్దం పడుతుందని దినకర్ అన్నారు.

రుణమాఫీ అమలు చేయాలి

- స్పీకర్‌కు తెలంగాణ తెదేపా వినతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేస్తామని శాసన సభలో ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ ఇంత వరకు దాన్ని పట్టించుకోలే దని తెలుగుదేశంపార్టీ తెలంగాణ ఆరోపిం చింది. రుణమాఫీ కింద వడ్డీ మాఫీ కాకపోవ డంతో పాస్‌పుస్త కాలను రైతులకు బ్యాంకు అధికారులు ఇవ్వడం లేదని ఆయన చెప్పారు. దీనిపై పూర్తి సమాచారం ఇస్తే వెంటనే సమస్య పరిష్కరి స్తామంటూ శాసనసభలో ఇచ్చిన హామీని అమలు చేసేలా ప్రభుత్వానికి ఆదేశించాలని శాసనసభ స్పీకర్‌ను ఆ పార్టీ కోరింది. తెదేపా శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య, ఆ పార్టీ అధ్యక్షుడు ఎల్.రమణ, పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు ఎన్. అమ ర్‌నాథ్‌బాబు గురువారం స్పీకర్‌ను కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం గా వెంకటవీ రయ్య మాట్లాడుతూ, ఒక్క ఖమ్మం జిల్లాలోనే 20వేల మంది రైతులకు రూ.105 కోట్లు రుణమాఫీ కాలేదని, రాష్ట్రవ్యాప్తంగా రూ.5 వేల కోట్ల మేరకు బకాయిలు ఉన్నాయని చెప్పారు. సభలో సీఎం ఇచ్చిన హామీని అమలు చేయాలని స్పీకర్‌కు గుర్తుచేసేందుకే ఆయనను కలిశామని అన్నారు. రైతులకు అప్పులు లేనపుడు బ్యాంకులు పాస్‌పుస్తకాలు ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. రుణ మాఫీ పూర్తిగాచేస్తే పాస్‌పుస్తకాలు ఇవ్వని బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకుం టారా అని వెంకటవీరయ్య ఆవేశంగా ప్రశ్నిం చారు. రైతులకు కనీస మద్దతు ధర అందించలేదని, ఇప్పుడు దళారుల చేతికి పోయిన పంటలకు నాలుగు రెట్లు ధరలు పెరిగాయని రావుల చంద్రశేఖర రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. రైతు సమన్వయ సమితుల పేరుతో మరో ఆదర్శ రైతులాంటి వ్యవస్థను తెరపైకి తెస్తున్నారని, ఇది కేవలం తెరాస ఎన్నికల ప్రచారానికి ఉపయోగపడేదేనని అన్నారు. 90శాతం మందికి పాస్‌పుస కాలు అందలేదని రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని, ప్రైవేట్ రుణాలపై వడ్డీ భరించలేని పరిస్థితిలో ఉందన్నారు. ఎస్ఎల్‌బీసీ అధికారులతో సీఎం సమావేశం జరిపితే సమస్యలు తెలుస్తుందని రావుల అన్నారు. రెండు నెలలుగా ఆసరా పెన్షన్లు నిలిపివేశారని, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు ఆపేశారని చెప్పారు. ఆర్థికశాఖలో బిఆర్‌వో పేరుతో మౌఖిక ఉత్తర్వుల ద్వారా నిధులు ఆపేశారని రావుల చెప్పారు.ఎన్నికల కోసం రూ.4వేల పెట్టుబడి పథకమంటూ కొత్త నాటకానికి ముఖ్యమంత్రి తెర తీశారని రమణ దుయ్యబట్టారు. ఇది కేవలం ఎన్నికల ఎత్తుగడ మాత్రమేనని, రైతు రుణమాఫీలో నష్టపో యిన రైతులకు ప్రభుత్వ నాటకాలు ఇప్పటికే తెలిశాయని ఆయన అన్నారు. రాష్ట్రంలో 1600 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడి రెండోస్థానంలో నిలిచినట్టు జాతీయ క్రైమ్‌బ్యూరో నివేదిక స్పష్టం చేస్తోందన్నారు. ఎన్నికల కోసం కొత్త డ్రామాలు ఆపివేసి 2014లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని రమణ డిమాండ్ చేశారు.

కేటీఆర్ చదువుకున్న నిరక్షరాస్యుడు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ చదువుకున్న నిరక్షరాస్యుడని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ అభివర్ణించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పూర్తిగా అవగాహన ఉన్నప్పటికీ దురుద్దేశపూర్వకంగానే ఆయన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రా నికి ఏమి ఇవ్వలేదని కేటీఆర్ అనడం హాస్యాస్పదంగానూ, అవగాహన రాహిత్యానికి నిదర్శమన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వినూత్నమైన రీతీలో బడ్జెట్‌ను ప్రవేశపెడిచే రాష్ట్రంలో తెరాస, కాంగ్రెస్ పార్టీలు జీర్ణించుకోలేకపోతున్నాయని విమర్శించారు. ప్రజారోగ్యానికి, వ్యవసాయ రంగానికి పెట్టపీట వేసిందన్నారు. 2020 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలన్న సంకల్పంతో మోదీ ప్రభుత్వం ఉందన్నారు.గురువారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సీనియర్ నాయకుడు బద్దంబాల్‌రెడ్డి, చింత సాంబ మూర్తి, సుధాకర్‌శర్మ, ఎన్వీఎస్. సుభాష్ తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ, తెరాస ప్రభుత్వంతో పాటు మంత్రి కేటీఆర్‌పై విరుచుకపడ్డారు. ఇప్పటి వరకు ఏ దేశంలో లేని విధంగా 50 కోట్ల మందికి ఆరోగ్యబీమా పథకాన్ని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఉజ్వల భవిష్యత్ కింద ఎనిమిది కోట్ల మంది మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇస్తున్నామన్నారు. వీటితో పాటు అనేక సంక్షేమ, అభివృద్ధి రంగాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేస్తే...దానిని తెరాస జీర్ణించుకోలేకపోతోందని లక్ష్మణ్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెరాస పుట్టకముందే భాజపాకు 19శాతం ఓటు బ్యాంకు ఉందన్న విషయాన్ని ఈ సందర్భంగా లక్ష్మణ్ గుర్తు చేారు. ప్రస్తుతం తమ ఓటు బ్యాంకు రాష్ట్రంలో 23శాతానికి పెరిగిందన్నారు. తెరాస ఒక ప్రాంతీయ పార్టీ అని...గత ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టినప్పటికీ బోటాబోటీ సీట్లతో అధికారాన్ని కైవసం చేసుకున్న కేసీఆర్...భయంతోనే పార్టీ ఫిరాయింపులను ప్రొత్సహించారని లక్ష్మణ్ విమర్శించారు.

తెరాస ఒక లోఫర్ పార్టీ

కేసీఆర్, కేటీఆర్‌పై రేవంత్ ఫైర్



హైదరాబాద్,ఆంధ్రప్రభ : టీఆర్ ఎస్, మంత్రి కల్వకుంట్ల తారక రామారావుపై కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ఫైర్ అయ్యా రు. సీఎం చంద్రశేఖర్‌రావును మోసగాడంటూ వ్యాఖ్యానిం చారు. మాటమీద నిలబడే వ్యక్తి కాదని ఆరోపించారు. తెరాసను లోఫర్ పార్టీగా అభివర్ణించారు. రాహుల్ గాంధీపై విమర్శలు చేసే స్థాయి కేటీఆర్‌కు లేదన్నారు. ఉత్తమ్‌కు మార్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించకుండా డొంకతిరుగుడు మాటలతో ప్రజలను మభ్యపెట్టొద్దని సూచించారు. గురువారం ఆయన అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ గతంలో కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు సహారా ఇండియా సంస్థ ఈఎస్ఐ భవనాల నిర్మాణాల్లో జరిగిన అవినీతి అక్రమాల కేసుల్లో జైలుకు వెళ్లాల్సి వస్తుందనే ప్రధాన మంత్రి నరేంద్రమోడి వద్ద మోకరిల్లుతున్నారని విమర్శించారు. విభజన హామీల అమలుపై టీఆర్ఎస్ ఎంపీలు ఎందుకు మాట్లాడటం లేదని రేవంత్ ప్రశ్నించారు. కమీషన్లకోసమే మిషన్ భగీరథ పైప్‌లైన్లు వేస్తున్నారని విమర్శించారు.

తెరాసలో చేరినవారూ లోఫర్లేనా?

టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజ్



హైదరాబాద్,ఆంధ్రప్రభ: కాంగ్రెస్ పార్టీలో ఓనమాలు దిద్దు కున్న సీఎం కేసీఆర్ కూ డా లోఫరేనా..? అనే విషయం మంత్రి కేటీఆర్ స్పష్టం చేయా లని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజ్ శ్రావ ణ్‌కుమార్ అన్నారు. కాంగ్రె స్ నుంచి టీఆర్ఎస్‌లో చేరిన డీఎస్, కేకే, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లోఫర్‌లేనా..? ఆయన నిలదీశారు. చిట్‌చాట్ పేరుతో మంత్రి కేటీఆర్ సినిమాల్లో చిట్టినాయుడు లెక్క మాట్లాడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. పాసుపోర్టు కేసులు ఎవరి మీద నమోదైనాయో తెలుసుకోవాలన్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో పార్టీ నేతలు జనక్ ప్రసాద్, నగేశ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలకు ఆత్మగౌరవం ఉంటే బయటికి రావాలని డిమాండ్ చేశారు.


సచివాలయం తరలింపు ఓ కుట్ర

- ప్రాధాన్యత అంశాలను పక్కన పెట్టి సచివాలయానికి ఎందుకంత తొందర?
- బైసన్‌పోల్ గ్రౌండ్‌ను కాపాడుకోవాలి
- అవసరమైతే ఢిల్లీకి వెళ్ళి అయినా ప్రభుత్వ యత్నాలను అడ్డుకుందాం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో ధ్వజమెత్తిన కోదండరాం
- ప్రగతిభవన్‌ను ముట్టడిద్దాం: వీహెచ్ హనుమంతరావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రజలకు సంబంధించి అనేక ప్రాధాన్యత అంశాలను పక్కనపెట్టి రాష్ట్ర ప్రభుత్వం కేవలం సచివాలయం తరలింపుపై దృష్టి సారించడంపై వివిధ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఏడాదికి ఒక రోజు కూడా సచివాలయానికి రాని ముఖ్యమంత్రి కేసీఆర్ ఎవరి మేలు, ప్రయోజనాల కోసం తరలిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నగరం నడిబొడ్డున ఉన్న సచివాలయాన్ని వదులుకుని బైసన్‌పోల్‌లో కోట్లాది రూపాయలు వెచ్చించి కొత్తగా నిర్మించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.గురువారం సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జాయింట్ యాక్షన్ (టీజేఏసీ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్తులను కాపుడుకుందాం...బైసన్‌పోల్ గ్రౌండ్‌ను రక్షించుకుందాం అన్న అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి. హనుమంతరావు, తెలుగుదేశం పార్టీ నాయకుడు వనం రమేష్, భాజపా నాయకుడు రామకృష్ణ సీపీఐ నాయుడు గెల్వయ్యతో పాటు వివిధ ప్రజా సంఘాల నేతలు ఇన్నయ్య, గోవర్ధన్, జానకీరాం, అనురాధ, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు. టీజేఏసీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సత్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కోదండరాం మాట్లాడుతూ, సచివాలయం తరలింపు ముగిసిన అధ్యాయం కాదన్నారు. కేంద్రం చిన్న మెలిక పెట్టిందన్నారు. బైసన్‌పోల్ గ్రౌండ్‌నుఇస్తున్నందుకుగానూ కేంద్రానికి ప్రత్యామ్నాయంగా రూ. 60 కోట్లు, 500 ఎకరాల స్థలాన్ని అడిగిందన్నారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత అంశాలకే నిధులు కేటాయించాలని ఆయన అన్నారు. ఇప్పటికే సిఎం కేసీఆర్ ప్రగతి భవన్ పేరిట సుమారు రూ.30 కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించారన్నారు. కానీ నిలువ నీడలేని పేదల కోసం ఇండ్లు నిర్మించి ఇవ్వడానికిగానీ, విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులను మంజూరు చేయడానికిగానూ, ఆరోగ్యశ్రీకీ అవసరమైన నిధులు కేటాయించలేని రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత లేని అంశాలకు పెద్దఎత్తున నిధులు వృధాగా ఖర్చుపెడుతోందని ఆయన మండిపడ్డారు. ఆర్థిక సమస్యలను తట్టుకోలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే వారి సమస్యలను పరిష్కరించేందుకు తెరాస ప్రభుత్వం ఇప్పటి వరకు దృష్టి సారించలేదని విమర్శించారు. అలాగే ప్రజలకు అవసరమైన ఆసుపత్రులపై కూడా నిధులను ఖర్చు చేయడానికి ప్రభుత్వానికి మనసురావడం లేదని మండిపడ్డారు. బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టడానికే సచివాలయం తరలింపు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం తెరపైకి తీసుకవచ్చిందన్నారు. బైసన్‌పోన్ గ్రౌండ్ నగరానికి లంగ్‌స్పేస్ లాంటిదన్నారు. సచివాలయం స్థలం ఎవరికి చెందాలన్నది ప్రధాన ప్రశ్న తలెత్తుతోందని, స్వచ్ఛమైన వాతావరణం ఉన్న బైసన్‌పోల్‌లో సచివాలయం కోసం వాడడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారని కోదండరాం అన్నారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ ఉన్న స్థలం ప్రజలదేనని అన్నారు. ఈ స్థలాన్ని పెద్ద కంపెనీలు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ చర్యలను అడ్డుకుని బైసన్‌పోల్ గ్రౌండ్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జర్నలిస్టులు,లాయర్లు ఇళ్ళు అడిగితే ప్రభుత్వం స్థలాలుఇవ్వదుకానీ ప్రైవేటు సంస్థలకు మాత్రం పెద్దఎత్తున స్థలాల లభిస్తున్నాయన్నారు. దీని వెనుక ఉన్న అసలు రహస్యమేందే అంతుచిక్కడం లేదన్నారు. ఇలాంటి వాటిని అడ్డుకోవడానికి అన్ని పార్టీలు పూనుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. దీనిపై త్వరలో ఢిల్లీకి వెళ్ళి కేంద్ర పెద్దలను కలిసి వినతిపత్రాలను అందజేస్తామన్నారు. హైదరాబాద్ ప్రాంతం కేవలం పెట్టుబడిదారులదేనా? ఇక్కడుండే ప్రజలది కాదా? అని ప్రశ్నించారు. ఇక్కడి ఆస్తులు ప్రజలకే దక్కాలే తప్ప కొద్దిమంది కాంట్రాక్టర్లు కాదన్నారు.అంతుకు ముందు కాంగ్రెస్ నేత హనుమంతరావు మాట్లాడుతూ, రాత్రింత మేల్కొని పొద్దున్నే నిర్ణయాలు తీసుకుంటున్న సిఎం కేసీఆర్‌కు బుద్ధిచెప్పడానికి తెలంగాణ ప్రజలు సిద్ధమవుతున్నారన్నారు. ఇంట్లో కూర్చోని రాష్ట్ర పాలన సాగించే ముఖ్యమంత్రిని తాను ఇప్పటి వరకు చూడలేదని మండిపడ్డారు. అందుకే కేసీఆర్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు ఛలో ప్రగతిభవన్‌కు టీజేఏసీ పిలుపునివ్వాలనికోరారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరిస్తాయన్నారు. విద్యార్థుల ప్రాణత్యాగాలకు చలించి సోనియాగాంధీ తెలంగాణను ఇస్తే.... ఇప్పుడే కాంగ్రెస్ పార్టీపైనే విమర్శలు చేసే స్థాయిలే తండ్రి, కొడుకులు (కేసీఆర్, కేటీఆర్)లు ఎదిగారని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను లోఫర్‌పార్టీగా కేటీఆర్ పేర్కొనడంపై ఆయన తీవ్ర స్థాయిలో భగ్గుమన్నారు. అరే...బాబు...మీ నాయన కూడా కాంగెస్ నుంచే వచ్చారు కాదా...ఆయన కూడా లోఫరేనని అన్నారు. కేసీఆర్ లోఫర్ అయితే మీ కుటుంబమంతా కూడా లోఫరే కదరా బాబు అని కేటీఆర్‌పై విరుచుకపడ్డారు. తెలంగాణ రాష్ట్ర బాగుపడాతంలే కేసీఆర్ కుటుంబ పాలన నుంచి విముక్తి లభించినప్పుడే సాధ్యమవుతుందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సమయం మరో సంవత్సరం మాత్రమే ఉందని.... తెరాసకు వ్యతిరేకంగా అన్ని పార్టీలను ఏకతాటిపైకి తీసుకవచ్చే బాధ్యతలను కోదండరాం తిరిగి తన భుజస్కంధాలపై వేసుకుని కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని కోరారు. టీజేఏసీ ఎలాంటి నిర్ణయాలు, కార్యక్రమాలు తీసుకున్నా అందుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతును అందిస్తుందన్నారు.

నల్లగొండ ప్రజలతోనే ఉంటా..



నల్గొండ, ప్రభన్యూస్ బ్యూరో : నాకు నల్గొండ ప్రజలంటే ప్రాణం.. తుదిశ్వాస వరకు నల్గొండ నియోజకవర్గ ప్రజల కోసమే పనిచేస్తా.. ఇక్కడ నుంచే పోటీచేస్తాను.. అని కాంగ్రెస్ శాసనసభపక్ష ఉపనేత, ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. బొడ్డుపల్లి శ్రీనివాస్ సతీమణి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మిని నల్లగొండ నుంచి పోటీకి దించే అవకాశం ఉందంటూ మూడు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. కోమటి రెడ్డి మునుగోడు నుంచి పోటీ చేస్తారని, లేదంటే నల్గొండ లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తారన్న వదంతులపై కోమటిరెడ్డి స్పందిం చారు. ఇవన్నీ ఊహాగానాలేనని కొట్టిపారేశారు.

సోనియా కాళ్లు మొక్కినప్పుడు తెలియదా?

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీని లోఫర్ పార్టీ అని మంత్రి కేటీఆర్ విమర్శించేముందు కుటుంబ సమేతంగా వెళ్లి సోనియాగాంధీ కాళ్లు మొక్కిన విషయాన్ని గుర్తుంచుకోవాలని మాజీ మంత్రి కోమటిరెడ్డి అన్నారు. కేటీఆర్ అని గూగుల్‌లో టైప్ చేస్తే దోపిడి దొంగ అని వస్తుందని కోమటిరెడ్డి మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 70 అసెంబ్లీస్థానాల్లో విజయం సాధించకుంటే ఉత్తమ్‌తో పాటు తాను కూడా రాజకీయాల నుంచి తప్పుకుంటారని ఆయన సవాల్ విసిరారు. గురువారం ఆయన అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్ అధికారంలోకి రాకుంటే కుటుంబం మొత్తం రాజకీయాలకు దూరంగా ఉంటారా..? అనే విషయం మంత్రి కేటీఆర్ స్పష్టం చేయాలని కోమటిరెడ్డి డిమాండ్ చేశారు.

ఆరెకటికలకు ప్రాధాన్యం

• నామినేటెడ్ పదవులకు కృషి చేస్తాం
• శంఖారావ సభలో మంత్రులు ఈటల, జోగురామన్న
• అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు కేటాయిస్తాం: తెదేపానేత రమణ
• ఎస్సీ జాబితాలో చేర్చండి:సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్



దిల్‌సుఖ్‌నగర్ , ప్రభన్యూస్ : ఆరెకటిక కులస్థులు ఎదుర్కుంటున్న సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరిస్తుందని రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ వెల్లడించారు. మూడున్నర సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాలకు అనేక సంక్షేమాలు ప్రకటించిందని గుర్తుచేశారు. ఆరెకటిక కులాల కబేలాలను ఆదునీకరించేందుకు కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తామని అన్నారు. గతంలో రాజకీయాల కోసం కులసంఘాల సభలు పెట్టి పదవులు తీసుకునే వారని, తెలంగాణ వచ్చిన పిమ్మటి ఆత్మగౌరవం కోసం, హక్కుల కోసం సభలు పెడుతున్నారని ఆయన అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ వర్గాలకు బాసటగా నిలుస్తుందని ప్రకటించారు. ఆరెకటిక పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం నగరంలోని సరూర్‌నగర్ గ్రౌండ్‌లో ఆరెకటిక పోరాట సమితి శంఖారవ సభను నిర్వహించారు. పోరాట సమితి అధ్యక్షుడు గోగికర్ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన సభకు రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న, ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు, మాజీ మంత్రి ఎల్.రమణ, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా 17డిమాండ్లతో కూడిన ఆరెకటిక సమాజం ప్రగతికి కావాల్సిన సదుపాయాలను సభ ముందు ఉంచారు. ఈసందర్భంగా మంత్రి ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ఐదుకోట్ల పైచిలుకు బడ్జెట్‌లో బీసీ వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం గత సంవత్సరం బడ్జెట్ ప్రవేశపెట్టిందని అన్నారు. ఆరెకటికలు ఎదుర్కుంటున్న సమస్యలపట్ల ముఖ్యమంత్రి కేసిఆర్‌కు నివేదిక అందజేస్తామని ప్రకటించారు. మాంసం మార్కెట్లను ఆదునీకరించి వారికి వందశాతం సబ్సిడితో రుణాలు అందిస్తామని అన్నారు. బ్యాంక్‌లతో సంబంధం లేకుండా 50వేల నుండి 2లక్షల వరకు రుణాలు అందించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. కేసీఆర్ బీసీకులాల పక్షపాతిగా అందరిని ఆదరిస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందరి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రానున్న బడ్జెట్‌ను రూపుదిద్దుతామని అన్నారు.

టీడీపీ ద్వారా ఆరెకటికలను చట్టసభల్లోకి తీసుకెళ్తాం:రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆరెకటిక కులస్థులకు టీడీపీ ద్వారా టికెట్లను కేటాయించి ఆయా వర్గాలను చట్టసభల్లోకి తీసుకెళ్తామని తెలంగాణ రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు ఎల్.రమణ అన్నారు. నేటి ముఖ్యమంత్రి కేసిఆర్ బాల్‌కొండ ఎన్నికల సభలో ఆరెకటికలకు ఇచ్చిన హామిలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరెకటికలు క్షేత్రస్థాయిలో ఎదుర్కుంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ప్రత్యేక కమీషన్ ఏర్పాటు చేసి రాజకీయంగా, ఆర్థికంగా రిజర్వేషన్‌లు కల్పించాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలో ఉందని, అక్కడ కూడా ఆరెకటికలకు న్యాయం జరిగేల ముఖ్యమంత్రి చంద్రబాబును ఒప్పిస్తామని అన్నారు.

ఎంబీసీ కార్పోరేషన్ నుండి రుణాలు అందిస్తాం: చైర్మన్ తాడూరి శ్రీనివాస్

ఎంబీసీ కార్పోరేషన్ నుండి ఆరెకటికలకు రుణాలు అందించి ఆదుకుంటామని చైర్మన్ తాడూరి శ్రీనివాస్ వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీలపట్ల దైవంగా మారి అన్ని వర్గాలను ఆదుకుంటున్నారని గుర్తుచేశారు. కేవలం కేసీఆర్‌తోనే అన్ని సాధ్యమని అన్నారు.

సీఎం కేసీఆర్ బీసీల పక్షపాతి: జోగురామన్న

బీసీ కులాలు ఎదుర్కుంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి కేసిఆర్ ఎప్పటికప్పుడు తమందరితో చర్చిస్తున్నాడని, ఆయా వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న కృషి ఎంతగానో ఉందని అన్నారు. ఎంబీసీ కార్పోరేషన్ ఏర్పాటు చేసి వెయ్యికోట్ల నిధులను కేటాయించామని, ఇంకా రానున్న బడ్జెట్‌లో నిధులను పెంచేల చర్యలు చేపడు తామని అన్నారు. నాయిబ్రాహ్మణ, విశ్వ బ్రాహ్మణ, కుమ్మరి, ఆరెకటిక చేతివృ త్తులను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక రుణాలను అందిస్తుందని, వీటిని అందరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీ వర్గాల కు అన్యాయం జరిగిందని, 5వేల70 కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టి దేశంలోనే తెలంగాణ ప్రభుత్వం అగ్రగామిగా నిలిచిందన్నారు. ఎస్టీ, మైనార్టీలకు 25 లక్షల రుణసాకర్యం కల్పిస్తున్నా మని, బీసీలకు కళ్యాణలక్ష్మీ పేరుతో 75వే ల116ఇస్తున్న ఘనత ప్రభుత్వా నిదేన న్నారు. ఖచ్చితంగా ఆరెకటిక కులస్థు లకు ఫెడరేషన్ ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.

చేస్తున్నాం... చూస్తున్నాం

• చెప్పిందే చెప్పి, మళ్లీ అదే చెప్పి
• లోక్‌సభలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విభజన కారణంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇప్పటికే చాలా ఇచ్చామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. గురువారం లోక్‌సభలో జరిగిన బడ్జెట్ చర్చకు సమాధానమిస్తూ చివర్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంశాల గురించి మాట్లాడారు. రాష్ట్రాన్ని విభజించే సమయంలో తాము తెలంగాణ ఏర్పాటుకు మద్దతిచ్చినప్పటికీ, ఏపీకి ఎదురయ్యే ఆర్థిక సమస్యలు, ఇబ్బందులను గ్రహించామని అన్నారు. అందుకే తాము అప్పట్లో కొన్ని డిమాండ్లు చేసి విభజన చట్టంలో పొందుపరిచేలా చేశామని అన్నారు. చట్టంలో పేర్కొన్నవాటిలో చాలా అంశాలను ఇప్పటికే అమలు చేశామని చెప్పారు. మరికొన్ని దశలవారిగా అమలవుతున్నాయని జైట్లీ అన్నారు. విభజన కారణంగా అనేక జాతీయ విద్యా, పరిశోధనా సంస్థలు తెలంగాణ ప్రాంతంలోనే ఉండిపోవడంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్తగా ఆ సంస్థలను ఏర్పాటు చేయాలని చట్టంలో పేర్కొనగా, వాటిని ఇప్పటికే అమలు చేస్తున్నామని తెలిపారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొత్త రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు వెనుకబడ్డ జిల్లాల కోసం కూడా నిధులిచ్చామని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం నాబార్డు ద్వారా నిధులు అందించే ఏర్పాటు చేశామని వివరించారు. ఇకపోతే రెవెన్యూ లోటు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అంచనాలు, గణాంకాల మధ్య వ్యత్యాసాలున్నాయని, ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో బుధవారం చర్చించామని అన్నారు. ఈ వ్యత్యాసాన్ని పూడ్చే ప్రయత్నం చేస్తున్నామని, వీలైనంత త్వరలో ఈ పని పూర్తిచేస్తామని భరోసా ఇచ్చారు. ప్రత్యేక ప్యాకేజి విషయంలోనూ ఈ ఏడాది జనవరి 3న ఒక సమావేశం జరిగిందని, దీనిపై కూడా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తుది నిర్ణయం తీసుకుంటే త్వరలో అమలు చేస్తామని వెల్లడించారు.

కేంద్ర బడ్జెట్ ఓ జుమ్లా

రాజ్యసభలో చిదంబరం విసుర్లు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : కేంద్ర బడ్జెట్ ఓ పెద్ద జుమ్లా అని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం అన్నారు. జీడీపీ వృద్ధి రేటు తగ్గుతున్న సమయంలో ఉద్యోగాలు పెరుగుతున్నాయని ప్రభుత్వం చెప్పడం ఓ అబద్ధమని అన్నారు. గురువారం రాజ్యసభలో బడ్జెట్‌పై ఆయన ప్రసంగించారు. కేంద్రమంత్రి చిదంబరం మాట్లాడుతున్నంత సేపు బీజేపీ ఎంపీలు ఆయన ప్రసంగానికి అడ్డుతగిలారు. ప్రధానమంత్రికి క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. గందరగోళం మధ్యనే చిదంబరం తన ప్రసంగాన్ని సాగించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ద్రవ్యలోటు పెరిగిపోతోందని, ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి 12 ప్రశ్నలు సంధిస్తున్నానని చెప్పారు. బడ్జెట్‌లో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమానికి నిధులు కేటాయించకుండా 10 కోట్ల కుటుంబాలకు వర్తింపజేస్తామనడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.గతంలో నేషనల్ హెల్త్ స్కీమ్ కింద లక్ష రూపాయల బీమా కవరేజి ఇస్తానమి చెప్పి ఆ పథకం అమలు మర్చిపోయారని అన్నారు. ఈ దిశలో కొత్త పథకాన్ని ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. ఈ ఆరోగ్య పథకం సైతం జుమ్లాలో భాగమేనని అన్నారు. ఓ వైపు ఏడాదికేడాది జీడీపీ వృద్ధి రేటు తగ్గిపోతుంటే, ఉద్యోగాల కల్పన పెరుగుతుందని ప్రభుత్వం చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు.

అవసరాలకు అనుగుణంగా బడ్జెట్‌ను రూపొందించాలి

మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి ఆదేశం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : అవసరాలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన చేయాలని సంబంధిత అధికారులను వైద్య ఆరోగ్య శాఖా మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి ఆదేశించారు. సచివాలయం లోని తన ఛాంబర్‌లో మంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేసీఆర్ కిట్ల పథకం, మాతా శిశు ఆరోగ్య వైద్యశాలల నిర్మాణం అవసరం ఉందని వాటికి అనుగుణంగా బడ్జెట్ ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. వీటితో పాటు కొత్త నియామకాలు జరగ నున్న నేపథ్యంలో నిధులు ఎక్కువ కావాల్సి ఉంటుం దన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు రోగుల తాకిడి ఎక్కువ యినందున మరిన్ని సదుపాయాలు కల్పించాలని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రజలకు కంటి, మధుమేహం, బీపీ, క్యాన్సర్ వంటి వ్యాధులకు సంబంధించి స్క్రీనింగ్ వంటి అన్ని రోగ నిర్ధారణ పరీక్షలు, ఆధునిక పరిక రాలు, మరిన్ని మందులు, కొత్త భవనాలను ప్రాతిప దికన ఈ బడ్జెట్ ఉండాలన్నారు. సీఎం కేసీఆర్ వైద్య ఆరోగ్య శాఖ అధికంగా నిధులు కేటాయిస్తానని హామీఇచ్చారని ఆ విధంగానే బడ్జెట్ కేటాయింపులు ఉండాలని ఆయన అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమా వేశంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతికుమారి, డీఎంఈ రమేష్‌రెడ్డి, హెల్త్‌వర్సిటీ వీసీ డాక్టర్ కరుణాకర్ రెడ్డి, ఐపీఎం డైరెక్టర్ డాక్టర్ శంకర్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మనోహర్, ఈహెచ్ఎస్ సీఈఓ డాక్టర్ పద్మ, ఆయుష్ కమిషనర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, ఎంఎన్‌జే డైరెక్టర్ జయలత, చీఫ్ ఇంజనీర్ లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం వద్దు

రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రైల్వే ప్రాజెక్టుల అమలులో జాప్యం వద్దని, పనులను వేగవంతం చేయాలని, అదే సందర్భంగా రాష్ట్రా లతో సమన్వయంతో వ్యవహరించాలని దక్షిణమధ్యరైల్వే (దమరై) జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. జోన్ పరిధిలో ప్రాజెక్టుల ప్రగతిపై గురువారం రైల్ నిలయంలో ఉన్నతాధి కారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రైల్వే, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపడుతున్న ప్రాజెక్టుల విషయంలో చాకచక్యంగా వ్యవహరించాలని సూచించారు.భూసేకరణ, అటవీ భూములకు అనుమతులు, విద్యుత్ లైన్ల మార్పు, టెలికాం కేబుల్స్ మార్చే సందర్భంగా సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు.ప్రతిపాదనలు, నిధులు, వ్యయం, అంచనాల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. మంచిర్యాల - పెద్దంపేట ట్రిప్లింగ్, కాజిపేట - విజయవాడ ట్రిప్లింగ్, పర్భాని -ముద్‌కేడ్ డబ్లింగ్, నడికుడి -శ్రీకాళహస్తి కొత్తలైను, ఓబులవారి పల్లె - క్రిష్ణపట్నం కొత్త లైను, కల్లూరు - గుంతకల్ డబ్లింగ్, మనోహరాబాద్ - కొత్తపల్లి కొత్తలైను, మెదక్ - అక్కన్నపేట కొత్తలైను, నంద్యాల -ఎర్రగుంట్ల కొత్తలైను,. కాజిపేట - బల్హార్షా ట్రిప్లింగ్, గుంటూరు -గుంతకల్ డబ్లింగ్, అకోలా- ఖాండ్వా గేజ్ మార్పిడి ప్రగతిపై జీఎం వినోద్‌కుమార్ యాదవ్ సూచనలు చేశారు. పనులను వేగవంతంచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ ఎన్ మధుసూదన్ రావు, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ వినయ్ మోహన్ శ్రీవాస్తవ, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్స్ ఇంజనీర్ పూర్ణా ఎం చేరాల, ప్రధాన పరిపాలనాధికారి విజయ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. ప్రాజెక్టుల వారిగా నిర్మాణాలను విజయ్ అగర్వాల్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

నాణ్యమైన విద్యనందించాలి

అధికారులతో సీఎస్ ఎస్.కె. జోషి సమీక్ష



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో చదవే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేం దుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.ఎస్.కె.జోషి ఆదేశించారు. గురువారం సచివాల యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా సంక్షేమం, విద్యాశాఖ, ఇంధనం, గృహ నిర్మాణం, రవాణా, మున్సి పల్, పంచాయతీ రాజ్, పర్యాటక, యువజన సంక్షే మం, వైద్య ఆరోగ్య శాఖ, కార్మికశాఖ ఉన్నతా ధికారు లతో ఆయన సమీక్ష నిర్వహించారు. రెసిడెన్షియల్ పాఠశాలలో అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి అడ్మిషన్ అందించేలా చర్యలు తీసుకోవడంతో పాటు హాస్టళ్లు, కళాశాలలు, పాఠశాలకు గ్రేడింగ్ ఇచ్చే విధానాన్ని రూపొందించాలని సీఎస్ పేర్కొన్నారు. వివిధ సంక్షేమ శాఖల ద్వారా అమలవుతున్న స్వయం ఉపాధి పథ కాలు శిక్షణా కార్యక్రమాలు, విద్యా సౌకర్యాలు, విదేశీ విద్యా పథకం తదితర అంశాలపై చర్చించారు. గిరిజన సహకార సంస్థ ద్వారా ఆర్థిక కార్యకలాపాలను మరింత విస్తృత పరచాలని ఆయన సూచించారు. స్టడీ సర్కిళ్ల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత ఉద్యోగ అవకాశాలు పొందేలా శిక్షణా కార్యక్రమా లు ఉండాలన్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి పనితీరు మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మా ణానికి సంబంధించి రాష్ట్రంలో 1,73,406 గృహాలకు టెండర్లు ఫైనల్ అయ్యాయని, 1,38,795 గృహాలు గ్రౌండ్ కాగా 58,24 గృహాలు పూర్తి అయినట్టు సీఎస్ తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సౌభాగ్య పథకం ద్వారా విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవా లన్నారు. రోడ్లు భవనాల శాఖకు సంబంధించి జాతీయ రహదారుల భూసేకరణను వేగవంతం చేయాలని సీఎస్ సూచించారు. జిల్లా కలెక్టరేట్లు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో 7,440 కోట్లతో 5150 కిలోమీటర్ల సింగిల్‌లేన్‌ను డబుల్‌లేన్‌లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించి 2890 కిలోమీటర్లు పూర్తి చేశామన్నారు. మండలాల నుంచి జిల్లా హెడ్ క్వార్టర్స్‌కు డబుల్ లేన్‌కు సంబంధించి 950 కిలోమీటర్లు పూర్తి చేశామని 163 బ్రిడ్జికమ్ చెక్‌డ్యాంలు 5300 కిలోమీటర్ల మేర రోడ్లకు రెన్యువల్ చేశామని అధికారులు సీఎస్ వివరించారు. ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్స్, ఎస్ఆర్‌డిపి మాస్టర్‌ప్లాన్ ఇంటిగ్రేషన్‌లపై ప్రత్యేకంగా ప్రజెంటేషన్ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులు అజయ్‌మిశ్రా, చిత్రా రామచంద్రన్, ముఖ్య కార్యదర్శులు సునీల్‌శర్మ, వికాస్ రాజ్, ట్రాన్స్‌కో చైర్మన్ ప్రభాకర్ రావు, నవీన్‌మిత్తల్, బి.వెంకటేశం పాల్గొన్నారు.

పాడిరైతులకు రెండేసి గేదెలు

(మొదటిపేజీ తరువాయి)

మొత్తాన్ని పొందుపరచాలని సీఎం కేసీఆర్ ఆర్థికశాఖ అధికారులను ఆదేశించినట్టు తెలుస్తోంది. ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న పాడి రైతులకు సీఎం కేసీఆర్ ఇస్తున్న రెండు గేదెల పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని అధికారులు భావిస్తున్నారు. ఒక్కో గేదె కనీసం ఇరవై నుంచి ముప్పై లీటర్ల పాలు ఇస్తుందని దీనివల్ల రెండు గేదెలకుగానూ పాడి రైతుకు రోజూ రెండువేల నుంచి మూడువేల రూపాయల ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. గేదెలకు అవసరమైన మేతను సరఫరా చేసే బాధ్యత కూడా పశు సంవర్ధకశాఖ చేపడుతుంది. సబ్సిడీపై రైతులకు గడ్డి విత్తనాలను సరఫరా చేయాలని దీంతో పాటు రోగాల బారిన గేదెలు పడకుండా వాటికి వ్యాక్సిన్లు ఇచ్చేందుకు కూడా ప్రణాళికలు రూపొందుతున్నాయి. ఇందుకోసం ఖాళీగా ఉన్న పశువైద్యుల పోస్టులను ఇప్పటికే భర్తీచేసిన ప్రభుత్వం మరిన్ని ఖాళీలను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న పాడి రైతులు వారి వద్దనున్న గేదెలను నమ్ముకుని జీవనం సాగిస్తున్న విషయం తెలిసిందే. పాల అమ్మకం ద్వారా వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని వెల్లదీస్తూ ముందుకు సాగుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులు కొనుగోలుచేసిన గేదెలు కేవలం ఐదు నుంచి పది లీటర్ల పాలు మాత్రమే ఇస్తుండడం వేసవి కాలంలో పరిస్థితి మరింత ఇబ్బందిగా తయారవుతుండడంతో రైతులు కష్టాలు పడుతున్నారు. దీన్ని గమనించిన సీఎం కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న పాడి రైతులకు ఒక్కొక్కరికి రెండేసి గేదెలను ఇస్తామని ప్రకటించారు. ఒక్కో గేదెను రూ.లక్షతో కొనుగోలు చేస్తామని ఇందులో రూ.70వేలను ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుండగా మిగతా రూ.30వేలను పాడి రైతు భరించాలని కోరారు. ఈ పథకం ద్వారా లబ్ధిపొందే వారి వివరాలను ఇప్పటికే సేకరించిన పశు సంవర్ధకశాఖ వాటిని జిల్లా అధికారుల ద్వారా సచివాలయానికి చేరాయి. ఒకటి, రెండు రోజుల్లో ఈ పథకానికి సంబంధించి సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి ఈ పథకంపై ఆమోదముద్ర వేయనున్నారు. రాష్ట్రంలో వర్షాలు కురిసే నాటికి గేదెలను సిద్ధంచేసి రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాడి రైతుల ద్వారా సమకూరే పాలను ఆయా గ్రామాలకు వెళ్ళి సమీకరించే బాధ్యతను కూడా ప్రభుత్వం విజయ డెయిరీకి అప్పగించింది. రాష్ట్రంలో కరీంనగర్



కేంద్రంగా ముల్కనూరు డెయిరీ పనిచేస్తోంది. నల్గొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల సమాఖ్య నగర శివార్లలోని హయత్‌నగర్‌లో మదర్ డెయిరీని గతంలోనే ఏర్పాటుచేసి ఈ రెండు జిల్లాల్లో రైతుల నుంచి పాలను సమీకరిస్తున్న సంగతి తెలిసిందే. తెలంగాణలోని మిగతా జిల్లాల్లో రైతుల ద్వారా సమీకరించిన పాలను లాలాపేటలోని విజయ డెయిరీకి రప్పించి వాటిని ప్యాకెట్ల ద్వారా వినియోగదారులకు అందిస్తున్న సంగతి తెలిసిందే. ముల్కనూరు, మదర్ డెయిరీ, విజయ డెయిరీల ద్వారా ప్రతిరోజూ నాలుగున్నర లక్షల లీటర్ల పాలను మాత్రమే విక్రయిస్తున్నారు. కనీసం కోటి లీటర్ల పాలను అందుబాటులోకి తీసుకురావాలని సంకల్పించిన సీఎం కేసీఆర్ గేదెల పథకానికి శ్రీకారం చుట్టారు. వివిధ డెయిరీలకు తాము అందిస్తున్న పాలవల్ల వస్తున్న మొత్తం ఏమాత్రం సరిపోవడం లేదని అదనంగా మరో రూ.4 ఇవ్వాలని సీఎం కేసీఆర్ కలిసేందుకు వచ్చిన పాడి రైతులు కోరిన సంగతి తెలిసిందే. ఈ డిమాండ్‌ను చెప్పిన వెంటనే సీఎం కేసీఆర్ రైతులు కోరినట్టు రూ.4 అదనంగా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పాడి రైతులు మరింత బలోపేతమయ్యేందుకు వీలుగా ఒక్కో రైతుకు రెండేసి గేదెలను సబ్సిడీపై ప్రభుత్వం పంపిణీ చేస్తుందని అప్పట్లోనే వారికి భరోసా ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు పాడి గేదెలను కొనుగోలు చేసేందుకు పశు సంవర్ధకశాఖ సిద్ధమైంది. ఈ శాఖకు చెందిన అధికారుల బృందం వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ఎక్కడెక్కడ గేదెలు అందుబాటులో ఉన్నాయో గుర్తించి ఆ వివరాలను సేకరించారు. దీనిపై ప్రత్యేక నివేదిక సిద్ధంచేసిన పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ద్వారా సీఎం కార్యాలయానికి పంపించినట్టు తెలుస్తోంది. బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయాశాఖల ఉన్నతాధికారులతో సమీక్షలు జరుపుతున్న సీఎం కేసీఆర్ ఒకటి, రెండు రోజుల్లో గేదెల పథకంపై కూడా అధికారులతో సమావేశం కానున్నట్టు తెలుస్తోంది. ఆ రోజునే ఈ పథకానికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడుతుందని భావిస్తున్నారు. ఈ పథకాన్ని రాష్ట్రంలో ఒకేరోజున ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు కూడా చేస్తున్నట్టు సమాచారం. రైతుకు ఎకరాకు రూ.4వేలు ఇచ్చేందుకు సంబంధించిన పెట్టుబడి పథకం తరహాలోనే గేదెల పథకం పంపిణీకార్యక్రమాన్ని కూడా నిర్వహించాలని భావిస్తున్నారు. పాడి రైతులక ప్రభుత్వం అందించే గేదెల పథకం దుర్వినియోగం కాకుండా వాటికి జియో ట్యాగింగ్ చేయాలని భావిస్తున్నారు. గేదెలను ఎక్కడ కొనుగోలు చేస్తున్నారో అక్కడే వాటికి జియో ట్యాగింగ్ చేసి నేరుగా ఏ గ్రామంలో గేదెలు ఇవ్వాలనుకున్నది నిర్ణయించి అక్కడికి అవి చేరేలా చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు.ఈ పథకానికి వార్షిక బడ్జెట్‌లో రూ.600 కోట్లను కేటాయించేందుకు ఆర్థికశాఖ ప్రణాళికలు రూపొందించే పనిలో నిమగ్నమై ఉంది. పాడి రైతులకు లీటరుకు రూ.4 పారితోషకాన్ని ప్రకటించిన ప్రభుత్వం ఇందుకు ఏటా రూ.100 కోట్లను ఖర్చు చేస్తోంది. హర్యానా, పంజాబ్, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో పశు సంవర్ధకశాఖ అధికారులు ఇప్పటికే పర్యటించి వచ్చారు.

హర్యానా, పంజాబ్‌లో పాడి రైతుల వద్దనున్న గేదెలు రోజుకు రెండు పూటలా పాలు ఇస్తాయని ఇరవై నుంచి ముప్పై లీటర్ల వరకు ఆ గేదెలు పాలు ఇస్తున్నాయని గుర్తించారు. అయితే అక్కడ గేదెల ధరలు లక్షకు మించి ఉండడంతో ఏం చేయాలన్న అంశంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఉన్నతస్థాయి సమావేశంలో గేదెల ధర అంశంపై చర్చించే అవకాశం కనిపిస్తోంది. మొత్తంమీద ఈ ఏడాది మే లేదా జూన్ మాసాంతానికి ప్రతిష్టాత్మకమైన గేదెల పథకం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

సియోల్: ఉత్తరకొరియాలో మిలటరీ పరేడ్‌లో ప్రదర్శించిన క్షిపణులను టీవీలో ఆసక్తిగా తిలకిస్తున్న పౌరులు. సైనిక వందనం స్వీకరిస్తున్న ఆ దేశ అధ్యక్షుడు కిమ్





అంతరిక్ష కారు రూటు మార్చింది

• గ్రహశకలాల ఆవృతం దిశగా ప్రయాణం • ఆవృతంలోకి అడుగుపెడితే కారు ఖతం



న్యూఢిల్లీ: కేప్‌కనవెరల్, అమెరికా: టెస్లా, స్పేసెక్స్ సీఈఓ ఎలోన్ మస్క్ గగనతలంలోకి పంపించిన కారు దారి తప్పింది. అంతులేని అంతరిక్షపు లోతుల్లోకి వెళ్ళిపోయింది. భూతలంపైన అత్యంత శక్తిమంతమైన రాకెట్ ఫాల్కన్‌కు ఒక మనిషిని పోలిన డమ్మీని డ్రైవర్ సీట్లో ఉన్న టెస్లా రోడ్‌స్టర్‌ను తగిలించి అంతరిక్షంలోకి ప్రయో గించడం వెనుక ముఖ్యోద్దేశ్యం అంగారక గ్రహం చుట్టూ ఆవరించి ఉన్న కక్ష్యలో పరిభ్రమించేలా చేయడం.

ఆ కక్ష్య కూడా అంగారక గ్రహం, భూమికి మధ్య ఉంటుంది కాబట్టి టెస్లా రోడ్‌స్టర్ నెమ్మదిగా సౌర మండలంలో తిరుగుతుంటుందని ఆశించారు. కానీ రాకెట్ ప్రయోగం అనుకున్నదాని కన్నా శక్తిమంతమైనది కావడంతో డమ్మీ మనిషి నడుపుతున్న కారు ప్రస్తుతం గ్రహ శకలాలతో నిండిన ఆవృతం దారిలో పయనిస్తున్నదని మస్క్ ట్వీట్ చేశారు.

గ్రహ శకలాల మైనింగ్‌కు మంచి మార్గం

అంతరిక్షంలో టెస్లా రోడ్‌స్టర్ దారి మార్చుకోవడం స్పేసెక్స్‌కు ఒకింత ఇబ్బందికరంగా పరిణమించినప్పటికీ దాని సేవలను వినియోగించుకోవడంలో అది ప్రైవేట్ కంపెనీలను ప్రోత్సహిస్తుంద ని చెప్పకతప్పదు. అది చేపట్టిన సుదీర్ఘ మార్గం ఫాల్కన్ హెవీ రాకెట్ అత్యంత శక్తిమంతమైనదని నిరూపించింది. అలాగే టెస్లా రోడ్‌స్టర్ గ్రహశకలాల ఆవృతంలోకి ప్రవేశించడమనేది అత్యంత ఉపయోగకరమైనది.

అంతేకాక గ్రహశకలాల మైనింగ్ కంపెనీలు ఏర్పాటు చేయాలని ఆశిస్తున్న పలు ప్రైవేట్ కంపెనీలకు టెస్లా కారు గతి తప్పడం అత్యంత విలువైనది. మన సౌర మండలం అంచుల్లో ఇష్టానుసారంగా పరిభ్రమిస్తుండే గ్రహశకలాలు ఎంతో విలువైన, అరుదైన పదార్థాలను కలిగి ఉంటాయని భావిస్తుంటారు. కానీ వాటిని స్వాధీనపరుచుకొని, భూమికి తిరిగి తీసుకువచ్చే దారిని ఇప్పటిదాకా కనుక్కోలేదు. గ్రహశకలాలను సేకరించి, భూమికి తిరిగి తీసుకువచ్చే మిషన్లకు కేంద్రంగా సెరెస్ అనే మరుగుజ్జు ఉపగ్రహం పనికి వస్తుందని కొందరు పేర్కొంటున్నారు. మస్క్ ట్వీటర్‌లో పంచుకున్న కక్ష్య మార్గం ప్రకారం టెస్లా రోడ్‌స్టర్ కారు సెరెస్‌కు అత్యంత చేరువ దిశలో ప్రయాణిస్తున్నది. గ్రహశకలాలను భూమికి చేర్చే పని కార్యరూపం దాల్చడానికి అనేకానేక సంవత్సరాలు పట్టవచ్చు. వాణిజ్య కంపెనీలను ప్రైవేట్ అంతరిక్ష యాత్ర, అంతరిక్షశోధన చేపట్టడానికి ఆసక్తి చూపించేలా చేసి దానిని సొమ్ము చేసుకోవడానికే స్పేసెక్స్ రాకెట్లు ప్రయోగిస్తున్నది.

అందని డేటా

కారు ఎలాంటి విపత్కర పరిస్థితిలో ఉన్నది వెల్లడికావడంలేదు. సౌర మం డలం గుండా సాగుతున్న దాని ప్రయాణం ఎక్కడితో ముగుస్తుందనేది అందివచ్చిన డేటా ఆధారంగా వ్యోమగాములు అంచనావేయగలరు. కానీ ప్రస్తుతానికి ఐతే అనేక గ్రహాల గురుత్వాకర్షణ శక్తి దానిని ఎక్కడికి చేరుస్తుందో స్పష్టం కాని పరిస్థితి. కారు చాలా చిన్నదికావడంతో అది దేనితోనూ ఢీకొనే అవకాశం లేదు. గ్రహశకాలల ఆవృతంలోనికి చేరుకున్న పక్షంలో అది ముక్కలు చెక్కలైపోయే అవకాశం ఉంది.



మాణిక్ 'సర్కార్'ను సాగనంపండి

✦ అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించండి ✦ త్రిపుర ఎన్నికల ప్రచారంలో మోడీ పిలుపు

సోనామురా(త్రిపుర): మాణిక్ సర్కార్ సారథ్యంలోని వామపక్ష కూటమి ప్రభుత్వాన్ని సాగనంపండి. అభివృద్ధి కోసం భారతీయ జనతాపార్టీకి ఓటేయండి అని త్రిపుర ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. గురువారం, సోనామురాలోని రంగమాటియా మైదానంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జీవితంలో మహర్దశ రావాలని, అదృష్టం వరించాలని మాణిక్యాలను ధరించడం మనకు తెలుసు. కానీ, ఈ మాణిక్ సర్కార్ (ముఖ్యమంత్రి) మాత్రం ప్రజల జీవితాలకు సౌభాగ్యం ఇవ్వడంలో విఫలమయ్యారు. అందుకే వచ్చే ఎన్నికల్లో మాణిక్ ప్రభుత్వాన్ని పక్కనబెట్టండి. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాశ్రేయస్సు కోసం బీజేపీ 'హీరా' సిద్ధాంతానికి ఓటేయండి. హెచ్- జాతీయ రహదారులు, ఐ- ఇంటర్నెట్, ఆర్- రహదారులు, ఏ- విమానమార్గాలు అంటూ హీరాను ప్రధాని నిర్వచించారు. త్రిపుర ఎంతోకాలంగా వెనుకబడి ఉంది. రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదు. బీజేపీని గెలిపిస్తే రాజ్యాంలో అభివృద్ధికి బాటలు వేస్తాం. ఈసారి మాణిక్‌ను పారేయండి.. హీరాను ధరించండి. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మనకు మంచి రోడ్లు, జాతీయ రహదారులు, రైల్వేలు, విమాన మార్గాలు అవసరం అని ప్రధాని సూచించారు. 60 మంది శాసన సభ్యులున్న త్రిపుర అసెంబ్లీకి ఈనెల 18న పోలింగ్ జరుగుతుంది. ఫలితాలు మార్చి 3న వెల్లడవుతాయి.

మోడీని ఎదుర్కొనే వీరుడు రాహులే



న్యూఢిల్లీ: 2019 సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని రాహుల్ గాంధీ మాత్రమే ఎదుర్కొగలడని కాంగ్రెస్ పార్టీ నాయకుడు సచిన్ పైలట్ స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారం నుంచి దింపివేసే సత్తా కాంగ్రెస్‌కు ఉందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై విపక్ష ప్రశ్నల నుంచి ప్రభుత్వం పారిపోతున్నదని, అయినా బాధ్యతవహించేలా రాహుల్ ఒత్తిడి పెంచుతున్నారని పైలట్ చెప్పారు. రాహుల్ తమ నాయకుడని, అతనికి సహకరించాలని పార్టీ పార్లమెంటరీ సమావేశంలో సోనియా గాంధీ ఇచ్చిన పిలుపును స్వాగతిస్తున్నామన్నారు. బీజేపీ నాయకత్వంపైనా, ప్రభుత్వంపైనా రాహుల్ అలుపెరగని పోరాటం చేస్తున్నారని, ఇది తమకు ఎంతో స్ఫూర్తిని, బలాన్ని ఇస్తున్నదని చెప్పారు. రాజస్థాన్ ఉప ఎన్నికల్లో విజయమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. బీజేపీ వైఫల్యాలను రాహుల్ నిలదీస్తున్న తీరు బీజేపీయేతర పార్టీలను ఆకట్టుకున్నదని తెలిపారు. ఎన్నికల హామీలపై తమ నాయకుడు పదేపదే అడిగే ప్రశ్నలతో బీజేపీ సంకటంలో పడిందన్నారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని పైలట్ ధీమా వ్యక్తంచేశారు.

ఇక రెండేళ్లకో బడ్జెట్

✦ భవిష్యత్ తరాలకు భరోసా ఇచ్చే దిశగా అమెరికా అడుగులు ✦ ఆమోదం తెలిపిన డెమొక్రట్, రిపబ్లికన్లు

వాషింగ్టన్: అమెరికా సెనెట్ బడ్జెట్ నేపథ్యంలో ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతీ ఏడాది పెట్టాల్సిన బడ్జెట్ విషయంలో మార్పులు చేసింది. రెండేళ్లకు ఓ సారి బడ్జెట్ ప్రవేశపెట్టాలని సెనెట్ ఏకాభిప్రాయానికి వచ్చింది. భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని, షట్‌డౌన్ విషయంలో వచ్చిన ఇబ్బందులు మరే ప్రభుత్వానికి రావొద్దనే ముందస్తు ఆలోచనతో సెనేట్‌లోని సభ్యులు నిర్ణయించుకున్నారు. ఈ ప్రతిపాదనకు సభలోని డెమొక్రటిక్, రిపబ్లికన్ సభ్యులు ఆమోదం తెలిపారు. వైట్‌హౌస్ నుండి వచ్చిన ఈ అంశానికి సభ్యులు దరా వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. రెండేళ్లకు కలిపి ఒకే బడ్జెట్‌ను రూపొందిస్తున్న విషయాన్ని సెనెట్ మెజార్టీ నాయకుడు మిచ్ మెక్ కొన్నెల్, సెనెట్ మైనార్టీ నాయకుడు చార్లెస్ స్కామర్ ప్రకటించారు.

గతంలో గడువులోగా ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం పొందకపోవడంతో అమెరికాలో షట్‌డౌన్ ప్రకటించారు. దీంతో ప్రభుత్వ వార్షిక లావాదేవీలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. డ్రీమర్స్ భద్రత విషయంలో స్పష్టమైన హామీ కోరిన డెమొక్రట్లకు ప్రభుత్వం నుండి ఎలాంటి సానుకూలత రాలేదు. ద్రవ్య వినిమయ బిల్లుపై రిపబ్లికన్స్-డెమొక్రట్ల మధ్య చర్చ జరిగినా ఫలితం శూన్యం కావడంతో షట్‌డౌన్ పరిస్థితి విధించారు. అనంతరం రిపబ్లికన్-డెమొక్రట్ల మధ్య సయోధ్య నేపథ్యంలో షట్‌డౌన్ వివాదానికి తెరపడింది. అమెరికా ప్రతినిధుల సభ ఫిబ్రవరి 8న ఫెడరల్ ప్రభుత్వానికి నిధుల సమకూరుస్తూ సెనెటర్లు తమ ఆమోదం తెలిపారు. దీనిపై ట్రంప్ సంతకం చేస్తున్నట్లు ప్రకటించడంతో షట్‌డౌన్‌కు తెరపడింది. 266-150 ఓట్లతో దీర్ఘకాలిక యూఎస్ సెనేటర్లు ఓకే చెప్పారు. ఫిబ్రవరి 8 వరకు అవాంతరాలు లేకుండా ప్రభుత్వం నడిపించేందుకు ఫండింగ్ లెజిస్లేషన్ మద్దతు ప్రకటించారు. ఈ గడువు ముగియడంతో గురువారం



సమావేశమైన అమెరికా సెనెటర్లు రెండేళ్లకు ఒకసారి బడ్జెట్ పెట్టేందుకు నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా చార్లెస్ స్కామర్ మాట్లాడారు. రక్షణ రంగం కోసం ఖర్చులతో పాటు ఇంటి అవసరాలకు ఉపయోగపడే వాటికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి తుది నిర్ణయం త్వరలో ప్రకటిస్తామని వివరించారు. రెండేళ్ల బడ్జెట్ అనేది డెమొక్రట్లు, రిపబ్లికన్ వాళ్ల కోసం కాదని, ఇది అమెరికా ప్రజల కోసమని అన్నారు. దీనికి చట్టబద్ధత కల్పించడానికి కొన్ని నెలల సమయం పడుతుందని వివరించారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ సారా సాండర్స్ మాట్లాడుతూ.. ట్రంప్ పరిపాలన అధికారులు కాంగ్రెస్ నాయకులతో చర్చలు నిర్వహిస్తారని, రక్షణ రంగంలో కేటాయింపుల విషయమై చర్చిస్తారని అన్నారు. రక్షణ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని, ఈ బిల్లు ఈ పరిస్థితుల్లో ఎంతో ముఖ్యమైందని అన్నారు. ఈ బిల్లు 2019, మార్చి వరకు రుణ పెంపును పెంచుతుందని సారా చెప్పారు. ఇది తమను సంక్షోభం నుండి గట్టెక్కించేందుకు ఉపయోగపడుతుంది. వైద్యం, నిర్మాణంతో పాటు పలు రంగాలు చాలా దారుణంగా ఉన్నాయని చెప్పారు. బడ్జెట్‌కు సంబంధించిన విషయాలపై వైట్‌హౌస్‌లో ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా డిఫెన్స్ సెక్రెటరీ జిమ్ మాట్టిస్ మాట్లాడారు. రెండేళ్ల బడ్జెట్ బిల్లుకు కాంగ్రెస్ ఆమోదం తెలపడం ఎంతో సంతోషంగా ఉందని, దీంతో రక్షణ రంగంతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని ఆయన అన్నారు. ఈ ఒప్పందంతో అమెరికా ప్రజలకు ఎంతో లాభం చేకూరుతుందని హౌస్ స్పీకర్ పాల్ రేయన్ చెప్పారు. యువ వలసదారులకు స్పీకర్ పాల్ రేయన్ భరోసా ఇవ్వని పక్షంలో బిల్లును వ్యతిరేకిస్తామని డెమొక్రటిక్ నాయకురాలు న్యాన్సీపిలోసీ చెప్పారు.

ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్



వాషింగ్టన్: అమెరికా మరోసారి పాకిస్తాన్‌పై విరుచుకుపడింది. పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని, దీనికితోడు భారత్, ఆఫ్ఘనిస్తాన్‌పై దాడులకు దిగుతోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ రెండు దేశాలనే లక్ష్యంగా చేసుకుని పాక్ దుశ్చర్యలకు పాల్పడుతున్నదని చెప్పారు. హౌస్ విదేశీ వ్యవహారాల కమిటీ, దక్షిణ ఆసియా, పసిఫిక్ సబ్ కమిటీతో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ నాయకుడు టెడ్ యోహో అధ్యక్షత వహించారు. పాకిస్తాన్ తన వైఖరి మార్చుకోకపోవడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రక్షణ సంబంధమైన సామాగ్రి అందజేసేందుకు నిరాకరించారని గుర్తు చేశారు. ఒక ఉగ్రవాద కారణంగానే పాకిస్తాన్-అమెరికా మధ్య సత్సంబంధాలు దెబ్బతినున్నాయని అమెరికా చట్టసభ్యులు చెప్పుకొస్తున్నారు. జనవరిలో పాక్‌కు, అమెరికా అందజేయాల్సిన 2 మిలియన్ డాలర్ల సహాయాన్ని ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నదన్న కారణంగానే నిరాకరించింది. కొన్నేళ్లుగా అమెరికా, పాకిస్తాన్‌కు సహాయం అందించడం తగ్గిస్తూ వచ్చింది. పాక్‌కు ప్రాధాన్యత ఇవ్వడంలో మార్పు వచ్చింది. గత ఆరు నెలలుగా ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారిందని కాంగ్రెస్ నాయకుడు టెడ్ యోహో అన్నారు. అమెరికా-పాక్ మధ్య సంబంధాల విషయంలో మార్పు రావాలని కోరుకున్నాం.. అది జరిగింది. కానీ ఆలస్యమైందని టెడ్ వివరించారు. దక్షిణ ఆసియాలో ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనే ఉద్దేశంతోనే పాకిస్తాన్‌తో అమెరికా ఒప్పందాలు చేసుకోలేదని అన్నారు. ఆఫ్ఘనిస్తాన్ లేదంటే భారత్‌ను లక్ష్యంగా చేసుకుని పాక్ ఎందుకు దాడులకు దిగుతోందో అర్థం కావడం లేదన్నారు. 2001 నుండి అమెరికా సంయుక్త రాష్ట్రాలు 11 బిలియన్ డాలర్లు ఆర్థిక సాయం అందించాయి. రక్షణ పరంగా 8 బిలియన్ డాలర్లు ఇచ్చాయి. సంకీర్ణ మద్దతు నిధుల్లో అమెరికా 14 బిలియన్ డాలర్లు పాక్‌కు చెల్లించింది. ఇన్ని నిధులు పాకిస్తాన్‌లో ఉగ్రవాదాన్ని తుదముట్టించడానికే అని కాంగ్రెస్ నాయకుడు బ్రాడ్ షెర్‌మెన్ తెలిపారు.

రజనీతో పొత్తుకు కమల్ ఓకే?

చెన్నై: సినీరంగంలోనే కాక తమిళ రాజకీయాల్లోనూ తనకంటూ ప్రత్యేకత చాటుకునేలా నటుడు కమల్ హాసన్ అడుగులు వేస్తున్నారు. తన రాజకీయ భవితపై ఆయన మాట్లాడుతూ సూపర్ స్టార్ రజనీకాంత్‌తో తనతో ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని కలిసి పోటీచేయాలని భావిస్తే అందుకు తాము సుముఖమే అన్నారు. కాకపోతే ఇరువురం ఆలోచించాలిసిన అవసరం ఉందన్నారు. ఇదే విషయంపై రజనీకాంత్‌ను అడిగితే కాలమే దీనికి సమాధానం చెపుతుందంటు న్నారు. కనుక ఆ కాలం ఎప్పుడూ అనేది ఆయనే చెప్పాలన్నారు. అయితే ముందుగానే రజనీతో పొత్తు నిర్ణయం ప్రకటించటం తొందరపాటు అవుతుందన్నారు. రజనీ సార్‌తో రాజకీయ పొత్తు అంటే సినిమా కోసం నటులను ఎంచుకోవటం కాదన్నారు. ఇరువురుము భిన్న ధ్రువాలం అన్నారు. పొత్తు విషయంపై ఇరువురు ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉందన్నారు. కాగా ఈ నెల 21న కమల్ తన పార్టీపేరు, రాజకీయ పర్యటన తదితర వివరాలు వెల్లడించనున్న విషయం విదితమే. కాగా గత నెల కమల్ హాసన్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ దేశం కోసం, రాష్ట్రం కోసం తనతో చేతులు కలిపి తన పార్టీని సపోర్టు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రూ.4,800 కోట్లతో గ్యాస్ కనెక్షన్లు

న్యూఢిల్లీ: పేదవర్గాలకు రానున్న మార్చి 2020నాటికి మూడు కోట్ల మందికి అదనంగా ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్లను కేంద్రం అందజేయనుంది. ఇందుకోసం సుమారు 4,800 కోట్లు ఖర్చు చేయనుందని పెట్రోశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గురువారం విలేఖరులకు వెల్లడించారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై) పథకాన్ని మే 2016లో ప్రారంభించినపుడు పేదలకు 5కోట్ల ఉచిత వంట గ్యాస్‌ను అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటివరకు సుమారు 3.36 కోట్ల మందికి ఉచిత వంట గ్యాస్ అందించామన్నారు. 2018-19 బడ్జెట్‌లో సుమారు 8000కోట్ల బడ్జెట్ కేటాయింపు జరిగిందన్నారు. తాజాగా ఈ పథకాన్ని మరో సంవత్సరం పొడిగించామన్నారు. దీనివల్ల మరింతమందికి ఉచితంగా గ్యాస్ అందజేసే అవకాశం ఉందన్నారు.

రోడ్డు కూలి 8మంది మృతి

బీజింగ్: చైనాలో రోడ్డు కూలిపోవటంతో జరిగిన పెను ప్రమాదంలో 8మంది మృతి చెందారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం చైనా గ్యాంగ్‌డాంగ్‌లో జరిగిన రోడ్డు కూలిపోయిన ప్రమాదంలో 8 మృతి చెందగా మరో ముగ్గురు గల్లంతయ్యారన్నారు. కాగా మరో 9మందికి తీవ్రగాయాలయ్యాయని, ప్రమాదం జరిగిన ప్రాంతంలో 8మంది అక్కడికి అక్కడే మృతి చెందారన్నారు. ముగ్గురు గల్లంతవటంతోవారి గురించి అధికారులు గాలింపు చర్యలు చేపట్టారన్నారు. ప్రమాదంలో గాయపడిన తొమ్మిదిమందిని ఆసుపత్రిలో చేర్చి వైద్యచికిత్స అందిస్తున్నారని ప్రస్తుతం వీరి ఆరోగ్యస్థితి నిలకడగానే ఉందన్నారు.

డ్రీమర్ల సమస్యను పరిష్కరించాలి

✦ ఒబామా పథకాన్ని రద్దు చేసిన ట్రంప్ ✦ 8 గంటల పాటు నిర్విరామ ప్రసంగం ✦ 108 ఏళ్ల తరువాత చరిత్ర సృష్టించిన డెమొక్రట్ నాన్సీ పెలోసీ

వాషింగ్టన్ : అమెరికాకు చాలా మంది తమ సంతానంతో వచ్చి ఉద్యోగాలు చేస్తున్నారని, ఇది చట్టవిరుద్ధం కావడంతో అప్పటి అధ్యక్షుడు బరాక్ ఒబామా డెఫరెడ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌హుడ్ అరైవల్స్ ప్రోగ్రాంతో బహిష్కరణ నుండి రక్షించబడ్డారని డెమొక్రట్ నాన్సీ పెలోసీ గుర్తు చేశారు. వెంటనే డ్రీమర్ల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్‌లో ఒబామా ప్రోగ్రాంను ట్రంప్ ఎత్తేశారని అన్నారు. మార్చి 5 డెడ్‌లైన్‌తో రోజుకు వెయ్యి మంది వలసదారులు బహిష్కరణకు గురవుతారని తెలిపారు. ప్రస్తుతం డ్రీమర్స్‌ల పరిస్థితి చాలా దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వారికి ట్రంప్ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలవాలని ఆమె డిమాండ్ చేశారు.

ప్రసంగంతో చరిత్ర తిరగరాసిన నాన్సీ

అమెరికా ఎగువ సభలో డెమొక్రట్ నాన్సీ పెలోసీ చరిత్ర సృష్టించారు. అతిపెద్ద స్పీచ్ ఇచ్చి ఔరా అనిపించుకున్నారు. 108ఏళ్ల తరువాత ఇలాంటి పెద్ద స్పీచ్ నాన్సీ పెలోసీ ఇచ్చారు. సుమారు 8



గంటల పాటు ఏకధాటిగా మాట్లాడుతూనే ఉన్నారు. యువ వలసదారుల ఇబ్బందులు, ప్రభుత్వ కార్యకలాపాలపై నాన్సీ ప్రసంగం కొనసాగింది. వచ్చే నెలలో 78 సంవత్సరాలకు చేరుకునే కాలిఫోర్నియాకు డెమొక్రట్ నాన్సీ తన ప్రసంగాన్ని ఉదయం 10.04 నిమిషాలకు ప్రారంభించింది. ఇది నిరాంటకంగా 8 గంటలు కొనసాగింది. అలా మాట్లాడుతూనే ఉండటంతో సభ్యులంతా అవాక్కయ్యారు. మొత్తంగా 8 గంటల 7 నిమిషాలు మాట్లాడింది. సాయంత్రం 6.11 నిమిషాలకు ప్రసంగం ముగిసింది. 10 సెంటీమీటర్లు ఉన్న హీల్స్ వేసుకుని నిలబడి నాన్సీ మాట్లాడారు. ఓ సహాయకుడితో కేవలం నీరు తాగుతూ ఈ ప్రసంగం కొనసాగించింది. ప్రసంగం ముగిసిన వెంటనే సభ్యులతో పాటు స్పీకర్ లేచి నిల్చోని ప్రశంసలు కురిపించారు. 1909లో అత్యధిక సేపు ప్రసంగం నమోదైంది. రెండేళ్లకోసారి నిర్వహించే బడ్జెట్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారు. డ్రీమర్స్ సమస్య పరిష్కరించేలా చూడాలని ఆమె కోరారు. సభలో రిపబ్లికన్ డెస్క్ ఖాళీగా ఉన్నప్పటికీ డజన్ల కొద్ది ఉన్న డెమొక్రట్లు మాత్రం పెలోసీ ఇచ్చిన ప్రసంగాన్ని వింటూనే ఉన్నారు. డ్రీమర్ల విషయంలో పోరాడుతున్న న్యాన్సీ ధైర్యం ఎంతో నచ్చింది. నేను కూడా డ్రీమర్లకు భద్రతా విషయంలో పోరాడుతాను అని కాంగ్రెస్ నాయకురాలు బెట్టీ మెక్‌కల్లోం ట్విట్టర్ వేదికగా స్పందించారు. మళ్లీ డెమొక్రట్లు అమెరికా అభివృద్ధికి నిరోధకాలుగా మారుతున్నారని హౌస్ రిపబ్లికన్ స్టీవ్ పీయర్స్ ట్విట్టర్ వేదికగా విమర్శించారు.

ప్రభుత్వ కార్య క్రమాల నిర్వహణలో 'ప్రైవేట్' వద్దు

న్యూఢిల్లీ: ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించవద్దని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ అధికారిక వేడుకల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే సంస్కృతి బాగా పెరిగి పోయిందని, దీనివల్ల ప్రొటోకాల్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయనే ఫిర్యాదులు ఎక్కువై పోయాయి. ఈ విషయమై ఏర్పాటు చేసిన పార్లమెంట్ కమిటీ గత నెల 4వ తేదీన తన నివేదికను పార్లమెంట్‌కు సమర్పించింది. ఈ నివేదికలో చేసిన సూచలను అనుసరించి ఇక నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, సంస్థలు తమ అధికారిక కార్యక్రమాల నిర్వహణకు అనధికార వేడుకల నిర్వహణ సంస్థలను నియమించుకోకుండా అన్ని స్థాయిల్లోని అధికారులకు కఠినమైన ఆదేశాలు జారీ చేయాలని కేంద్రం కోరింది.

సరోగసి ఉద్యోగినులకు ప్రసూతి సెలవులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ అధీనంలో పనిచేసే మహిళా ఉద్యోగులకు కేంద్రం తీపి కబురు అందించింది. అద్దెగర్భం ద్వారా తల్లి అయిన ఉద్యోగులకు సైతం ప్రసూతి సెలవులు మంజూరు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. వీరికి సుమారు 180 రోజులు (26వారాలు) వరకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేశారు. కేంద్రంలో మాత, శిశుసంక్షేమశాఖ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉండే అన్ని శాఖలుకు దీనికి సంబంధించిన లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. కోర్టు ఆదేశాలతో కూడిన పత్రాలను కూడా జతచేసి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీ హైకోర్టు వెలువరించిన తీర్పు నేపథ్యాన్ని ఒకసారి పరిశీలిస్తే కేంద్రీయ విద్యాలయంలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు ఒకరు అద్దెగర్భం ద్వారా కవలలకు జన్మనిచ్చింది. అయితే ఆమె ప్రసూతి సెలవులకు దరఖాస్తు చేసుకోగా ఆమె వినతిని ఉన్నతాధికారులు తిరస్కరించారు. ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఢిల్లీ హైకోర్టు ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.



బంగ్లా మాజీ ప్రధాని జియాకు ఐదేళ్ల జైలు

✦ మరో నలుగురికి పదేళ్లు...

✦ నిధుల దుర్వినియోగంపై ప్రత్యేక న్యాయ స్థానం తీర్పు

ఢాకా : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, నేషనలిస్ట్ పార్టీ నాయకురాలు బేగం ఖలేదా జియాకు నిధులు దుర్వినియోగంపై అక్కడి ప్రత్యేక న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. బంగ్లాదేశ్ ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నాయకురాలు, 72 ఏళ్ల ఖలేదా జియా రెండు సార్లు ప్రధానిగా పని చేశారు. జియా నిర్వహిస్తున్న చారిటబుల్ ట్రస్ట్‌కు విదేశాల నుంచి పెద్దమొత్తంలో నిధులు వచ్చేవి. వీటిని అక్రమ మార్గంలో వినియోగించుకున్నారన్న ఆరోపణలు రుజువు కావడంతో ప్రత్యేక న్యాయస్థానం ఐదేళ్ల జైలు శిక్షను విధించింది. జియా చిన్నారుల కోసం చారిటబుల్ ట్రస్ట్‌ను కొనసాగిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ట్రస్ట్ కోసం వినియోగించాల్సిన 21 మిలియన్ల టకాలు (రూ.1,62,00,000)ను దుర్వినియోగం చేశారని ఆరోపణలు వచ్చాయి. కేసును పరిశీలించిన న్యాయస్థానం ఆమెపై వచ్చిన ఆరోపణలు రుజువు కావడంతో జైలు శిక్ష విధించింది. ఆమెపై 409, 109 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి శిక్షించినట్టు న్యాయమూర్తి మహ్మద్ అక్తేరుజ్మాన్ వివరించారు. అదేవిధంగా డిసెంబర్‌లో నిర్వహించే సాధారణ ఎన్నికల్లో ఆమె పోటీ చేయడానికి అనర్హురాలని కోర్టు ప్రకటించింది. జియాతో పాటు ఆమె కుమారుడు, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ఉపాధ్యక్షుడు తారిఖ్ రెహ్మాన్‌తో పాటు మరో నలుగురికి పదేళ్ల పాటు జైలు శిక్ష విధించారు. తీర్పును జడ్జి కేవలం పది నిమిషాల్లో చెప్పేశారు. పదేళ్ల శిక్షకు గురైన వారిలో చట్టసభ్యుడు ఖాజీ సలీముల్ హకీ కమల్, వ్యాపారవేత్త షర్ఫొద్దీన్ అహ్మద్, మాజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ కమల్ ఉద్దీన్ సిద్దీఖీతో పాటు ఆమె మనువడు మోమినుర్ రహ్మాన్ ఉన్నారు. ప్రత్యేక న్యాయస్థాన తీర్పుపై హైకోర్టును ఆశ్రయిస్తామని, దేవుడు ఉన్నాడని, న్యాయమే గెలుస్తుందని జియా చీఫ్ కౌన్సిల్ ఖోండ్‌కర్ మహబుబ్ హొస్సేన్ తెలిపారు.

'ఉపాధి'కి నిధుల కోత లేదు

న్యూఢిల్లీ: డిమాండ్‌కు లోబడి అమలవుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి లోబడి రాష్ట్ర ప్రభుత్వాలు అడుగుతున్న నిధుల్లో ఎలాంటి కోత విధించడం లేదని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం గురువారం విన్నవించుకుంది. సదరు పథకం కింద పని దినాలు లేదా రాష్ట్రాలకు నిధుల విడుదలలో కేంద్ర ప్రభుత్వం పరిమితి విధించిన దాఖలాలు లేవని జస్టిస్ మదన్ బి లోకుర్, ఎన్.వి.రమణలతో కూడిన ధర్మాసనానికి అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ తెలిపారు. స్వరాజ్ అభియాన్ రాజకీయ పార్టీ తరపున అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ దాఖలు చేసిన పిటిషన్‌కు కేంద్రం కౌంటర్ సమర్పించిన సందర్భంగా వేణుగోపాల్ సర్వోన్నత న్యాయస్థానం ఎదుట కేంద్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించారు. ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రాలకు నిధుల కేటాయింపు ప్రక్రియను వివరించాలని వాదోపవాదాల సందర్భంగా ఏజీని ధర్మాసనం అడిగింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో పథకం కింద తొలుత రూ.48,000 కోట్లు కేటాయించడం జరిగిందని చెప్పారు. కానీ మరిన్ని నిధుల కోసం రాష్ట్రా లు పట్టుబట్టగా ఆర్థిక మంత్రిత్వశాఖ అదనంగా రూ.7,000 కోట్లు కేటాయించిందని అధికారి తెలిపారు.

కేంద్రమంత్రి గిరిరాజ్‌పై భూకబ్జా కేసు

✦ ఎఫ్ఐఆర్‌లో మరో 32 మంది పేర్లు ✦ నితీష్ రాజీనామాకు ఆర్జేడీ డిమాండ్

పాట్నా: కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ భూ కబ్జా కేసులో ఇరుకున్నారు. బీహార్‌లో దళిత వ్యక్తికి చెందిన 2.06 ఎకరాల వ్యవసాయ భూమిని మంత్రి ఆక్రమించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాల మేరకు పాట్నా పోలీసులు మంత్రితోపాటు మరో 32 మందిపై ఎస్సీ, ఎస్టీ, భూకబ్జా నేరాలకు సంబంధించిన సెక్షన్లకింద కేసు నమోదు చేసినట్లు దనపూర్ పోలీసు అధికారి స్పష్టంచేశారు. బీజేపీకి చెందిన సింగ్, నవాడా పార్లమెంటు స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మోడీ కేబినెట్‌లో సూక్ష్మ మధ్య తరహాపరిశ్రమలశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. భూ ఆక్రమణను ప్రశ్నించినందుకు తనను పరుష పదజాలంతో దూషించారని అసోపూర్ గ్రామానికి చెందిన రాంనరైన్ ప్రసాద్ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, కేంద్ర మంత్రి తీరును ప్రతిపక్ష ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామి అయినందున, ఈ ఘటకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 'నితీష్ జీ.. సంకోచించకండి.. నోరు విప్పండి.. మీ మనసులోని అభిప్రాయాన్ని బయటపెట్టండి.. నీజాయతీగా వ్యవహరించండి.. రాజ్‌భవన్‌కు వెళ్లి రాజీనామా లేఖ ఇవ్వండి. మీ ప్రియ మిత్రుడు గిరిరాజ్ సింగ్ దళితుల భూమిని ఆక్రమించారు' అని తేజస్వియాదవ్ ట్వీట్ చేశారు. అంతేకాదు బీజేపీ సీనియర్ నేత, ఉప ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోడీని టార్గెట్ చేస్తూ మరో ట్వీట్ చేశారు. 'అక్రమాల గుట్టు విప్పే మాస్టర్.. పుకార్లు సృష్టించే సుశీల్ మోడీ.. మీరు ఎక్కడ? మీ అభిమాన కేంద్రమంత్రి గిరిరాజ్ దళితుల భూమిని ఆక్రమించారు. సుమో (సుశీల్ మోడీ) ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ పాపాల్లో మీకేమైనా వాటా ఉందా?' అంటూ తేజస్వి చురకలు వేశారు. గతేడాది జులైలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న తేజస్వి యాదవ్‌పై అవినీతి ఆరోపణలు వచ్చాయన్న కారణంగా రాజీనామాకు నితీష్ డిమాండ్ చేశారు. ఎంతకీ తేజస్వి రాజీనామా చేయకపోవడంతో, తానే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి సంచలనం సృష్టించారు. ఈక్రమంలో తాజా ఘటనపై తేజస్వి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాగా, ఆర్జేడీ విమర్శలపై బీజేపీ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ తిప్పికొట్టారు. గిరిరాజ్ సింగ్ చట్టాన్ని గౌరవించే వ్యక్తి.. వాస్తవాలేంటో సమయం వచ్చినపుడు కోర్టులో చెబుతారు. కొందరు ఈ అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారు. ఇదెంతమాత్రం తగదు అంటూ బదులిచ్చారు.

వ్యాపం కేసులో మరో చార్జిషీట్

న్యూఢిల్లీ: 2012 వ్యాపం కుంభకోణానికి సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తాజాగా చార్జిషీటు దాఖలు చేసింది. గ్రేడ్-2 కాంట్రాక్టు ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించిన అక్రమాల కేసులో, మధ్యప్రదేశ్ మంత్రి లక్ష్మికాంత్ శర్మ, ఆయన ఓఎస్‌డీతోపాటు 85 మంది పేర్లను ఇందులో పొందుపరిచింది. ఈ మేరకు చార్జిషీటును భోపాల్ ప్రత్యేక న్యాయస్థానానికి సమర్పించింది. 72 మంది అభ్యర్థులు, ఇద్దరు వ్యాపం అధికారులు, 11 మంది దళారుల పేర్లు చార్జిషీటులో పొందుపరిచామని సీబీఐ వర్గాలు తెలిపాయి. మొహింద్ర, త్రివేది అభ్యర్థుల మార్కులను ప్రభావితం చేశారని సీబీఐ వెల్లడించింది. ఎగ్జామినేషన్ కంట్రోలర్ పోస్టుకు అభ్యర్థుల జాబితాలో త్రివేది పేరు లేకున్నప్పటికీ, మంత్రి చొరవతో అతనిని కీలక పదవిలో కూర్చోబెట్టారని సీబీఐ దర్యాప్తులో తేల్చింది. మొహింద్ర, త్రివేది ఇద్దరు కలిసి కొందరు అభ్యర్థులకు ఎక్కువ మార్కులు వేశారు. ఓఎంఆర్ షీట్‌లో వచ్చిన మార్కులకు, ఫలితాలకు ఎంతో వ్యత్యాసం ఉంది. ఈ మార్కుల జాబితాను మొహింద్ర ల్యాప్‌ట్యాప్ నుంచి సేకరించామని సీబీఐ వివరించింది.

సచిన్ కుమార్తె పేరిట నకిలీ ట్విట్టర్.. టెకీ అరెస్ట్

ముంబై: సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా పేరిట నకిలీ ట్విట్టర్ ఖాతాను నిర్వహిస్తున్న టెకీనీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై డిప్యూటీ కమిషనర్ అక్బర్ పఠాన్ తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. నిందితుడు నితిన్ షిశోడే(39) ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడన్నారు. సచిన్ కుమార్తె సారా పేరుతో టెకీ నితిన్ నకిలీ ట్విట్టర్ ఖాతా నిర్వహిస్తూ అనుచిత వ్యాఖ్యలతో ట్వీట్స్ చేయడం ప్రారంభించాడన్నారు. ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌కు వ్యతిరేకంగా సారా పేరిట అనుచిత సమాచారాన్ని ట్విట్టర్‌లో ఉంచాడన్నారు. దీంతో సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు రావటంతో అంధేరీ ప్రాంతానికి చెందిన నిందితుడు టెకీ నితిన్‌ను అరెస్టు చేశామన్నారు. అనంతరం ఇంటరాగేషన్ అతను మరికొంతమంది బాలీవుడ్ ప్రముఖులకు చెందిన నకిలీ ఖాతాలను సృష్టించాడని తెలిసిందన్నారు. నిందితుడి నుంచి ల్యాప్ టాప్, రెండు మొబైల్ ఫోన్లు, రౌటర్‌తో సహా ఇంటర్నెట్‌కు వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితునికి కంప్యూటర్, ఇంటర్నెట్ సంబంధిత వ్యాపారాన్ని సైతం నిర్వహిస్తున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్టుచేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని డీసీపీ తెలిపారు.

రైలు బోగీల్లో సీసీ కెమెరాలు

న్యూఢిల్లీ: దేశంలోని అత్యంత విస్తృత నెట్ వర్క్ కలిగిన రైల్వే శాఖ ప్రయాణికుల భద్రతకు మరింత భరోసా ఇచ్చే దిశగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయనుంది. నిర్భయ పేరుతో ప్రారంభించిన ఈ పథకంలో ఇప్పటికే చాలా రైల్వేస్టేషన్స్‌లో సీసీ కెమెరాల భద్రతను ఏర్పాటు చేశారు. దీనికి కొనసాగింపుగా అన్ని ప్రధాన రైళ్లలో సీసీ కెమెరాలను అమర్చుతారు. తొలి విడతలో శతాబ్ది, రాజధాని, దురంతో రైళ్లలో ప్రతి కోచ్‌లోనూ నాలుగు సీసీ కెమెరాలను పెడతారు. వీటిలో బోగీలోకి ప్రవేశించే రెండు మార్గాల్లో రెండు, మరో రెండు బోగీ మధ్యలో అమర్చుతారని ఉత్తర రైల్వే జనరల్ మేనేజర్ విశ్వేష్ చౌబే మీడియాకు తెలిపారు. తాజా బడ్జెట్‌లో 11వేల రైళ్లలో కెమెరాల అమరికకు 3వేల కోట్ల రూపాయలను కేటాయించారని, రాబోయే రోజుల్లో అన్ని ప్రధాన రైళ్లు, సబర్బన్ రైళ్లతో పాటు 8,500 రైల్వే స్టేషన్‌లలో సీసీ టీవీల భద్రతను ఏర్పాటు చేస్తారని కూడా ఆయన చెప్పారు. 2013-14 సంవత్సరంలో 53,989 కోట్ల రూపాయలను కేటాయిస్తే, 2018-19లో దాన్ని దాదాపు మూడింతలు పెంచుతూ 1,48,528 కోట్లను కేటాయించడం విశేషమని, మొత్తం బడ్జెట్‌లో 73,065 కోట్లు ప్రయాణికుల భద్రతకే కేటాయించడం మెచ్చుకోదగ్గ విషయమని ఆయన చెప్పారు.

క్రీడాప్రభ

కోహ్లీ ఆటే కీలకం

- వన్డేల్లో విరాట్ ఎప్పటికి అత్యుత్తమ ఆటగాడే
- వీరూపై ప్రశంసల జల్లు



కేప్‌టౌన్: భారత క్రికెట్‌లో విరాట్ కోహ్లీ విలువ అమాంతం పెరిగిపోయింది. బుధవారం నాటి వన్డేల్లో కోహ్లీ తన వన్డే కెరియర్‌లో 34వ శతకంతో జట్టు చారిత్రక గెలుపులో కీలక పాత్ర పోషించాడు. దక్షిణాఫ్రికా పర్యటన కోహ్లీ సామర్థ్యానికి పరీక్షగా నిలిచిందని చెప్పవచ్చు. ఇప్పటివరకు దేశీయంగా గెలుపులతో రికార్డు సృష్టించిన కోహ్లీ విదేశాల్లో కూడా తనకు ఎదురులేదని చాటుకోవడానికి వచ్చిన అవకాశంగా ఈ పర్యటన నిలుస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. టెస్టు సిరీస్‌లో ఓటమికి ప్రతీకారంగా కోహ్లీ సేన ప్రతీకారాన్ని తీర్చుకొనే అవకాశంగా ఈ వన్డే సిరీస్ నిలిచింది. ఆ ప్రకారంగానే వరుసగా మూడు వన్డేలు గెలిచి సిరీస్‌లో 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. భారత జట్టు, కెప్టెన్‌గా కోహ్లీ పేర ఈ పర్యటనలో రికార్డులు నమోదు అవుతున్నాయి. న్యూలాండ్స్‌లో మూడో వన్డేలో 124 పరుగుల భారీ ఆధిక్యంతో గెలవడం కూడా రికార్డే. కోహ్లీ ఇన్నింగ్స్ ఆటను ఆస్ట్రేలియా కెప్టెన్ మైఖెల్ క్లార్క్ ప్రశంసిస్తూ అభినందనలు తెలిపాడు. వన్డేల్లో ఎప్పటికీ అత్యుత్తమ ఆటగాడు కోహ్లీనే అని ప్రశంసించాడు. భారత క్రికెట్లో ఇక కోహ్లీ యుగం ప్రారంభమైంది. అతనో రన్నింగ్ యంత్రమని ఆస్ట్రేలియన్ బ్యాట్స్‌మన్ డేవిడ్ వార్నర్ కూడా కోహ్లీని ప్రశంసించాడు. 2017 సంవత్సరాన్ని కోహ్లీ అత్యధికంగా 1,460 పరుగులు సాధించి ముగించాడు. మొత్తం 26 మ్యాచ్‌ల్లో 99.11 స్ట్రైక్‌రేట్‌తో ఈ రికార్డును సాధించాడు. కాగా బ్యాటింగ్ సగటు 76.84. ఇందులో ఆరు సెంచరీలు 7 హాఫ్ సెంచరీలున్నాయి. 2018లో కూడా కోహ్లీ తన రికార్డుల జోరును కొనసాగిస్తున్నట్లే కన్పిస్తోంది. వన్డే సిరీస్‌లో భాగంగా డర్బన్ వన్డేలో కోహ్లీ సెంచరీతో కదం తొక్కాడు. అనంతరం న్యూలాండ్స్ మైదానంలో మూడో వన్డేలో159 బంతుల్లో 160 పరుగులు చేసి నాటౌట్ నిలిచి తన జోరు ఈడా కొనసాగుతుందని స్పష్టం చేశాడు.

రికార్డ్ ఇన్నింగ్స్

దక్షిణాఫ్రికాలో దక్షిణాఫ్రికాపై అత్యధిక వ్యక్తిగత స్కోరు 160 పరుగులు సాధించిన బ్యాట్స్‌మన్‌గా కోహ్లీ రికార్డును తనపేర నమోదు చేసుకున్నాడు. 2001లో సౌరబ్ గంగూలీ జోహెన్నెస్‌బర్గ్‌లో 127 పరుగుల రికార్డును కోహ్లీ అధిగమించాడు. అంతేకాక, న్యూలాండ్స్ మైదానంలో దక్షిణాఫ్రికాపై సెంచరీచేసిన తొలి బ్యాట్స్‌మన్‌గా రికార్డు కూడా కోహ్లీదే. అంతకుముందు 2003లో సౌరబ్ గంగూలీ ఈ మైదానంలో కెన్యాపై సెంచరీ చేశాడు. అటు కెప్టెన్‌గా వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన రికార్డు కూడా కోహ్లీదే కావడం విశేషం. వన్డేలు, టెస్టుల్లో కలిపి మొత్తం కోహ్లీ 55 సెంచరీలతో ప్రపంచంలో ఐదో స్థానంలో ఉండగా . ప్రథమ స్థానంలో సచిన్ టెండూల్కర్(100 సెంచరీలు) ఉన్నాడు. రెండో స్థానంలో రికీ పాటింగ్(71 సెంచరీలు), మూడో స్థానంలో సంగకర(63సెంచరీలు) నాలుగో స్థానంలో కలిస్(62సెంచరీలు) ఉన్నాడు.

వికెట్ల మధ్య పరుగెత్తి చేసిన రన్స్‌లో రికార్డు

న్యూలాండ్స్ మైదానంలో చేసిన 160 పరుగుల్లో 100 పరుగులు వికెట్ల మధ్య పరుగెత్తి తీసినవే. ఈ విధంగా పరుగులు చేసిన ప్రపంచ బ్యాట్స్‌మన్లలో కోహ్లీ 5వ వాడు. కాగా భారత్ బ్యాట్స్‌మన్ సౌరబ్ గంగూలీ 1999లో శ్రీలంకపై చేసిన 130 పరుగుల్లో 98 పరుగులు ఈ విధంగానే సాధించాడు. అత్యధికంగా పరుగులు చేసిన రికార్డు మాజీ భారత క్రికెట్ జట్టుకోచ్, దక్షిణాఫ్రికాకు చెందిన బ్యాట్స్‌మన్ గ్యారీ కిర్‌స్టిన్ పేర ఉంది. కిర్‌స్టన్ 1996లో యుఏఈపై చేసిన 188 పరుగుల్లో 112 పరుగులు వికెట్ల మధ్య పరుగెత్తి తీసినవే. కోహ్లీ ఈ సిరీస్‌లో ఇప్పటివరకు 318 పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికాలో ఆదేశంపై ఒక వన్డే సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాట్స్‌మన్ కూడా కోహ్లీయే. గతంలో 2001-02లో రికీ పాటింగ్ 283 పరుగులు చేశాడు.

సిరీస్ వదులుకోం : కోహ్లీ

'మూడో వన్డేలో భారత్ 300 మార్కును చేరాలంటే నేను క్రీజ్‌లో ఉండాల్సిందేనన్న నిర్ణయించుకున్నాను. ఇలాంటి పరిస్థితులు శారీరకంగా, మానసిక సామర్థ్యాలకు పరీక్ష వంటివి. మేము మ్యాచ్‌ను కోల్పోకుండా స్పిన్నర్లను బరిలోకి దించాలని ముందే నిశ్చయించుకున్నాము. అది ఫలితమిచ్చింది. నాలుగో వన్డేలో ఇంకా ఒత్తిడి ఉంటుంది. ఎందుకంటే సిరీస్‌ను ఎట్టి పరిస్థితుల్లో కోల్పోయేందుకు సిద్ధంగా లేము' అని కోహ్లీ అన్నాడు. ఈ ఏడాది నేను 30వ వడిలోకి ప్రవేశిస్తున్నాను. 34-35 ఏళ్లు వచ్చేవరకు ఈ తరహా క్రికెట్‌ను ఆడాలని నేను కోరుకుంటున్నాను. పూర్తి స్థాయి సామర్థ్యంతో నేను ఆడాలనుకుంటాను అందుకోసమే నేను నిరంతరం శ్రమిస్తున్నాను. శిక్షణ పొందుతూ శారీరకంగా ఫిట్‌గా ఉండాలనుకుంటున్నాను అని కోహ్లీ చెప్పాడు. 'అంతర్జాతీయ మ్యాచుల్లో పరుగులు అంత సులభంగా రావు. అందుకు చాలా కష్టపడాలి. కొన్ని సందర్భాల్లో బ్యాటింగ్ పిచ్‌లో అవి తేలికగా రావచ్చు. కఠినమైన బౌలింగ్, పేస్, బౌన్స్‌లకు తొలుత అలవాటు పడాల్సి ఉంటుంది. అనంతరం 30 ఓవర్ల తర్వాత పిచ్‌లో మార్పు రావచ్చు, వికెట్ల పతనంను కూడా గమనిస్తూ ఇన్నింగ్స్‌ను కొనసాగించాలి' అని కోహ్లీ తన అనుభవాన్ని చెప్పాడు.



చాహల్, కుల్దీప్‌దే ఈ ఘనత

- మణికట్టు మాయాజాలం బాగా పనిచేసింది: కోహ్లీ

మణికట్టును అద్భుతంగా తిప్పుతూ స్పిన్ బౌలింగ్ చేస్తున్న యజువేంద్ర చాహల్, కులదీప్ యాదవ్ దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌లో నమ్మశక్యంకాని రీతిలో రాణిస్తున్నారని కెప్టెన్ కోహ్లీ గురువారం మీడియాతో అన్నాడు. అయితే వారు టెస్ట్‌క్రికెట్‌లో కూడా ఆడతారా అన్న విషయంపై కోహ్లీ స్పందిస్తూ కొన్ని విషయాలు తెలిసీ తెలియనట్లుంటాయని దాటవేశారు. ఏమైనప్పటికి వీరు నిర్వహించిన పాత్ర అమోఘం. ఈ పరిస్థితుల్లో వీరు చేసిన బౌలింగ్ తీరు ఇప్పటివరకు నేను చూడలేదు. బంతిని అన్ని కోణాల్లో తిప్పుతూ ప్రత్యర్థులను బెంబేలెత్తించేశారు. వారిని ప్రశంసించాలంటే పదాలు చాలవు. వారు బంతిని క్రీజుకు ముందు వేసి బ్యాట్స్‌మన్లను ముందుకు వచ్చి ఆడేలా రెచ్చగొట్టడం.. వారి బౌలింగ్ తీరు చూడ ముచ్చటేసింది అని కోహ్లీ అన్నాడు. చాహల్, యాదవ్‌లు సంయుక్తంగా 21 వికెట్లు తీశారు. వీరిని ఎలా ఎదుర్కోవాలన్నది సఫారీలు ఇంకా తెల్చుకోలేకపోతున్నారు. ఇక్కడి పరిస్థితులు కూడా వారికి అనుకూలిస్తున్నాయి, పిచ్‌నుంచి సహకారం రాకున్నా వారు వికెట్లు తీశారు అని అన్నాడు. ఈ విజయాల ఘనత వారికి దక్కుతుంది అని కోహ్లీ పేర్కొన్నాడు. వచ్చే ప్రపంచకప్‌లో వారిద్దరు కీలకం కానున్నారు. విదేశీ గడ్డపై జరుగనున్న ప్రపంచ కప్‌లో వీరిద్దరు రెచ్చిపోతారని పేర్కొన్నారు. యాదవ్ తన టెస్ట్ కెరియర్ గతేడాది ఆస్ట్రేలియాపై ప్రారంభించగా చాహల్ ఇంకా టెస్టుల్లోకి అడుగు పెట్టలేదు.

ఒలింపిక్స్ పోటీలు ప్రారంభం

- కర్లింగ్‌లో రష్యాపై అమెరికా గెలుపు
- నేడు అధికారిక ప్రారంభోత్సవాలు

గ్యాంగ్నూంగ్(దక్షిణ కొరియా): అధికారికంగా శీతాకాల ఒలింపిక్ క్రీడలు నేడు ప్రారంభం కానున్నప్పటికి పోటీలు గురువారంనాడే మొదలయ్యాయి. స్థానిక కర్లింగ్ కేంద్రంలో జరిగిన కర్లింగ్ క్రీడ (మంచు ఫలకలపై ఆడే గేమ్) మిక్స్‌డ్ డబుల్స్‌లో ఒలింపిక్ అథ్లెట్స్ ఫ్రం రష్యా(ఓఏఆర్) అథ్లెట్లు అమెరికా అథ్లెట్ల చేతిలో ఓడిపోయారు. ఈ కర్లింగ్ సెంటర్ 3000 మంది ప్రేక్షకులు కూర్చుండి తిలకించే సామర్థ్యం కలిగివుంది. అమెరికన్ అన్నాల చెల్లెలి జోడీ మట్, బెక్కా హామిల్టన్ జోడీ రష్యాకు చెందిన భార్యా భర్తలు అలెక్సాండర్ కృషెఇనిత్‌స్కి, అనాస్టాసియా బ్రిజ్‌గలోవా జంటపై 9-3 తేడాతో విజయం సాధించారు. కాగా, ఓఏఆర్ జట్టుకు స్థానిక అభిమానులు రష్యా జెండాతో స్వాగతం పలికారు. రష్యా జట్టు ఒలింపిక్స్‌లోకి ఒలింపిక్ జెండా కింద ప్రవేశించారు.



2014 సోచి ఒలింపిక్స్‌లో డోపింగ్ టెస్టులో రష్యా అథ్లెట్లు పట్టుబడటంతో రష్యాను ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనకుండా ఐవోసీ నిషేధం విధించింది. ఈ ఈవెంట్‌లో కాగా రష్యా జోడీ పలు తప్పిదాలను అమెరికా జంట సధ్వినియోగం చేసుకుంది. ఇదే క్రీడకు సంబంధించి మరో పోటీలో దక్షిణా కొరియా జోడీ లీ కి జోంగ్, జాంగ్ హెయ్‌జి జోడీ ఫిన్‌లాండ్ జోడీపై 9-4 తేడాతో విజయం సాధించింది. నార్వే జోడీ కెనడా జోడీపై 9-6 తేడాతో విజయం సాధించింది. స్విట్జర్లాండ్, చైనాపై 7-5 తేడాతో విజయం సాధించింది. ఆదివారం వరకు ఈ పోటీలు రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరుగుతాయి. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్‌కు చేరుతాయి. మంగళవారం జరిగే మ్యాచ్‌లో పతక విజేతల నిర్ణయం జరుగుతుంది.

2030 శీతాకాల ఒలింపిక్స్ నిర్వహణకు సాల్ట్ లేక్ సిటీ బిడ్



లాస్‌ఏంజిల్స్: 2030లో జరిగే శీతాకాల ఒలింపిక్స్‌కు అమెరికాలోని ఉటా రాష్ట్రానికి చెందిన సాల్ట్ లేక్ సిటీ తన బిడ్‌ను దాఖలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉటా స్టేట్ లెజిస్లేచర్ చేసిన తీర్మానంపై ఉటా గవర్నర్ గ్యారీ హెర్బర్ట్ సంతకం చేశారని స్థానిక మీడియా గురువారం వివరాలను ప్రచురించింది. '2030 శీతాకాల ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడానికి ఉటా సిద్ధంగా ఉంది. ఈ క్రీడలకు ఇంతకంటే మంచి ప్రదేశం ప్రపంచంలో మరొకటి ఉన్నదని నేను అనుకోవ డంలేదు' అని గ్యారీ ట్విటర్లో పేర్కొన్నారు. గతంలో 2002లో సాల్ట్ లేక్ సిటీ శీతాకాల ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చింది. 2030లో శీతాకాల ఒలింపిక్స్ నిర్వహణ కు అమెరికా ఒలింపిక్ కమిటీ అధికారులు కూడా ప్రత్యేక ఆసక్తిని ప్రకటిస్తున్నారు. ఈసారి బిడ్‌ను వేయాలని సూచించారు. కాగా సాల్ట్ లేక్ సిటీతోపాటు, కాలిఫోర్నియాతో సరిహద్దు కలిగిన రెనో-తాహో, కొలరాడో రాష్ట్రంలోని డెన్వర్ పట్టణాలు కూడా ఈ క్రీడలను నిర్వహించడానికి ఆసక్తిని ప్రకటించాయి. నేడు ప్యాంగ్ చాంగ్‌లో శీతాకాల ఒలింపిక్స్-2018 ప్రారంభం కానున్నాయి.

కోచ్‌లు తల్లిదండ్రులతో సమానం

- సచిన్ టెండూల్కర్
- ఈవెన్ దేర్ ఈజ్ ఏ డాక్టర్ పుస్తకావిష్కరణ



ముంబై: కోచ్‌లు తమకు తల్లి దండ్రులతో సమానమని సచిన్ టెండూల్కర్ అన్నారు. గురువారం డాక్టర్. యశ్వంత్‌కుమార్, రాజేష్ చౌహాన్, క్రిష్ణన్ శివరామకృష్ణన్ రాసిన ఈవెన్ దేర్ ఈజ్ ఏ డాక్టర్ అన్న పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సచిన్ మాట్లాడుతూ.. కోచ్‌లు, గురువులు తల్లి దండ్రులతో సమాన మని చెప్పారు. ఎందుకంటే తమ జీవితంలో ఎక్కువ కాలం వారితో గడుపుతామని తెలిపారు. ఈ సందర్భంగా తన కోచ్ రమా కాంత్ అచ్రేకర్ ను గుర్తుచేసుకుంటూ.. ఆయన తన క్రీడా జీవితాన్ని ఏవిధంగా మలుపు తిప్పాడో వివరించాడు. అచ్రేకర్ సమయ పాలన కచ్చితంగా పాటించేవాడేనన్నారు. అంతేకాక వ్యక్తిగత భద్రత, ప్రేమను చాటేవాడన్నారు. భాగా ఆడావని ఆయన ఒక్కసారి కూడా అనలేదని అయితే. తనను వెంటతీసుకు వెళ్లి బేల్‌పురి పానిపూరి తినిపించేవాడని గుర్తు చేసుకున్నాడు. ఈ ప్రేమ అప్యాయలతో తాను ఆటలో మరింత రాణించే వాడినని సచిన్ చెప్పారు. చిన్న తనంలో తాను చిలిపిగా అల్లరి చేసేవాడినని అన్నాడు. నా కెరియర్‌ను ప్రోత్సాహమి చ్చే కుటుంబం దొరకటం తన అదృష్టంగా తెలిపారు. మా తండ్రి ఎల్లప్పుడు ప్రశాంతంగా ఉండేవాడని తెలిపారు. ఎప్పుడూ కోపంకు వచ్చేవాడు కాదని.. మా అమ్మ కూడా అదేతీరని తెలిపాడు. వారు తగిన స్వేచ్ఛనిస్తూ ప్రోత్సాహమిచ్చారన్నాడు.

సింధు గెలిచినా తప్పని ఓటమి



అలోర్ సెటార్: ఆసియా బ్యాడ్మింటన్ టీం ఛాంపియన్ షిప్ క్వార్టర్ ఫైనల్లో మహిళా షట్లర్లు జపాన్ షట్లర్ల చేతిలో 1-4 తేడాతో పరాజయం పాలయ్యారు. పివి సింధు తాను ఆడిన సింగిల్స్‌లో గెలిచినప్పిటికీ ఫలితం లేకపోయింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భాగంగా సింగిల్స్ మ్యాచ్‌లో సింధు వరల్డ్ నెంబర్ 2 యమగుచిపై వరుస సెట్లలో 21-19, 21-15 తేడాతో గెలిచింది. మరో సింగిల్స్‌లో శ్రీ కృష్ణ ప్రియ కుదారవల్లి సాయక్ సాటోపై 12-21, 10-21 తేడాతో ఓటమి చెందింది. ఆశ్విని పొన్నప్ప ఆడిన సింగిల్స్ మ్యాచ్‌లో జపాన్‌కు చెందిన ఆయా ఓహ్రి చేతిలో 14-21, 12-21 తేడాతో ఓటమి చవిచూసింది. డబుల్స్‌లో సన్యోగితా గోర్‌పడే ప్రజక్త సావంత్ జంట షిహో తనాక, కొహరు యోనెమొటోల చేతిలో 17-21, 17-21 తేడాతో ఓడి పోయారు. మరో డబుల్స్ మ్యాచ్‌లో పొన్నప్ప , సిక్కిరెడ్డి జోడీ మిసకి మత్సుటొమోలపై 18-21, 18-21 తేడాతో ఓటమి చెందారు. కాగా భారత్ మహిళలు, పురుషుల విభాగంలో ఓటమి లేకుండా క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. గ్రూప్ డబ్ల్యులో భారత మహిళల జట్టు హాంగ్‌కాంగ్ కు పైన జపాన్‌కు దిగువన ఉంది. కాగా గ్రూప్ డిలో పురుషుల జట్టు మాల్దీవులను ఓడించి క్వార్టర్స్‌కు చేరింది.

జియో టీవీకి ఒలింపిక్స్ ప్రసార హక్కులు

ముంబై: దక్షిణ కొరియాలో జరుగుతున్న శీతాకాల ఒలింపిక్స్ క్రీడలను భారత్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు హక్కులను దేశంలో అత్యంత ఆదరణ పొందుతున్న టీవీ ఆప్ జియో టీవీ దక్కించుకుంది. ఈ మేరకు జియో టీవీ గురువారం ఒక ప్రకటనను చేసింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ)తో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ ప్రసార హక్కులు తమకు దక్కాయని జియోటీవీ తెలిపింది. ఒలింపిక్ శీతాకాల క్రీడలు నేటినుంచి దక్షిణ కొరియాలోని ప్యాంగ్ చాంగ్ పట్టణంలో ప్రారంభమై 25వ తేదీవరకు కొనసాగనున్నాయి. జియో టీవీకి అధనంగా ఒలింపిక్ కమిటీకి చెందిన ఒలింపిక్ ఛానెల్ కూడా ప్రత్యక్ష ప్రసారంను దేశంలో చేయనుంది.

90 దేశాల అథ్లెట్లు రాక

మొత్తం 15 క్రీడాంశాల్లో 102 విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి. ఇందులో స్కీయింగ్, స్కేటింగ్, ల్యూజ్, స్కె జంపింగ్ ఐస్ హాకీ, స్నో బోర్డింగ్ భాగంగా ఉన్నాయి. భారత్‌తో కలిపి మొత్తం 90 దేశాలనుంచి క్రీడాకారులు ఇందులో పాల్గొంటున్నారు. భారత్ తరపున ల్యూజ్ క్రీడలో శివ కేశవన్, స్కీయింగ్‌లో జగదీష్ పాల్గొన నున్నాడు.



న్యూఢిల్లీ: కేంద్ర క్రీడల శాఖ మంత్రి రాజ్యవర్ధన్ సింగ్‌తో ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్‌ల్లో బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఫైనల్ మ్యాచ్ తర్వాత స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ షట్లర్లు బొక్కా నవనీత్, విష్ణువర్ధన్ గౌడ్.. రజత, కాంస్య పతకాలు సాధించిన క్రీడాకారులు

"ఖేలో" విజేతలకు శాట్స్ అభినందన



హైదరాబాద్, ఆంధ్రప్రభ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన "ఖేలో ఇండియా నేషనల్ స్కూల్ గేమ్స్-2017" పోటీలలో విజేతలుగా నిలిచిన తెలంగాణ విద్యార్థినీ, విద్యార్థులను శాట్స్ ఛైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి అభినందించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో 11 క్రీడా విభాగాలలో 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాడ్మింటన్ డబుల్స్ విభాగంలో విష్ణువర్ధన్ గౌడ్, నవనీత్ 23-21, 21-16 స్కోరుతో కేరళకు చెందిన యడ్వీన్, అరవింద్ జోడీపై గెలిచి స్వర్ణ పతకం పొందాడు. వ్యక్తిగత విభాగంలో సాయి చంద్ 21-13, 21-17 స్కోరుతో మహారాష్ట్రకు చెందిన రోహాన్ పై గెలిచి కాంస్య పతకం గెలుచుకున్నాడు. అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో శ్రీకాంత్ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నాడు. ఈ అభినందన కార్యక్రమంలో క్రీడాకారులను న్యూఢిల్లీలోనే శాట్స్ ఛైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, వీసీ అండ్ ఎండీ ఎ.దినకర్ బాబు, ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ ప్రతినిధి, స్టాన్లీ తదితరులు అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో సి.హెచ్. కార్తీక్, ఎ. శివలింగేశ్వర్, బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో విష్ణువర్ధన్ గౌడ్, నవనీత్ జోడీ బంగారు పతకాలు గెలుచుకున్నారు. పరుగు పందెంలో శ్రీకాంత్ రజత పతకం సాధించగా, బ్యాడ్మింటన్ సింగిల్స్ విభాగంలో సాయి చంద్ కాంస్యం చేజిక్కించుకున్నాడు.

బాటా పవర్ బ్రాండ్ ప్రచాకర్తగా స్మృతి మంధాన



న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్ జట్టు ఓపెనర్ స్మృతి మంధాన బాటా స్పోర్ట్ వేర్ బ్రాండ్ 'పవర్'కు ప్రచార కర్తగా వ్యవహరించనుంది. 21 ఏళ్ల మంధాన తన అద్భుతమైన ఆటతో రానున్న తరాలకు రోల్ మోడల్‌గా నిలిచింది. అంతేకాక దేశంలో భారీ సంఖ్యలో అభిమానులను సంపాదించుకుంది. ఆమె క్రీడా జీవితంలో మలుపు తిప్పింది ఏదైనా ఉన్నది అంటే గతేడాది జరిగిన ఐసీసీ ప్రపంచకప్ అని చెపుతున్నారు విశ్లేషకులు. పవర్ బ్రాండ్‌కు ప్రచార కర్తగా వ్యవహరించడంపై మంధాన వ్యాఖ్యానిస్తూ.. యువత తమ శారీరక ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్న బాటా కంపెనీ దృక్పథం తనను ఆకర్షించిందని తెలిపింది. ప్రచార కర్తగా ఉండటం తనకు లభించిన ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నాన్నది. ఇది తన వ్యక్తిగత ఆహార్యం, విలువలను ప్రతిబింబిస్తుందని పేర్కొంది. ఈ బ్రాండ్ నాకు ఇష్టమని అందుకే దీనితో ఒప్పందం కుదుర్చుకున్నానని తెలిపింది. బాటా ఇండియా మేనేజర్ సందీప్ కటారియా మాట్లాడుతూ... అత్యంత నైపుణ్య క్రీడాకారిణుల్లో స్మృతి ఒకరు అని అన్నారు. తన ఆటతో దేశానికి కీర్తిని తెచ్చిన ఆమెకు పవర్ బ్రాండ్‌కు ప్రచారకర్తగా నియమించినందుకు గర్వపడుతు న్నామన్నారు.

Published & Printed by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812
RNI Regd.No.32178/1977, Printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT.

ఆంధ్రప్రభ lifepage2012@gmail.com
Lively Interaction For Ever
లైఫ్
శుక్రవారం
9 ఫిబ్రవరి 2018

చీరలే చిత్రపటాలు!





చీరలను కాన్వాస్‌గా మార్చుకుని అద్భుతమైన చిత్రరచన చేస్తున్నారు ఇప్పుడు. చీరలకెక్కని డిజైన్లు లేవు. అసలు చీరలపై దర్శనమివ్వని దృశ్యం లేదంటే అతిశయోక్తి కాదు. ప్రేమికులు తమ ప్రేమ కబుర్లను కూడా చీరలపై చిత్రించుకుంటున్న రోజులివి. నిన్నకాక మొన్న బాహుబలి ప్రధానపాత్రలతో చీరలు భళా అనిపించాయి. ఎంబ్రాయిడరీ, ప్యాచ్ వర్క్, కలంకారీ అద్దకాలు, పెయింటింగ్స్ ఇలా పలురూపాల్లో భిన్న కళా రూపాలను చీరల మీద అద్భుతంగా చిత్రిస్తున్నారు. ఇక్కడ కనబడుతున్న కేరళ చీరలపైన కూడా అలాంటి చిత్రకళని చూడవచ్చు. వీటిలో కలంకారీ అద్దకాలు కూడా ఉన్నాయి. చీరకట్టే ఒక సంప్రదాయమైతే...చీరపై మరిన్ని సాంప్రదాయ కళలు ఇలా ఊపిరిపోసుకుంటూ చూపరులకు కనువిందు చేస్తున్నాయి.



ప్యాడ్ మ్యాన్‌తో ఆ బ్యాడ్ వదిలేనా?!

సామాజిక జాడ్యంపై సమరశంఖం!



మన జీవితాల్లో కొన్ని విషయాలు చాలా చిత్రంగా అనిపిస్తాయి. అంతరిక్షంలోకి వెళ్లి ఇతర గ్రహాలు నివాసయోగ్యమా కాదా...అనే విషయాలను పరిశోధిస్తాం కానీ....ఇక్కడ జీవితాలను సరళంగా చేసుకునే విషయాలను గురించి మాట్లాడము. రుతుక్రమం విషయంలో ఇలాగే జరుగుతోంది. సినిమాలు కళలు మోడలింగ్ ప్రకటనలు...ఇలా పలు రూపాల్లో స్త్రీ శరీరాన్ని ఎలాంటి ఆటంకం లేకుండా పూర్తి అనాచ్ఛాదితంగా చూపుతున్నారు కానీ...ప్రకృతి సహజంగా జరిగే ఒక సాధారణ శారీరక ప్రకియ విషయంలో మాత్రం అంతులేని గోప్యతని పాటిస్తున్నాం. అందుకే అక్షయ్ కుమార్ ప్యాడ్‌మ్యాన్ సినిమా...ఒక చిన్నపాటి సంచలనంగా మారింది. ఈ విషయం గురించి పైకి మాట్లాడకూడదని భావిస్తున్నవారంతా తమ సినిమాతో మారాలని... ఆ సామాజిక జాడ్యం వదలాలని ఈ సినిమా బృందం కోరుతోంది. రుతుక్రమం విషయంలో మహిళలు ఎన్నో అడ్డుగోడలు, అనారోగ్యాలు భరిస్తున్నా...దీని గురించి ధైర్యంగా పెగిలిన గళాలు తక్కువ. అందుకే ప్యాడ్‌మ్యాన్ రాక ఇప్పుడు అత్యవసరం. అసలు...ఒక్క ప్యాడ్‌మ్యాన్ కాదు...వందలు వేలు లక్షల్లో ప్యాడ్‌మ్యాన్‌ల అవసరం సమాజానికి ఉంది.

-ఇండియాలో కేవలం 12శాతం మంది మహిళలు మాత్రమే సురక్షితమైన శానిటరీ ఉత్పత్తులను వాడుతున్నారు.

-గత ఏడాది తమిళనాడులో క్లాసులో రుతుస్రావం మరకలు దుస్తులపై కనిపించినందుకు టీచరు అందరిముందు తిట్టిందని... 12ఏళ్ల బాలిక ఆత్మహత్య చేసుకుంది.

అన్నింటా ఆమె ముందుకు వెళుతున్నా...ఆ హక్కుల్లో వెనుకడుగే...

రుతుక్రమం అనే విషయాన్ని గోప్యంగా ఉంచడం అనేది ఎప్పటినుండో ఉన్న ఆచారం. అయితే ఈ గోప్యతతో మరెన్నో విషయాలు చీకటిలో ఉండిపోతున్నాయి. ఒకరు ఎదుర్కొంటే అది వ్యక్తిగత సమస్య అవుతుంది. కానీ పది, వంద, వేలు, లక్షల మంది ఎదుర్కొంటున్న సమస్య వ్యక్తిగతం కాదు...సామాజికమే అవుతుంది. అలాంటిదే రుతుక్రమం విషయంలో మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక భావజాలం. రుతుక్రమాన్ని సిగ్గుపడాల్సిన విషయంగా, మాట్లాడకూడని అంశంగా, అదొక అపవిత్రతగా...ఇలా ఇన్ని రకాలుగా దాన్ని సృష్టించడం వల్లనే దాని చుట్టూ అల్లుకుని ఉన్న ఏ సమస్యనీ స్త్రీలు నోరువిప్పి చెప్పలేకపోతున్నారు. స్కూళ్లలో ఆఫీసుల్లో, క్రీడారంగంలో, ప్రయాణాలు చేసే ఉద్యోగాల్లో, రాజకీయాల్లో సినిమాల్లో... మహిళలు కనిపించని చోటు లేదిప్పుడు. ఆమె తెలివితేటలను, శక్తి సామర్థ్యాలను, శారీరక శ్రమని కుటుంబాలు సమాజాలు దేశాలు వినియోగించుకుంటున్నపుడు ఆమె ఆరోగ్యం అనేది సామాజిక బాధ్యతే అవుతుంది. రుతుక్రమం సమస్యలు బయటకు చెప్పగల పరిస్థితులకోసం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా మహిళలు నినదిస్తున్నారు. ఆ సమయంలో శారీరక శుభ్రత, విశ్రాంతి, బలమైన ఆహారం ఇవన్నీ పూర్తిగా మహిళల ఆరోగ్యానికి సంబంధించిన హక్కులు. రుతుక్రమం విషయంలో గోప్యతని పాటిస్తే...ఈ హక్కులన్నింటినీ కాలరాసినట్టే అవుతుంది.

ఆ సమయంలో అంటరానివారిగా...

రుతుక్రమం చుట్టూ అల్లుకుని ఉన్నవి .. భయం, సిగ్గు, సంశయం, అవమానం, అపరాధభావన, అపవిత్రత...లాంటి నెగెటివ్ భావాలు అయినప్పుడు ఏ అమ్మాయి అయినా మహిళ అయినా దీని గురించి నోరువిప్పి మాట్లాడే పరిస్థితి ఎలా ఉంటుంది. అదే నేటి సమాజంలో మనం చూస్తున్నది. బయటకు మాట్లాడలేని పరిస్థితి కారణంగా ఆ సమయంలో మహిళలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లోనూ, అసంఘటిత రంగంలో వివిధ పనుల్లో పనిచేసే ఆడవాళ్లకు రుతుక్రమం సమయంలో సురక్షితమైన ప్రదేశాలు, నీళ్లు లాంటి వసతులే ఉండవు. ఇక స్కూళ్ల సంగతైతే చెప్పాల్సిన పనే లేదు. చాలా స్కూళ్లలో రుతుక్రమం సమయంలో ఆడపిల్లలు స్కూళ్లు కాలేజీలు మానేస్తున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. నేటికీ భారత్‌లో గ్రామీణ ప్రాంతాలలో ఆ సమయంలో ఆడవాళ్లు వంటింట్లోకి వెళ్లకూడదని, మొక్కలకు నీళ్లు పోయరాదనే ఆచారాలు ఉన్నాయి. ఆ సమయంలో పూర్తిగా ఇంట్లోకే రానివ్వని వారూ ఉన్నారు. గ్రామాల్లోని స్కూళ్లలో ఒక సర్వేని నిర్వహించినప్పుడు 55 శాతం మంది అమ్మాయిలు తాము ఆ నాలుగు రోజులు వంటింట్లోకి వెళ్లకూడదని తాము ఆహారాన్ని పట్టుకుంటే పాడవుతుందని చెప్పారు. సుమారు 22శాతం మంది



రవిశాస్త్రి



అక్షయ్‌కుమార్

అమ్మాయిలు ఆ సమయంలో కుటుంబంలోని మగవారితో కూడా తాము మాట్లాడకూడదని నమ్ముతున్నారు. మతాచారాలను పాటించడం మానవ హక్కుల్లో ఒకటిగా చెబుతున్నా....మహిళలు రుతుక్రమం సమయంలో ఆలయాల్లోకి వెళ్లకూడదనే ఆచారం ఉంది. కొన్ని ఆలయాల్లో అయితే మహిళల ప్రవేశం పూర్తిగా నిషిద్ధం.

మనదేశంలోనే కాదు...

మనదేశంలోనే కాదు...ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఇలాంటి పరిస్థితే ఉంది. ఆఫ్ఘనిస్తాన్‌లో ఒక పాత సంప్రదాయం ప్రకారం ఆ సమయంలో స్నానం చేస్తే పిల్లలు కలగరని నమ్ముతారు.

కొంతమంది మహిళలకు వారి శరీరతీరుని బట్టి పీరియడ్స్ అత్యంత బాధాకరంగా ఉంటాయి. అయినా...ఇందుకోసం సెలవు కావాలి...అని అడిగే ధైర్యం ఏ మహిళా చేయలేకపోతున్నది. దక్షిణ కొరియా, చైనా, జపాన్, ఇండోనేషియా లాంటి దేశాల్లో మహిళలకు పీరియడ్స్ టైంలో సిక్‌లీవుని ఇచ్చేలా చట్టాలున్నాయి. కానీ చాలా దేశాలు ఈ విషయం గురించి పట్టించుకోవటం లేదు. నేపాల్‌లో గ్రామీణప్రాంతాల్లో ఆడపిల్లలను ఈ సమయంలో ఇంటికి దూరంగా ఒంటరిగా ఉంచుతారు. వారిని స్కూళ్లలో కూడా అందరితో కలిసి కూర్చోనివ్వరు. రుతుక్రమ సమయంలో తాము మగవారిని ముట్టుకోకూడదని, అలా చేస్తే వారు ఆనారోగ్యం పాలవుతారనే నమ్మకం కూడా ఉంది. జపాన్‌లో మహిళల చేత సుషీ అనే వంటకాన్ని చేయించరు. రుతుక్రమంలో ఉన్నపుడు మహిళలు రుచిని సరిగ్గా తెలుసుకోలేరని అక్కడి వారు నమ్ముతారు. అయితే కొంతమంది మహిళలు ఇప్పుడు సుషీ చెఫ్‌లుగా మారుతున్నారు. ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ యునిసెఫ్ అధ్యయనం ప్రకారం ఇరాన్‌లో 48శాతం మంది అమ్మాయిలు రుతుక్రమాన్ని అనారోగ్యమని అనుకుంటున్నారు. 2012లో నేషనల్ సెంటర్ ఫర్ బయో టెక్నాలజీ ఇన్‌ఫర్మేషన్ నిర్వహించిన ఒక అధ్యయనంలో ఇరాన్‌లోని అమ్మాయిలకు రుతుక్రమం గురించిన అవగాహన కల్పించాక సగం మంది అమ్మాయిలు తమ పీరియడ్స్ సమయంలో స్నానం చేయటం మొదలుపెట్టారని...తేలింది.

బొలీవియాలో అమ్మాయిలు తాము వినియోగించిన ప్యాడ్స్‌ని ఇతర చెత్తలో కలిపి పడేస్తే తమ ఆరోగ్యం పాడవుతుందని లేదా క్యాన్సర్ వస్తుందని నమ్ముతారని యునిసెఫ్ వెల్లడించింది. ఈ కారణంగా వారు బయటకు వెళ్లినప్పుడు తీసేసిన వాటిని... ఎక్కడా పడేయకుండా ఒక బ్యాగులో వేసుకుని ఇంటికి తెస్తుంటారు. బొలీవియాలో ఈ విషయంపై అమ్మాయిలు చాలా సిగ్గుపడుతున్నట్టుగా గుర్తించిన యునిసెఫ్ చాలా భారీ ఎత్తున ఈ విషయంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించింది.

అరుణాచలం...అసలైన ప్యాడ్ మ్యాన్

తమ శరీరంలో జరుగుతున్న ఒక శారీరక ప్రక్రియని గురించి స్త్రీలే మాట్లాడలేనప్పుడు ఇక పురుషులు ఆ విషయం గురించి మాట్లాడటం చర్చించడం ఒక సామాజిక సాహసమే అవుతుంది. మగవారు దీన్ని పూర్తిగా తమకు అవసరం లేని విషయంగా, తమకే మాత్రం సంబంధం లేని విషయంగా భావిస్తున్న రోజుల్లో అరుణాచలం మురుగానంతం...మహిళలకు ఆరోగ్యపరమైన భద్రతని ఇస్తూ చవగా లభించే శానిటరీ నేప్‌కిన్స్ గురించి ఆలోచించారంటే...ఆయనలోని మానవత్వం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. ఆయనే ప్యాడ్‌మ్యాన్ సినిమాకు ప్రేరణ. నిజమైన ప్యాడ్ మ్యాన్ అరుణాచలమే. ఆయన జీవితంలోని నిజ సంఘటనలను, ఆయన రాసిన కొన్ని వ్యాసాలను ఆధారంగా చేసుకుని ట్వింకిల్ ఖన్నా 'ది లెజండ్ ఆఫ్ లక్ష్మీప్రసాద్' అనే సంకలనంలో ఒక కథ రాశారు. ఆ కథే ప్యాడ్‌మ్యాన్ సినిమాకు ఆధారం. తమిళనాడు కొయింబత్తూర్‌కి చెందిన అరుణాచలం మురుగానంతం ఒక కల కన్నారు...భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలు శానిటరీ నేప్‌కిన్స్ లేకపోవటం వలన అనారోగ్యాల బారిన పడకూడదని. చివరికి అతను చవకగా శానిటరీ ప్యాడ్‌లను తయారుచేయగల మిషన్‌ని కనుగొన్నారు. అరుణాచలం స్కూలు చదువుని మధ్యలో ఆపేసిన విద్యార్థి. 1998లో అతనికి శాంతితో వివాహం జరిగింది. తన భార్య రుతుక్రమం సమయంలో అపరిశుభ్రమైన బట్టలను పేపర్లను వాడటం అతను గమనించాడు. ఎందుకంటే కార్పొరేట్ కంపెనీలు తయారుచేసే ప్యాడ్‌లు చాలా ఖరీదైనవి. భార్య పరిస్థితి చూశాక చవకగా ప్యాడ్‌లను తయారుచేయాలని అనుకున్నాడు. దూదిని ఉపయోగించి ఆ ప్రయోగం చేశాడు. కానీ అతని భార్య అక్కాచెల్లెళ్లు...అవి పనికిరావని చెప్పేశారు. అతను చేస్తున్న పనులు చూసి గ్రామస్తులంతా ఎగతాళి చేశారు. చివరికి భార్య కూడా కొన్నేళ్లపాటు అతడిని వదిలేసింది.

అయితే అరుణాచలం తన ప్రయత్నాలు మానలేదు. ఆయన ఆశయ తీవ్రత గురించి చెప్పాలంటే...మనకు మాటలు రావు.. ఒక ఫుట్‌బాల్‌లో మేక రక్తం నింపుకుని తన శరీరంలోనే అమర్చుకుని రక్తం ఒక ట్యూబ్ నుండి బయటకు వచ్చేలా ఏర్పాటు చేసుకున్నారు. దాంతోనే నడిచేవాడు, సైకిల్ తొక్కేవాడు..తాను తయారుచేసిన ప్యాడ్ ఎంత రక్తస్రావాన్ని పీల్చుతుందో తెలుసుకునేందుకు ఆయనలా చేశారు. స్థానికంగా దొరికే మెటీరియల్‌తోనే శానిటరీ టవల్‌ని తయారుచేయడానికి అవసరమైన పరిశోధనకోసం ఇదంతా చేశారు. చివరికి అతని శ్రమ ఫలించింది. చవకగా శానిటరీ టవల్స్‌ని తయారుచేసే మిషన్‌ని కనిపెట్టారు. 2009లో భారత్‌లోని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నుండి అవార్డు పొందటంతో అతని కృషి వెలుగులోకి వచ్చింది. అరుణాచలం రూపొందించిన శానిటరీ టవల్స్‌ని తయారుచేసే మిషన్లని గ్రామీణ ప్రాంతాల మహిళలకు పంపిణీ చేసేందుకు ఆ సంస్థ ముందుకొచ్చింది. ఇప్పటివరకు 23 రాష్ట్రాల్లో 600 మిషన్లను పంపిణీ చేశారు. ప్యాడ్ మ్యాన్ సినిమాతో...భారత్ నూరుశాతం శానిటరీ ప్యాడ్స్ వాడే దేశంగా మారుతుందని ఆయన ఆశపడుతున్నారు. అమెరికాలో నాలుగు కోట్లఖరీదైన మిషనరీని...భారత్‌లో ఆయన లక్షన్నరకే మహిళలకు




అందిస్తున్నారు. అమెరికా మిషనరీ పనిచేసే విధానాన్ని అర్థం చేసుకుని అదే విధానంలో పనిచేసేలా చవకైన యంత్రాలను కనుగొన్నారు. కాకపోతే...వీటిని ఉంచడానికి ఒక గది స్థలం పడుతుంది. ఇప్పుడు అరుణాచలం జయశ్రీ ఇండస్ట్రీస్ పేరుతో శానిటరీ నేప్‌కిన్స్‌ని తయారుచేసే మిషన్లను పెద్ద సంఖ్యలో తయారుచేస్తున్నారు. అయితే వీటిని ఆయన మహిళా సహకార సంఘాలకు మాత్రమే అమ్ముతున్నారు. తను చేస్తున్నది డబ్బు కోసం కాదని...మానసిక దృక్పథాన్ని మార్చడానికి అంటారు అరుణాచలం.

వి.దుర్గాంబ

జంట లింగాల విలక్షణ క్షేత్రం

కాళేశ్వరం



ఈ ఆలయంలో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఒకే పాన పట్టంపై రెండు లింగాలు ఉంటాయి. వాటిలో ఒకరు ముక్తేశ్వరుడు (శివుడు), రెండవ వారు కాళేశ్వరుడు (యముడు). ఇక్కడి ఆలయానికే ఉన్న మరో విశిష్టత యమ కోణం. భక్తులకు యమ దోషం తొలగించడానికి గాను మునులు ఆలయంలోకి భక్తులు వెళ్లే ద్వారమార్గంలో యమ కోణాన్ని ఏర్పాటు చేశారు. మండపం మాదిరి ఉండే ఈ యమకోణం పైభాగం తలకు తగలకుండా వెళ్లిన వారికి అపమృత్యువు, యమగండాలు ఉండవని నమ్ముతుంటారు.

తెలుగు రాష్ట్రాల్లో పేరెన్నికగన్న శివాలయాల్లో కాళేశ్వరం ఒకటి. తెలంగాణ జిల్లాలోని జయ శంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి 58 కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. ఈ ఆలయానికి ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. ఆలయం నలు దిక్కులా నాలుగు ధ్వజస్తంభాలతోను, నాలుగు గోపురాలతోను ప్రత్యేకత సంతరించుకుని నిత్యం సముజ్జ్వలంగా శైవారాధనలతో, ఆధ్యాత్మిక పరిమళాలతో భక్తకోటికి కైవల్యప్రాప్తికి ద్వారాలు తెరిచింది.

స్థల పురాణం

ఈ క్షేత్రానికి గొప్ప పౌరాణిక నేపథ్యం ఉంది. కాళుడు (యముడు) ఇక్కడ శివుని కోసం ఘోర తపస్సు చేసి పరమ శివుణ్ని ప్రసన్నం చేసుకుని తన పేరున కాళేశ్వరం క్షేత్రాన్ని వెలయింపజేసుకున్నట్టు స్థల పురాణం. ఈ విషయాన్ని స్కాంద పురాణంలో సూతుడు శౌనకాది మహా మునులకు చెప్పినట్లు ఉంది. అలాగే గౌతమీ పురాణంలో కూడా ఈ క్షేత్ర మహిమ చాటబడి ఉంది.

ఒకే పానపట్టంపై రెండు లింగాలు

ఈ ఆలయంలో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఒకే పాన పట్టంపై రెండు లింగాలు ఉంటాయి. వాటిలో ఒకరు ముక్తేశ్వరుడు (శివుడు), రెండవవారు కాళేశ్వరుడు (యముడు). ముక్తేశ్వర లింగానికి రెండు రంధ్రాలున్నాయి. అభిషేకసమయంలో ఎన్ని పాలు, నీళ్ళు పోసినా అవి ఆ రంధ్రాల ద్వారా లోనికి వెళ్లిపోతాయి తప్ప బయటకు రావు. ఇక్కడి నుంచి ఆ నీరు త్రివేణీ సంగమంలో కలుస్తుందని 'కాళేశ్వర ఖండం' అనే గ్రంథం చెబుతోంది. ఇక్కడ మొదటగా కాళుడికి (యముడికి), ఆ తర్వాత ముక్తేశ్వరుడికి పూజలు జరుగుతాయి. పార్వతీ దేవి శుభానందా దేవి పేరుతో ఆలయంలో దర్శనమిస్తుంది. గౌతమీ నది అభీష్టం, ముక్తేశ్వరుని ఆదేశాల మేరకు పార్వతీ దేవి ఇక్కడ వెలసిందని చెబుతారు.

త్రిలింగ శైవ క్షేత్రాలలో ఒకటి

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా శ్రీశైలం, తూర్పు గోదావరి జిల్లా ద్రాక్షారామం, తెలంగాణలోని జయ శంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఈ ఆలయాల్లోని మూడు శివలింగాలను త్రిలింగ శైవ క్షేత్రాలుగా పిలుస్తారు. పూర్వం ఈ మూడు క్షేత్రాల మధ్య ఉన్న ప్రాంతాన్ని త్రిలింగ దేశం అని పిలిచేవారని చెబుతారు. అదే కాలక్రమంలో తెలుగు అయిందని అంటారు.

దక్షిణ కాశిగా ప్రసిద్ధి

కాళేశ్వరానికి దక్షిణ కాశిగా పేరుంది. ఉత్తర భారత దేశంలో కాశీ పవిత్ర పుణ్య శైవ క్షేత్రంగా మహోన్నతంగా విరాజిల్లుతోంది. కాశీ విశ్వేశ్వర విశాలాక్షులను దర్శించిన వారికి కైలాస ప్రాప్తి కలుగుతుందన్న విశ్వాసం హిందువులకుంది. పూర్వకాలంలో కాశీకి కాలినడకన వెళ్లేవారు. అంతదూరం వెళ్ళడమంటే ఆ రోజుల్లో కష్టం కనుక కాశీకి పోయిన వారు కాటికి పోయినట్లేనని అనేవారు. అంతదూరంలోని క్షేత్రానికి వెళ్లడం కష్టం కనుక దక్షిణ భారత దేశంలో దానికి సమానమైన ఈ కాళేశ్వర క్షేత్రాన్ని రుషులు కనుగొన్నారు. ఉత్తర భారతంలోని ప్రయాగలో గంగ, యమున, సరస్వతి మూడు నదుల పవిత్ర సంగమం ఉంది. అదే విధంగా కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతి (అంతర్వాహిని) ఉంది. దీనిని కూడా ఈ ప్రాంతవాసులు త్రివేణి సంగమం అంటారు.

ద్వారాల విశిష్టత

కాళేశ్వర గర్భాలయానికి నాలుగు వైపులా ద్వారాలున్నాయి, ఈ విశేషం దేశంలోని మూడు ఆలయాలకే ఉంది. అవి కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వరాలయం, కాశీ విశ్వేశ్వరాలయం, నేపాల్‌లోని పశుపతి ఆలయం.

యమకోణం

ఇక్కడి ఆలయానికే ఉన్న మరో విశిష్టత యమ కోణం. భక్తులకు యమ దోషం తొలగించడానికిగాను మునులు ఆలయంలోకి భక్తులు వెళ్లే ద్వార మార్గంలో యమ కోణాన్ని ఏర్పాటు చేశారు. మండపం మాదిరి ఉండే ఈ యమకోణం పైభాగం తలకు తగలకుండా వెళ్లిన వారికి అపమృత్యువు, యమగండాలు ఉండవని నమ్ముతుంటారు.

(తరువాయి భాగం రేపటి సంచికలో)

- తాళ్ళపల్లి యాదగిరి గౌడ్
9949789939

జంతురక్షణ కోసం ప్రాణాలు తృణప్రాయం!

జీవులపై కారుణ్యాన్ని వదులుకోరు మహనీయులు. వాటి రక్షణకై ఎంతటి త్యాగానికైనా సిద్ధపడ్డవారు ఉన్నారు. ఒక పక్షి కోసం తమ ప్రాణాన్నైనా వదిలి వేయడానికి సిద్ధపడ్డవారు ఉన్నారు. తండ్రి అభీష్టం నెరవేరేందుకు ఆజన్మాంతం వివాహం చేసుకోని భీష్ముడు మనకు మహాభారతంలో కనిపిస్తాడు. జంతు వధ నివారణకు వివాహం వద్దని సన్యాసం స్వీకరించాడు ఒక మహనీయుడు. అతడే భగవాన్ నేమినాథుడు. ఆయన జైనుల 22వ తీర్థంకరుడు. ఈయనను నేమి లేదా అరిష్టనేమి అని కూడా పిలుస్తారు. ఈయన ద్వారకలో జన్మించాడు. యువ రాజు. బాల్యం నుంచి జంతువులంటే ఎంతో ఆదరణ కలిగి ఉండేవాడు. ఆయనకు జునాగఢ్‌కు చెందిన యువరాణి రాజమతితో వివాహం నిశ్చయమైంది. నిశ్చితార్థ తాంబూలాలు కూడా తీసుకున్నారు. ముహూర్తాలు పెట్టుకున్నారు. నేమినాథుడు తన తల్లిదండ్రులతో జునాగఢ్‌కు బయలుదేరాడు, వివాహం చేసుకోవటానికి. ఇరు పక్షాలు ఈ వివాహం జరుగుతున్నందుకు ఎంతో సంతోషంతో ఉన్నాయి. పెళ్ళి పరివారం జునాగఢ్ పరిసరాలకు చేరింది. జునాగఢ్ దారిలో వందల పక్షలు, జంతువులు కనబడ్డాయి. అవన్నీ బంధింపబడి ఉన్నాయి. ఆ పక్షుల, జంతువుల దీనారావాలు నేమినాథుని గుండెను కలచివేసాయి. సారథిని అడిగాడు ఇదేమిటని. అవి తమ వివాహంలో ఏర్పాటు చేయబోయే విందు భోజనం సమకూర్చటానికి వినియోగింపబడే రకరకాల పశు పక్ష్యాదులు అని చెప్పాడు సారథి. ఆ జంతువుల దీనారావాలను వినలేకపోయాడు. అసలు వివాహం చేసుకోకుంటే ఈ జంతు వధ ఉండదు కదా అనిపించింది నేమినాథునికి. అన్నీ వదిలివేశాడు. వెంటనే గిర్నార్ పర్వతం వైపు సర్వసంగ పరిత్యాగిగా వెళ్లిపోయాడు. చరిత్రలో అత్యంత కారుణ్యమూర్తిగా పేరు తెచ్చుకున్నాడు. వందల, వేల జంతు పక్షి జాతుల వధను ఆపాడు. అహింసను తానాచరించి ఈ విశ్వానికి చూపాడు. కారుణ్యం అంటే ఇలా ఉండాలి అని.

మహనీయుల సేవలో జంతువులు


మెటార్య జైన మతంలో ఒక ప్రముఖ స్థానాన్ని పొందిన మహనీయుడు. మహర్షి మెటార్య ఒక నెల పాటు నిరాహారదీక్షలో ఉన్నాడు. ఇక ఆ దీక్ష విరమించాలి. అందుకని ఆయన భిక్షాటనకు బయలుదేరాడు. ఒక ప్రఖ్యాత నగల వ్యాపారి (కంసాలి) ఇంటి గుమ్మం వద్దకు వచ్చాడు. ప్రాంగణంలోకి అడుగు పెట్టాడు. విశాలమైన తోట, పూల చెట్లు, చూడచక్కని సుందరమైన భవంతి. మెటార్యుడు భిక్షకై తన భవంతికి రావటమే అదృష్టమని భావించాడు కంసాలి. ఆ సమయంలో ఆయన కొద్ది చిన్న చిన్న బంగారు గుళ్ళను ఒక దారంలోకి ఎక్కిస్తున్నాడు. ఆ పనిని ఆపి భిక్ష తేవటానికి లోనికి వెళ్ళాడు. అయితే అక్కడ ఒక ఫలవృక్షంపై ఉన్న పక్షి ఆ చిన్ని బంగారు గుళ్ళను ఏవో గింజలని భావించి వాటిని మింగింది. ఆ పక్షి బంగారు గుళ్లను మింగకుండా దానిని తోలివేయడానికి మెటార్య ప్రయత్నించాడు. కాని సాధ్య పడలేదు. అది ఆ గుళ్ళు మింగి అక్కడి ఒక చెట్టు ఎక్కి కూచుంది. ఇంతలో భిక్ష తీసుకువచ్చాడు కంసాలి. ఇక్కడి బంగారు గుళ్లు ఏమయ్యాయి అని ప్రశ్నించాడు. ఆ పక్షి తిందని చెబితే దానిని ఎలాగైనా పట్టించి, చంపించి ఆ గుళ్ళను వెలికితీయిస్తాడు. అందువల్ల ఆయన పెదవి విప్పలేదు. కంసాలికి అంతకు ముందు మెటార్యపై ఉన్న గౌరవం పోయింది. విపరీతమైన కోపం వచ్చింది. మెటార్య దొంగ తనం చేశాడని ఒక పెద్ద తోలును తెచ్చి ఆయన మెడకు, తలకు చుట్టాడు. అది ఎండకు ఎండి విపరీతమైన బాధను కలిగిస్తోంది. పైగా నెల రోజుల నుంచి ఉపవాసం. ప్రాణం పోయేట్లు ఉంది. అయినా ఆ పక్షిని కాపాడేందుకు నిజం చెప్పలేదు మెటార్య. షిరిడీ సాయి చెప్పిన సబూరీకి ఉదాహరణ కాబోలు ఇది. మెటార్య బంగారు గుళ్లు ఎక్కడ దాచిందీ చెబుతాడని కంసాలి భావించాడు. ఈలోగా బంగారు గుళ్లను తిన్న పక్షికి అవి అరగలేదు. వాటిని విసర్జించింది. ఆ విసర్జనలో బంగారు గుళ్లు కిందపడటం కళ్ళారా చూసాడు కంసాలి. విషయం అర్థమైంది. వెంటనే వెళ్లి మెటార్య మెడకు, తలకు చుట్టిన తోలును తొలగించాడు. తన తప్పును గ్రహించి పశ్చాత్తాపపడి, మెటార్య కాళ్లపై పడి క్షమించమని పరిపరివిధాల ప్రార్థించాడు. మెటార్య అతనిని క్షమించాడు. ఒక పక్షి కోసం తన జీవితాన్నే ఆర్పించటానికి సంసిద్ధుడయ్యాడు మెటార్య. అందుకే మెటార్యను మహర్షి మెటార్య అంటారు అందరూ.



భగవాన్ నేమినాథుడు

- ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్

పాపరహితులు దివ్యస్థితికి అర్హులు



అధ్యాయం 7
శ్లోకం 28:

యేషాం త్వంతగతం పాపం
జనానాం పుణ్యకర్మణామ్।
తే ద్వంద్వమోహనిర్ముక్తా
భజంతే మాం ధృఢవ్రతాః॥

తాత్పర్యం


పూర్వజన్మలోను, ప్రస్తుత జన్మ లోను పుణ్యకార్యాలు చేస్తూ పాపా లను పూర్తిగా నశింపచేసుకున్న మనుజులు ద్వంద్వమోహాల నుండి విడివడినవారైనా సేవ యందు దృఢ వ్రతముతో నెలకొంటారు.

భాష్యం

ఈ శ్లోకములో దివ్యస్థితిని పొం దుటకు ఎవరు అర్హులవుతారో వివ రించబడింది. నాస్తికులుగా, మూఢు లుగా, కపటులుగా, పాపులుగా కొనసాగే వారికి ఇచ్ఛాద్వేషాలను అధిగమించటం సాధ్యం కాదు. కేవలం ఎవరైతే పుణ్యాత్ములో, నియమిత ఆధ్యాత్మిక జీవితాన్ని గడుపుతారో వారు భగవద్భక్తిని స్వీకరించి క్రమేణా భగవత్ తత్త్వాన్ని అర్థము చేసుకొనగలుగుతారు. ఇటు వంటి పురోగతి శుద్ధ భక్తుల సాంగత్యములో సులభంగా పొందవచ్చు. ఎందువలనంటే అట్టి సాంగత్యములో ఎవరైనా ఇచ్ఛాద్వేషాల నుండి బయటపడే అవకాశం ఉంటుంది. కాబట్టి భక్తులు ఈ భూమిపై పర్యటిస్తూ ఇటువంటి అవకాశాన్ని అందరికీ అందిస్తూ ఉం టారు. అయితే భగవంతునికి విధే యులు కానివారు భగవంతుని చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఉంటారు కనుక వారు భగవంతుణ్ణి అర్థం చేసుకొనలేరు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

విద్యా, ఐశ్వర్యాభివృద్ధి మంత్రం




ఓం అక్షరాయ నమః

మంత్ర జప విధానము :

ప్రాతఃకాలమునే లేచి స్నానాదులు ముగించుకుని పరిశుద్ధమైన వస్త్రములు ధరించి నుదుటన తిలకము దిద్దుకుని పూజా మందిరంలో దీపారాధన చేసి తమ నిత్యకృత్యములైన సంధ్యావందనాది కార్యక్రమములను ముగించుకుని నిశ్చలమైన పరిశుద్ధమైన మనస్సుతో తమ శక్తికి అనుగుణంగా మంత్రాన్ని జపించాలి.

ధర్మం-మర్మం




- డా॥ కందాడై రామానుజాచార్య

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

ఆత్మహత్య



(గత సంచిక తరువాయి భాగం)

ఆత్మ ఎప్పుడూ ఎక్కడా నిత్యమై ఉండేది. ఆ నిత్యమైన తన్ను చూడక అనిత్యమైన దేహాదులు తానని చూచుటే ఆత్మహత్య అంతకంటే హత్య. వేరే ఏమున్నది? వివేక దృష్టి వల్ల తన్నుఃదాగన్నవాడు ఎన్ని కల్లోలాలు వచ్చినా చలించడు. ప్రపంచ కష్టసుఖాలన్నీ నటనా మాత్రంగా భావిస్తాడు. వారి దృష్టికి ఈ లోకం నాటకశాల. ఆ రంగాలలో ఒకే మనిషి ఒకసారి రాజువేషం, మరొకసారి మంత్రి, ఇంకొకసారి సేవకుడు, చాకలి, మంగలి ఇంకా ఎన్నెన్నో వేషాలు ధరించి ఆయా పాత్రోచితంగా నటించినా, తాను తానేగాని ఇవేవీ కాదని తెలిసి ఉన్నందున ఆయా పాత్రధారణ వల్ల కలిగే న్యూనతాన్యూనతలు పాటించడు. అదేవిధంగా ఈ లోకమూ ఈశ్వరుని నాటకశాల. అందులో నీవొక నటుడవు. నీ శక్తిననుసరించి చేతనైనంతవరకు సహాయపడవచ్చుగాని, అంతా సమానంగా ఉండేట్టు చేయాలంటే, ఏ కాలంలోనూ ఎవరివల్లా సాధ్యం కాలేదు; కాబోదు" అన్నారు భగవాన్.

"ఇట్లా ఉండటం వల్ల లోకంలో శాంతి లేకుండా పోయిందే? అందుకు విచారిస్తున్నా" నన్నాడా యువకుడు. "అదుగో, మళ్లీ మొదలు. లోకంలో శాంతి లేకుండా పోయిందే అని విచారించే బదులు మనకు శాంతి ఎట్లా కలుగుతుందా అని విచారించి తెలుసుకుంటే మంచిది. అది వదలి లోకంలో శాంతిలేదే అని విచారిస్తే, లాభమేమున్నది? తన మనస్సు శాంతిగా ఉంటే, లోకమంతా శాంతిగానే కనబడుతుంది. మీకా శాంతి ఉన్నదా ముందు చెప్పండి?" అన్నారు భగవాన్. "లేదు" అన్నాడాతడు. "ఆ, అదీ సమాచారం. మీకు శాంతిలేదు. ఆ శాంతి ఏ విధంగా సంపాదించాలో తెలియదు. తెలుసుకుందామన్న యోచన చేయక లోకంలో శాంతి ఏవిధంగా కలుగజేద్దామా, అన్న ఈ ప్రయత్నం ఉన్నదే, తనకు అన్నం లేదు, తన తిండి తాను సంపాదించుకునే యత్నం చేయక 'ఎవరన్నా నాకుక్షి నింపితే, నేనెందరికైనా అన్నం సంపాదించి పెడతాన'న్నట్లున్నది. 'నన్ను లేవదీస్తే, ఈ దొంగలెంత' అన్న కుంటివాని కథ వలె" నన్నారు భగవాన్.

ఉన్నది ఒక్కటే శక్తి

16-5-47

ఈ మధ్యాహ్నం ఉత్తర హిందూస్థానీయులొకరు నిన్నటి వారి వలెనే "లోకోద్ధరణ నిమిత్తం భగవాన్ ఎందుకు ప్రయత్నించరు?" అనే అర్థమిచ్చే ప్రశ్నలతో నిండిన కాగితం శ్రీవారికిచ్చారు. భగవాన్ చూచి, సమీపస్థులతో "ఇదుగో చూడూ, నిన్ననూ ఇటువంటి ప్రశ్నలే. లోకోద్ధరణ చేయాలని బోధించే వీరంతా తమ్ముతాముద్ధరించుకుంటే చాలును. తానెవరో విచారించి, తెలుసుకోలేక, లోకాన్నుద్ధరించాలని చింతిస్తారు. ఈ చింతించేదెవరో తెలుసుకోవాలి ముందు. అది చేయరు. లోకాన్నుద్ధరిస్తారట. అచ్చంగా కుంటివాని కథ వలెనే ఉంటుందిది" అన్నారు.

"స్వామీ, తమ వంటి జ్ఞానులు కదలకుండా కూర్చుంటే ఎట్లా? లోకం అల్లకల్లోలంగా ఉన్నప్పుడు సహాయపడి, శాంతిని ప్రసాదింపవద్దా?" అన్నారా పృచ్ఛకులు. "ఔనయ్యా, జ్ఞానులు ఏ సహాయము చేయుట లేదని నీకెట్లా తెలుసును? వారు ఉన్నట్లుండుటే లోకానికి సహాయం. చూచేందుకు ఊరికే ఉన్నట్లే ఉంటారు. వారి శక్తి ఎన్నో విధాల పనిచేస్తుంది. అయితే, నేను చేస్తున్నానన్న అహంభావన ఉండదు. ఒక ధనవంతుడుంటాడనుకో. కలలో బిచ్చమెత్తుతాడు, కూలి చేస్తాడు. వీధులూ ఊడుస్తాడు. మెలకువ రాగానే అవేవీ నేను కాదు, నేను ధనికుడను అనే ధీరత్వంతో ఉంటాడు. అదేవిధంగా జ్ఞాని అయినవాడు ప్రారబ్ధానుసారం ఏది చేసినా, నేను కాదని దేనికీ అంటక ధీరుడై ఉంటాడు.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. కుటుంబసఖ్యత పెరుగుతుంది. శారీరిక శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో చిరుజాగ్రత్తలు పాటించాలి. రుణ ఒత్తిడులు క్రమక్రమంగా తగ్గుతాయి. ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి: వాహన నిర్ణయాలు ఉపకరిస్తాయి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ ఒత్తిడులు పెరుగుతాయి. ఆదాయం పర్వాలేదు.

మిథున రాశి: దూరప్రయాణాలు అనుకూలం. ఆర్థిక ప్రయత్నాలు పర్వాలేదు. మానసిక రుగ్మతలు పెరుగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. అధిక ప్రయత్నాలతో అనుకూల పరిస్థితులు ఆర్థికంగా ఉంటాయి.

కర్కాటక రాశి: ఆర్థిక లావాదేవీలు, ప్రక్రియలు ఉపకరిస్తాయి. పనులలో ఒత్తిడులు పెరుగుతాయి. ఆరోగ్య ఖర్చులు కొనసాగుతాయి. మిత్రుల ప్రోత్సాహం లోపిస్తుంది. ఆదాయంలో అసహన పరిస్థితులు పెరుగుతాయి.

సింహ రాశి: స్థిరాస్తి నిర్ణయాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ ఉంటుంది. రుణ ఒత్తిడులు తగ్గుతాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార విజయాలు దగ్గరవుతాయి. ఆదాయంలో ఆయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: విదేశీ లావాదేవీలు అనుకూలం. స్వతంత్ర నిర్ణయాలు లాభిస్తాయి. వ్యయం పెరుగుతుంది. ఆరోగ్యంలో అనుకూల మార్పులు ఉంటాయి. పనులలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల మార్పులు ఉంటాయి.

తులా రాశి: వాహన కొనుగోళ్ళు లాభిస్తాయి. ప్రోత్సాహ పరిస్థితులు వృత్తిలో కొనసాగుతాయి. శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. అసహన పరిస్థితులు ఆర్థికంగా ఉంటాయి. ఆదాయాన్ని పెంచుకొనే మార్గాలు కూడా సులభతరమవుతాయి.


వృశ్చిక రాశి: ఉద్యోగ ప్రయత్నాలలో విజయాలు సాధించగలుగుతారు. అసంతృప్తి సంఘటనలు అన్ని రంగాల వారికి కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. అసహన పరిస్థితులను పరిష్కరించుకోలేకపోతారు. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. ఆకస్మిక ఖర్చులు లేకపోలేదు. ఆరోగ్యంలో మంచి మార్పులు చేకూరుతాయి. గతంలోని పొరపాట్లు వెలుగు చూస్తాయి. ఆదా యంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: రుణ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. ఆకస్మిక ఖర్చులు పెరుగుతాయి. ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి. వ్యాపారంలో అవమానకర సంఘటనలు ఉంటాయి. ఆదాయ మార్గాలు ఇబ్బందులను పెడతాయి.

కుంభ రాశి: ఒత్తిడులు ఉద్యోగపరంగా పెరుగుతాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో రుగ్మతలు తగ్గుతాయి. చేపట్టే కార్యాలలో అలసత్వం పెరుగుతుంది. ఆదాయం పర్వాలేదు.

మీన రాశి: విద్యాప్రయత్నాలు కలసి వస్తాయి. నూతన కార్యాలలో ప్రోత్సాహం. ఉద్యోగ వ్యవహారాల్లో విజయాలు ఉంటాయి. ఆరోగ్యంలో మెరుగైన మార్పులు ఉంటాయి. ముఖ్య కార్యక్రమాలు సగంలోనే ఆగిపోతాయి కాబట్టి జాగ్ర త్తలు తప్పనిసరి. ఆదాయాన్ని ఆశించినంతగా పొందలేకపోతారు.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



స్టాక్ మార్కెట్లను వైకుంఠపాళితో పోలుస్తారు. సరైన ప్రణాళిక లేకుండా పెట్టుబడులు పెడితే పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోవడం ఖాయం. గతంలో ఎన్నో కుటుంబాలు స్టాక్ మార్కెట్లలో భారీ నష్టాలు తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడ్డ సంగతి తెల్సిందే. ఈ వారంలోనూ భారత స్టాక్ మార్కెట్లు కుప్పకూలి మదుపర్లు లక్షల కోట్లు నష్టపోవడం చూశాం. ఒక్క వారంలోనే మదుపర్లు 10 లక్షల కోట్లు నష్టపోవడం చూశాం. బుల్‌మార్కెట్ ఒక్కసారిగా బేర్‌మంది. అయితే సరైన పద్ధతిలో ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా స్టాక్ మార్కెట్లో లాభాలు పొందేవారు ఎక్కువే. కొన్ని పద్దతులను వినియోగదారులు అనుసరిస్తే మార్కెట్ ఎంతనష్టపోయినా తాము మాత్రం పటిష్టస్థితిలో వుండటం ఖాయం. ఈ అంశాలను ఓ సారి పరిశీలిద్దాం.

స్టాక్ మార్కెట్లోకి ఆచి తూచి...

భారతదేశంలో స్టాక్ మార్కెట్లో పెట్టుబడులను ఓసారి పరిశీలిస్తే స్టాక్ మార్కెట్లో రిటైల్ ఇన్వెస్టర్ల వాటా కేవలం ఐదుశాతం లోపే ఉండటం గమనార్హం.

చాలామంది పక్కవారిని చూసి మార్కెట్లోకి వస్తారు. ఫలానా వ్యక్తి మార్కెట్లో బాగా ఆర్జించాడు. బాగా లాభాలు వస్తాయని మార్కెట్లోకి వస్తారు. వీరిని క్యాష్ చేసుకొనేందుకు స్టాక్ బ్రోకర్లు ఉంటారు. స్వల్పకాలంలో భారీగా లాభాలు వస్తాయని నమ్మబలుకుతారు. వ్యర్థమైన షేర్లలో పెట్టుబడులు పెట్టిస్తారు. ఫలితంగా మార్కెట్ కుప్పకూలితే ఈ చిన్నమదుపుదార్లు భారీగా నష్టపోతుంటారు.



2008 సంవత్సరంలో ఇదే జరిగింది. చాలామంది రిటైల్ ఇన్వెస్టర్లు ఈ మార్కెట్లో ప్రవేశించి ఆర్థికంగా నష్టపోయారు. అందుకే పొరుగింటి పుల్లయ్యను చూసో ఆశపడో ఈ మార్కెట్లో ప్రవేశించకూడదు. స్టాక్ మార్కెట్‌పైన అవగాహన పెంచుకొని ఈ మార్కెట్లోకి ప్రవేశించడం చాలా అవసరం. లేదంటే చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం వల్ల లాభముండదు.

అన్నిటికి మించి దీర్ఘకాలంలో లాభాలు కావాలనుకున్నవారు ఈ మార్కెట్లో మంచి ఫలితాలను పొందుతారు.

మార్కెట్లు ఒడిదుడుకులకు ఎదురైనా దీర్ఘకాలంలో అవి సత్ఫలితాలనిస్తాయి. ఇది ప్రాథమిక మాత్రంగా ఇన్వెస్టర్లు గమనించాలి. రాత్రికి రాత్రే ధనవంతులమై పోవాలని స్టాక్ మార్కెట్లో ప్రవేశిస్తే మిగిలేది నిరాశే. నిదానమే ప్రదానం అన్న సూత్రం స్టాక్ మార్కెట్‌కు బాగా వర్తిస్తుంది. లేకుంటే కుప్పకూలిన తర్వాత ఏం చేయలేం. మన కష్టార్జితాన్ని బావిలో పోసినట్లవుతుందని గుర్తుంచుకోవాలి. అందుకే మార్కెట్లోకి దిగే ముందు కాస్త కసరత్తు చేసి ప్రవేశించడం ఎంతైనా మంచిది.

మ్యూచువల్ ఫండ్స్ శ్రేయస్కరం

స్టాక్ మార్కెట్లలో నూతనంగా ప్రవేశించువారు మ్యూచువల్ ఫండ్స్ ద్వారా పెట్టుబడులు పెట్టడం మంచిది.

మన డబ్బులను ఫండ్ మేనేజర్స్ వేర్వేరు కంపెనీల్లో పెట్టుబడి పెడతారు. కంపెనీల లాభనష్టాలను విశ్లేషించి ఈ పెట్టుబడులు వుంటాయి కాబట్టి నష్టపోయే అవకాశం తక్కువగా ఉంటుంది. ప్రతినెలా కొంత డబ్బును మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఎప్పటికప్పుడు మన పెట్టుబడులు ఎలా పెరిగాయో తెలుసుకోవచ్చు.

దీర్ఘకాలం మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడుల ద్వారా అనుకున్న ఫలితాలు ఆశించవచ్చు. భారతదేశంలో ప్రస్తుతం 50కి పైగా మ్యూచువల్ ఫండ్ కంపెనీలు పనిచేస్తున్నాయి.


సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్, సిప్ ద్వారా పెట్టుబడులు శ్రేయస్కరం.

పుకార్లకూ దూరంగా ఉండాలి

స్టాక్ మార్కెట్లో మదుపర్లు ఎక్కువగా మోసపోయేది ఊహాగానాల వల్లనే. ఈ షేరు బాగుంది ఆషేరు చాలా లాభాలుంది అంటూ పుకార్లు షికార్లు చేస్తుంటాయి. కొన్ని చిన్న కంపెనీషేర్లు తప్పుడు మార్గంలో షేర్ల విలువను బాగా పెంచుకుంటాయి. కాబట్టి ఎవరో చెప్పారని షేర్లు కొని మోసపోయిన సంఘటనలు మార్కెట్లో రోజూ వింటూనే వుంటాం. అత్యాశకు పోయి అసలుకే మోసం తెచ్చుకోవద్దు.

ఫండమెంటల్స్ ముఖ్యం

ఓ కంపెనీలో మనం పెట్టుబడులు పెడుతున్నామంటే ఆ కంపెనీ గురించి పూర్తిగా తెలుసుకోవాలి. ఆ కంపెనీ ఏ వ్యాపారం చేస్తుంది? ఆ వ్యాపారానికి మార్కెట్లో ఎలాంటి డిమాండ్ ఉంది గత సంవత్సరం ఆ కంపెనీ ఏ మేరకు లాభాలు ఆర్జించింది, ఆ కంపెనీకి ఎంతమేరకు అప్పులున్నాయి. భవిష్యత్తులో లాభాలు వచ్చే అవకాశం వుందా? ఇవన్నీ తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. ఇవి కొంతమేరకు మనకు నష్టాల్ని తగ్గిస్తాయి. అంతమాత్రమే రకాదు లాభాలకు దారితీస్తాయి. స్టాక్ మార్కెట్ నిపుణుల సలహాలు తీసుకోవచ్చు. మంచి పనితీరు కనిపించే కంపెనీల్లో పెట్టుబడులు లాభాలకు సోపానాలుగా చెప్పుకోవచ్చు.



రిస్క్ తీసుకుంటేనే లాభాలెక్కువ

స్టాక్ మార్కెట్లో రిస్క్ తక్కువగా వుండే షేర్లు లభిస్తాయి. వీటివలన లాభాలు కచ్చితంగా ఉంటాయి. అయితే లాభాలు కొద్దిమాత్రంగానే ఉంటాయి. ఎక్కువ రిస్క్ తీసుకుంటే ఎక్కువ లాభాలు వచ్చే అవకాశం ఉంది. అదే స్థాయిలో భారీగా నష్టపోయే అవకాశం వుంటుంది. అయితే నాకు అధిక లాభాలు అక్కరలేదు ఒక మోస్తారు లాభాలు వస్తే చాలు అనుకునేవారు ఈ మార్కెట్లో బాగా రాణిస్తారు. ఒక షేరుపైన 20శాతం లాభం వస్తే లాభాల స్వీకరణ చేయడం ఎంతో శ్రేయస్కరం. చాలామంది అత్యాశకు పోయి ఎక్కువ లాభాలు కావాలని లాభాల స్వీకరణ చేయకుండా వదిలేస్తారు.

కొన్నిసార్లు ఆ షేరు ఊహించనిరీతిలో పతనమై భారీగా నష్టాలు అందించిన సంఘటనలు కోకొల్లలు.

10 రూపాయలు ముఖవిలువ కలిగిన షేరు వేలరూపాయలకు పెరిగి తిరిగి 10 రూపాయలకంటే తక్కువకు పతనమైన మదుపుదారులకు తీవ్ర నష్టం కలిగించిన సంఘటనలు అనేకం.

ఎందుకోసం మార్కెట్ కు వస్తున్నారు

స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే సమయంలో ఏ వుద్దేశ్యంతో మనం మార్కెట్లో ఇన్వెస్ట్ చేస్తున్నామో తెలుసుకోవాలి. మన అవసరాల మేరకు ఒక ప్రణాళికతో పెట్టుబడులు వుండాలి. ఒక ఇల్లు కట్టాలనుకుంటున్నారా? పిల్లల చదువుకోసమా, భవిష్యత్ అవసరాలకోసమా, అందుకు ఎంత ఇన్వెస్ట్ చేయాలి? ఎంత కాలంలో అనుకున్న లాభాలు సాధించాలి. ఇలాంటి అంశాలు బేరీజు వేసుకుని ముందుకు సాగాలి. అలా నిర్ణీత వ్యవధి లేకుండా పెట్టుబడులు పెడితే చుక్కాని లేని నావలా ప్రయాణముంటుందని తెలుసుకోవాలి.

ఇక చివరగా మార్కెట్లో ఎప్పుడు పెట్టుబడులు పెట్టాలి ఎప్పుడు లాభస్వీకరణ చేయాలన్నది పెద్దకళ.

పెద్ద పెద్ద విశ్లేషకులు సైతం ఈ విషయంలో పప్పుల్లో కాలేస్తుంటారు. సహజంగా మార్కెట్ బాగా నష్టపోయినప్పుడు పెట్టుబడులు పెట్టడం, మార్కెట్ బాగా పెరిగినప్పుడు మార్కెట్ నుంచి లాభాల స్వీకరణ చేయడం ఉత్తమమైన పద్ధతి అయితే చాలామంది మార్కెట్ ఉన్నతశిఖరాలకు చేరుకున్నప్పుడే ఎక్కువ పెట్టుబడులు పెడతారు. మార్కెట్ మరింత పెరుగుతుందని భ్రమలో వుంటారు. అయితే మార్కెట్ బుడగలా పేలితే నష్టాలను మూటగట్టుకుంటారు. అందుకే మంచి తరుణమని వేచి చూడాలే తప్ప ఆవేశంతో, అనాలోచితంగా పెట్టుబడులు పెట్టవద్దు. మార్కెట్ ఉన్నత స్థితిని, కనిష్ట పతనాన్ని ఎవరూ అంచనావేయలేరు కాబట్టి షేర్ల కొనుగోలు సమయంలోనూ, లాభాల స్వీకరణ సమయంలోనూ ఒకేసారి లావాదేవీలు జరుపకుండా కొంచెం కొంచెంగా కొనుగోలు చేస్తూ అమ్ముతూ క్రమశిక్షణ పాటించాలి. ఒకేసారి పెట్టుబడి అంతా పెట్టడం మంచిదికాదు. ఒక క్రమపద్ధతి ఇన్వెస్ట్‌మెంట్ జరపాలి పెట్టుబడి అంతా ఒకే కంపెనీల్లో లేక ఒకే రంగంలోనూ పెట్టకుండా లాభాలిచ్చే పలు రంగాలను ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాన్ని తగ్గించవచ్చు.

షేర్ మార్కెట్లో అనుకున్న స్థాయిలో ఇన్వెస్ట్ చేసిన తర్వాత మీ పోర్ట్‌పోలియోను క్రమం తప్పకుండా చూసుకోవాలి. వరుసగా నష్టాలు అందిస్తున్న షేర్లను తొలగించుకుంటూ లాభాలు అందిస్తున్న షేర్లలోకి పోర్ట్ పోలియోను సవరించుకోవాలి.

ఫ్యూచర్ ఫండ్ ఆప్షన్స్ మార్కెట్లో చాలా రిస్క్ వుంటుంది. కొత్తగా ప్రవేశించేవారు ఎఫ్ అండ్ ఓ జోలికి వెళ్లకుండా ఉండటం శ్రేయస్కరం.

చివరగా మన సంపద పెంచుకునే మార్గాలు అనేకం. అందులో స్టాక్ మార్కెట్ ఒకటి అని గ్రహించాలి. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు రిస్క్‌తో కూడి ఉన్నాయని గ్రహించాలి. మార్కెట్లో ప్రవేశించేవాడికి ఓపిక ఉండాలి. కంపెనీల పనితీరును గమనించి, మార్కెట్‌ను కొంతైనా ఫాలో అయ్యే పరిజ్ఞానం అవసరం. ఏ మాత్రం అవగాహనలేకుండా మార్కెట్లోకి వస్తే ఈ వారం వచ్చిన భారీ ఒడిదుడుకులు వచ్చినప్పుడు తీవ్రంగా నష్టపోతారు. దీర్ఘకాలంలో భారతమార్కెట్లు బాగా వృద్ధి చెందే అవకాశం కన్పిస్తోంది. అయితే మార్కెట్లో లాభాలు అందిపుచ్చుకోవాలంటే చక్కని ప్రణాళిక అవసరం.



స్సెర్జి రాజన్ బందెల
ఆర్థికరంగ విశ్లేషకులు



అద్దె మీద రుణం

స్వంతిల్లు ఉన్న వారు ఆర్థిక సంస్థల నుంచి భవిష్యత్తులో వచ్చే అద్దెల మీద రుణం తీసుకునే వెసులుబాటు ఉంది. ఈ రుణం పొందడానికి అర్హతలు ఏమిటో తెలుసుకుందాం?

రుణదాతలు సాధారణంగా రుణం మొత్తంపై 1శాతం వరకు ప్రాసెసింగ్ రుసుమును వసూలు చేస్తారు. రుణదాతల మొత్తం విషయంలో రుణ గ్రహీతలు ప్రొఫైల్‌పై ఆధారపడి వడ్డీ మారుతుంది.

ప్రస్తుతం వడ్డీ రేటు సంవత్సరానికి దాదాపు 10 శాతం నుండి 13 శాతం వరకు ఉంటుంది. అద్దెకు ఇచ్చే రుణం గరిష్టకాలం 10 సంవత్సరాలు. అయితే రుణ వ్యవధి లీజ్ ఒప్పందం మిగిలిన కాలానికి మించకూడదు. అదనంగా వ్యతిరేకంగా రుణాలతో సహా ఎటువంటి రుణాన్నైనా పొందడానికి మీ క్రెడిట్ చరిత్ర బాగుండాలి. లేకపోతే మీరు రుణం పొందడం చాలా కష్టమవుతుంది.

భద్రత: లీజుకు ఇచ్చిన ఆస్థిని రుణం చార్జ్ ద్వారా సురక్షితంగా ఉంటుంది. పర్యవసానంగా, మీరు ఇప్పటికే గృహ రుణాన్ని కలిగి ఉంటే ఇతర రుణ దాతనుండి మీరు ఈ రుణాన్ని పొందడం కష్టమవుతుంది. ఎందుకంటే వారు రాబోయే డబ్బుపై రెండో చార్జ్ తీసుకోవడానికి ఇష్టపడరు. ఇలాంటి సందర్భాలలో, మీరు అద్దె రుణం కోసం సెక్యూరిటీగా ఏదైనా ఇతర ఆస్థిని ఆఫర్ చేయవచ్చు. ఇది రుణదాత మార్జిన్ అవసరాల సంతృప్తిపై ఆధారపడి ఉంటుంది.

అయితే ప్రారంభ గృహ రుణాలు చెల్లించిన తర్వాత ఆస్తి విలువ గణనీయంగా పెరిగితే, ప్రస్తుతం గృహ రుణదాత మీ అద్దె రుణాన్ని అనుకూలంగా పరిగణించవచ్చు.

బ్యాంక్ ప్రాథమిక కెవైసీ డాక్యుమెంట్‌ను ఏర్పాటు చేయమని అడుగుతుంది. అంటే అడ్రస్ ప్రూఫ్, ఐడెంటిటీ ప్రూఫ్ వీటిని అప్లికేషన్ ఫారం పూర్తి చేసి దానితో జతచేసి ఇవ్వాలి. మీరు తిరిగి చెల్లించే సామర్థ్యాన్ని ఏర్పాటు చేయడానికి రుణదాత కూడా ప్రూఫ్ అడుగుతాడు. జీతాలు తీసుకునేవారయితే ఇన్‌కంటాక్స్ రిటన్ అందుబాటులో లేకపోతే, ఫామ్ 16 ఇస్తే సరిపోతుంది. అయితే స్వయం ఉపాధి దరఖాస్తుదారులు అడిట్ చేసిన అకౌంట్స్ సబ్‌మిట్ చేయాలి.

అకౌంట్స్ అడిట్ చేయకపోతే, మీరు గత రెండు లేదా మూడు సంవత్సరాల ఐటిఆర్ సబ్‌మిట్ చేయాల్సి ఉంటుంది. భవిష్యత్తు రుణాలకు వ్యతిరేకంగా డబ్బు ఇచ్చినప్పటికీ, ఇదొక సందర్భంలో లీజ్‌కి ఇచ్చినప్పుడు రుణదాతలు మీరు తిరిగి చెల్లించే సామర్థ్యానికి సంబంధించి ఏదైనా హామిని అడుగుతారు.


ఆస్తి హామిగా రుణం : వాణిజ్యపరమైన ఆస్తికి సంబంధించి మీరు ఈ రుణాన్ని పొందవచ్చు. ప్రభుత్వ సంస్థలు, బ్యాంక్, ఇన్సూరెన్స్ కంపెనీ లేదా రిటైల్‌హౌజ్ వంటి ప్రముఖ వ్యక్తులకు అద్దెకు ఇవ్వొచ్చు లేదా లీజుకు ఇవ్వొచ్చు. రుణదాతలు సాధారణంగా ఇటువంటి సంస్థల ముందస్తు అనుమతి జాబితాను కలిగి ఉంటారు.

అద్దెకు ఇచ్చిన ఇళ్లకోసం కూడా మీరు ఈ సదుపాయాన్ని పొందవచ్చు. అద్దెకు వ్యతిరేకంగా రుణాన్ని తిరిగి చెల్లించే కాలానికి ఒక ఒప్పందం కలిగి ఉండాలి. దానితోపాటు భవిష్యత్తు అద్దెలకు వ్యతిరేకంగా బ్యాంక్ రుణాన్ని మంజూరు చేసే ముందు మీరు అద్దె/లీజు ఒప్పందాన్ని కలిగి ఉన్నట్టుగా వెంటనే రిజిస్టర్ చేసుకోవాలి.

రుణ ప్రయోజనం : భవిష్యత్తు అద్దెలకు వ్యతిరేకంగా రుణాల ద్వారా సేకరించిన డబ్బును, ఇంటిని కొనడానికి లేదా మీ వ్యాపారాన్ని పెంచుకోవడానికి మీ పిల్లల చదువులు,పెళ్లిళ్లకు ఎటువంటి ప్రయోజనాలకైనా ఉపయోగించుకోవచ్చు. ఈ డబ్బును మీరు ఇంటి మరమ్మత్తులకి లేదా పునురుద్దరణకి కూడా ఉపయోగించవచ్చు., పెంచిన డబ్బును ఉపయోగించుకోవడానికి, ఉన్న రుణాన్ని చెల్లించడానికి రుణదాతలు కూడా అనుమతిస్తారు.

అర్హత : వాణిజ్య లేదా గృహ ఆస్తి కలిగిన యజమాని ఎవరైనా ఈ సదుపాయాన్ని పొందవచ్చు. ఈ ఆస్తికి యజమాని ఒకరే ఉండవచ్చు లేదా సంయుక్త యాజమాన్యం కలిగి ఉండవచ్చు. ఉమ్మడి యాజమాన్యం విషయంలో యజమానులు అందరూ ఈ ఆస్తికి దరఖాస్తుదారులుగా మారాలి. ఇప్పటికే ప్రవేశపెట్టిన ఆస్తులకోసం లేదా లీజ్ ఒప్పందంలోకి ప్రవేశించిన ఆస్తులకి రుణక్రమం అందుబాటులో ఉంది.

క్రెడిట్ లైన్ : దాదాపు అన్ని ప్రయివేటు, పబ్లిక్ సెక్టార్ బ్యాంక్‌లు, భవిష్యత్తులో వచ్చే అద్దె ఆస్తిని తనఖా పెట్టుకుని రుణాలు అందిస్తున్నాయి. ఈ సౌకర్యంతో అద్దెలకు ఇచ్చే ఇళ్లకోసం భవిష్యత్తులో అద్దెలపై ఆధారపడి గృహయజమానులు క్రెడిట్ లైన్‌ని పొందవచ్చు.



ఇన్వెస్ట్‌మెంట్స్ లేకుండా పన్ను ఆదా


ఆదాయపు పన్నును ఆదా చేయడం అంటే పెద్ద ప్రహసనం అని అంతా భావిస్తారు. ముఖ్యంగా ఆర్థిక సంవత్సరం చివర్లో చేతిలో సరిగ్గా డబ్బులు ఆడని సమయంలో నిధుల కొరత ఎదుర్కొంటున్న సమయంలో ఇన్‌కంటాక్స్ నుంచి తప్పించుకునేందుకు ఇన్వెస్ట్‌మెంట్ చేయాల్సి రావడం తలకు మించిన భారంగా కనిపిస్తుంది.

పన్ను మినహాయింపు ప్రయోజనం కల్పించే పెట్టుబడులు చేయడం ఈ తరహా సమస్యల నుంచి కొంత ఉపశమనం కలిగిస్తుంది. అయితే మీరు ఇప్పటికే ఇన్వెస్ట్‌మెంట్ చేసి ఉన్నట్లయితే కొత్త పెట్టుబడులు లేకుండా గతంలో చేసిన పెట్టుబడుల ద్వారానే పన్ను ఆదా చేసుకునేందుకు మూడు మార్గాలున్నాయి.

మళ్లీ పెట్టుబడి

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో ఏటా రూ 1.5 లక్షల వరకు పెట్టుబడులపై ఇన్‌కంట్యాక్స్ సెక్షన్ 80 సీ ప్రకారం పన్ను మినహాయింపు లభిస్తుందనే విషయం తెలిసిందే. ఒకవేళ మీరు ఇప్పటికే పీపీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నట్లయితే ఈ నిధుల కొరతను ఎదుర్కొనేందుకు ఒక అవకాశం ఉంటుంది. ప్రారంభించిన ఏడో సంవత్సరం నుంచి పీపీఎఫ్‌లో పెట్టుబడులను ఉపసంహరించుకునే అవకాశం ఉంది. నాలుగో సంవత్సరం ముగిసినప్పటి నుంచి మొత్తం ఫండ్ బ్యాలెన్స్‌లో 50శాతం వరకు విత్ డ్రా చేసుకోవచ్చు.

అప్పటివరకూ క్రమం తప్పకుండా మీరు పీపీఎఫ్ పెట్టుబడులు చేస్తున్నట్లయితే ఇందులోంచి నగదు ఉపసంహరణకు ఓ అవకాశం ఉంటుంది. మీరు తిరిగి ఇదే మొత్తాన్ని పీపీఎఫ్‌లోకానీ, మరే ఇతర మీకు నచ్చిన పెట్టుబడి సాధనంలో కానీ ఇన్వెస్ట్‌చేసి... సెక్షన్ 80 సీని పూర్తిగా ఉపయోగించుకోవచ్చు.



ప్రస్తుతం టాక్స్ సేవింగ్స్ మ్యూచువల్ ఫండ్స్ (ఈఎల్ఎస్ఎస్)లో పెట్టుబడులు చేయడం సహజం అయిపోయింది. సెక్షన్ 80సీ పరిమితిలోనే ఈ పెట్టుబడులు కూడా ఉంటాయి. వీటికి మూడేళ్లపాటు లాక్‌ఇన్ పీరియడ్ ఉంటుంది. మీ దగ్గర మూడేళ్లకు మించిన కాలవ్యవధి నుంచి హోల్డ్ చేస్తున్న ట్యాక్స్ సేవింగ్స్ మ్యూచువల్ ఫండ్స్ ఉన్నట్లయితే, వాటిని విక్రయించి తిరిగి మరో పన్ను ఆదా చేసే స్కీమ్‌లో ఇన్వెస్ట్ చేయండి. వీటిని తాజా పెట్టుబడులుగా పరిగణించడంతో, పన్ను మినహాయింపు ప్రయోజనాలు లభిస్తాయి. కొత్త పెట్టుబడులకు మరో మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుందని గుర్తుంచుకోండి.

ఒకవేళ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ఉన్నట్లయితే వాటిని ఏడాది తిరిగిన వెంటనే విక్రయించేసినా ఎలాంటి ట్యాక్స్ కట్టాల్సిన పని ఉండదు. వీటిని మరోసారి ఇన్వెస్ట్ చేసి పన్ను ఆదా పొందవచ్చు. ఇలా చేసినా సరే మీ అస్సెట్ కేటాయింపులు ఏ మాత్రం మారవు.

టాక్స్ సేవింగ్ ఎఫ్‌డి

బ్యాంకులలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయడం ఎక్కువగానే జరుగుతుంది. వీటిని మధ్యలో బ్రేక్ చేసి ఉపసంహరించుకోవచ్చు. అయితే ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినప్పుడు నిర్ణయించిన వ్యవధి కంటే ముందే ఉపసంహరించినట్లు అయితే.. కొంత వడ్డీ రేటును కోల్పోవచ్చు. అయినా సరే కొంత ప్రయోజనం తప్పకుండా దక్కుతుంది. ఇప్పుడీ నిధులను బ్యాంక్ ట్యాక్స్ సేవింగ్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడి పెట్టండి. ఈ డిపాజిట్లకు ఐదేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. అలాగే సెక్షన్ 80 సీ ప్రకారం పన్ను మినహాయింపులు లభిస్తాయి. ఈ విధంగా చేయడం ద్వారా అనవసరపు రిస్క్‌లు కూడా ఉండవు. అలాగే మీ అసెట్ అలోకేషన్‌లో కూడా మార్పులు రావు. పైగా పన్ను ప్రయోజనం కూడా సిద్ధిస్తుంది.

ఇలాంటి ట్రిక్కులు తెలుసుకునేందుకు బాగానే ఉంటాయి. కానీ వీటిని ఆఖరినిమిషంలో మరే ఇతర ఆప్షన్ లేకపోతే మాత్రమే చేయాల్సి ఉంటుంది. ఇలా ట్యాక్స్ సేవింగ్ పెట్టుబడులను రీలోవర్ చేయడం ద్వారా పెట్టుబడులపై ప్రయోజనాలు కొంతమేర క్షీణించే అవకాశం ఉంటుంది. నిజానికి పెట్టుబడులు చేయడంలో పన్ను ఆదా చేయడం ఒకటే పరమావధి కాకూడదు. మీ వయస్సు, కెరీర్ పెరుగుతున్న కొద్దీ పెట్టుబడులు కూడా పెంచుకుంటూ ఉండాలి. ఒకవేళ ఏ సమయంలో అయినా నగదు కొరత ఏర్పడినట్లయితే, అప్పుడు తగిన చర్యలు చేపట్టాల్సిన సమయం వచ్చిందని గుర్తించాలి.

స్ఫూర్తిమంతంగా మణికర్ణిక

- రచయిత విజయేంద్రప్రసాద్...


కంగనా రనౌత్



చారిత్రక నేపథ్యాలతో రూపొందే చిత్రాలకు మనోభావాల పేరుతో అడ్డంకులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా మత అనుబంధ సంస్థలు...సినిమా చిత్రీకరణలకు, ప్రదర్శనలకు అడ్డుపడుతున్నాయి. ఇటీవల పద్మావత్ చిత్రం ఇలాంటి వివాదాలతో ఇబ్బందిపడింది. తాజాగా మరో బాలీవుడ్ సినిమా మణికర్ణిక పట్ల విమర్శలు మొదలయ్యాయి. ఝాన్సీ రాణి లక్ష్మీభాయ్ జీవిత కథతో దర్శకుడు క్రిష్ మణికర్ణిక చిత్రాన్ని రూపొందిస్తున్నారు. కంగనా రనౌత్ లక్ష్మీభాయ్ పాత్రలో నటిస్తోంది. జీ స్టూడియోస్, కమల్ జైన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. మణికర్ణికలో ఝాన్సీ పాత్ర గౌరవాన్ని తగ్గేలా సినిమా చిత్రీకరణ చేస్తున్నారంటూ కొన్ని వర్గాల నుంచి విమర్శలు మొదలయ్యాయి. వీటిని ప్రారంభంలోనే ఆపేందుకు రచయిత, నిర్మాతలు స్పందించారు. రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ....ఝాన్సీ రాణి నా అభిమాన నాయకురాలు. ప్రాణాలు ఒడ్డి ఆంగ్లేయులతో పోరాడింది. ఆమె జీవితం గురించి చదువుతూ రచయితగా ఎదిగాను. ఆమె అసలు పేరు మణికర్ణిక. వారణాసిలో మణికర్ణిక ప్రముఖ ఘాట్. ఆ పేరే ఝాన్సీ రాణికి పెట్టుకున్నారు ఆమె తల్లిదండ్రులు. నా బిడ్డ పేరు కూడా మణికర్ణికే. దీన్ని బట్టి లక్ష్మీభాయ్ అంటే నాకెంత ఇష్టమో ఊహించండి. ఇక మణికర్ణిక చిత్రంలో ఝాన్సీ రాణి ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని స్ఫూర్తివంతంగా చూపిస్తున్నాం. ఎక్కడా ఆమె గౌరవాన్ని తగ్గించేలా సన్నివేశాలు ఉండవు. అని చెప్పారు. ఝాన్సీ రాణి జీవిత కథను అత్యంత గౌరప్రదంగా ఉండేలా చిత్రీకరిస్తున్నామని నిర్మాతలు తెలిపారు.

నా కల నిజమైంది

- సాయి ధరమ్‌తేజ్

మెగా కుటుంబ కథానాయకుడిగా ప్రేక్షకులను మెప్పించారు సాయి ధరమ్ తేజ్. పలు విజయవంతమైన చిత్రాలతో ప్రతిభావంతమైన హీరోగా పేరు తెచ్చుకున్నారు. తేజ్ నటించిన కొత్త సినిమా ఇంటిలిజెంట్. వీవీ వినాయక్ దర్శకత్వంలో సి కళ్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇవాళ ప్రేక్షకుల ముందుకొస్తున్న ఇంటిలిజెంట్ చిత్ర విశేషాలను సాయి ధరమ్ తేజ్ తెలిపారు.



☞ ఈ చిత్రంలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ పాత్రలో నటిస్తున్నాను. తన ఉద్యోగం, ఇళ్లు, కుటుంబం, స్నేహితులు ఇవే తన ప్రపంచం. వీటి నుంచి బయటకు రాడు. మిగతా విషయాలు పట్టించుకోడు. అలాంటి వ్యక్తి...తన జీవితం నుంచి బయటకొచ్చేలా పరిస్థితులు ఎదురవుతాయి. వాటిని తన మేధస్సుతో ఎలా ఎదుర్కొన్నాడు అనేది కథాంశం.

☞ వీవీ వినాయక్ గారితో పనిచేయాలన్న కల ఈ చిత్రంతో నిజమైంది. ఒక రోజు వినాయక్ గారు ఫోన్ చేసి మనం కలుద్దాం అన్నారు. ఆ రోజును నేను మర్చిపోలేను. తొలి రోజు షూటింగ్ చేస్తున్నప్పుడు నా జీవితంలో అద్భుతమైన క్షణాలు అనిపించాయి.

☞ వినాయక్ గారితో పనిచేయాలన్నది ఒకటైతే..కథ కూడా బాగుంది. మేము కలిసి పనిచేయాలని చేస్తే కాదు కదా...కథ బాగుంటేనే ప్రేక్షకులు సినిమా చూస్తారు.

☞ మనకు జీవితంలో సాయం చేసినవాళ్లను మర్చిపోకూడదు. మళ్లీ వాళ్లకు తిరిగి సాయం చేయాలనే నేపథ్యంతో పుట్టిన కథ ఇది. ఆకుల శివ మంచి కథను అందించారు. దాన్ని దర్శకుడిగా వినాయక్ గారు ఇంకా బాగా తెరకెక్కించారు. ఆయన చెప్పినదాంట్లో నేను 70 శాతం నటించాను అని అనుకుంటున్నాను.

☞ ఒక అనుభవమున్న దర్శకుడి దగ్గర పనిచేస్తే ఎలా ఉంటుందో ఇంటిలిజెంట్ చిత్రంతో చూశాను. షాట్ రెడీ అయితే అంతా నిశ్శబ్దమయ్యేవారు. ఎవరూ సైలెన్స్ అని చెప్పనవసరం లేదు. సాంకేతిక నిపుణులు కూడా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ సన్నివేశాల కోసం సిద్ధంగా ఉండేవారు.

☞ నా వ్యక్తిగత జీవితంలో చెప్పాలంటే మా గుంపువులందరూ ఇంటిలిజెంట్‌లే.

☞ మైండ్ గేమ్ కథలు చాలా వచ్చాయి. నేను ఇటీవలే జవాన్ అనే చిత్రంలోనూ నటించాను. అయితే ఇంటిలిజెంట్ కొత్త తరహాలో సాగుతుంది. యాక్షన్ ఉన్నా..ఎక్కడా వినోదపాళ్లు తగ్గవు. వినాయక్ నాలో పవన్, చిరంజీవి పోలికలు ఉన్నాయి వాటిని ఉపయోగించుకునేందుకు ప్రయత్నిద్దాం అన్నారు. అది నాకొక గొప్ప ప్రశంస అని భావిస్తాను. అయితే పరిశ్రమకు ఎప్పటికీ ఒకే ఒక్క చిరంజీవి ఉంటారు.

☞ జవాన్ కథలో ఇంట్లో శత్రువు దాగి ఉండటం, కథానాయకుడు బయట ప్రపంచంలో అతడిని వెతకడం అనేది ఆసక్తికరంగా అనిపించింది. సినిమా కథ బాగున్నా...దాన్ని ప్రేక్షకులకు చెప్పే విధానంలో తేడా వచ్చింది. అందుకే సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. సినిమా అనేది సమష్టి కృషి...ఫలితానికి ఎవరినీ నిందించాల్సిన పనిలేదు.

☞ జీవితం అంటేనే నిరంతరం నేర్చుకునే ప్రక్రియ. తప్పు జరిగితే ఎక్కడ లోపముంది అని ఆలోచించి...కొత్తగా దాన్ని చేయకుండా ఉండాలి. నా సినిమా ఎంపికలో ప్రస్తుతం అలాంటి జాగ్రత్తలే తీసుకుంటున్నా.

☞ రాజేంద్రప్రసాద్ గారు ఒకరోజు నాతో మాట్లాడుతూ అన్నారు...మనకొచ్చే అవకాశాలను ఎంత గొప్పగా మార్చుకున్నామనేది కథానాయకుడిగా ముఖ్యం అని. ఆ మాట నాకు బాగా నచ్చింది. మిగతా హీరోలు ఎలాంటి కథలు చేస్తున్నారు అని ఆలోచించకుండా...నాకు ఎలాంటి అవకాశాలు వస్తున్నాయి..వాటిలో మంచివి ఎంచుకుని చేద్దాం అనే విషయంపై దృష్టి పెడుతుంటాను. ఇప్పుడు వెళుతున్న దారి మార్చి పూర్తి భిన్నమైన కథల్లో నటించాలని నాకు ఉంటే సరిపోదు. అలాంటి కథలు రావాలి. వస్తే తప్పకుండా నటిస్తా.

☞ పాటల రీమేక్ నా ప్రమేయం ఏదీ ఉండదు. ఇప్పటిదాకా చేసిన మూడు పాటలు బాగున్నాయి అని ఇందులోనూ ఒక పాట రీమిక్స్ చేశాం. ప్రతి పాటను ఒక బాధ్యతోనే, ఆస్వాదిస్తూ చేశాను.

☞ ఒకే తేదీన తొలి ప్రేమ, నా సినిమా రావడం తప్పడం లేదు. అది మా చేతిలో లేని పని. ఈ విషయంపై వరుణ్, నేనూ మాట్లాడుకున్నాం. అయితే మంచి సినిమాకు వసూళ్లు ఎప్పుడూ బాగుంటాయి.

☞ ప్రస్తుతం కరుణాకరణ్ దర్శకత్వంలో సినిమా చేస్తున్నాను. అది పూర్తిగా ప్రేమకథ. ఒక షెడ్యూల్ పూర్తయింది. త్వరలో మరో షెడ్యూల్‌కు వెళ్తాం.

మూడు సినిమాలతో జోష్

స్టార్ హీరోలు నూతన సినిమాలను అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నా ఒక్కోసారి కథలు, దర్శకుల ఎంపిక నచ్చకపోవడంతో సినిమాకు, సినిమాకు మధ్య గ్యాప్ వస్తుంటుంది. అయితే తూకానికి తగ్గట్టు అన్నీ కుదిరితే వెంట వెంటనే సినిమాలను ఒప్పేసుకుంటుంటారు. దీనికి టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్ అన్న తేడా ఏమీ లేదు. ఏ భాషకు చెందిన స్టార్ హీరోలైనా ఈ ఫార్ములాతోనే ముందుకు సాగుతుంటారు. బాలీవుడ్ క్రేజీ హీరో సల్మాన్‌ఖాన్ కూడా ఇప్పుడు వరుస చిత్రాలతో సందడి చేయబోతున్నారు. తన కెరీర్‌లో ఎన్నో విజయాలను సాధించిన ఆయన భజరంగీ భాయీజాన్, సుల్తాన్, టైగర్ జిందా హై చిత్రాలతో బాక్సాఫీసు వద్ద సంచలనం సృష్టించారు. అయితే టైగర్ జిందా హైకు ముందు వచ్చిన ట్యూబ్‌లైట్ మాత్రం బాక్సాఫీసు వెలగలేదు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న రేస్-3 చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇదే ఏడాది జూన్‌లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని సంగతి ఇలావుంటే...అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో రూపొందనున్న భరత్ అనే చిత్రంలో నటించేందుకు ఆయన సన్నద్ధమవుతున్నారు. వీరిద్దరి కలయికలో లోగడ వచ్చిన సుల్తాన్, టైగర్ జిందా హై చిత్రాలు ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. దాంతో మళ్లీ వీరి కలయికలో నూతన చిత్రం సెట్స్‌పైకి రానుంది. ఇంకో వైపు కిక్-2 చిత్రంలో కూడా సల్మాన్ నటించనున్నారు. తెలుగులో రవితేజ కథానాయకుడిగా రూపొందిన కిక్ విజయం సాధించిన నేపథ్యంలో అదే చిత్రాన్ని దాదాపు నాలుగేళ్ల క్రితం హిందీలో రీమేక్ చేశారు. తెలుగులో విజయవంతమైన చిత్రాలలో తనకు సరిపోతాయనుకున్న వాటిని సల్మాన్ హిందీలో చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కోవలోనే హిందీలో ఆయన కిక్ చిత్రం చేశారు. దానికి దర్శకత్వం వహించిన సాజిద్ నడియావాలానే కిక్-2 చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో కూడా సల్మానే హీరో. వెయిట్ ఈజ్ ఓవర్..డెవిల్ ఈజ్ బ్యాక్ అనే ట్యాగ్‌లైన్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తారట. వచ్చే ఏడాది రంజాన్ సందర్భంగా భరత్ చిత్రాన్ని, అదే ఏడాది క్రిస్మస్‌కు కిక్-2 చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తేవాలన్నదే లక్ష్యమట.


సల్మాన్‌ఖాన్

కాలా ముందుకు.. 2.0 వెనక్కి


రజనీకాంత్

కొత్తపుంతలు తొక్కుతున్న సాంకేతికతను కథ డిమాండ్‌కు అనుగుణంగా అనుసంధానం చేయడంతో పాటు వైవిధ్యభరితమైన సినిమాను తెరకెక్కించాలనుకున్నప్పుడు ఒక్కోసారి అనుకున్నవిధంగా పనులు జరగక ఆలస్యమవుతుంటాయి. దాంతో ఆ ప్రభావం సినిమా విడుదలపై పడి తేదీ మారడం చూస్తున్నదే. ఇప్పుడు 2.0. పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదని పరిశ్రమలో అంటున్నారు. రజనీకాంత్, దర్శకుడు శంకర్ కలయికలో తెరకెక్కుతున్న ఈ చిత్రం రోబోకు సీక్వెల్. ఇప్పటికే దీనిపై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగానే అత్యంత భారీ బడ్జెట్‌తో, అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో తెరకెక్కిస్తున్నారు. ఎమీజాక్సన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ ప్రతినాయకుడిగా కనిపించబోతున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తిచేసుకుని, నిర్మాణానంతర పనుల్లో ఉంది. తొలుత ఏప్రిల్ 14న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకుని రావాలని అనుకున్నప్పటికీ, గ్రాఫిక్స్ పనులు ఆలస్యం అవుతుండటంతో విడుదలను వాయిదా వేసినట్లు పరిశ్రమ వర్గాల భోగట్టా. అయితే అదే తేదీన రజనీకాంత్ నటించిన మరో చిత్రం కాలాను విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. రజనీకాంత్, దర్శకుడు పి.ఎ.రంజిత్ కలయికలో ధనుష్ నిర్మిస్తున్న ఈ చిత్రం గ్యాంగ్‌స్టర్ కథాంశంతో తెరకెక్కుతోంది. లోగడ రజనీకాంత్, రంజిత్‌ల కాంబినేషన్‌లో కబాలి చిత్రం వచ్చిన సంగతి తెలిసిందే.

దండుపాళ్యం చివరి పార్టు


పూజాగాంధీ

దండుపాళ్యం సిరీస్ చిత్రాలు విజయం సాధించాయి. ఇప్పుడు దండుపాళ్యం 3 పేరుతో మరో సినిమా తెరకెక్కుతోంది. విభిన్నకథాంశంతో, సహజమైన సన్నివేశాలతో, భావోద్వేగం మిళితమైన ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. శ్రీనివాసరాజు దర్శకత్వంలో వహిస్తున్న ఈ చిత్రం మార్చి 2న విడుదలకానుంది. శ్రీవాడపల్లి వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ దండుపాళ్యం 3 హక్కులు పొందింది. శ్రీనివాస్ మీసాల, రజని తాళ్లూరి సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెలుగులో అందిస్తున్నారు. బొమ్మాళి రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికా లే ఇందులో ప్రధాన పాత్రలు పోషించారు.

నిర్మాతలు మాట్లాడుతూ దండుపాళ్యం సిరీస్ చిత్రాు ఘనవిజయం సాధించాయి. అదే రీతిలో తాజా సినిమాకూడా సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది. ఈసిరీస్‌లో పార్ట్ 3 చివరిది కావడంతో క్లయిమాక్స్ ఏ విధంగా ఉండనుందనే ఆసక్తి ఏర్పడింది. త్వరలో భారీగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించి, మార్చి 2న సినిమాను విడుదల చేస్తాం అని చెప్పారు.